# మానవ హక్కులు - 2005

బులెటిన్ – 7

---

**మానవహక్కుల వేదిక ప్రచురణ**

Humanrights Forum Publication


। ప్రచురణ సంఖ్య : 13

। ప్రచురణ కాలం : మే 2005

। కాపీలు : 2000 । వెల : 10 రూపాయలు

। బొమ్మలు : మోహన్

। ముద్రణ : నవ్య ప్రింటర్స్



ప్రతులకు :

**ఎస్.జీవన్ కుమార్**

3–12–117/ఏ–2/1, పి.ఎస్.కాలనీ,

గణేష్‌నగర్, రామంతాపూర్

హైదరాబాద్–13. ఫోన్: 27039519


**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

## సంపాదకీయం

# హక్కులకొక తాత్విక కోణాన్ని ఆవిష్కరించుకుందాం

హక్కులు అనే భావన తనకు సొంతం అని పాశ్చాత్య దేశాల లిబరల్ సంప్రదాయం భావిస్తుంది. అందువల్ల ఆ తాత్విక సంప్రదాయం హక్కుల భావనను చాలా చర్చించింది. హక్కుల గురించి నిత్యం ఆరాటపడే సగటు జీవికి ఏమీ అర్థంకాని సిద్ధాంత సంవాదం చాలా జరిపింది.

హక్కుల భావన లిబరల్ సంప్రదాయానికి ప్రత్యేకమేం కాదుగానీ, ఆ సంప్రదాయానికి ఉన్న ఒక ముఖ్య లక్షణం హక్కుల చర్చకు చాలా వెసులుబాటు కల్పిస్తుంది. హక్కులు మనిషికి చెందినవి. ఇక్కడ మనిషి అంటే వ్యక్తి అనుకోనక్కరలేదు, ఒక సామాజిక సమూహం కావచ్చు. ఒక్కొక్క హక్కు ప్రతిపాదన వ్యక్తిని ప్రాతిపదిక చేసుకున్నట్టే ఒక్కొక్క హక్కు ప్రతిపాదన వ్యక్తిని కాక ఏదో ఒక సామాజిక సమూహాన్ని ప్రాతిపదిక చేసుకోవచ్చు. ఉదాహరణకు 'సంఘం పెట్టుకునే హక్కు' అనే దానికి అర్థం ఉండాలంటే కనీసం ఇద్దరు మనుషులుండాలి. ఒకే ఒక వ్యక్తికి 'సంఘం పెట్టుకునే హక్కు' ఉండదు. ఇంకొంచెం లోతయిన అర్థంలో కూడా ఒక హక్కు ప్రతిపాదనకు వ్యక్తి కాక సమూహం ప్రాతిపదిక కాగలదు. ఒక ప్రత్యేకమైన జీవన సరళి, స్థితిగతులు ఉన్న వారి హక్కుల గురించి మాట్లాడేటప్పుడు (ఉదాహరణకు ఆదివాసుల హక్కులు) ఆ ప్రజలను ఒక సమూహంగానే తీసుకొని మాట్లాడతాము. ప్రత్యేకమైన జీవన సరళే ఉండనక్కరలేదు. కేవలం ఆర్థిక లేక సామాజిక స్థితి నిర్వచించే ప్రత్యేకత ఒక సమూహానికి ప్రాతిపదిక కావచ్చు. గుడిసెవాసుల హక్కులు, వినియోగదారుల హక్కులు ఇటువంటివి.

అయితే హక్కుల ప్రతిపాదన వ్యక్తిపరంగా జరిగినా సమూహంపరంగా జరిగినా దాని తాత్విక మూలంలో ఎక్కడో మనిషికి ఒక మనిషిగా విలువనిచ్చే గుణం ఉంది. నీకీ హక్కు ఎక్కడిది అన్నప్పుడు మనిషయి పుట్టాను కాబట్టి అనేది అన్నిటికంటే ఆకర్షణీయమైన జవాబు. ఆ హక్కు వ్యక్తికి చెందినది కావచ్చు (ఉదాహరణకు అభిప్రాయ స్వేచ్ఛ), ఒక సమష్టికి చెందినది కావచ్చు (శ్రామికులకు కనీస వేతనం, శుభ్రమైన పర్యావరణం మొదలయినవి).

అందువల్లనే మనిషిని మనిషిగా కేంద్రం చేసుకునే తాత్విక గుణం గల లిబరల్ సంప్రదాయం హక్కుల భావనను తనదిగా భావించి దాని విశదీకరణ కోసం చాలా చర్చ జరిపింది.

అయితే చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే హక్కుల ఉద్యమాలకూ ఈ హక్కుల సిద్ధాంత చర్చకూ ఏమీ సంబంధం లేకుండా దేనిపాటికది సాగుతుండడం. పాశ్చాత్య దేశాలలో సహితం హక్కుల ఉద్యమం లిబరల్ తాత్విక సంప్రదాయానికి చెందిన హక్కుల సంవాదంతో పెద్దగా సంబంధం లేకుండా ఒక ప్రాక్టికల్ కార్యక్రమంగా సాగిపోతుంటుంది. మూడవ ప్రపంచ దేశాలలో చాలా క్లిష్టమైన హక్కుల పరిరక్షణ కార్యక్రమాన్ని చేపట్టిన ఉద్యమాలయితే అటువంటి తాత్విక చర్చ ఒకటి ఉందన్న స్పృహ లేకుండానే నడుస్తున్నాయి.

దీనికి చాలా కారణాలున్నాయి. మనబోటి దేశాలలో హక్కుల ఉద్యమాలు ఒక బలమైన అవసరం నుండి పుట్టాయి. ఆ అవసరాన్ని తీర్చే నిత్య కార్యక్రమంలో నిమగ్నమయి ఉంటాయి. దానికి చట్టం పనికొస్తే చట్టాన్ని వాడుకుంటాయి. కోర్టులు అక్కరకొస్తే కోర్టులను వాడుకుంటాయి. ప్రచారం, ఆందోళన, లాబీయింగ్, ఏది ఉపయోగకరమనుకుంటే అది చేస్తాయి. దీనికి లోతయిన తాత్విక సంవాదం అసలు అవసరమా అన్న పద్ధతిలో సాగుతుంటాయి.

ఇదొక కారణం కావచ్చు.

ఇంకొక కారణం, మూడవ ప్రపంచ దేశాలలోని హక్కుల ఉద్యమాల ప్రాపంచిక దృక్పథం ఎక్కువ భాగం ఏదో ఒక అర్థంలో రాడికల్ దృక్పథం. ప్రస్తుత సమాజాన్ని అదొక గడచిపోతున్న సామాజిక దశగా అర్థం చేసుకుంటుంది. పాశ్చాత్య లిబరల్ దృక్పథం ఇవ్వాల్టి సమాజాన్నే శాశ్వతం అనుకున్నా అనుకోకున్నా, అది ఈ సమాజంలోనే నిలబడి దానివైపే చూస్తూ ఆలోచిస్తుంది. రాడికల్ దృక్పథాలు ఇవ్వాల్టి సమాజంలో నిలబడి రేపటి సమాజంగా భావించే దానివైపు చూస్తూ ఆలోచిస్తాయి. ఈ తేడా వల్ల హక్కులను చూసే పద్ధతిలో చాలా తేడా వస్తుంది.

అది కూడా కారణం కావచ్చు.

అయితే అంతకంటే మౌలికమైన సమస్య ఉందేమో అనిపిస్తుంది. మౌలిక అనే భావనను 'సమానత' అనే భావన అంటిపెట్టుకొని ఉంటుంది. ఇది నా హక్కు అని ఎవరు ఎవరితో అన్నా అక్కడ నీకంటే నేనేం తక్కువకాదు అనే ధ్వని తప్పనిసరిగా ఉంటుంది. సమానత్వ భావన హక్కుల భావనలో అంతర్లీనమయినది.

ఇది లిబరల్ సంప్రదాయాన్ని చాలా ఇబ్బంది పెడుతుంది. ఆ సంప్రదాయం సమానత్వం అనే ఆలోచనను చాలా సమస్యాత్మమైనదిగా భావిస్తుంది. చట్టం ముందు సమానత్వాన్ని మాత్రమే నిర్ద్వంద్వంగా అంగీకరిస్తుంది. వేరే ఏ అర్థంలో సమానత్వాన్ని ప్రతిపాదించినా అడుగడుగూ తటపటాయిస్తుంది.

కానీ హక్కుల ఉద్యమం సమానత్వాన్ని చాలా సహజమైన భావనగా స్వీకరిస్తుంది. హక్కుల భావనతో విడదీయరానిదిగా ఏ ఇబ్బందీ లేకుండా గుర్తిస్తుంది. సమానత్వాన్ని వ్యవస్థీకరించడం, అమలులోకి తీసుకురావడం, ఆచరించడం ఎంత మాత్రం సులభం కాదన్న స్పృహ హక్కుల ఉద్యమానికి లేకపోలేదు. ఒకనాడు దీనిని తేలికగా తీసుకొని ఉన్నా, ఇవాళ తీసుకోవడం సాధ్యంకాదు. సమానత్వం అనేది ఎంత ఆకర్షణీయమైన భావనో దానిని ఆచరణలోకి తీసుకురావడం అంత కష్టతరం అనేది ఇరవయ్యవ శతాబ్దం నేర్పిన ప్రధాన గుణపాఠం. దానిని విస్మరించే ప్రగతిశీలక ఉద్యమమేదీ ముందుకు పోలేదు. అయినప్పటికీ సూత్రప్రాయంగా హక్కులంటే సమానత్వం అని ఒప్పుకోవడానికి హక్కుల ఉద్యమం సంశయించదు.

లిబరల్ సంప్రదాయంలో విస్తారంగా జరుగుతున్న హక్కుల సిద్ధాంత చర్చ మూడవ ప్రపంచ దేశాల హక్కుల ఉద్యమాలను పెద్దగా ఆకర్షించకపోవడానికి ఇది బలమైన కారణం కావచ్చు.

అయినప్పటికీ దానిని అసలే పట్టించుకోకుండా సాగిపోవడమూ సరయినది కాదు. ఇందుకు మూడు కారణాలున్నాయి. అడ్డగోలు వాదనలు విడిచిపెట్టి తర్కబద్ధంగా వాదించడం నేర్చుకోవడానికి లిబరల్ సంప్రదాయానికి చెందిన హక్కుల సంవాదం ఉపయోగపడుతుంది. రెండవది, హక్కుల మధ్య ఘర్షణను సీరియస్‌గా తీసుకోవడం నేర్పుతుంది. ఒకరి మేలు కోసం మరొకరి ప్రాణం తీయవచ్చు అన్న దగ్గర మొదలుపెట్టి ఒకరి బాగుకోసం మరొకరి పైన నిర్బంధం పెట్టవచ్చు, ఒకరి పురోగమనం కోసం మరొకరి అవకాశాలు కుదించవచ్చు, మొదలయినవన్నీ హక్కుల మధ్య ఘర్షణకు సంబంధించిన సమస్యలు. ఈ సమాజంలో నిలబడి వేరే సమాజం వైపు చూసే దృక్పథం కంటే ఈ సమాజం మీద దృష్టిపెట్టే దృక్పథమే ఈ సమస్యలను లోతుగా అధ్యయనం చేయగలుగుతుంది. మూడవది, హక్కుల ప్రతిపాదనకు వ్యక్తి ప్రాతిపదిక అనుకున్నా ఒక సమూహం ప్రాతిపదిక అనుకున్నా మనిషికి మనిషిగా విలువనిచ్చే గుణం – మానవతావాదానికి పునాదిప్రాయమైన గుణం – హక్కుల దృక్కోణానికి చాలా అవసరం. లేకపోతే మనిషి మరిదేనికో సాధనం అయిపోయే ప్రమాదం ఉంది.

ఈ మేరకు లిబరల్ తాత్విక సంప్రదాయం నుండి స్వీకరిస్తూ, సమానత్వాన్ని ప్రాతిపదిక చేసుకున్న హక్కుల దృక్కోణాన్ని తాత్వికంగా బలోపేతం చేసే కృషి అవసరం. హక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక కర్తవ్యం, కార్యరంగం ఉన్నాయనుకుంటేనే ఇది సాధ్యం అని వేరే చెప్పనవసరం లేదు. హక్కుల ఉద్యమాన్ని కేవలం రాజకీయ కాలక్షేపంగా చూసే దృష్టి ఏ తాత్విక దృక్పథాన్నీ పెంపొందించలేదు.

**–మానవహక్కుల వేదిక**

మేడే, 2005

బ్యాక్ కవర్ కోసం..

# ఇందులో...


**సంపాదకీయం**

హక్కులకొక తాత్విక కోణాన్ని ఆవిష్కరించుకుందాం ... 3

**వ్యాసాలు**

మానవహక్కుల పథం ... 9

ప్రజాభూమి కమిషన్ ... 28

వ్యవసాయానికి పడుతున్న మరొక చీడ జన్యుకాలుష్యం ... 37

జీవోకు పట్టిన గతే గిర్‌గ్లానీ కమిషన్‌కూ! ... 47

ఆస్తి హక్కు లేని ఆదివాసీ స్త్రీలు ... 55

ఆకలి చావులు – తిండి హక్కు ... 60

**జుడీషయరీ వాచ్**

ఎ.బి.సి.డి. పైన సుప్రీంకోర్టు తీర్పు

విజ్ఞత లేదు, తర్కమూ లేదు ... 67

**రివ్యూ**

దేశ స్వాతంత్ర్య ఉద్యమం – ముస్లింలు ... 73

**రిపోర్టులు**

అది 420 జీవో కాదుగానీ... ... 85

నగరాలలో పేదలకు చోటులేదా ... 92

పోలవరం ప్రాజెక్టు – ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదు ... 100

పాకీపని దళితులకు ఇచ్చిన రిజర్వేషనా? ... 109

**కరపత్రాలు** ... 117-164


# ఇందులో...


**సంపాదకీయం**

హక్కులకొక తాత్విక కోణాన్ని ఆవిష్కరించుకుందాం ... 3

**వ్యాసాలు**

మానవహక్కుల పథం – బుర్రా రాములు ... 9

ప్రజాభూమి కమిషన్ – ఆవశ్యకత, కర్తవ్యాలు
– గొర్రెపాటి నరేంద్రనాథ్, కె.బాలగోపాల్ ... 28

వ్యవసాయానికి పడుతున్న మరొక చీడ జన్యుకాలుష్యం – కె.అనూరాధ ... 37

జీవోకు పట్టిన గతే గిర్‌గ్లానీ కమిషన్‌కూ! – సి.విఠల్, యం.కోదండరామ్ ... 47

ఆస్తి హక్కు లేని ఆదివాసీ స్త్రీలు – కె.సుధ ... 55

ఆకలి చావులు – తిండి హక్కు – ఎం.కోదండరామ్ ... 60

**జుడీషయరీ వాచ్**

ఎ.బి.సి.డి. పైన సుప్రీంకోర్టు తీర్పు

విజ్ఞత లేదు, తర్కమూ లేదు – కె.బాలగోపాల్ ... 67

**రివ్యూ**

దేశ స్వాతంత్ర్య ఉద్యమం – ముస్లింలు – కె.బాలగోపాల్ ... 73

**రిపోర్టులు**

అది 420 జీవో కాదుగానీ... – కె.బాలగోపాల్ ... 85

నగరాలలో పేదలకు చోటులేదా – ఎస్.జీవన్‌కుమార్ ... 92

పోలవరం ప్రాజెక్టు – ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదు
– కె.బాలగోపాల్ ... 100

పాకీపని దళితులకు ఇచ్చిన రిజర్వేషనా? –విమల ... 109

**కరపత్రాలు** ... 117-164

# మానవహక్కుల పథం

-బుర్రా రాములు *

**హ**క్కుల దృక్పథం క్రమంగా ఎదిగిన విధమే హక్కుల చరిత్ర. ఇది మానవ పోరాటాల ఫలితం. మనిషి జీవిక కోసం, స్వేచ్ఛ కోసం పడిన ఆరాటాలు, చేసిన పోరాటాలు మానవహక్కుల పథాన్ని నిర్మించాయి. నిర్వచించాయి. మానవహక్కులపై ఈనాడు ఏర్పర్చుకున్న భావనలు సారాంశంలో ఒకటే అయినప్పటికీ వివిధ దేశాల, ప్రాంతాల, జాతుల, కుల, వర్గ, లింగాలుగా వాటిని పరిశీలించినప్పుడు, స్థల, కాలాలతో సరిపోల్చినప్పుడు ఎంతో వైవిధ్యంగా ఉంటాయి. వివిధ సందర్భాలలో, వివిధ రకాలుగా, వివిధ వ్యవస్థలకు వ్యతిరేకంగా చేసిన ఈ పోరాటాలన్నిటికీ మూలం ప్రజల స్వేచ్ఛా కాంక్ష. ఈ పోరాటాలలో ముందుకొచ్చిన విలువలనే క్రోడీకరించి మానవహక్కుల అవగాహనలోనూ, రాజ్యాంగాలలోనూ భద్రపరుచుకున్నాం. సారాంశంలో ఇవన్నీ మానవహక్కులే.

20వ శతాబ్ది మొదట్లో కేవలం పది శాతం ప్రజలే రాజకీయంగా స్వతంత్ర దేశాలలో జీవించారు. ఆ శతాబ్ది చివర్లోనే మెజారిటీ ప్రజలు స్వతంత్రులైనారు. ఆ క్రమంలోనే ఐక్యరాజ్య సమితి మానవహక్కుల ప్రకటన వెలువడింది.

---

మానవహక్కువ కార్యకర్త, కాకతీయ యూనివర్సిటీలో లెక్చరర్

ఇదొక ముఖ్యమైన మలుపు.

మానవునిగా పుట్టినందుకు మనిషికి గల హక్కులే మానవహక్కులు. వీటిని రాజ్యం నిరోధించి, నిరాకరించి, నిర్మూలించ వీలులేదు. ఎందుకంటే ఇవి రాజ్యం ఇచ్చినవి కావు. ఈ భావనను ముందుకు తీసుకొచ్చిన ఉద్యమాలుగా పాశ్చాత్య దేశాల ప్రజాతంత్ర ఉద్యమాలను, వాటిపై వామపక్ష కార్మిక ఉద్యమాలు పెట్టిన విమర్శను విశ్లేషకులు చూపుతారు. వీటితో పాటు ఆ దేశాలలోని ఈ రెండు దృక్కోణాలపై స్త్రీవాదులు పెట్టిన విమర్శ, నల్లజాతీయుల సివిల్ రైట్స్ ఉద్యమం ముందుకు తెచ్చిన విలువలు అంతర్జాతీయ స్థాయిలో మానవహక్కుల భావనకు నిర్వచనాన్నిచ్చాయి. నిన్న మొన్నటి వరకు మన దేశ మానవహక్కుల ఉద్యమానికి భావనలుగా కూడా ఇవే పనిచేశాయి. మన పౌర ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమాలకు పూలే, అంబేద్కర్‌ల కార్యాచరణ, భావనలను అర్థం చేసుకోడానికి, ఆచరించడానికి ఇటీవలి దళిత ఉద్యమాలే తప్ప హక్కుల ఉద్యమం స్వీయ కృషి కారణం కాదు. అందుకే మన హక్కుల ఉద్యమం రియాక్టివ్‌గా ఎదిగిందే తప్ప ప్రో-ఆక్టివ్‌గా కాదు. నిజానికి హక్కుల ఉద్యమం ప్రో-ఆక్టివ్‌గా తన కార్యక్షేత్రాన్ని విస్తరించుకోకుంటే నిజమైన మానవహక్కుల ఉద్యమం ఆవిష్కరించబడదు.

మనదేశంలో హక్కుల కోసం జరిగిన పోరాటం మనిషి జీవితం గురించి మతం చేసిన ఆలోచనలు, నిర్దేశించిన నియమాల ఫలితంగా ఏర్పడిన వైరుధ్య వాతావరణంలో ఆరంభమయింది. మతపర ఆధిపత్యాలను ప్రశ్నించడం, సామాజిక రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యాన్ని డిమాండు చేయడం, ఇందుకు 'దేవుని ముందు అందరూ సమానులే' అనే భావనను ముందుకు తేవడం జరిగింది. భక్తి ఉద్యమాలు, సామాజిక సంస్కరణ ఉద్యమాలు దీనికి వాహకంగా పనిచేశాయి. పాలకుల మధ్య ఘర్షణలలోనూ ఇది వ్యక్తం అయింది. ఆ తరువాత చరిత్ర క్రమంలో జరిగిన వివిధ ఉద్యమాలు, పోరాటాలు - రైతు ఉద్యమాలు, కార్మిక, మహిళా ఉద్యమాలు, జాతి విముక్తి పోరాటాలు, రాజ్య ఆధిపత్యాన్ని ప్రశ్నించిన పోరాటాలు, దళిత-బహుజన కులాల ఉద్యమాలు - హక్కుల భావనను ముందుకు తీసుకుపోయాయి.

'హక్కులు చట్టాల ద్వారా రక్షింపబడవు. సమాజం, సామాజిక నైతిక స్పృహ ద్వారా మాత్రమే రక్షింపబడతాయి. చట్టాల్ని (హక్కుల్ని) అమలుపర్చుకోవడానికి సిద్ధపడే సామాజిక స్పృహ ఉండాలి' అన్న అంబేద్కర్ మాటల్ని దృష్టిలో పెట్టుకుని హక్కుల అజెండాను నిర్దేశించుకున్నట్టయితే ఆ అజెండా 'వ్యవస్థను మార్చడం' కాదు. వ్యవస్థతో నిరంతరం పోరాటం చేయడం అని అర్థం అవుతుంది. అది ఏ కాలమైనా, ఏ వ్యవస్థ అయినా మానవహక్కుల్ని నిరాకరించినప్పుడు, నిరోధించినప్పుడు, నిర్మూలించినప్పుడు పోరాటం చేయడం పనిగా పెట్టుకోవాలి. ప్రకటించుకున్న హక్కుల్ని అమలు పర్చుకోడానికి, విస్తృత పర్చుకోడానికి ప్రో-ఆక్టివ్‌గా కదలాలి. ఈ హక్కుల ఉద్యమ పరిభాష అవసరాలు, ప్రయోజనాల పరిధిలో ఉండదు. విలువలు, న్యాయాన్యాయాల పరిధిలో ఉంటుంది అందుకే. రాజ్యాన్ని కేవలం అణచివేత కేంద్రంగా చూడదు. ప్రజల పోరాటాల ఫలితాల్ని (విలువల్ని) కాపాడే బాధ్యత ఉన్న వ్యవస్థగా రాజ్యాన్ని సంస్కరించుకొనే బాధ్యత మానవహక్కుల ఉద్యమానిదే. ఈ అవగాహనలో అణచివేత కేంద్రం కేవలం రాజ్యమే కాదు. కుటుంబం, కులం, మతం, భూస్వామ్యం, పెట్టుబడి (అభివృద్ధి), ప్రపంచీకరణ కూడా అణచివేత కేంద్రాలే. ఈ కోణం నుండి మన దేశ మానవహక్కుల ఉద్యమాన్ని పరిశీలించుదాం.



## చారిత్రక మూలాలు

'మనిషి స్వేచ్ఛల్ని కలిగి ఉండటమే మానవహక్కులు. ఈ స్వేచ్ఛల్ని సాఫల్యం చేసేవి మనిషి శక్తి సామర్థ్యాలు. ఈ శక్తి సామర్థ్యాలనిచ్చేవి విద్య, ఉపాధి, ఆరోగ్యమ'ని అమర్త్యకుమార్ సేన్ అంటారు. అంటే ప్రజలు ఏ హక్కుల్ని అనుభవించాలన్నా మౌలిక శక్తులు ఉండాలి. ఈ శక్తుల లేమి ఎప్పుడు ఎట్లా ఏర్పడింది అనే ప్రశ్నకు జవాబు వెతికితే మన దేశంలో హక్కుల స్థితిగతుల చరిత్ర తెలుస్తుంది. అందుకేనేమో అంబేద్కర్ 'ధార్మిక న్యాయ విజయమే అభివృద్ధి నిరోధక'మన్నాడు. బుద్ధుడి నుండి నేటిదాకా ధార్మిక న్యాయానికి వ్యతిరేకంగా సాగిన పలు రకాల ఉద్యమాలు మానవహక్కుల పథంలో అడుగులే. ఈ ధార్మిక న్యాయం కాలానుగుణంగా రూపం మార్చుకుందే కాని సారం మారలేదు. నేటి హిందూత్వమే నిన్నటి హిందూ ధార్మిక న్యాయం. దానిపేరే బ్రాహ్మణ ధర్మం, వైదిక ధర్మం, ఆర్య ధర్మం. అది ఆధిపత్యాన్ని చలాయిస్తూ ఈ దేశ మెజారిటీ ప్రజల్ని (బహుజనాన్ని) అజ్ఞానం, అంధకారం, ఆకలి, ఆవేదనలతో, అంతరాల అన్యాయాలతో అణచివేస్తూ వస్తున్నది. నేటి ఆధునిక రాజ్యం మానవహక్కుల లక్ష్యం ప్రకటించుకున్నా ఆచరణలో తరచుగా ధార్మిక న్యాయం పక్షాన్నే ఉన్నట్లు నిరూపితమవుతున్నది. ధార్మిక న్యాయమంటే అసమ న్యాయం, అసహజ న్యాయం. మెజారిటీ ప్రజలకు జీవితం అనుభవించడానికి ఇచ్చింది కాదని నిషేధించిన ధర్మం. వాళ్ళను నిండైన మనుషులుగా గుర్తించని ధర్మం. ఈ ధర్మం మన దేశంలో ఆర్యుల రాక తరువాత రూపొందింది. ఆర్యుల రాకపూర్వం ఇక్కడ ఉన్న సమాజాన్ని గురించి మన దగ్గర సమగ్రమైన చిత్రం లేదు. వర్ణ వ్యవస్థ లేదని, ఆర్య సమాజం లాగ అది పూర్తిస్థాయి పితృస్వామ్య సమాజం కాదని మాత్రం తెలుసును. ఆర్యుల రాకకు పూర్వం ఇక్కడ మాతృస్వామిక వ్యవస్థలుండేవని, సిద్ధ సంప్రదాయం, యోగ సంప్రదాయం అనే పద్ధతుల ద్వారా జిమ్మెరు నదీ పరివాహక ప్రాంతంలో మనుషులు జీవించేవారని, వారి జీవన విధానాన్నే సింధూ నాగరికతగా వర్ణించినారని బొనిగల రామారావు అంటారు.

చారిత్రక క్రమాన్ని వివరించడానికి ఆయన ప్రాచీన సాహిత్యాన్ని ఆధారం చేసుకొని ఒక ఊహాచిత్రాన్ని రచించారు. పురాణాల్లో వర్ణించిన భూగోళంలో ఏడు ఖండాలు ఉన్నాయి. వాటిలో జంబూద్వీపం ఒకటి. వేల సంవత్సరాల కాలంలో వివిధ జల ప్రళయాల ఫలితంగా జరిగిన పరిణామాల వల్ల రూపుదిద్దుకున్న భారత భూభాగం నాటి జంబూద్వీపమే. ఈ భూభాగపు తొలినాటి వాసుల సంతతే నేటి అంటరాని జాతులు అని ఆయన అంటాడు. నేడు వేల రకాలుగా అంటరాని కులాలు, జాతులు భారతదేశం మొత్తంలో ఉండటానికి వేల సంవత్సరాల ఆర్థిక పరిణామాలు కూడా కారణం కావచ్చు. కాని ఆర్యుల రాక తరువాత జరిగిన సామాజిక పరిణామాలు, ఆర్యీకరణను వ్యతిరేకించిన వారిని బానిసలుగా, అంటరాని జాతులుగా అణచివేసిన క్రమం కూడా దీనికి కారణమైనాయి. జంబూదేశ ప్రజలు మాతృస్వామిక వ్యవస్థలో ఉన్నారని, ఆర్యులు ఇక్కడ ఆధిపత్యం పొందడానికి స్త్రీ దళాలతో యుద్ధాలు చేయవలసి వచ్చిందని, ఫలితంగా ఈ దేశాన్ని 'ఇందియా'గా పిలిచారని ఆయన ఊహిస్తాడు. ఈ స్త్రీ దళాలను మట్టుబెట్టడానికి ఆర్యులకు నాయకత్వం వహించిన వాడిని ఇందిరుడు/ఇంద్ర అన్నారని, అప్పుడే జంబుదేశం ఇందియాగా మారిందని బొనిగల రామారావు అభిప్రాయం. ఇలా దేశం పేరు మారడం, మాతృస్వామిక దేశం పితృస్వామిక వ్యవస్థగా మారడం ఆర్యుల రాక తర్వాత ఒక క్రమంలో జరిగాయని అంటాడు. ఈ ఊహా చిత్రం చారిత్రకత సంశయాస్పదమే కావచ్చు. కానీ 'ఇండియా' అనే దేశం లేక జాతి గుర్తింపు ఆర్యీకరణతో ముడిపడి ఉందని ఇది మనకు సంకేతాత్మకంగా తెల్పుతుంది.

ఆర్యులు 'మధ్య ఆసియా' నుండి తెగలు తెగలుగా అంచలంచెలుగా బ్రతుకుతెరువు కోసం సింధుకు వచ్చారు. సింధు అనే మాట నుండి హిందు అనేది వచ్చిందనీ, 'ఆర్యానాం' (ఆర్యులకు సంబంధించినది) అన్న వాక్య శకలం నుండి ఇరాన్ అన్న శబ్దం పుట్టిందనీ చరిత్రకారులు వ్యాఖ్యానించారు. ఈ విధంగా మధ్య ఆసియా నుండి ఇరాన్ మీదుగా సింధు ప్రాంతానికి వచ్చిన ఆర్యులు పితృస్వామ్య వ్యవస్థను, బీజరూపంలో వర్ణ వ్యవస్థనూ కలిగి ఉన్నారు. వారు స్థానిక ప్రజలను లోబరచుకొని ఆర్యీకరించిన క్రమంలో వర్ణ వ్యవస్థ రూపొందింది. వేల సంవత్సరాల పరిణామ క్రమంలో ఆర్యుల శృతిసాహిత్యం రూపం తీసుకునింది. తొలి శృతి సాహిత్యం ఋగ్వేదం. దీనినిండా ప్రార్థనలున్నాయి. దస్యులను నిర్మూలించే శక్తి తమకిమ్మని ఇంద్రున్ని వేడుకున్నారు. తమ శరీరాలకు శతృవును (దస్యులను) సంహరించే శక్తినిమ్మని కోరుకున్నారు.

ఆర్య సాహిత్యం తొలినాటి భారతీయుల్ని విడదీసి, ఆర్యీకరించి ఆధిపత్యం చెలాయించిన క్రమాన్ని ప్రతిఫలించింది. కొన్ని సామాజిక సమూహాల్ని కీర్తిస్తూ, కొన్ని సమూహాల్ని దూషిస్తూ సాగుతుంది ఋగ్వేదం. దీనిలో తరువాతి కాలంలో చేర్చబడ్డ పురుషసూక్తం సృష్టి, దాని మూలాన్ని వివరించింది. సామాజిక కట్టడాన్ని కూడా తెలిపింది. ఈ సూక్తంలో తెలిపిన సామాజిక కట్టడమే వర్ణధర్మం. ఇదే ఈనాటికీ లౌకిక న్యాయంపైన పోరాటం సాగిస్తున్న ధార్మిక న్యాయం. శృతి, స్మృతి సాహిత్యంగా పిలువబడే బ్రాహ్మణ ధార్మిక సాహిత్యానికి, నాటి సామాజిక జీవన నిర్మాణాలకు, రాజ్య శాసనాలకు వ్యతిరేకంగా సాగిందే ఈ దేశ మానవ హక్కుల పథంగా చెప్పవచ్చు. పురుష సూక్తం మనుషుల్ని మనుషులుగా పుట్టించదు. వర్ణాలుగా పుట్టిస్తుంది. బ్రహ్మ శరీర భాగాల నుండి నాలుగు వర్ణాలుగా ప్రజలు పుట్టారంటుంది. పై మూడు వర్ణాలకు జ్ఞానార్జన, వనరులపై యాజమాన్యాన్ని, సామాజిక హోదాను ఇచ్చింది. నాలుగవ వర్ణానికి జ్ఞానం, ఆర్థిక వనరులు ఇవ్వకపోగా వాటిని కలిగి ఉండటం నేరమని, పై వర్ణాల వారికి సేవ చేస్తూ జీవించాలని శాసించింది. జీవన వనరుల విషయంలో మనుషులకు గల అర్హతను, అనర్హతను అది తెలియజేస్తుంది.

ఈ వర్ణ ధర్మ శాసనం వేల సంవత్సరాలు నిలకడగా సాగింది. ఇది స్థానిక జాతుల్ని విడదీసింది. ఆర్యీకరించబడినవారు పై మూడు వర్ణాలలో సర్దుబాటైనారు. తక్కినవారు నాలుగవ వర్ణంగా నెట్టివేయబడ్డారు. ఈ ఆర్యీకరణ, నెట్టివేత ఒక అసంకల్పిత చారిత్రక క్రమంలో జరిగాయని కోశాంబి వంటి మార్క్సిస్టు చరిత్రకారులు అంటుండగా, ఆర్యీకరణను సంకల్పపూర్వకంగా వ్యతిరేకించిన వారు నాలుగవ వర్ణంలోకి నెట్టివేయబడ్డారన్న వ్యాఖ్య అంబేద్కర్ రచనలలో కనిపిస్తుంది. ఈ పరిణామ క్రమంలో సమాజం జనపదాలు, మహాజనపదాలుగా మారి రాజ్యాలు ఆవిర్భవించాయి. రాజకీయార్థిక నిర్మాణం గణ రూపంలో ఉన్నప్పుడే వర్ణ ధర్మానికి ప్రతిఘటన వచ్చింది. అది క్రీ.పూ. 600-500 సంవత్సరాలలో, బుద్ధుని రూపంలో బలంగా వ్యక్తమయింది. బుద్ధుడు సమాజంలోని అసమ వర్ణ ధర్మాన్ని నిరసించాడు. అయితే అన్ని కష్టాలకూ కోరికలే కారణమన్న బుద్ధుడి మాట ప్రచారం పొందినంతగా ఆయన ఆలోచనలలోని సామాజిక విశ్లేషణ పొందలేదు. యజ్ఞ యాగాదులను, వాటిలో ఇమిడి ఉన్న హింసను బుద్ధుడు వ్యతిరేకించాడు. సమాజం మానవీకరించడానికి అష్టాంగ మార్గాన్ని ఉపదేశించాడు. దీనిని హెచ్చు తగ్గులతో నిమిత్తం లేకుండా మనుషులందరూ ఆచరించవచ్చు. ఆ మార్గం:

సరైన దృష్టి, సరైన సంకల్పం
సరైన మాట, సరైన పని, సరైన జీవిక,



సరైన ప్రయత్నం, సరైన స్మృతి, సరైన సమాధి.

ఈ మార్గం ప్రజలను శాంతి వైపుకు నడుపుతుందని బుద్ధుడు అన్నాడు. అదే సమయంలో జ్ఞానసముపార్జన విషయంలో వర్ణ వివక్షను పూర్తిగా వ్యతిరేకించాడు. ఏ కులంలో పుట్టినవారైనా భిక్షువులు కావచ్చునన్నాడు. భిక్షువులై జ్ఞానాన్ని అన్వేషించవచ్చునన్నాడు.

ఇది బహుజన హితాన్ని, బహుజన సుఖాన్ని ఇస్తుందని ప్రచారం చేయడం వైదిక ధర్మానికి కుదుపుగా మారింది. వర్ణ ధర్మంలోని దృష్టికోణం, న్యాయం అంతా బ్రాహ్మణుల సృష్టేనని తేటతెల్లం కావడంతో- ధార్మిక పీఠాలు కదిలాయి. బౌద్ధానికి పోటీగా బ్రాహ్మణీకం తానూ ప్రచారాన్ని మొదలు పెట్టింది. హింసను విడిచిపెట్టాలని, జంతు సంహారాన్ని మానుకోవాలని ఉద్బోధించింది.

జంతు సంహారం విడిచిపెట్టి, వ్యవసాయాన్ని విస్తరించేందుకు, ఉత్పాదకతను పెంచేందుకు బౌద్ధం తోడ్పడింది. రైతుకు విత్తనాన్ని, వ్యాపారికి ద్రవ్యాన్ని ఇవ్వాలని బౌద్ధం చేసిన ప్రచారం గణ సమాజాలలో కదలిక తెచ్చింది. వర్ణ ధర్మాన్ని కుదిపివేసింది. దీన్ని పూడ్చుకోడానికి వైదికులు అటవీ ప్రాంతాలు తిరిగి ఆటవికుల్ని వ్యవసాయకులుగా మార్చుతూ ఆర్యీకరిస్తూ పోటీపడినారు. ఆ రకంగా పోటాపోటీగా సాగిన బౌద్ధ, వైదిక ధర్మాల ఘర్షణ నూతన పరిణామానికి కారణమైంది. ఈ పోటీలో బౌద్ధం వెనుకడుగు వేసింది. వర్ణ ధర్మం విస్తరించింది. దీని విస్తృత రూపమే మౌర్యుల రాజ్య వ్యవస్థ. దీనికి అండగా నిలిచిందే నేటి ఆర్థిక శాస్త్రం. ఈ మొత్తం క్రమంలో మానవ హక్కుల భావనను నిర్వచించే కొన్ని విలువలు స్థిరపడ్డాయి. ఇవి జ్ఞానం, సమానత్వం, సంఘతత్వం అనే బౌద్ధ విలువలు.

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

అంటే బుద్ధికి, సంఘానికి, ధర్మానికి శరణుగమ్మన్నాడు బుద్ధుడు. అజ్ఞానాన్ని, దైవభావనను, వర్ణ ధర్మాన్ని వీడమన్నాడు. హక్కులు అనుభవించడానికి స్వేచ్ఛలుండాలని, ఆ స్వేచ్ఛలు జ్ఞానంతో లభిస్తాయని అమర్త్య సేన్ చెప్పిన మాటనే రెండున్నర వేల సంవత్సరాల నాడు బుద్ధుడు చెప్పడం వర్ణ ధర్మానికి మొట్టమొదటిసారిగా చుట్టుకున్న యమపాశంగా చెప్పవచ్చు. అయితే ఆ ఉచ్చు నుండి బయటపడి విస్తరించి, బలపడింది వర్ణ ధర్మం. కౌటిల్యుడు, మనువు ఈ క్రమానికి ప్రధాన సిద్ధాంతవేత్తలు. ఈ పరిణామంలో కూలివారిగా ఉన్న శూద్రులు కొంతమేరకు వ్యవసాయకులుగా ఎదిగారు. స్త్రీ సంపూర్ణంగా ఇంటి నాలుగు గోడలలోకి పోయింది. వర్ణం కులాలుగా విస్తరించింది. అంటరాని కులాల సంఖ్య కూడా అపరిమితంగా పెరిగింది. ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక శక్తి పెరిగినా జ్ఞానం మీద, వనరుల మీద పై వర్ణాల ఆధిపత్యం చెక్కుచెదరకుండా రాజ్యం మీదనే వర్ణధర్మ రక్షణ బాధ్యతను మోపినవి- కౌటిల్యార్థశాస్త్రం, మనుధర్మ శాస్త్రమూను. బుద్ధుని జీవిత కాలములో బౌద్ధం, వైదికం పోటీపడి వ్యవసాయ సమాజాల విస్తరణ చేసినప్పటికీ తర్వాత వైదికం జయించి బౌద్ధం ఆవిష్కరించిన విలువల్ని కానరాకుండా చేసింది.

భారతదేశంలో భూస్వామ్యాన్ని కొశాంబి పైనుంచి భూస్వామ్యం, క్రింది నుంచి భూస్వామ్యంగా రెండు దశలుగా వివరించారు. ఈ రెండు దశలలోనూ వర్ణధర్మం విస్తరించి పటిష్టమైంది. క్రీ॥శ॥ 8వ శతాబ్ది వరకు ఏకస్వామిక పాలన కొనసాగింది. క్రీస్తుపూర్వం ఉన్న వ్యవస్థకు అర్థశాస్త్రం అద్దం

పట్టింది. క్రీస్తు తర్వాతి కాలములో మనుధర్మ శాస్త్రము, మహాభారతము ఈ వ్యవస్థ సామాజిక జీవితాన్ని వివరిస్తాయి. ఈ కాలంలోనే భర్త చనిపోయిన స్త్రీ 'సతి'గా మారిన విధము కనిపిస్తుంది. ఇది ముఖ్యంగా భూస్వామ్య కులీన కుటుంబాలకు చెందిన పవిత్ర ఆచారంగా ముందుకొచ్చింది. ఇంకొక పక్కన అతిశూద్రులు అమానవీయ సామాజిక స్థితికి నెట్టివేయబడినారు. రహదారిపై తమ రాకను తెలుపడం తప్పనిసరి నియమంగా పెట్టబడింది. క్రింది నుంచి భూస్వామ్యం బలపడి ప్రజలకు బాధలను పెంచింది. భగవద్గీతలోని కృష్ణుని ఉపదేశం రాజ్య కర్తవ్యాన్ని మరోసారి నొక్కి చెప్పింది. అర్జునుని స్వకర్మను ఆచరించమని కృష్ణుడు పురికొల్పడాన్ని 'గీత' తెలుపుతుంది. వేరే ఏ ఒత్తిడికీ ఆలోచనకూ తావు ఉండకూడదని బోధిస్తుంది. రాజు, భూస్వామి, బ్రాహ్మణుడు, వ్యాపారి-రైతాంగంపైన ఈ వర్గాల భారాన్ని, ఒత్తిడిని ఈ సామాజిక నీతి పెంచింది. అదే సమయంలో ఆర్థిక వ్యవస్థ 'స్వయం పరిమితం'గా కుదించబడింది. మనుషులు ఎవరి కర్మను వారు చేయటమే ధర్మము అని బోధించడం హక్కుల లేమిని, అణచివేతను ప్రశ్నించకుండా నిద్రాణంలో ఉంచడానికి దోహదపడింది. వ్యక్తి 'నిమిత్త మాత్రుడు' అని చెప్పడం ద్వారా నైతిక సంశయానికి తావు లేకుండా చేసింది.

## బుద్ధుని అనంతరం

కాలక్రమంలో బౌద్ధం, వైదికం వేరు వేరు కావన్నట్లుగా కలసిపోయి పాలకులకు, బ్రాహ్మణులకు రక్షణగా నిలిచిపోయినవి. బౌద్ధం తాను ప్రవేశపెట్టిన సార్వత్రిక, సమధర్మ విలువలు మరిచిపోయి అమానుష ధర్మంతో మిలాఖత్ అయ్యింది. ప్రజల స్వేచ్ఛల గురించి, వాటిని అనుభవించే శక్తుల గురించి క్రీ.శ. 5వ శతాబ్దం తరువాతి కాలంలో బౌద్ధులు ప్రస్తావించిన ఛాయలు లేవు. బౌద్ధం క్రమేపీ వైదికంతో సర్దుబాటు చేసుకున్నది. ఈ దశలో శైవం వైదికానికి సవాలుగా ముందుకొచ్చింది.

వైదిక మతంలో యజ్ఞయాగాదుల నిర్వహణాధికారం బ్రాహ్మణేతరులకు లేదు. వారికి శాస్త్ర జ్ఞానం పొందే హక్కు లేదు. సామాన్యులపైనా, వృత్తికారులపైనా, శ్రమజీవులపైనా భూస్వామ్య రాజకీయార్థిక వ్యవస్థ ప్రయోగించిన అణచివేతను ప్రశ్నించడానికి, ధిక్కరించడానికి శైవం తీసుకొచ్చిన భక్తిభావన ఆధారమైంది. సామాజిక, రాజకీయ వ్యవస్థలో వర్ణధర్మం పట్ల ప్రదర్శింపవలసిన 'భక్తి' వారు భగవంతుని వైపు మరల్చి వైదికాన్ని ఉక్కిరి బిక్కిరి చేశారు. భగవంతుని ముందు అందరూ సమానులేనంటూ భగవంతుని కంటే మించిన అధికారం ఎవ్వరికీ లేదని గొంతెత్తారు. శైవం ఆవిర్భావాన్ని సామాజిక అణచివేతపై తిరుగుబాటుగా చూడవచ్చు. బ్రాహ్మణ ధర్మం దేన్నైతే నిషేధించిందో దాన్నే తన విలువలుగా ప్రకటించడం శైవం విశిష్టత.

శివదీక్ష తీసుకోవడంలో వర్ణ, వర్గ, వృత్తి, లింగ భేదాలు పాటించరు. ఆ విధంగా వర్ణ సమానత, వృత్తి సమానత, కొంతమేరకు లింగ సమానతను పాటించి సామాజిక జీవితంలో సమానతా విలువలను బుద్ధుని తర్వాత మళ్లీ శైవమే ఉనికిలోకి తీసుకొచ్చింది. ఈ ఉద్యమ నిర్మాత, నాయకుడు, కార్యకర్త అయిన బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందినవాడు. మనిషి తనను తాను ఉద్ధరించుకోవటంతో పాటు సమాజాన్ని ఉద్ధరించాలనే మహాసంకల్పం బసవడిది. విశ్వాసాల కంటే ఆచరణకు, అధ్యయనం కంటే అనుభవానికి, సుఖాలాలసత కంటే శ్రమజీవనానికి అధిక ప్రాముఖ్యత నిచ్చాడు. మానవ సంబంధాలన్నీ శివ సంబంధాలేనన్నాడు. దేవాలయాలను నిరసించాడు. శరీరమే దేవాలయమన్నాడు. కులాన్ని నిరసిస్తూ,



వ్యాసుడు జాలరి కొడుకు,
మార్కండేయుడు చండాలుడు,
మండోదరి కప్ప కడుపున పుట్టింది-
కులాన్ని ఎందుకు చూస్తావు?
నిన్నటి దినం నీ కులం ఏమిటో?
అగస్త్యుడు కోళ్లు పట్టేవాడు.
దూర్వాసుడు చెప్పులు కుట్టేవాడు.
కాశ్యపుడు కమ్మరి. ఇక కౌండిన్యుడంటారా
అతను మంగలి అని ముల్లోకాలూ ఎరుగును.
కూడలి సంగముని మాటలు ఆలకించుమా,
కింది కులంలో పుడితేనేం?

శివభక్తుడొక్కడిదే ఉత్తమ జన్మ అన్నాడు బసవడు. బ్రాహ్మణ సంప్రదాయాన్ని అపహాస్యం చేస్తూ, శాస్త్రాలు సంతలో పుకార్లనీ, తర్కం పొటేళ్ల కొట్లాట అనీ, పురాణ శ్రవణం అల్లరి మూకల సమావేశమనీ, పూజలు కొద్దిమందికి వ్యాపారం మాత్రమేననీ అన్నాడు.

అసమాన ధర్మానికి ప్రతిగా సమధర్మాన్ని ఆచరించి చూపింది శైవం. ప్రజలంతా దేవుని ముందు సమానమనే కొత్త ఆలోచనకు మార్గం చూపింది. ఆ మేరకు కర్మ, వర్ణధర్మ సిద్ధాంతాలను నిలువరించింది.

బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థ పైన తిరుగుబాటుగా మొదలయిన బౌద్ధం, శైవం మొదలయినవి ఎందుకు కాలక్రమంలో బలహీన పడ్డాయన్న చర్చ చాలా జరిగింది. చాలా సంక్లిష్టమైన ఈ చారిత్రక క్రమాన్ని ఒకటి రెండు వాక్యాలతో వివరించలేమన్నది స్పష్టమే. అయితే కొట్టొచ్చినట్టు కనిపించే ఒక కారణమేమిటంటే కొన్ని మౌలిక విలువల ప్రతిపాదనతో మొదలయిన ఈ తిరుగుబాట్లు తరువాతి కాలంలో కొన్ని ప్రయోజనాల రక్షణకు పరిమితం కావడం. ఎప్పుడయితే అది జరిగిందో అప్పుడు వాటిలోని తిరుగుబాటు గుణం నశించింది.

ముస్లిం పాలకులు రాజ్యాలు నెలకొల్పిన తర్వాత హిందూ పాలకుల స్వేచ్ఛకు మొదటిసారి అడ్డుకట్ట పడింది. ఆయుధాలు పట్టకూడదనే, గుఱ్ఱాలు వాడకూడదనే నిషేధాజ్ఞలకు కట్టుబడి ఉండవలసి వచ్చింది. అయితే తర్వాత దశలో ముస్లిం రాజులు కౌటిల్యం నేర్చుకొని, పరిపాలన మెలకువలు తెలుసుకొని, ఆచరించారు. ఫలితంగా పాత సామాజిక నిర్మాణాన్ని బలపరిచే వారిగా నూతన పాలకులు కూడా మారిపోయారు. మొదట్లో ముస్లిం పాలకులు అనుసరించిన మత పద్ధతులు ఘర్షణకు కారణమయ్యాయి కానీ ఆ తరువాత బ్రాహ్మణీకంతో వారు రాజీపడ్డారు. బౌద్ధం, శైవం, వైదికం, ముస్లిం మతాలు ఘర్షించుకుంటున్న నేపథ్యంలో 12-13 శతాబ్దాలలో సూఫి ఉద్యమం అమీర్ ఖుస్రూతో మొదలైతే, 15-17 శతాబ్దాలలో భక్తి ఉద్యమం ఆవిష్కరించబడింది. ఇది ప్రధానంగా ఉత్తర, పశ్చిమ భారతంలో జరిగింది.

చాలామంది సామాజిక శాస్త్రవేత్తలు - చరిత్రకారుడైన రిచర్డ్ బార్నెట్ నుంచి ఆర్థిక శాస్త్రవేత్త అయినటువంటి సంజయ్ సుబ్రమణియన్ వరకు - 15-17 శతాబ్దాలలో మొలకెత్తిన రాడికల్ భక్తి ఉద్యమాన్ని ఆధునిక భారత చరిత్రకు ఉషోదయంగా విశ్లేషించారు. ఈ కాలానికి చెందిన భక్తి

ఉద్యమకారుల్లో తుకారామ్ ఆధునిక భారత మానవహక్కుల భావనకు ఆద్యుడుగా చెపుతారు వాళ్లు. తుకారామ్ సూఫీ మరియు భక్తి సంప్రదాయాల మీద తన భావనలను నిర్మించాడు. ఈ భక్తి ఉద్యమానికి కబీర్ ఆద్యుడు. ఆ తర్వాతి వారు మీరా, రవిదాస్, తుకారామ్‌లు.

కబీర్ 15వ శతాబ్దిలో జీవించాడు. పద్మశాలి వృత్తిగా గల కుటుంబంలో జన్మించాడు. ఇతనిపై ఇస్లాం, బౌద్ధ భావనల ప్రభావం ప్రగాఢంగా ఉంది. మత ఘర్షణలను విమర్శించాడు. వ్యతిరేకించాడు. హిందువులు రాముడు గొప్పవాడని, తురకలు రహీమ్ గొప్పవాడని ఒకరితో ఒకరు పోట్లాడు కుంటారు – సారాంశమేదీ తెలియకుండానే..... అంటాడు.

"బ్రహ్మ గొప్పవాడా! అతని పుట్టుక (Origin) గొప్పదా! వేదాలు గొప్పవా? లేక వాటిని సృష్టించినవారా?"

"మెదడు గొప్పదా! అది తెలుసుకొన్న విషయం గొప్పదా! రాముడు గొప్పవాడా! అతన్ని తెలిసినవాడు గొప్పవాడా?"

ఈ విధంగా కబీరు నాటి అశాంతి పూర్వక సమాజానికి సంధించిన ప్రశ్నలు కొత్త విలువల ఆవిష్కరణకు నాంది అయ్యాయి.

మతాలు ఏవైనా దైవం ఒక్కడేననే విలువ ముందుకు రావడం, ఏమీ తెలుసుకోకుండానే ఘర్షణ ఎందుకనడం, ఒకవైపు సామరస్యం ఇంకొకవైపు ప్రశ్నించడం – నాటి సమాజానికి కబీరు చేసిన భావనల చేర్పు.

రవిదాస్ చనిపోయిన పశువుల్ని శుభ్రపరిచి, తోలుతీసే కులానికి చెందినవాడు. ఇతను బ్రాహ్మణత్వాన్ని ప్రశ్నించాడు. పరాధీనత భయంకరమైందన్నాడు.

ప్రతిభలేని బ్రాహ్మలను గౌరవించవద్దన్నాడు.

ప్రతిభ ఉన్న చండాలుడికైనా పాదపూజ చేయొచ్చన్నాడు.

భక్తి క్షీణించిన బ్రాహ్మడి ముఖాన్ని కాలబెట్టమన్నాడు.

లొంగి ఉండడం అన్నింటి కంటే హీనమైనదని అన్నాడు. ఈ విధంగా బ్రాహ్మణ వర్ణం గౌరవ ప్రదమైందేమీ కాదు, ప్రతిభ ఉన్నవాడే బ్రాహ్మడనే భావనను ముందుకు తెచ్చాడు. ఆ రకంగా మనుషుల్ని కులపరంగా కాకుండా ప్రతిభపరంగా గుర్తించాలనే వాదనను, మానవులు సహజంగా సమానులనే భావనను ఎత్తిచూపాడు. ఒకరికొకరు అణగి ఉండడం హీనమూ, భయంకరమూ అన్నాడు. ఆనాటి అసమసమాజ భయంకర నిర్మాణం నశించిపోవాలని ఆశించాడు.

మీరా రాజపుత్ర మహిళ. రాజపుత్ర సమాజపు పితృస్వామిక విలువల్ని వ్యతిరేకించింది. వివాహ బంధాన్ని తృణీకరించడం ద్వారా సంప్రదాయ విలువలపై తిరగబడింది. కృష్ణ భక్తురాలిగా సంచార జీవితం గడిపింది. ఈమెకు తిరగబడే మానసిక ధైర్యాన్నిచ్చింది రవిదాస్ అని కొంతమంది విశ్లేష కుల అభిప్రాయం. మీరా రవిదాస్‌లో గురువును చూసింది. అతని ఆశీస్సులను కోరింది. రవిదాస్ "నాకు కులాలతో, ఇతర విభజనలతో పనిలేదు. ప్రపంచం ఏమనుకున్నా ఫర్వాలేదు. నీకు నేను నా ఆత్మను, బుద్ధిని, శరీరాన్ని ఇస్తున్నాను... నేను పశువుల తోలు తీస్తాను, చర్మాలను శుద్ధి చేస్తాను. అదే నా పని, ఈ పని నాకు ప్రీతిపాత్రమైనది..." అన్నాడు. ఇది విని మీరా రవిదాస్ కాళ్ళమీద పడి తననీ ఆ ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్ళమని వేడుకుంది.

తుకారామ్ 17వ శతాబ్దానికి చెందినవాడు. ఉత్తర భారతావనికి చెందిన భక్తి ఉద్యమంలో చివరివాడు. ఇతను దళితుల్ని, మహిళల్ని, ముస్లింలను విష్ణుదాసులుగా వర్ణించాడు. ఇతను ఆస్తిపరుడయినా శూద్రకులానికి చెందినవాడు కావడం వల్ల చదివే హక్కు, రాసే హక్కు లేనివాడయ్యాడు. చదువు నేర్చుకొని రాసినందుకు ఇతనిని గ్రామ సంఘం ముందు నిలబెట్టి విచారించారు. ఇతని రచనలను నదిలో పారవేశారు. చివరికి చంపారు కూడా. దీనికి కారణం, ఇతని రచనలలో రాజును, బ్రాహ్మణులను విమర్శించడం, వారిని దొంగలుగా వర్ణించడం.

భక్తిలేని బ్రాహ్మడి ముఖాన్ని తగలబెట్టమన్నాడు.

మెదడులో ఉన్న దాన్ని బట్టి కులం నిర్ణయించాలన్నాడు.

కలియుగంతో బానిసత్వం ముగుస్తుంది. సంకెళ్ళు తెగిపోతాయి. అందరికీ సంపద, అధికారం, గౌరవం లభిస్తుంది అన్నాడు.

తుకారాం కవిత్వం స్వేచ్ఛకు ఆధారాలైన వాటిని చూపింది. వాటికోసం పోరాటం చేశాడు, చంపబడ్డాడు. ఆ రకంగా ఆధునిక భారత చరిత్రలో మానవ హక్కుల పోరాటానికి సంకేతమయ్యాడు.

మన దగ్గరికొస్తే, వేమన, వీరబ్రహ్మం 17వ శతాబ్ది మధ్య భాగం నుంచి 18వ శతాబ్ది ప్రథమ పాదం వరకు జీవించారు. ఆధిపత్య భావాలను నిరసించారు. అభ్యుదయ దృక్పథాన్ని అలవర్చారు. ఒక ప్రత్యేక మత విశ్వాసంతో సామాజిక అభ్యుదయాన్ని కోరకపోవడమే వీరి విశిష్టత. వీరు సామాజిక స్పృహ కలిగిన తొలి తెలుగు కవులు. సమకాలీన సంఘటనలకు ప్రతిస్పందిస్తూ సమాజాన్ని మానవీకరించడమెలాగో తమ కవిత్వంలో చూపారు. వైష్ణవ శైవాలు ప్రచార ఆర్భాటం వలన ప్రజలకు సన్మార్గం చూపటంలో విఫలమైనాయని తెలిపారు.

వీరు మతం, కులం, గుణం, డబ్బు, మూఢ విశ్వాసాలపై నిరసన తెలుపుతూ తమ కలం ద్వారా ప్రత్యామ్నాయ గొంతును విప్పారు.

"చిల్లర రాళ్ళకు మొక్కుచునుండి చిత్తము చెడిపోనోరేమొరె"

ఏ కులమని నను వివరమడిగితే – యేమని దెల్పుతు లోకులకు–

పలుగాకులకు – దుర్మార్గులకు – దుష్టులకు...

– కులము గలవాడు – గోత్రంబు గలవాడు – విద్య చేత విఱ్ఱవీగువాడు ధనము గలవాని బానిస కొడుకులు

– పిండములు జేసి పితరుల తలబోసి.. కాకులకు, గ్రద్దలకు పెట్టు వెఱ్ఱివాడా. పియ్య తినెడు కాకి పితరులెట్లయ్యెరా!

మొదలయిన వాక్యాలు వీరి విలువలను వ్యక్తం చేస్తాయి.

## ఆధునిక కాలం

తూర్పు ఇండియా కంపెనీ పాలన క్రమంగా ముస్లిం పాలకులను కూలదోసి బ్రిటీష్ రాజ్యాన్ని ఏర్పర్చిన తర్వాత ఆర్థిక వ్యవస్థలో, సామాజిక వ్యవస్థలో, రాజకీయ ఆలోచనలలో కొత్త కదలికలు వచ్చాయి. భూమి శిస్తు పద్ధతి పాలకులకు, ప్రజలకు మధ్యన కొత్త దళారులను, అధికార వ్యవస్థలను నిర్మించింది. చేతివృత్తులు, గ్రామీణ పరిశ్రమలు నశించాయి. సంపన్నులు, మధ్య తరగతి కుటుంబాలు ఇంగ్లీష్, క్రైస్తవ మిషనరీల పుణ్యాన చదువుకున్నారు. ఇన్నాళ్ళు విద్యనోచుకోని కులాలు

విద్యను అందుకున్నాయి. సంపన్న కుటుంబాలు విదేశీ చదువులు చదివి బ్రిటీష్ ఇండియాలోని అధికార యంత్రాంగంలో కలసిపోయాయి.

సిపాయి తిరుగుబాటు జరిగిన స్థాయిలోనే భారత సమాజంలోని వివిధ వర్గాలలో ప్రతిస్పందనలు మొదలయ్యాయి.

అధికారాన్ని కోల్పోయిన వర్గాలలోని తర్వాతి తరాలలో బ్రిటీష్ రాజ్యంలో భాగస్వామ్యం కావాలనుకున్నవారున్నారు. బ్రిటీష్ చదువులు చదివి ఆధునిక, ప్రజాతంత్ర విలువల్ని పరిచయం చేసుకున్నవారున్నారు. వీరు ప్రధానంగా బ్రాహ్మణ, బనియా, కాయస్తు, రాజపుత్ర కులాల వారు. మిషనరీల విద్య వల్ల నూతన విలువల్ని పరిచయం చేసుకున్న కులాలు ఇక్కడి సామాజిక అసమ, అమానవీయ సంబంధాలను ప్రశ్నించే చైతన్యం పొందాయి. అంటే ఒకరు బ్రిటీష్ రాజ్య యంత్రాంగంలో భాగస్వామ్యం కోసం సిద్ధపడుతూ ఇక్కడి మధ్యయుగాల సాంఘిక పరిస్థితి సంక్రమించాలని కోరుకుంటే, ఇంకొక వర్గం ఇక్కడ ప్రబలంగా ఉన్న హిందూ ధర్మాన్ని ప్రశ్నించి సాంఘిక సమానత్వాన్ని కాంక్షించింది. ఈ కాంక్షలు బ్రిటీష్ ఇండియాలో మానవ హక్కుల చైతన్యానికి కొత్త పేజీలను తెరిచాయి. ఈ పోరాటాల పరిణామ క్రమం స్వరాజ్య భావనను ఆవిష్కరించింది. స్థూలంగా మూడు పాయలుగా సాగిన ఈ పోరాటాలలో ఒక్కొక్క పాయ నుండి ఒక్కొక్క రకమైన హక్కుల స్ఫూర్తి జన్మించింది.

ఈ మూడు- సామాజిక విముక్తి, సాంఘిక సంస్కరణ, స్వరాజ్యం- పాయలలోని హక్కుల స్ఫూర్తికి జ్యోతిరావు పూలె, రాజా రాంమోహన్, బాలగంగాధర తిలక్‌లను ప్రతీకలుగా తీసుకోవచ్చు.

19వ శతాబ్దంలోని ఈ హక్కుల భావనలకు రెండు ముఖాలున్నాయని చెప్పవచ్చు. అవి విలువలు, ప్రయోజనాలు. అన్ని పాయలలోనూ రెండూ ఉన్నాయి. కానీ ఒక పాయలో విలువలు ప్రధానం కాగా వేరొక దానిలో ప్రయోజనాలు ప్రధానం. సామాజిక విముక్తి కోసం సాంఘిక అణచివేతకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే వేసిన బాట విలువల చట్రంలో సాగితే బ్రాహ్మణ మహిళ జీవితంలో సంస్కరణ నుద్దేశించి రాజా రామ్‌మోహన్ రాయ్ చేపట్టిన సంస్కరణాత్మక పోరాటంలో విలువలు ఇమిడి ఉన్నప్పటికీ అందులో ప్రయోజనాలు ప్రధానం. ఈయన ఏర్పరచిన బ్రహ్మ సమాజం తదితర నిర్మాణాలన్నిటికీ ఇది వర్తిస్తుంది. 'ఉన్నత' వర్గాల పాశ్చాత్యీకరణ ఆయన కోరుకున్న ప్రయోజనం.

బ్రిటీష్ వారి భూమి శిస్తు విధానం జమీందారుల్ని సృష్టించింది. పశ్చిమ దేశాల విద్య కొత్త ఉద్యోగ వర్గాన్ని, పట్టణ మధ్యతరగతిని పుట్టించింది. జమీందార్లు, ఇతర ఉన్నత వర్గాలు బ్రిటీష్ వారితో సమానత్వాన్ని కాంక్షించారు. వీరి మెదడులో పుట్టిందే జాతుల సమానత్వం ఆలోచన. పశ్చిమ దేశాల నుండి వీరు సమానత్వ విలువను ఆ విధంగా దిగుమతి చేసుకో దలిచారు. సంఘాలు పెట్టాలనే ఆలోచన చేశారు. ఆ విధంగా-

1837లో జమీందార్ల సంఘం ఏర్పడింది.

1843లో బెంగాల్ బ్రిటీష్ ఇండియా సొసైటీ ఏర్పడింది.

1851లో బ్రిటీష్ ఇండియా అసోసియేషన్ పుట్టింది.

ఈ సంఘాలు నెలకొల్పినవారు బ్రిటన్‌లో ఉన్న మాదిరిగా తమకు హక్కులు ఉండాలని కోరుకున్నారు. భూమి చట్టాలలో సంస్కరణలు, పాలనలో ఉద్యోగావకాశాలు, భాగస్వామ్యం తదితర



డిమాండ్లు పెట్టారు. ఇండియా ప్రజలు, బ్రిటీష్ ప్రజలు సమానులే అన్న విలువ సంపన్న వర్గాల ప్రయోజనాల పరిధిలో వీరి ఆచరణలో వ్యక్తం అయింది. కానీ ఈ సంఘాలు ఆనాటి బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాట్లను వ్యతిరేకించాయి. కౌలు చట్టాలను వ్యతిరేకించాయి. ఉదా॥ 1857 సిపాయిల తిరుగుబాటును, 1882 బెంగాల్ కౌలు చట్టాలను వ్యతిరేకించాయి.

రాజా రామ్‌మోహన్‌రాయ్ బెంగాల్ బ్రాహ్మణ జమీందారి కుటుంబంలో పుట్టాడు. ఇంగ్లీషు విద్య దేశీయ అజ్ఞానానికి పరిష్కారమని భావించాడు. వాస్తవ వివేచనాత్మక దృష్టి కోణం గలవాడు. ఆత్మీయ సభను ఏర్పాటు చేశాడు. బ్రహ్మ సమాజాన్ని ఏర్పరచి ఇక్కడి (హిందూ) సమాజాన్ని పాశ్చాత్యీకరణ (క్రిష్టియనైజ్) చేయాలని సంకల్పించాడు. ఇదే ముందడుగని భావించాడు. సర్వ మానవ సమానతా (హిందూ, క్రిష్టియన్, ఇస్లాం) మత ప్రాతిపదికను పెంపొందించే వేదికగా బ్రహ్మ సమాజాన్ని నిర్మించాడు. కుల, మత భేదాన్ని పాటించని, విగ్రహారాధన లేని భక్తి ధ్యాన రూపంగా బ్రహ్మ మతాన్ని ముందుకు తెచ్చాడు. ఇతనికి తోడుగా నిలిచినవాడు ద్వారకానాథ ఠాకూర్.

1857 సిపాయిల తిరుగుబాటుకు సమాంతరంగా బ్రహ్మ మతం ఏర్పాటై ముందుకు పోవడం గమనించదగ్గ పరిణామం.

ఈ బ్రహ్మ సమాజం హిందూ ఆధ్యాత్మిక వాదం పరిధిలో ఉండిపోయిందని భావించి దానిని నవీకరించడానికి 1866లో ప్రతాపచంద్ర మజుందార్‌తో కలిసి కేశవచంద్రసేను భారత బ్రహ్మ సమాజం అనే కొత్త వేదికను ఏర్పర్చాడు. ఇది ఆంధ్ర ప్రాంతానికీ వచ్చింది. అయితే ఇలా క్రైస్తవీకరించడం, హిందూ సనాతన ధర్మాలకు దూరం కావడం సరైంది కాదని భావించిన దయానంద సరస్వతి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. వీరందరి కృషీ పరిమితమైనదే అయినా అది సనాతనులకు కోపం తెప్పించింది. వేదాలకు అర్థాలు చెప్పడం, కుల భేదాలను నిర్మూలించడం, స్త్రీ, పురుష సంబంధాలు సమానత్వం వైపు ప్రయాణించాలని చెప్పడం మొదలయిన పోకడలను సనాతన హిందూ బ్రాహ్మణ సమూహాలు తిరస్కరించాయి. రామకృష్ణ పరమహంస స్ఫూర్తితో వివేకానందుడు 1876లో స్థాపించిన దివ్యజ్ఞాన సమాజం భారత పునరుజ్జీవన ఆలోచనా ధోరణిని కొనసాగించింది.

బ్రిటీష్ ప్రభుత్వం విదేశీయమైనదని, విజాతీయమైనదని భావించి మతం ఆధారంగా స్వజాతీయతా స్ఫూర్తిని నిలబెట్టే కృషికి కూడా బీజాలు పడ్డాయి. 1867లో ఒక సంస్థ హిందూ మేళాను ఏర్పర్చింది. ఈ ఆలోచనకు బ్రిటీష్ పారిశ్రామికుల నిర్ణయాలు బలాన్ని అందించాయి. ఉదా॥ 1878లో మద్రాసు హైకోర్టు జడ్జిగా ఒక భారతీయున్ని నియమించినందుకు బ్రిటీష్ పారిశ్రామికవేత్తలు నిరసన తెలిపారు. 1880లో బకించంద్ రాసిన ఆనందమఠం నవల హిందూ వీరజాతీయతను పురికొల్పింది.

1882లో జాతి, మత వివక్ష పాటించకుండా యోగ్యతను బట్టి న్యాయస్థానాల్లో న్యాయాధికారులను నియమించాలని ఇల్బర్టు బ్రిటిష్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకించిన బ్రిటీష్ జాత్యహంకారులు రిప్పన్ పదవిని ఊడపెరికించారు!!

సివిల్ సర్వీస్‌లో ప్రవేశానికి వయోపరిమితిని తగ్గించి భారతీయులను అడ్డుకున్నారు. దీనికి నిరసనగా ఇండియన్ అసోసియేషన్ సంస్థ 1883లో ఏర్పడింది. స్థానిక పత్రికల స్వేచ్ఛకోసం

పూనా సార్వజనీకసభ ఏర్పడింది. ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మళ్ళించుకోడానికే 1885లో జాతీయ కాంగ్రెస్‌ను ఏ.ఓ.హ్యూం అనే ఇంగ్లీష్‌వాడు ఏర్పాటు చేశాడు.

ఈ ప్రయత్నాలు కొన్నిటిలో కొన్ని ప్రజాతంత్ర విలువలున్న మాట వాస్తవమే. ముఖ్యంగా రాజా రాంమోహన్‌రాయ్ వంటివారి కృషిలో విలువల పాలు తక్కువ కాదు. అయితే మొత్తం మీద తీసుకున్నప్పుడు ఇవి ప్రజాస్వామ్యం, మానవీయత మొదలయిన మాటలు ప్రయోగించినప్పటికీ విలువల కంటే పరిమితమైన ప్రయోజనాలే ప్రధానంగా కలిగిన ప్రయత్నాలు. విలువలకు చెప్పుకో దగ్గ స్థానం ఉన్న సందర్భాలలో సహితం అవి పరిమితమైన ప్రయోజనాలనే అంటిపెట్టుకొని ఉండ డం వల్ల విలువలుగా ఒక స్థాయిని దాటి ఎదగలేకపోయాయి.

ఈ పరిణామాలకు ప్రతిగా హిందూ సామాజిక అణచివేతను వ్యతిరేకిస్తూ సాగిన ఉద్యమాలకు జ్యోతిరావు పూలే శ్రీకారం చుట్టాడు. జ్యోతిరావు పూలే (1827-1870) పూనాలో ఒక కూరగాయల వర్తకుని ఇంట్లో పుట్టాడు. వీరి తాతలు పేష్వా కొలువులో పూలమ్మి బ్రతకడం వల్ల పూలేలని పిలుపు స్థిరపడింది. సతారా జిల్లా నుండి పూలే తండ్రి పూనాకు వలస వచ్చి స్థిరపడ్డారు. జ్యోతిరావు 1841లో స్కాటిష్ హైస్కూలులో థామస్ పెయిన్ రాసిన 'మానవుని హక్కులు' అనే పుస్తకం తన బ్రాహ్మణ మిత్రులతో కలిసి చదివి ప్రభావితుడయ్యాడు. 1847లో సెకండరీ విద్య పూర్తిచేశాడు. ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదని నిర్ణయించుకున్నాడు.

1848లో బ్రాహ్మణ మిత్రుని పెళ్ళికి పోయినప్పుడు జరిగిన అవమానం ఆయన్ని 19వ శతాబ్ది నిజమైన మానవహక్కుల కార్యకర్తగా మలిచింది. హిందూ సమాజంలోని హెచ్చుతగ్గులు, అణచివేత, స్త్రీ-పురుషుల అసమానతలను పారదోలటానికే ఆయన కార్యకర్తగా మారాడు.

స్త్రీలు, అతిశూద్రులు, నిమ్నజాతులు విద్య నేర్చుకోవలసిన ఆవశ్యకతను గుర్తించి తాళ్లకోసం స్కూలు పెట్టాలని నిర్ణయించాడు. 1848 ఆగస్టులో బాలికల పాఠశాల తెరిచి మానవశక్తుల నిర్మాణంలో మొదటి అడుగు వేశాడు. అంటరాని వాళ్ళకు చదువు నేర్పడానికి ఎవరూ ముందుకు రాలేదు. తన భార్యకే ముందు చదువు చెప్పి ఆమెను ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయురాలుగా నిలి పాడు. ఈ క్రమంలో ఎన్నో అవమానాలు, దాడులు ఎదుర్కోవలసి వచ్చింది. తండ్రి నుండి దూరం కావలసి వచ్చింది.

వితంతు జీవితాలు, బాల్య వివాహాలు, బ్రాహ్మణ, ఇతర అగ్రకులాలలో సర్వ సామాన్యంగా ఉండేవి. వీటివల్ల ఆ స్త్రీలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పూలె పూనుకున్నాడు. వితంతు తల్లులకు శరణాలయం కట్టి భద్రత కల్పించాడు. ఓ వితంతువుకు జన్మించిన మగబిడ్డను తానే పెంచుకొని వారసునిగా తీర్చిదిద్దాడు. దీనికంటే ముందే 1868లో తన ఇంటి వద్ద గల చిన్న చెఱువులో అంటరాని జాతుల్ని మంచినీళ్ళు తీసుకొమ్మని ప్రోత్సహించాడు. 1873లోనే సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశాడు. హిందూ సమాజాన్ని విశ్లేషిస్తూ 'గులాంగిరి' అనే పుస్తకాన్ని ప్రచురిం చాడు. బ్రాహ్మలు ఇక్కడి భూమిపుత్రుల్ని అణిచి దోచుకున్నారని, దాని ఫలితమే ఈ అసమ సమాజ మని దానిలో చెప్పాడు.

1873 సెప్టెంబర్ 24న తన అనుచరులతో సత్యశోధన సమాజాన్ని స్థాపించాడు.

"సాంఘిక, మత సంస్థల లక్ష్యం మానవుడు తన హక్కులు గుర్తించేలా చేయడమే" అని నమ్మి సామాన్యులను కేంద్రంగా గల సాంఘిక వాతావరణాన్ని పట్టించుకోవాలని చెప్పి నిరంతరం



కృషిచేసినవాడు జ్యోతిరావు పూలె. దొంగ దేశభక్తిని, బ్రహ్మ సమాజాలను వ్యతిరేకించాడు. జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలివ్వాలని బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరాడు.

బ్రాహ్మణ పురోహిత వర్గాల నిర్దయ దోపిడికి వ్యతిరేకంగా శూద్రుల్ని సమీకరించడానికి ఏర్పడిన సంస్థ సత్యశోధక సమాజం. విద్య నేర్పడం, హక్కుల్ని తెలపటం, హింసను వ్యతిరేకించటం, మద్య నిషేధాన్ని వ్యతిరేకించటం, మహిళలకు సమాన ప్రతిపత్తినివ్వటం, వృద్ధుల పట్ల, పసిపిల్లల పట్ల, అనాథల పట్ల, అంగ వికలుర పట్ల సహాయంగా నిలవటం, రైతులు, కార్మికుల సమస్యల్ని, హక్కుల్ని తెలియచేయటం దీని లక్ష్యాలు.

జ్యోతిరావుకు అత్యంత సన్నిహిత మిత్రుడు నారాయణ్ లోఖాండె భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాత. 1880లో బొంబాయి బట్టల మిల్లుల సమస్యల్ని పరిశీలించి కార్మికుల దుర్భర స్థితిని తొలగించడానికి సమగ్ర పోరాటాలు నిర్మించారు. కనీస పనిగంటలు సాధించడానికి, పని పరిస్థితులు మెరుగుపరచడానికి, బాల కార్మికుల కష్టాలు పరిష్కరించడానికి లోఖాండే చేసిన కృషి నిరుపమానమైనది. ఆ విధంగా సార్వత్రిక విలువల అజెండాను ఆచరించిన సంస్థ సత్యశోధక్ సమాజ్. అది నిజమైన మానవహక్కుల సంస్థ. ప్రో-ఆక్టివ్‌గా నిర్ణయించిన ఆ కార్యక్రమమే ఇప్పటికీ హక్కుల ఉద్యమానికి కేంద్రంగా ఉండవలసింది. ఈ సందర్భంగా అంబేద్కర్ పూలె గురించి చెప్పిన మాటను గుర్తుచేసుకుందాము. "ఆధునిక భారత సమాజంలో అందరికంటే గొప్ప శూద్రుడు ఆయన. హిందూ సమాజంలో అగ్రకులాల వారి బానిసలుగా బతుకుతున్న కింది కులాల వారిలో తమ బానిసత్వం పట్ల చైతన్యం రగిలించాడు. విదేశీ పాలన నుంచి విముక్తి సంపాదించడం కంటే సాంఘిక ప్రజాస్వామ్యం సాధించడం భారతదేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్నిచ్చాడు."

19వ శతాబ్దంలో 'సమానత్వ' విలువ జాతుల సమానత్వంగా, సామాజిక సమానత్వంగా నిర్దిష్ట రూపం తీసుకునింది. బ్రిటీష్ ఇండియా ఉద్యోగస్వామ్యంలో భాగస్వామ్యం అనే ప్రయోజనాన్ని 'జాతుల సమానత్వం' ఆశిస్తే, ఇక్కడి సమాజ అంతరాలను కూలదోయడం కోసం భూమిలో వాటా కోసం 'సాంఘిక సమానత్వం' ఆశించిందని చూశాము. కాగా, 20వ శతాబ్దంలో 'స్వరాజ్యం నా జన్మహక్కు'ని తిలక్ చేసిన నినాదం 'స్వయం నిర్ణయాధికారం', 'సార్వభౌమాధికారం' అనే మానవ హక్కుల విలువలను ఆవిష్కరించింది. ఈ విలువలు మొట్టమొదటిసారిగా ఉత్తరం నుండి దక్షిణం వరకు ప్రజల్ని కదిలించాయి. ప్రజలను సంఘటిత పరిచాయి. దేశభక్తి ప్రజల్ని ఒకటిగా బంధించింది. దీనికి ప్రతిగా బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం ఒకవైపు కాంగ్రెస్ పార్టీని సేఫ్టీవాల్వ్‌గా ఉపయోగించుకుంటూనే నిర్బంధ చట్టాలు తీసుకొచ్చింది. దీనితో మానవహక్కుల భావన రాజ్య వ్యతిరేక స్వభావంలోకి నెట్టివేయబడింది. కాంగ్రెస్ పార్టీ అనివార్యంగా ఈ ధోరణికి నాయకత్వం వహించవలసి వచ్చింది.

ప్రాతినిధ్య సంస్థల ఏర్పాటు కోసం, జ్యూరీ విచారణ కోసం, కార్యనిర్వాహక మరియు న్యాయాధికారాల విభజన కోసం, నేర విచారణ స్మృతి సంస్కరణల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేయవలసి వచ్చింది. అణచివేత చట్టాల మీద, జాతుల సమానత్వం మీద ప్రత్యేక దృష్టి పెట్టవలసి వచ్చింది.

1878 నాటి ఆయుధాల చట్టం, పత్రికల సెన్సార్‌షిప్‌లపై చట్టం, సమావేశాల నియంత్రణ (1870) చట్టం కాంగ్రెస్ వారి వ్యతిరేకతను చవిచూసాయి. వీటిలో చివరిది తీవ్రవాద, తిరుగుబాట్ల

మరియు రహస్య అరాచక సంస్థల నిర్మూలన ఉద్దేశ్యాన్ని కలిగి ఉంది. దీనిని గోపాలక్రిష్ణ గోఖలే తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ క్రమంలోనే 1906లో ఇండియా డిఫెన్స్ ఆక్టును అణచివేత చట్టంగా బ్రిటిష్ పాలకులు తీసుకొచ్చారు.

1908లోనూ, 1910లోనూ కూడా నేర చట్టానికి సవరణలు తీసుకొచ్చారు. అభ్యంతరకర వార్తలను పత్రికలవారు ప్రచురించడం నేరమయింది. కొన్ని సందర్భాలలో నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే పెట్టారు. ఈ చట్టాలు ఏవీ బ్రిటీష్ రాజ్యం ఆశించిన ఫలితాల నివ్వలేదు. దానితో రౌలట్ చట్టం 1919లో తీసుకొచ్చారు. దీనికి వ్యతిరేకంగా 1919లో కాంగ్రెస్ పార్టీ బొంబాయి సమావేశంలో ఒక తీర్మానం చేసింది. 1917 ఆగస్టులో ఈ బిల్లు ప్రతిపాదనను ప్రకటించినప్పటి నుండి దేశవ్యాపితంగా ఉద్యమాల ఊటలు ఉబికి వచ్చినవి. రౌలట్ కమిటీని ప్రతిఘటించినందుకు అమలైన అణచివేతలో 1300 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు నాలుగు వేల మంది గాయాల పాలయ్యారు. వేల మంది నిర్బంధానికి గురైనారు. మొట్టమొదటి సారిగా గాంధీ 'బ్రిటీష్ రాజ్యానికి' వ్యతిరేకంగా కదిలాడు. రాజ్యశక్తి కేంద్రీకరింపబడడం ప్రమాదకర మని గాంధీ గుర్తించాడు. తాను ప్రకటించిన హర్తాళ్ హింసకు పరిణామం చెందుతున్నదని భావించి దానిని విరమింపజేశాడు.

1930లో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ స్వరాజ్యం కోసం సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టింది. ఇది పాలకులకు అణచివేతకు సాకుగా పనికొచ్చింది. ఆనాటి వరకు తీవ్రవాదుల పేరు మీద తీసుకొచ్చిన అన్నిరకాల చట్టాలనూ ఈ ఉద్యమాన్ని అణచడానికి వాడుకుంది. గాంధీతో సహా కాంగ్రెస్ నాయకత్వాన్నంతటినీ జైల్లో పెట్టింది. కాంగ్రెస్ పార్టీనే నిషేధించింది. పత్రికలపై నిర్బంధం ప్రయోగించింది. ఈ సత్యాగ్రహంలో సుమారు 50 వేల మంది అరెస్టు అయ్యారు. 110 మంది చనిపోగా, వేలాది మంది గాయపడ్డారు. ఈ నిర్బంధం కాంగ్రెస్‌ను ఊపిరాడనీయలేదు. ఈ స్థితి 1936 వరకు కొనసాగింది. ఈ స్థితి భారత పౌరహక్కుల సంఘం ఆవిష్కరణకు కారణమైంది.

ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించేందుకు, బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు ఓ సంఘం ఉండాలని నెహ్రూ ఆలోచన చేశాడు. అప్పటికే అమెరికా, ఇంగ్లాండ్‌లలో ఉన్న పౌరహక్కుల సంఘాల గురించి విన్నాడు. వాటి పనితీరు తెలిసినవాడు కనుక అలాంటి సంఘం అవసరమని భావించాడు.

నెహ్రూ ఉద్దేశానికి కాంగ్రెస్ పార్టీలోని మెజారిటీ మద్దతు తెలిపింది. ఉదారవాదులు వ్యతిరేకించినా 1936 ఆగస్టు 24న బొంబాయిలో ఐసిఎల్‌యు (భారత పౌరహక్కుల సంఘం) పుట్టుకను ప్రకటించింది కాంగ్రెస్.

"ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన ఘర్షణ వచ్చినప్పుడు పౌరహక్కుల సమస్య ఉత్పన్నమవుతుంది. ప్రజలు లేదా ఆయా సెక్షన్లు లేవనెత్తిన అంశాలతో అంగీకారమున్నా లేదా నామమాత్ర వ్యతిరేకత ఉన్నా ప్రభుత్వ నిర్బంధమనేది తలెత్తదు. అలాగాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక ధోరణిగా నిరసన ఉంటేమటుకు అది అణచివేత రూపం తీసుకుంటుంది. దీనికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని స్థిరంగా నిలిపితేనే ప్రభుత్వ నియంతృత్వ పోకడలను నిరోధించవచ్చు..."

"భారతదేశంలో ప్రజాస్వామ్యం లేదు. ప్రభుత్వ విధాన సారాంశం నియంతృత్వమే. కావున దాని అతిని నిరోధించడానికి చేసే ప్రయత్నం.. గొప్పది... ప్రభుత్వ అతిని, దాని అప్రజాస్వామిక



తీరును ఎండగట్టడం, అడ్డుకోవడం- పౌరహక్కుల సంఘం బాధ్యత.." అని నెహ్రూ మాట్లాడిన మాటలే హక్కుల సంఘం విధి, విధానాలుగా నిలిచాయి.

ఈ సంఘానికి రవీంద్రనాథ్ ఠాగోర్ గౌరవ అధ్యక్షులు, సరోజినీ నాయుడు అధ్యక్షులు, బి.కె.మీనన్ ప్రధాన కార్యదర్శి, మౌలానా ఆజాద్, సర్దార్ పటేల్, జయప్రకాశ్ నారాయణ్, రాజేంద్ర ప్రసాద్ కార్యనిర్వాహక మండలి సభ్యులు.

బెంగాల్‌లోని ఖైదీల ఆత్మహత్యలు, జూట్‌మిల్లు కార్మికుల వేతనాల పెంపు, కార్మిక నాయకుల అరెస్టు, సాహిత్యంపైన నిషేధం, పోలీసుల అమానుషత్వాలపై రిపోర్టులు తయారుచేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసింది ఐసిఎల్‌యు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో ఈ సంఘం పనులు పార్టీకి మింగుడు పడలేదు. మధ్యలోనే సరోజిని నాయుడు రాజీనామా చేసింది. స్వతంత్రం వచ్చాక దీన్ని రద్దుచేశాడు నెహ్రూ.

ఈ సంఘం దేశవ్యాపితంగా చాలామందిని ప్రభావితం చేసింది. రామమనోహర్ లోహియా రాసిన 'పౌరహక్కుల కోసం పోరాటం' నిషేధించబడింది. సెతల్వాడ్ రాసిన 'యుద్ధం-పౌరహక్కులు', మామిడిపూడి వెంకటరంగయ్య రాసిన 'మనిషి-పౌరుని యొక్క విధులు', సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'పౌరుల హక్కులు' ఆనాడు ఆలోచింపజేసిన రచనలు.

రాజకీయ స్వాతంత్ర్యంకై సాగుతున్న సహాయ నిరాకరణ ఉద్యమంపై అమలయిన అణిచివేతను ఎండగట్టడానికి నెహ్రూకు పౌరహక్కుల సంఘం ఆవశ్యకత ఏర్పడిన సందర్భంలోనే అంబేద్కర్ సాంఘిక మహాసభ ఎలా బలహీనపడిందో సమీక్షిస్తున్నాడు. సరిగ్గా 1936లోనే లాహోర్‌లోని జాత్‌పాత్ తోడక్ మండలి వారి వార్షిక మహాసభలో ఆయన అధ్యక్ష ఉపన్యాసం ఇవ్వవలసి ఉంది. అందుకు 'కుల నిర్మూలన' మకుటంతో ఆయన వ్రాసిన ఉపన్యాసంతో నిర్వాహకులు ఏకీభవించక మహాసభనే రద్దుచేసుకున్నారు. ఈ దేశంలో రాజకీయ సంస్కరణ ముందు జరగాలా, సాంఘిక సంస్కరణ ముందు జరగాలా? అనే వాద వివాదాలలో రాజకీయ సంస్కరణే ముందు జరగాలనే తిలక్, బెనర్జీల అభిప్రాయం బలపడిన విషయాన్ని అంబేద్కర్ గుర్తుచేసుకుంటూ, "...రాజకీయ మనస్కులైన హిందువులను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాను. అస్పృశ్యుల వంటి అత్యధిక సంఖ్యాకులైన మీ సొంత దేశీయుల్ని ప్రభుత్వ పాఠశాలలోనికి మీరు రానివ్వడం లేదు. ...ప్రభుత్వ బావుల నుంచి అస్పృశ్యులు నీళ్ళు తోడుకోడానికి మీరు అనుమతించడం లేదు... పబ్లిక్ వీధులలో అస్పృశ్యులు నడవడానికి మీరు ఇష్టపడటంలేదు... అస్పృశ్యులు తమ ఇష్టం వచ్చిన దుస్తులు వేసుకోవడానికి మీరు ఒప్పుకోరు... అస్పృశ్యులు తమకు నచ్చిన తిండిని తినడాన్ని కూడా మీరు ఓర్వడంలేదు. అయినప్పటికీ మీరు రాజకీయాధికారానికి అర్హులేనా?... ఒక దేశాన్ని పరిపాలించే అర్హత మరొక దేశానికి లేదనే "మిల్లు" దొర సిద్ధాంతాన్ని పదే పదే వల్లించే ప్రతీ కాంగ్రెస్ వ్యక్తి ఒక వర్గం ప్రజల్ని అణగద్రొక్కి ఉంచే అధికారం మరొక వర్గానికి లేదని అంగీకరించి తీరాలి" అన్నాడు. ఇలా జ్యోతిరావు పూలే ప్రతిపాదించిన సాంఘిక విముక్తి ప్రధానమైన ఆచరణే సరయినదంటూ రాజకీయ విముక్తికై పరుగులు తీసే కాంగ్రెస్‌ను పిడిగుద్దులు గుద్దాడు అంబేద్కర్. మనిషి శక్తికి మతం, సాంఘిక స్థాయి, ఆస్తి మన సమాజంలో మూలాధారమని ఈ మూడూ కోల్పోయిన అస్పృశ్యులు స్వేచ్ఛలు పొందాలంటే అవి సంస్కరించబడవలసిందే నంటాడు. మనిషి సామర్థ్యాల ఎదుగుదలకు కుల వ్యవస్థ అడ్డుగా ఉంది. కులం పునాదుల మీద ఓ నీతిని కాని, జాతిని కాని నిర్మించలేము. 'ఒక మనిషికి ఒకే విలువ' అనే సమాజం ఆవిష్కరించబడటమే మానవహక్కులు

అమలైనట్లని అంటాడు. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం.. ఈ మూడింటి మీద ఆధార పడిన సమాజం తనకాదర్శమని హక్కుల సార్వత్రిక విలువల్ని ఎలుగెత్తాడు. ప్రపంచంలో ఎన్నో దేశాలలో వచ్చిన సాంఘిక విప్లవాలు మన దేశంలో రాకపోవడానికి వర్ణ వ్యవస్థే కారణమన్నాడు.

వర్ణ వ్యవస్థ అమానవీయతను గుర్రం జాషువా వర్ణించిన తీరు అపూర్వం. 1895లో జన్మించి 1971లో మరణించిన జాషువా సాంఘిక సమానత్వం ఆవిష్కరణకై నిలిచాడు. కష్టం ఒకడిది, ఫలితం ఒకడికా అని ప్రశ్నించుతూనే కష్టించేవాడికి భుక్తిలేని అన్యాయ లోకం తీరును వర్ణించాడు.

వాని రెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమటోడ్చి ప్రపంచమునకు
భోజనము పెట్టు వానికి భుక్తిలేదు

ఇలాంటి జీవితంలో ఇనుప గజ్జెల తల్లి జీవిస్తున్నదని, దీనికి కారణం నాల్గు పడగల హైందవ రాజేనని చెప్పి దాని నుండి విముక్తి అనివార్యమైనదన్నాడు.

"వాని రక్తంబును హరించి
ఇనుప గజ్జెల తల్లి
జీవనముసేయు
కసిరి బుసగొట్టు నాతని
గాలిసోక
నాల్గు పడగల హైందవరాజు

జ్యోతిరావు పూలే సాంఘిక దోపిడీని, బ్రాహ్మణ్యాన్ని ఆచరణాత్మక కార్యక్రమంతో ఎదుర్కొం టున్న రోజుల్లో జన్మించిన కేరళ సామాజిక తత్త్వవేత్త శ్రీ నారాయణగురు. ఇతను 1856లో జన్మించాడు. పూలే సామాజిక విప్లవానికి ఓ సమగ్ర వేదికను నిర్మించి పోరాటాన్ని విస్తృతం చేస్తున్న సందర్భంలోనే తమిళనాడులో పెరియార్ రామస్వామి నాయకర్ 1879లో జన్మించాడు. వీరిద్దరి కృషి కేరళ, తమిళనాడులలో అపూర్వం. నారాయణగురు తాత్వికంగా మతాన్ని సమర్థిస్తూనే మతోన్మాదాన్నీ, కుల వివక్షనూ, అంటరానితనాన్నీ, అర్థంలేని ఆచారాలనూ నిర్మూలించేందుకు, దళిత వర్గాలలో, స్త్రీలలో అక్షరాస్యతనూ, ఆత్మగౌరవాన్నీ పెంచేందుకు కృషిచేశారు. విద్య ద్వారా స్వేచ్ఛ, సంఘటితం ద్వారా శక్తి, పరిశ్రమ ద్వారా ప్రగతి వస్తుందని చెప్పి, ఆచరించి ఆర్యీకరించ బడిన కేరళను సంస్కరించ పూనుకున్నాడు నారాయణ గురు. పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్ కుల మతాలను పూర్తిగా వ్యతిరేకిస్తూ నాస్తికత్వాన్నీ, స్వాభిమానాన్నీ ప్రబోధించాడు.

ఈ విధంగా 19, 20 శతాబ్దాలలో మూడు పాయలుగా హక్కుల భావన ఆవిష్కరించబడింది. 19వ శతాబ్దంలో కుటుంబ సంస్కరణ, సాంఘిక సంస్కరణగా సాగితే, 20వ శతాబ్దిలో సాంఘిక సంస్కరణ, రాజకీయ (సంస్కరణలుగా) హక్కుల కార్యాచరణ- ఆవిష్కరించబడింది. నెహ్రూ చేతిలో రాజ్యశక్తిని ప్రశ్నించే, ప్రచారం చేసే సాధనగా హక్కుల సంఘం రూపొందింది. కాని సారాంశంలో అది ఓ రాజకీయ పార్టీ ప్రయోజనాన్ని రక్షించేదిగా మారింది. ఇది నూతన పరిణామం.

ఆదివాసులను అడివి నుండి విడదీయాలని బ్రిటీష్ పాలకులు, స్థానిక సంప్రదాయ పాలక



శక్తులు ప్రయత్నించినప్పుడు జరిగిన ప్రతిఘటన, తిరుగుబాట్లు హక్కుల భావనలకు విస్తృతిని కలిగించాయి. ఇవి 19వ శతాబ్దంలో మొదలయి 20వ శతాబ్దపు మధ్య భాగం దాకా సాగాయి.

బ్రిటీష్ పాలనలో మొదలైన అభివృద్ధి ఆదివాసుల జీవన హక్కులను, సహజ హక్కులను తుడిచి వేసింది. అడవులపై రాజ్యం హక్కును ప్రకటించడం వల్ల ఆదివాసులు 'ఆక్రమణదారులుగా' వర్గీకర ణకు గురైనారు. తక్షణ ప్రయోజనాలను రక్షించుకునేందుకు, జీవన హక్కులను నిలబెట్టుకొనేందుకు తమకు తోచిన విధంగా ప్రతిఘటించారు. ఇవి బ్రిటీష్ ఇండియాలోనూ, నిజాం పాలనా ప్రాంతాల లోనూ జరిగాయి.

బీహార్, బెంగాల్ ప్రాంతాలలో జరిగిన తిరుగుబాట్లు 1830లలో పాలకులకు సవాలుగా నిలి చాయి. వడ్డీ తదితర ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లు 1855-56లలో వడ్డీ వ్యాపారస్థులతో పాటు జమీందార్ల ఆధిపత్యాన్ని కూడా ధిక్కరించాయి. ఇదేవిధమైన తిరుగుబాటు 1887లో జరిగిన 'సర్దార్' ఉద్యమం. ఒక జాతిగా సొంత రాజ్యాన్ని ఏర్పర్చుకున్న బిర్సాముండా తిరుగుబాటు 1875లో ఆదివాసీల 'స్వీయ పాలనా' కాంక్షకు, హక్కుల ఆకాంక్షకు సాక్షి.

ఈ విధమైన సాక్ష్యాలు ఆంధ్ర, నైజాం ప్రాంతాలలో 19వ శతాబ్ది ప్రథమ పాదంలో కూడా కనిపిస్తాయి.

'రంప పితూరి' తూర్పు గోదావరి జిల్లాలో రాంభూపతి నాయకత్వంలో 1802-03లలో జరిగింది. 1832లో విశాఖ ఏజెన్సీలో, 1879లో తమ్మన్న దొర నాయకత్వంలో తూర్పు గోదావరి లోని 'రంప' ప్రాంతంలో జరిగిన తిరుగుబాట్లు ఆదివాసీ జీవనహక్కులకు రాజ్యం వేసిన ఉచ్చును విసిరివేయడానికి జరిగినవే. ఇదే దారిలో అల్లూరి సీతారామరాజు మన్యంలో 1922-24 కాలంలో నాయకత్వం వహించిన తిరుగుబాటు గిరిజన హక్కులకు రక్షణగా నిలిచింది.

ఇరవై శతాబ్ది తొలి పాదంలో ఆదివాసీల తిరుగుబాటు రాంజీ గోండు నాయకత్వంలో ఆదిలా బాద్ అడవిలో నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగింది. దీన్ని అణచివేసిన తీరు చూస్తే ఆదివాసుల పోరు పాలకులకు ఎంత ప్రమాదకరంగా కనిపించిందో తెలుస్తుంది. రాంజీ గోండుతో సహా వెయ్యి మందిని నిజాం ప్రభుత్వం నిర్మల్‌లో ఉరితీసింది. దీనికి సాక్ష్యంగా ఈనాటికీ సజీవంగా ఉన్న వెయ్యి ఊడల మర్రిచెట్టు ఆదివాసుల సహజహక్కుల ఆకాంక్షలోని విలువల పటుత్వాన్ని చాటు తుంది. ఇదే కోవలో కొమురం భీము పోరాటం పురుడు పోసుకుంది. ఆసిఫాబాద్ తాలూకాలో షాహుకారుల, జంగ్లాత్ అధికారుల, మక్తేదారుల (భూస్వాముల)కు వ్యతిరేకంగా మొదలైన పోరాటం క్రమంగా నిజాం వ్యతిరేక ఉద్యమంగా, సొంత రాజ్యంకై సాగిన 'స్వయం నిర్ణయ హక్కు' పోరా టంగా ఎదిగింది. బాబేజరి, జోడేఘాట్, పాట్నాపూర్ తదితర పన్నెండు గ్రామాల విముక్తి చేసుకోవా లన్న కొమురం భీం ఆకాంక్ష స్వయం నిర్ణయాధికార హక్కు కోసం జరిగిన ప్రయత్నమే.

జ్యోతిరావు పూలే మానవహక్కుల్ని ప్రచారం చేసిన వందేళ్ళకు ప్రపంచ మానవహక్కుల ప్రకటనను ఐక్యరాజ్య సమితి 1948లో చేసింది. దేశానికి స్వాతంత్ర్య ప్రకటన అప్పుడే జరిగింది (1947). తర్వాత రాజ్యాంగ చట్టాన్ని ప్రకటించుకున్నాము. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృ త్వం, లౌకికత్వం, సార్వభౌమత్వంను ఈ ప్రజలు, దేశం కలిగి ఉంటవని ప్రకటించుకున్నాము. నెహ్రూ ఆశించినట్లుగా హక్కుల సంఘాల ఆవశ్యకత ఉండదనుకున్నాము. కాని అలా అనుకోవడం

అచారిత్రకమని తేలింది.

అభివృద్ధి మోసుకొచ్చిన పేదరికం, అసమానతలు, అవమానాలు, అన్యాయాలు, నిరక్షరాస్యత, నిరుద్యోగం, నిరాధారత హక్కుల అనుభవానికి నిరోధకాలైనవి. అసమ్మతి అణచివేతకు దారితీసింది. ఈ స్థితి ఉద్యమాలను ఆవిష్కరించింది. వెనువెంటనే రాజ్యం వాటికి అణచివేతే పరిష్కారమనింది. ఈ పరిణామం హక్కుల ఉద్యమాలకు దారులు వేసింది. 20వ శతాబ్ది ద్వితీయార్థంలో మూడు స్రవంతులుగా హక్కుల ఉద్యమం వికసించింది. ఈ మూడు స్రవంతులూ రాజ్య అణచివేతకు వ్యతిరేకంగా వచ్చినవే.

కాంగ్రెస్ పార్టీ అవినీతి పాలనకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' అణచివేతకు గురికావడంతో ఆయన సహచరుడు తార్కుండే నాయకత్వంలో 1973లో ఏర్పడింది పౌరహక్కుల ప్రజాసంఘం (పియుసిఎల్). ఎమర్జెన్సీ ఎత్తివేసి, ఇందిరా గాంధీ ఓడిపోయిన తర్వాత పియుసిఎల్ అవసరం తీరిందని జయప్రకాశ్ నారాయణ్ భావించినా అది కాదని కొనసాగుతున్నది. ఐతే, ఇది చీలికకు గురైంది. ఒక గ్రూపు పియుడిఆర్‌గా ఆవిర్భవించింది. 1962 భారత్-చైనా యుద్ధ సమయంలో ఏర్పడిన ఏపిసిఎల్ఏ ఆ యుద్ధం తర్వాత దాని ఆవశ్యకత లేదనుకుంది.

ఇంకొక స్రవంతి నక్సల్బరీ ఉద్యమాలపై రాజ్య అణచివేతకు వ్యతిరేకంగా ప్రచారం చేసి ప్రజాస్వామిక హక్కులను కాపాడుకో చూసిన స్రవంతి. ఇవి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా ఉన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) 1973లో, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) 1974లో ఏర్పడినవైతే అంతకు ముందే (1972లో) కలకత్తాలో ఎపిడిఆర్ ఏర్పడింది. ఆ తర్వాత బయటి రాష్ట్రాలలో సిపిడిఆర్ (మహారాష్ట్ర), పిడిఎఫ్ (కర్ణాటక) ఏర్పడ్డాయి.

మూడవ స్రవంతి జాతి ఉద్యమాల ఫలితం. ఈ ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా ఇండియా రాజ్యశక్తి అణచివేసిన పరిణామం. కాశ్మీర్, నాగాలాండ్, అస్సాం రాష్ట్రాలలో ఈ స్రవంతి కొనసాగుతున్నది.

మన రాష్ట్రంలో నిజాం కాలంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పడి ఆ తర్వాత ఆగిపోయిన సంస్థ హిందూ పౌరహక్కుల సంఘం, హైదరాబాద్ పౌర హక్కుల సంఘం.

మన రాష్ట్ర హక్కుల ఉద్యమం ఓ రాజకీయ ఉద్యమ అవసరాల కోసం ఏర్పడిందే అయినప్పటికీ అది పొందిన అనుభవం హక్కుల ఉద్యమ సజీవ కోణాల్ని ఆవిష్కరించింది.

కేవలం ఉద్యమాలపై అణచివేతను ప్రశ్నించడమే హక్కుల సంఘం బాధ్యత కాదని గుణపాఠం తీసుకుంది. లాకప్ మరణాలు, కుల అమానుషత్వం, మహిళపై కుటుంబం, సమాజం, చట్ట యంత్రాంగాలు చూపే వివక్ష, అణచివేతలు, గిరిజనుల హక్కుల రక్షణ, అంటురోగాలు, పర్యావరణం, ఎన్నికల అక్రమాలు, ఫ్యాక్షనిజం, పట్టణీకరణ, ప్రపంచ బ్యాంకు - సారాంశంలో అన్నిరకాల అమానవీయతల్ని ప్రశ్నించే సంఘంగా హక్కుల ఉద్యమం ఉండాలని గుణపాఠం తీసుకుంది. దాని ఫలితమే మానవహక్కుల వేదిక ఆవిర్భావం.

రాష్ట్రంలో, దేశంలో ఈనాడు ఎన్నోరకాల ఉద్యమాలు - విప్లవ, దళిత, గిరిజన, మహిళ, పర్యావరణ, ప్రాంతీయ, కుల ఉద్యమాలు ఉన్నాయి. ఇవి వాటి సొంత కార్యక్రమాల ప్రాతిపదికన ముందుకు పోతుంటాయి. నిజానికి ఈ ఉద్యమ సంస్థలు సార్వజనీన విలువల్ని ముందుకు తీసుకుపోతే ప్రత్యేక హక్కుల ఉద్యమం అవసరం ఉండదు. ఈ ఉద్యమాలకు పునాది సార్వత్రిక విలువలే



అయినప్పటికి అవి ప్రయోజనాల దగ్గర ఆగిపోతుంటాయి. అయితే ఆయా ఉద్యమాలు ముందుకు తీసుకొచ్చిన విలువలు ఉద్యమ సంస్థల ప్రయోజనాల దగ్గర ఆగిపోకూడదు. అందుకే హక్కుల ఉద్యమాల ఆవశ్యకత ఉంటుంది. నిరంతరం మానవీయ విలువల్ని విస్తృతపర్చుతూ ముందుకు సాగడమే హక్కుల ఉద్యమ లక్ష్యం.

❖

# ప్రజాభూమి కమిషన్ ఆవశ్యకత, కర్తవ్యాలు

–గొర్రెపాటి నరేంద్రనాథ్ *

–కె.బాలగోపాల్ *

**1990** దశకంలో తెరమరుగయిపోయిన భూమి సమస్య మళ్లీ స్టేజిపైకి వచ్చింది. మావోయిస్టుల వల్ల జరిగిన ముఖ్యమైన మేలు ఇది. 'ఎప్పుడో పంచేసాము – 50 లక్షల ఎకరాలు. ఇంకా మిగిలి ఉండేది 38 వేలే'నని౦ది ప్రభుత్వం. మీరు పంచకపోతే మేమే పంచుతామని మావోయిస్టులు సాగుభూములపైన జెండాలు పాతడం ప్రారంభించారు. 'వారే పంచితే మేమెందుకు?' అని ప్రభుత్వం వారు వారిని ఆగమన్నారు. 26 జనవరి 2005 నాటికి 1 లక్ష ఎకరాలు పంచుతామన్నారు. ఆరోజున 1.55 లక్షల ఎకరాలకు పట్టాలిచ్చారు. మరొక లక్ష ఎకరాలు ఏప్రిల్‌లోగా గానీ 15 ఆగస్టు నాటికి గానీ పంచుతామన్నారు. అనుకున్న దానికన్నా ఎక్కువ భూమి ఎక్కడి నుండి పుట్టుకు వస్తోంది?

ప్రతీ ఎంఆర్‌వోకూ తెలిసిన విషయం ఏమిటంటే మొన్నటి 26 జనవరి నాడు పట్టాలు ఇచ్చిన భూమి ఎన్నో ఏండ్లుగా పేదల అనుభవంలో ఉండి అధికారులకు అడిగినంత లంచం ఇవ్వలేకపోవడం వల్ల పట్టాలు రాకుండా ఉండిపోయినదే. కొంత భూమి ఎవరి ఆక్రమణలోనూ లేని నాసిరకం భూమి, బంజరు భూమి. రేపు 15 ఆగస్టు నాటికి పంచుతామంటున్నది కూడా ఈ రకమైన భూమేనా?

* వ్యాసకర్తలిద్దరూ మానవహక్కుల కార్యకర్తలు

పేదలకు పంచడానికి అసలు భూమి ఎంత ఉన్నది? ఎన్ని రకాలున్నదీ మొదట ఒకసారి చెప్పుకొని వాటి గురించి ఏం చేయవచ్చో తరువాత చెప్పుకుందాం. నిజానికి ఈ విషయంలో మొదట జరగవలసింది సమగ్రమైన, నిర్దుష్టమైన సమాచారం ప్రజల ముందు ఉంచడం. ఎంత భూమి ఉందో, దానిని పంచడంలో గల సమస్యలేమిటో ప్రభుత్వానికి మాత్రమే తెలిసిన రహస్య సమాచారంగా ఉండిపోయినంత కాలం ఈ సమస్య పరిష్కారం కాదు. అందులో రహస్యమేమీ లేదు, ఉండనవసరం లేదు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 ప్రకారం ప్రజలందరికీ అభిప్రాయాలు, విశ్వాసాలు కలిగి ఉండే స్వేచ్ఛ, వాటిని వ్యక్తంచేసే స్వేచ్ఛ ఉన్నాయి. ఇవి ప్రాథమిక హక్కులు. కానీ ప్రజల జీవితానికి సంబంధించిన సమాచారాన్ని రహస్యంగా ఉంచేసి మీకు అభిప్రాయ స్వేచ్ఛ ఉందంటే అర్థం లేదు. సమాచార హక్కు లేని అభిప్రాయ స్వేచ్ఛ ఒక మిథ్య.

1958లోనే బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ కింద జారీచేసిన జీవోలు 1406, 1407లో, భూమిలేని పేదలు గ్రామ కరణం దగ్గరికొచ్చి భూమికోసం అర్జీ పెట్టుకుంటామనీ, సాగుభూమి ఎంత ఉన్నదీ, ఎక్కడున్నదీ తెలపమనీ అడిగితే, గ్రామంలో పంచడానికి అవకాశమున్న సాగు భూమి వివరాలు కరణం వారికి వారం రోజులలోగా ఇవ్వాలనీ, దానికి ఏ ఫీజూ వసూలు చేయకూడదనీ, అర్జీదారు నిరక్షరాస్యుడయితే కరణమే వారికి అర్జీ రాసిపెట్టాలనీ అన్నారు. ఏ మైకంలో ఉండి ఈ తాఖీదులు జారీ చేశారో గానీ వాటిని ఏ కరణమూ ఎన్నడూ అమలుచేసిన పాపాన పోలేదు.

ఆనాటికీ ఈనాటికీ సమాచార హక్కు గురించి అవగాహన పెరిగింది కాబట్టి ఈ రోజు జరగవలసింది ఆ జీవోలు అమలు మాత్రమే కాదు. ప్రతీ పంచాయతీ ఆఫీసు ఆవరణలోనూ ఆ పంచాయతీ పరిధిలోని రెవెన్యూ గ్రామాల చిత్రపటం వేసి అందులో వివిధ రంగులతోనూ, గుర్తులతోనూ వివిధ రకాల భూములను సూచించాలి. సీలింగ్ చట్టాల కింద సేకరించిన భూమి, బంజరు భూమి, గ్రామ కంఠం, వాగు లేక చెరువు పోరంబోకులు సర్వే నంబర్లతో సహా చూపించాలి. ఇప్పటికే పేదలకు పట్టాలిచ్చిన భూములను చూపించాలి. వీటికి సంబంధించిన రికార్డు కాపీలు కావాలని ప్రజలెవరైనా కోరితే ఫీజు లేకుండా వారికి అందియ్యాలి.

ఇక పేదల చేతిలో పెట్టగల భూమి ఎన్నిరకాలున్నాయో చూద్దాం.

1. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే (2004 సెప్టెంబర్ 30 నాటికి) 48 లక్షల ఎకరాలు పేదలకు పంచినట్లు రికార్డులు చెప్తున్నాయి. ఇందులో రెండు రకాలుంటాయి. ఒకటి ప్రభుత్వ భూమి. రెండు భూస్వాముల నుండి సీలింగ్ చట్టాల ద్వారా, భూదాన్ ద్వారా స్వాధీనం చేసుకున్న భూమి. సీలింగ్ చట్టాల కింద స్వాధీనం చేసుకొని పేదలకు పంచినది 5.82 లక్షల ఎకరాలు. భూదాన్ కింద 2.42 లక్షల ఎకరాలు స్వాధీనమయ్యాయి గానీ 50 సంవత్సరాల కాలంలో పంచింది 1.10 లక్షల ఎకరాలే. కాబట్టి పేదలకు పంచిన 48 లక్షల ఎకరాలలో అత్యధిక భాగం (41.08 లక్షల ఎకరాలు) బంజరు భూమే.

ఈ భూమిలో సగం కూడా పంచిన పేదల చేతిలో లేదనేది వివిధ సర్వేలలో తేలిన విషయం. దీనికి ఒక కారణం ప్రభుత్వం పట్టాకాగితాలు ఇచ్చి భూమి చూపించకపోవడం, భూమిని

లబ్ధిదారుకు అప్పగించక పోవడం. ఇటువంటిది ఎక్కువ ఉండదులెమ్మని అమాయకంగా అనుకోవద్దు. కొన్ని జిల్లాలలో ఒక్కొక్క మండలంలోనే ఇటువంటి బూటకపు భూమి పంపిణీ వేల ఎకరాల పరిమాణంలో ఉంది. రెండవ కారణం, బంజరు భూమి పంచేసి దానిని సాగుయోగ్యం చేయడానికి అవసరమయిన వసతి గానీ, పెట్టుబడి గానీ అందియ్యక పోవడం వల్ల పేదలు గత్యంతరం లేక దానిని అమ్ముకోవడం. మూడవ కారణం బలవంతులు దురాక్రమణ, దౌర్జన్యం.

ఏ కారణం గానయితేనేం, ప్రభుత్వమే పంచి ఇచ్చిన 48 లక్షల ఎకరాలలో 20 లక్షలకు పైగా అన్యాక్రాంతం అయివుంది. దానిని తిరిగి ఆ పేదలకు ఇప్పించగలిగితే అదే పదివేలు. సీలింగ్ చట్టాల కింద ఇంక అదనంగా దక్కగల భూమి (కోర్టు లిటిగేషన్‌లో చిక్కుకొని 'స్టే' అయి ఉన్నది తప్ప) లేదు. ఆ లిటిగేషన్‌ను త్వరగా తెమిల్చితే ఆ భూమి (కేసులో ప్రభుత్వం గెలిస్తే) పేదలకు పంచవచ్చు. అది మినహా ఇంక పేదలకు కొత్తగా ఇవ్వగల భూమి బంజరు భూమే. అందులో ఏ కొంచెం సారవంతమైన భూమయినా, ఇప్పటికే పంచడమో ఎవరో ఒకరు కబ్జా చేసుకోవడమో జరిగిపోయి ఉంటుంది కాబట్టి కొత్తగా పేదలకు ఇవ్వగల బంజరు భూమి కూడా తక్కువే. నీటి పారుదల వసతిని బాగా పెంచితే మాత్రమే చెప్పుకోదగ్గ మోతాదులో కొత్తగా ప్రభుత్వ భూమి పంపిణీ చేయడం సాధ్యం అవుతుంది.

2. ఒకప్పుడు రాజులు, నవాబులు, బ్రిటిష్ పాలకులు కల్పించిన వివిధ 'ఎస్టేట్' భూములున్నాయి. జమీందారీ భూములు, ఇనాంలు, మొఖాసా, మహల్, ముఠా భూములు మొదలైనవి ఈ కోవకు చెందినవి. ఇవన్నీ స్వాతంత్ర్యం తరువాత రద్దయినాయి. అయితే వాటిని రద్దుచేసిన తరువాత ప్రభుత్వం ఆ భూముల్ని మొత్తంగా స్వాధీనం చేసుకోలేదు. అవి ఎస్టేట్ భూములుగా ఉన్న కాలంలో వాటిని సాగు చేస్తుండిన వారికి, వారి నుండి కొనుక్కున్నవారికి, ఒకనాటి జమీందారు, ఇనాందారు వగైరాల వారసులకు, వారి నుండి పట్టా పొందిన వారికి అప్పగించింది. దీనికోసం సెటిల్‌మెంట్ ఆఫీసర్లను నియమించింది, ఆపైన అప్పీల్ వేసుకోవడానికి ఒక డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్స్‌ను, రెండవ అప్పీలుకు ఒక కమిషన్‌ను నియమించింది.

ఈ సెటిల్‌మెంట్ పట్టాలలో జరిగినంత మోసం వేరే ఏ విషయంలోనూ జరిగి ఉండదు. జమీందారీలలోనూ, ఇతర ఎస్టేట్‌లలోనూ సరయిన భూమి సంబంధమైన రికార్డులు ఉండేవి కావు. కాబట్టి ఏదో ఒక కాగితం ముక్క చూపించి ఎకరాలకెకరాలు సెటిల్‌మెంట్ పట్టాలు తీసేసుకున్నారు. ఎన్ని లక్షల ఎకరాలు ఈ విధంగా అనర్హుల పాలయిందో చెప్పడం చాలా కష్టం. ఈ పట్టాలపైన సమీక్ష జరిపించి రద్దుచేయవలసిన వాటిని రద్దు చేయగలిగితే చాలా భూమే పేదలకు పంచడానికి లభించగలదు.

3. దేవాలయాలు, మసీదులు, చర్చిల పోషణార్థం అప్పుడెప్పుడో రాజులు, దాతలు ఇచ్చిన భూములున్నాయి. ఆ సంస్థలు ఈ భూములను స్వయంగా కూలీలను పెట్టి సాగుచేయించవు. రైతులకు లీజుకిస్తాయి. ఇది విపరీతమైన దురాక్రమణకు దారితీసింది. ఆ భూములను భూమి లేని పేదలకు తక్కువ కౌలుకు లీజుకిచ్చినట్టయితే పేదలకు భూమీ దక్కుతుంది, ధార్మిక సంస్థలకు ఇప్పుడొస్తున్న దానికంటె ఎక్కువ ఆదాయమూ వస్తుంది. రాష్ట్రంలో దేవాలయ భూములు 3.72 లక్షల ఎకరాలున్నాయి. వక్ఫ్ (ముస్లిం ధార్మిక సంస్థల) భూములు 1.45 లక్షల ఎకరాలున్నాయి. క్రైస్తవ భూముల లెక్క తెలీదు. ముస్లిం, క్రైస్తవ ధార్మిక ఆస్తులకు సంబంధించి ప్రభుత్వం జోక్యానికి



రాజ్యాంగం ఎక్కువ అవకాశం ఇవ్వదు కానీ వాటి నిర్వాహకులకు నచ్చజెప్పి ఒప్పించే ప్రయత్నం ప్రభుత్వం చేయవచ్చు. హైందవ ధార్మిక ఆస్తులకు సంబంధించి చట్టపరంగానే చర్యలు తీసుకోవచ్చు.

4. రాష్ట్రంలో అడవీ భూమి 1.53 కోట్ల ఎకరాలుంది. ఇది మొత్తం భూభాగంలో 23 శాతం. ఇందులో 4 నుంచి 5 లక్షల ఎకరాల వరకు పోడు లేక ఇతర సాగు రూపాలలో ప్రధానంగా నక్సలైట్ పార్టీల మద్దతుతో ఆదివాసీ పేదలు సాగుచేసుకుంటున్నట్టు ప్రభుత్వం అంటున్నది. నిజానికి ఆ 4 లేక 5 లక్షల ఎకరాలే కాదు, కాగితం మీద ఉన్న 1.53 కోట్ల ఎకరాల అడవిలో చాలా మొత్తం ఇప్పటికే అడవి కాకుండా పోయింది. వన సంరక్షణ సమితుల పేరిట ఆ భూములలో తిరిగి అడవి పెంచాలన్న ప్రయత్నం అరకొరగా జరుగుతున్నది. దాని బదులు భూమిని పేదలకు పంచగలిగితే వారికి చాలా భూమి దక్కుతుంది. కానీ వృక్ష ఛాయ (Cover) దేశ భూభాగంలో 33 శాతం ఉండాలన్న 'అంతర్జాతీయ' నియమాన్ని భారత్ అంగీకరించింది కాబట్టి, ఇప్పటికే కేవలం 23 శాతం అడవి ఉన్న రాష్ట్రం ఆ అడవిలో సాగుకు పట్టాలు ఇవ్వజాలదని అంటున్నారు. కానీ దీర్ఘకాలం అడవిలో సాగుచేసుకుంటున్న ఆదివాసులకైనా పట్టా కల్పించే అవకాశం ఉంది. 1980 అక్టోబర్ 24కు ముందు నుండి రిజర్వ్ అడవిలో భూమి అనుభవిస్తున్న ఆదివాసులకు పట్టా పొందే అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ 18 సెప్టెంబర్ 1990 నాడు సర్క్యులర్ నెం.13-1/90/ఎఫ్‌పి(1) జారీ చేసింది. దీనిని సవరిస్తూ, 31 డిసెంబర్ 1993 నుండి అడవి భూమిని అనుభవిస్తున్న ఆదివాసులకు పట్టా కల్పించే అవకాశాన్ని ఇచ్చే తాఖీదు నెం.2-1/2003-ఎఫ్‌సి (పిటి)ని కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ 2004 ఫిబ్రవరి 5న జారీచేసింది. ఈ సర్క్యులర్లను చిత్తశుద్ధితో అమలు చేసినట్టయితే అడవులలో వ్యవసాయం చేసుకొంటున్న ఆదివాసులకు చెప్పుకోదగ్గ మోతాదులో భూమి దక్కగలదు.

5. ఏజెన్సీలోని పట్టా భూములు అయిదవ కోవకు చెందినవి. ఎల్‌టిఆర్ చట్టం కింద విచారణలు సరిగ్గా జరిపితే ఈ పట్టా భూములలో గిరిజనేతరుల చేతిలో ఉన్నవి పెద్ద మొత్తంలోనే గిరిజనులకు దక్కేవి. కానీ ఈ చట్టం కింద విచారణలు నూటికి 95 శాతం ఇప్పటికే జరిగిపోయాయి. సగంపైగా భూమి గిరిజనేతరులకే ఖాయం చేయబడింది. దీనికి ప్రధాన కారణాలు రెండు. ఈ విచారణలు ఎక్కువ భాగం ఆదివాసులెవ్వరికీ తెలియకుండ ప్రభుత్వానికీ గిరిజనేతరునికీ మధ్య వ్యవహారంగా జరిగాయి. ఆదివాసులెవ్వరూ ఫిర్యాదు చేయకున్నా ప్రభుత్వమే గిరిజనేతరుని పైన కేసు పెట్టి విచారణ జరిపే 'సుమోటు' ప్రక్రియకు ఎల్‌టిఆర్ చట్టం అవకాశం ఇస్తుంది. అది దేనికి ఉపయోగపడిందంటే ఆదివాసులకేమీ తెలియకుండ విచారణల తంతు ముగించేయడానికి. రెండవ కారణం, నిన్న మొన్నటిదాకా ఆదివాసులలో విద్యావంతులు లేకపోవడం. అందువల్ల వారి ఎరుకలో జరిగిన విచారణలలో కూడా వారు సమర్థంగా పాల్గొనలేకపోయారు. ఈ కేసులను తిరగదోడడం, లేదా ఆలస్యంగానయినా సరే అప్పీల్ వేయడం సాధ్యమైతేనే ఎటిఆర్ కింద ఆదివాసులకు కొత్తగా భూములు దక్కగలవు.

ఇన్ని కోణాలున్న భూముల పంపిణీ సమస్య పరిష్కారం ముందుకు పోవాలంటే ప్రభుత్వానికి మాత్రమే అందుబాట్లో ఉండే సమాచారం మొట్టమొదట ప్రజలతో పంచుకోవాలని పైన చెప్పాము. సమాచార హక్కులో భాగంగా దీనిని డిమాండ్ చేస్తున్నాం.

అయితే అది చాలదు. సమాచార హక్కులో భాగంగా ఈ వివరాలను రాబట్టుకోవడం ఒకెత్తయితే

దీనిని ఆధారం చేసుకొని పల్లెలు తిరిగి వాస్తవాలు సేకరించడం చాలా కీలకమైన కర్తవ్యం. చట్టాలు, ప్రభుత్వ రికార్డులు ఏం చెప్పినా ప్రతీ జిల్లాలో వాస్తవంగా కొందరు వందల ఎకరాలు అనుభ విస్తున్నారు. పాత జమీందార్లు, జాగీర్దార్లు అత్యధిక భాగం కాలగర్భంలో కలిసిపోయారు. భూములు అమ్ముకొని పట్టణాలకూ, విదేశాలకూ వెళ్లిపోయారు. ఇప్పుడు నయా బడా భూస్వామ్య వర్గమొకటి ఆవిర్భవించింది. వంద ఎకరాలకు పైబడి భూములు, ముఖ్యంగా తోటలు, వారి అధీనంలో ఉన్నాయి. వీరే స్వయంగా గానీ వీరి శిష్యవర్గం గానీ, బంధువర్గం గానీ రాజకీయ నాయకులయి ఉంటారు. సివిల్ కాంట్రాక్టర్లు, మద్యం వ్యాపారులు అయివుంటారు. వీరి వద్ద జీపులు, ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్లు, టిప్పర్లు ఉంటాయి. అన్నిటినీ మించి వీరి హుకుం అమలు చేసేందుకు రౌడీ మూక లుంటాయి. ప్రాంతాన్ని బట్టి బాంబులు, తుపాకులు ఉంటాయి. ప్రజా ఉద్యమాలు బలంగా లేని అన్నిచోట్లా ఇదే పరిస్థితి. వీరి వివరాలు కూడా సేకరించవలసి ఉంది. భూమి సమస్య పరిష్కారం ముందుకు పోవడానికి ఈ సమాచారమూ అవసరమే.

ఇలాంటి వివరాలన్నీ బయటకు రావాలంటే ఒక భూమి కమిషను వేయాలని మావోయిస్టులు ప్రభుత్వంతో జరిపిన చర్చలలో పట్టుపట్టారు. ఆ కమిషన్‌లో కేవలం ప్రభుత్వ అధికారులే కాక ప్రజా ఉద్యమాలకు సన్నిహితంగా ఉండి భూమి సమస్య గురించి అవగాహన కలిగిన వారు కూడా ఉండాలని వారు అన్నారు. కాని ప్రభుత్వం కేవలం తన వారితో ఒక భూమి కమిటీని వేసింది. ఈ స్థితిలో ప్రజా సంఘాల కార్యకర్తలు, ప్రజాతంత్రవాదులు ప్రజలలో తిరిగి ప్రభుత్వ రికార్డుల సహాయంతో వాస్తవ పరిస్థితులను బయటకు తేవడం అవసరం. ఆ అవగాహనతోనే ప్రజల తరఫున ప్రజా ఉద్యమాల చొరవతో ఒక భూమి కమిషన్ ఏర్పడింది. పేద ప్రజలకు పంచగల భూముల వివరాలన్నీ బయటకు తీయాలంటే అది ఏ ఒక్క ప్రజాసంఘం వల్లా అయ్యే పని కాదు. ఎందువల్లనంటే రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రజా సంఘాలకు పార్టీలకు కొన్ని కొన్ని ప్రాంతాలలో, జిల్లాలలో మాత్రమే ఉనికి ఉంది. అందరూ కలిసి మండలాల వారీగా వారి వారి ఉనికిని బట్టి పని విభజన చేసుకొని అధికార రికార్డుల సహకారంతో సర్వే చేయాల్సి ఉంది. రాష్ట్రంలోని (హైదరాబాద్ మినహాయించి) 22 జిల్లాలలో సరాసరిన ప్రతి జిల్లాలో 50 మండలాలున్నాయి. ఒక్కొక్క మండలంలో 15 నుంచి 20 గ్రామాలున్నాయి. అన్ని సంఘాలూ కలిస్తే ఇదేం పెద్ద పని కాదు. రెండు లేక మూడు నెలలలో ఒక మండలంలో వివరాలు సేకరించవచ్చు. ఆపైన ఆ వివరాలు క్రోడీకరించి జిల్లా నివేదికలు, వాటి ఆధారంగా రాష్ట్ర నివేదిక తయారు చేయవచ్చును. ఒకటి లేక ఒకటిన్నర సంవత్సర కాలంలో ఈ పని పూర్తిచేస్తే ఈ సమాచారాన్ని ఒక పక్క ప్రభుత్వానికి అందజేస్తూ మరొక పక్క ప్రజా సంఘాలన్నీ కలిసి ఒక ఉద్యమంగా గ్రామీణ పేదలకు ఈ భూముల్ని స్వాధీన పరచే కార్యక్రమం చేపట్టవచ్చు.

స్వాధీన పరచడానికి నిర్దిష్టంగా ఏమి చేయాలన్నది ఒక్కొక్క రకమైన భూమి విషయంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా ప్రస్తుత పరిస్థితులలో ఈ విషయంలో చట్టం ప్రకారం పోక తప్పదు. భూమి వంటి స్థిరాస్తులను చట్టం ప్రకారం తప్ప ఇతరత్రా స్వాధీనం చేసుకోవడాన్ని గానీ, వారి నుండి మరొకరికి బదలాయించడాన్ని గానీ రాజ్యాంగం ఒప్పుకోదు. కాబట్టి ఒక్కొక్క రకమైన భూమికి సంబంధించి చట్టం ఏమంటుందో తెలుసుకోక తప్పదు.

1. ప్రభుత్వ బంజర్లు, సీలింగ్ భూములు, భూదాన్ భూములలో పేదలకు పట్టాలు ఇచ్చి ఇంకా స్వాధీనం చేయని భూములు ప్రతీ జిల్లాలోనూ ఉన్నాయని చెప్పాము. వీటి వివరాలు సేకరించిన



తరువాత ఉద్యమం రూపంలో ఆ లబ్దిదారులకు భూమి స్వాధీనం చేయమని ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలి. భూమి సమస్య విషయంలో తాను సహితం చిత్తశుద్ధితో ఉన్నానని ప్రభుత్వం అంటున్నది కాబట్టి వివరాలు వెలికితీసి ముఖం ముందు పెడితే కాదనడం ప్రభుత్వానికి కష్టం.

పేదలకు గతంలో స్వాధీనపరచి, వారికి తెలిసో తెలియకో అన్యాక్రాంతం అయిన భూమిది వేరే సంగతి. ఒకసారి వేరొకరి చేతిలోకి పోయిన తరువాత అది అన్యాయం అనుకున్నా దానిని తిరిగి లబ్దిదారులకు ఇప్పించాలంటే చట్టం ప్రకారం పోక తప్పదు. అదృష్టం కొద్దీ దీనికి గట్టి చట్టం ఉంది. దానిని '9/77 చట్టం' అని క్లుప్తంగా అంటారు. ఈ చట్టం కింద, అస్సైన్ చేయబడ్డ భూమి అన్యాక్రాంతం అయిందన్న ఫిర్యాదు ఎవరైనా చేయవచ్చు. ఫిర్యాదు స్వీకరించి విచారణ జరిపి లబ్దిదారుకు దానిని తిరిగి ఇప్పించే అధికారం ఎంఆర్‌వోకు ఉంది. ఎంఆర్‌వో చేపట్టే విచారణలో జిల్లా కోర్టు సహితం జోక్యం చేసుకోవడానికి వీలులేదు (హైకోర్టు చేసుకోగలదు– తరచుగా చేసు కుంటూ ఉంటుంది. భూమి సమస్య పరిష్కారానికి హైకోర్టు అడ్డం పడుతున్న వైనాన్ని చివర చెప్పుకుందాం).

కాబట్టి అన్యాక్రాంతమైన భూముల వివరాలు సేకరించగానే ఆయా ప్రజా సంఘాలు మండల రెవెన్యూ అధికారి దగ్గర ఫిర్యాదుచేసి సాక్ష్యాలు చూపించి వ్యాజ్యం నడపవలసి ఉంటుంది. తరచుగా, ఎంఆర్‌వోలు ఫిర్యాదుల పైన విచారణ చేపట్టకుండా జాప్యం చేస్తుంటారు. కాబట్టి చట్టం ప్రకారం ఫిర్యాదు చేసిన తరువాత కూడా ఎంఆర్‌వో పైన ఒత్తిడి పెట్టడానికి ఆందోళన చేయవలసి ఉంటుంది.

2. సెటిల్‌మెంట్ పట్టాల విషయంలో జరిగిన అక్రమాల గురించి చూచాయగా చెప్పాము. రేపు చేపట్టబోయే విషయ సేకరణలో ఈ అక్రమం స్పష్టంగానే కనిపించినా గతంలో ఇచ్చిన పట్టాపైన అప్పీల్ చేయడం ద్వారా తప్ప ఇంకొక రకంగా దానిని రద్దుచేయడం సాధ్యంకాదు. అప్పీల్ చేయడానికి ప్రభుత్వం సహకారం అవసరం అవుతుంది. ఏ అప్పీల్‌కయినా చట్టంలో కాలపరిమితి ఉంటుంది. కాలాతీతం అయిన అప్పీల్‌ను స్వీకరించే అవకాశం చట్టంలో లేకపోలేదు గానీ అది ఆ అప్పిలేట్ అధికారి విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. ఇక్కడ కూడా ప్రభుత్వం సహకారం అవసరం. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేకమైన చట్ట సవరణ చేసి అయినా అనుమానాస్పదం అని తేలిన అన్ని సెటిల్‌మెంట్ పట్టాలపైన అప్పీల్ లేక రివిజన్ దాఖలయ్యేటట్టు, న్యాయబద్ధంగా విచారణ జరిగేటట్టు చూడాలి. దీనికి ప్రభుత్వం పైన ప్రజా సంఘాలు నిర్దిష్టమైన సమాచారంతో ఒత్తిడి పెట్టాలి.

3. ధార్మిక సంస్థల భూముల విషయానికొస్తే, మైనారిటీ మత సంస్థల భూములను భూమిలేని పేదలకు చవకగా కౌలుకిమ్మని వాటి నిర్వాహకులకు ప్రభుత్వమైనా, ప్రజా సంఘాలైనా నచ్చజెప్పాలే తప్ప చట్టపరమైన చర్యలు తీసుకోవడం సాధ్యం కాకపోవచ్చు. (భూమి సేకరణ చట్టం కింద నష్టపరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవచ్చును గానీ దానికయ్యే ఖర్చు ఒక మోతాదు మించి ప్రభుత్వం పెట్టుకోలేకపోవచ్చు). హైందవ దేవాదాయ భూముల విషయం వేరే. వాటి విషయంలో చట్టపరమైన జోక్యానికి అవకాశం ఉంది. ఈ భూములను కౌలుకు తీసుకున్నవారు వాటిని సొంతం చేసేసుకొని అటు దేవాలయానికి గానీ, ఇటు సమాజానికి గానీ అక్కరకు రాకుండా చేసిన వైనాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం 1987లో దేవాదాయ ధర్మాదాయ చట్టాన్ని సవరించి అన్ని కౌళ్లూ రద్దు చేసేసింది. కౌలుదార్లలో భూమిలేని పేదలయిన వారికి మాత్రం అదే భూమిని 75 శాతం మార్కెట్

రేటుకు కొనుక్కునే హక్కు కల్పించింది. సెక్షన్ 82 ద్వారా ప్రవేశపెట్టిన ఈ సవరణను ఏ రకంగానూ సమర్థనీయం కాని తీర్పుతో మన రాష్ట్ర హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని కొట్టేయగా, దానిపైన సుప్రీంకోర్టులో అప్పీల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఒక దశాబ్దం పైగా ఆ అప్పీల్ సంగతి పట్టించుకోలేదు. చివరికి 2001లో సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును తప్పుపట్టి సెక్షన్ 82కు ప్రాణం పోసింది. దీనితో 3.72 లక్షల ఎకరాల దేవాలయ భూములు ప్రభుత్వం చేతిలోకి వచ్చాయి. అందులో భూమిలేని పేదలయిన కౌలుదార్లకు అదే భూమి 75 శాతం మార్కెట్ రేటుకు అమ్మవలసి ఉండగా, తక్కిన భూమి (ఎంతలేదన్నా రెండున్నర లక్షల ఎకరాలుంటుంది) ప్రభుత్వం చేతిలో ఉంది. ఒక్కొక్క గుడి యాజమాన్యమూ ఆ భూమిని మళ్లీ అధిక కౌలుకు వేలం పాడే ప్రయత్నం చేస్తున్నది. కొన్నిచోట్ల చేసేసారు. కొన్నిచోట్ల స్థానిక భూమి లేని పేదలు, వారి సంఘాలు వేలంపాటను ప్రతిఘటించి ఆపారు. అన్ని ప్రజా సంఘాలూ దీనినొక తక్షణ కర్తవ్యంగా తీసుకోవాలి. ఆ భూమిని స్థానిక భూమిలేని పేదలకు, అందులో ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టిలకు చవకగా అమ్మాలని, లేదా తక్కువ కౌలుకు లీజుకివ్వాలని, ఆ మాత్రం కూడా వారు చెల్లించుకోలేక పోయినట్టయితే ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గానీ, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గానీ ప్రభుత్వమే కొని వారికివ్వాలని డిమాండు చేయాలి. ఈ డిమాండును ప్రభుత్వం ఏమేరకు ఆమోదిస్తుందనేది భూమి సమస్య విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధికి పరీక్ష అవుతుంది.

4. భూమి లేని పేదలు, ప్రధానంగా ఆదివాసులు, సాగుచేసుకుంటున్న అటవీ భూముల విషయంలో కేంద్ర అటవీశాఖ 2004 ఫిబ్రవరి 5న జారీచేసిన సర్క్యులర్‌ను పైన ఉటంకించాము. చాలా పట్టుదలగా ఆదివాసులు, ఆదివాసీ సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా ఈ సర్క్యులర్ వచ్చింది. దీని నెంబరు 2-1/2003-ఎఫ్‌సి (పిటి) తేదీ 5.2.2004. ఈ సర్క్యులర్ ఏమంటుందంటే, అన్ని రాష్ట్రాలూ అడవిలో ఆదివాసుల సంప్రదాయక హక్కులకు చట్టాలలో చోటు కల్పించాలి. ఆదివాసులు అవిచ్ఛిన్నంగా అనుభవిస్తున్న అటవీ భూమి పైన వారికి హక్కు కల్పించేందుకు, ఆ భూమిని రిజర్వ్ ఫారెస్టు నుండి తొలగించేందుకు నిర్దిష్టమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వాలు తయారుచేసి కేంద్రానికి పంపించాలి. అవిచ్ఛిన్నంగా అడవి భూమిని అనుభవిస్తుండడం అంటే 1993 డిసెంబర్ 31కి ముందు నుండీ ఇప్పటిదాకా అనుభవిస్తుండడం అని అర్థం. అయితే ఈ ప్రతిపాదనలు పంపేటప్పుడు ఆ భూమిమీద హక్కు పొందబోయే ఆదివాసులు మళ్లీ కొత్తగా అడవి కొట్టకుండ అక్కడే బతకడానికి కావలసిన ఆర్థిక తదితర సదుపాయాలు ఆ రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలి. అప్పుడు ఆ ప్రతిపాదనల మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిత భూమిని రిజర్వ్ ఫారెస్ట్ జాబితా నుండి తొలగించి ఆదివాసులకు ఇచ్చే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తుంది.

ఇది అమలయితే రాష్ట్రంలో ఆదివాసులకు ఒకటి రెండు లక్షల ఎకరాలకు తక్కువ కాకుండా భూములు దక్కుతాయి. కానీ దీనికి చాలా కృషి కావాలనేది స్పష్టమే. రిజర్వ్ ఫారెస్టులో ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూమికి ఏ రికార్డూ ఉండదు. గ్రామీణ పేదలు దున్నుకుంటున్న ప్రభుత్వ భూముల వివరాలు అడంగల్ (పహాణీ)లోకి ఎక్కవచ్చు, ఏదో ఒక చోట గుర్తింపు పొందవచ్చు. రిజర్వ్ ఫారెస్టులో చేస్తున్న సాగు ఎక్కడా నమోదు కాదు. కాబట్టి ఈ విషయాన్ని నిజాయితీగా గుర్తించి ప్రతిపాదనలు పంపే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద పడేసి కూర్చుంటే న్యాయం జరగదు. ప్రజా సంఘాలు వివరంగా సమాచారం సేకరించి ప్రభుత్వానికిచ్చి కేంద్రానికి ప్రతిపాదనలు పంపేటట్టు చూడాలి. 31 డిసెంబర్ 1993 నుండి అవిచ్ఛిన్నంగా అడవి భూమిలో సాగుచేసు



కుంటున్నారన్న విషయం రుజువు చేసుకోవడమూ ఆదివాసులకు కష్టం. దానికి కూడా ప్రజా సంఘాల సహాయం కావాలి.

5. ఏజెన్సీలో ఆదివాసుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోకుండా నిరోధించడానికి ఉద్దేశించిన ఎల్‌టిఆర్ చట్టం అమలులో ఉన్న సంక్షోభాన్ని పైన సూచించాము. ఎల్‌టిఆర్ కింద గిరిజనేతరుల భూములపై విచారణ చాలావరకు 'జరిగిపోయింది'! ఎక్కువ భాగం, ఆదివాసులకు సమాచారమే లేకుండా జరిగిపోయింది. ఈ విచారణలు మొత్తంగా తిరగదోడాలన్న డిమాండు పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ మండలాలలో పుట్టింది. అది తీవ్రమైన గిరిజన-గిరిజనేతర ఘర్షణకు దారితీసేసరికి ప్రభుత్వం దిగొచ్చి 1998లో ఒక సర్క్యులర్ జారీచేసింది. రెవెన్యూ అధికారులు పశ్చిమ గోదావరి ఏజెన్సీలోని ఒక్కొక్క గ్రామంలోనూ ప్రజల మధ్య కూర్చొని భూమి యాజమాన్యానికీ అనుభవానికీ సంబంధించిన రికార్డు చూపించాలనీ, ఎల్‌టిఆర్‌కు విరుద్ధంగా గిరిజనేతరులు భూమి అనుభవిస్తున్నట్టు బయటపడినట్టయితే వారిపైన కేసులు నమోదు చేయాలనీ ఈ సర్క్యులర్‌లో ఉంది. ఒకవేళ అప్పటికే ఒకసారి ఆ భూమిపైన 'విచారణ' జరిగిపోయి గిరిజనేతరుడికి అనుకూలంగా తీర్పు వచ్చి ఉంటే మళ్లీ ప్రభుత్వమే కేసు పెడితే కోర్టులొప్పుకోవు కాబట్టి ఆదివాసులెవరయినా ఈసారి కేసు పెట్టొచ్చు.

ఈ సర్క్యులర్ పశ్చిమ గోదావరి జిల్లాకు మాత్రమే ఉద్దేశించింది. అక్కడ అది ఒక మేరకు అమలయింది. అధికారుల నిజాయితీని బట్టి, అవగాహనను బట్టి ఒకచోట సత్ఫలితాన్నిస్తే ఒకచోట ఇవ్వలేదు. ఈ సర్క్యులర్ అమలుకు ఏజెన్సీ సమస్యలతో పరిచయం ఉన్న సీనియర్ అధికారిని విడిగా కేటాయించి ఏజెన్సీ ఉన్న తొమ్మిది జిల్లాలకూ దానిని వర్తింపజేయాలి. ప్రజా సంఘాలు ఈ డిమాండుతో రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టాలి. ఏజెన్సీలో గిరిజనేతరుల దురాక్రమణకు సంబంధిన సమాచారం వేరే ఏరకంగానూ దొరకదు, పరిష్కారమూ వేరే ఏ రకంగానూ సాధ్యంకాదు.

ప్రజా భూమి కమిషన్‌లో భాగమైన ప్రజా సంఘాలు, ప్రజాతంత్రవాదులు చేపట్టవలసిన పనులు, ఆందోళనలు స్థూలంగా ఇవి. దీనికి ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం ఒక ఆటంకం కాగలదు. హైకోర్టు మరొక ఆటంకం కాగలదు. భూమి సమస్యకు సంబంధించిన అన్నిరకాల చట్టాల వైఫల్యాలనూ ఒక్కొక్కటిగా పరిశీలించినట్టయితే అందులో హైకోర్టు పాత్ర చిన్నదేం కాదని అర్థం అవుతుంది. భూమి మీద ఏ హక్కు లేకున్నా, రెవెన్యూ అధికారులను మెప్పించి- లేక గుండాల బలాన్ని వినియోగించి- ఒకసారి స్వాధీనంలోకి తెచ్చుకుంటే చాలు, లాయర్లకు ఫీజులిచ్చుకోగలిగినంత కాలం హైకోర్టు నుండి స్టే ఆర్డర్లు తెచ్చుకొని అనుభవిస్తూ ఉండవచ్చు. దీనికి విరుగుడుగా ఇప్పుడిప్పుడే చేయగలిగింది ఎక్కువ లేదు. అయితే సంక్షేమ రాజ్యాంగానికి తగిన న్యాయ సిద్ధాంతం భారత న్యాయవ్యవస్థ ఎందుకు రూపొందించుకోలేక పోయిందన్న చర్చ చేస్తూ ఉండాలి.

ఈ ప్రయాస అంతా ఎందుకోసమో ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. రాష్ట్రంలో ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 30 శాతం దాకా భూమిలేని పేదలున్నారు. 1995-96 నాటి భూమి లెక్కల ప్రకారం భూమిగల రైతులలో 80 శాతం ఐదెకరాలకు లోపల ఉన్న చిన్న, సన్నకారు రైతులే. మరొక 13 శాతం పదెకరాల లోపు భూమి ఉన్నవారు. కేవలం ఏడు శాతం మంది పది ఎకరాలకు పైబడి భూమిగలవారు. వీరి చేతిలో ఉన్న సాగు భూమి మొత్తం భూమిలో 31 శాతం అని ప్రభుత్వం అంటుంది గానీ బినామీలనూ దురాక్రమణలనూ కూడా లెక్కిస్తే ఇంకా

ఎక్కువే ఉంటుంది.

ఒక అంచనా ప్రకారం రోజులో ఒకపూట మాత్రమే తిండి తినేవారు రాష్ట్ర జనాభాలో 22 శాతం. 2001 గణాంకాల ప్రకారం 55 శాతం జనాభా ఒకే గది ఉన్న పూరిండ్లలో నివసిస్తున్నారు. 33 శాతం ఇండ్లకు కరెంటు లేదు. మెట్ట ప్రాంతాలలో సంవత్సరంలో మూడు నెలలకు పైగా పనులు దొరకడం లేదు. కాగా, దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా మన రాష్ట్రంలో బాల కార్మికుల సంఖ్య ఎక్కువ.

భూమి పంపిణీ ద్వారా పేదలకు చాలావరకు ఆహార భద్రత కల్పించవచ్చు. దానితోబాటు చెరువుల మరమ్మతు, వాటర్‌షెడ్ అభివృద్ధి, వృక్ష సంరక్షణ సరయిన అర్థంలో సక్రమంగా చేపడితే సంవత్సరం పొడవునా పేదలకు (సన్న, చిన్నకారు రైతులతో సహా) పనులు కల్పించవచ్చు. పేదల కొనుగోలు శక్తి పెరిగే కొద్దీ వినియోగ వస్తువులకు, సేవలకు డిమాండు పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ నిండుగా ఎదుగుతుంది. సామాజికంగా చూస్తే, భూమి పంపిణీ బడుగు వర్గాలలో ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. పంచాయతీల ద్వారా ప్రకటించుకున్న వికేంద్రీకరణ అర్థవంతమవుతుంది.

ఈ విషయంలో భారతదేశం, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఘోరంగా విఫలం అయినాయి. కమ్యూనిస్టు పార్టీ పాలనలో ఉన్న చైనా సాగుభూమిలో 43 శాతాన్ని భూమిలేని పేదలకు పంచింది. పెట్టుబడిదారీ నమూనా సంస్కరణలు అనుసరించిన జపాన్ 33 శాతం భూమిని, దక్షిణ కొరియా 32 శాతం భూమిని పేదలకు పంచాయి. భారతదేశం కేవలం 1.5 శాతం పంచగా, ఆంధ్రప్రదేశ్ 1.8 శాతం పంచింది. ప్రజా భూమి కమిషన్ చేపట్టిన కార్యక్రమం ఆవశ్యకత గురించి ఇంతకంటె ఏమీ చెప్పనవసరం లేదు.

❖



# వ్యవసాయానికి పడుతున్న మరొక చీడ జన్యుకాలుష్యం

-కె. అనూరాధ *

మానవ సమాజ పురోగతికోసం జరిగే చర్యలన్నీ సాధారణంగా చర్చనీయాంశం అవుతాయి. ముఖ్యంగా సామాజిక ఆర్థిక పరమైన విషయాలపై ఎప్పుడూ భిన్నాభిప్రాయాలు వుంటూనే వుంటాయి. కాని ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేకుండా, లేదా చాలా తక్కువ స్థాయిలో విమర్శలు వినబడేది ఒక్క శాస్త్రసాంకేతిక రంగంలోనే. ఇవి మామూలు మనుషులు తమ తలకు మించిన విషయంగా భావిస్తుంటారు. అలాంటివాటిని విమర్శించగల స్థాయి కేవలం మేధావులకే వుందన్న అపోహ మన సమాజంలో చాలా బలంగా వుంది. కాబట్టే ఎన్నోరకాల శాస్త్ర సాంకేతిక ప్రతిపాదనలు, విధానాలు సమాజం మీద రుద్దబడుతున్నా వాటిని అర్థం చేసుకుని విమర్శించే అలవాటు చేసుకోలేకపోతున్నాం. కానీ ప్రపంచీకరణ సందర్భంలో, అన్ని రంగాల్లోకి భారీ పెట్టుబడులతో పెద్దపెద్ద కార్పొరేషన్లు ప్రవేశించిన నేపథ్యంలో ప్రభుత్వాలు చేసే విధాన నిర్ణయా

* మానవహక్కుల కార్యకర్త, విశాఖపట్టణం

లన్నిటినీ అవి శాస్త్ర సాంకేతికపరమైనవైనా సరే నిశితంగా పరిశీలించి మంచిచెడ్డలు విశ్లేషిం చాల్సిన అవసరముంది. లేకపోతే ఎప్పటికీ సరిదిద్దుకోలేని నష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది.

గత దశాబ్దకాలంగా వ్యవసాయ రంగంలో తలెత్తిన సంక్షోభమే చూడండి. వ్యవసాయ రంగంలో అమలవుతున్న తప్పుడు విధానాలే ఇప్పుడు జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు ముఖ్యకారణం.

ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి మన దేశ శాస్త్రజ్ఞులు, కొన్ని బహుళజాతి కార్పొరేషన్లు కలిసి ఒక 'సర్వరోగ నివారిణి'ని ప్రవేశపెట్టాయి. అదే జన్యుమార్పిడి విధానం (జెనెటికల్లీ మోడిఫైడ్ – జి.ఎం). ఈ ప్రక్రియ ద్వారా ఆహార పంటల్లో కొన్ని జన్యుపరమైన మార్పులు చేసి అధిక దిగుబడులు సాధించడమే కాక, అదనంగా కొన్ని గుణగణాలు కలిగిన పంటలను పండించవచ్చునని, తద్వారా ఆహార భద్రత లభిస్తుందని, పేదవారిలో పౌష్టికాహార సమస్యలు కూడా తీరిపోతాయని వాదిస్తున్నారు.

అసలు జన్యుమార్పిడి (జి.ఎం) విధానం దానికదిగా మంచిదా చెడ్డదా అనే నైతిక విషయం మీద చాలా ఏళ్ళుగా భిన్నాభిప్రాయాలు వున్నాయి. ప్రస్తుతం ఆ చర్చలోకి పోకుండా జి.ఎం. పంటలు మనకి ఆహార భద్రతను ఇవ్వగలవా? పౌష్టిక ఆహార సమస్యను తీర్చగలవా? అని మాత్రమే చూద్దాం. అది అర్థం చేసుకోవడానికి కొద్దిగా చరిత్రలోకి వెళ్ళాలి.

## చరిత్ర

మానవులు కొన్నివేల సంవత్సరాల నుంచి తమ ఆహార పంటలను మెరుగుపరుస్తూ వచ్చారు. అదీకాక వ్యవసాయంలో సహజంగానే జన్యుపరమైన మెరుగుదల జరుగుతూ వచ్చింది. జన్యుశాస్త్ర పరిభాషలో దాన్నే సెలెక్షన్ అని అంటారు. అయితే 1960లో జన్యుశాస్త్రంలో సంభవించిన కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణల తర్వాత పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది. సంకర విధానం (హైబ్రిడైజేషన్) అనే ప్రక్రియ ద్వారా వ్యవసాయం రూపురేఖలు మారిపోయాయి. అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ వంగడాలు ప్రవేశించాయి. హరిత విప్లవానికి అవే నాంది అయ్యాయి. హరిత విప్లవం అధిక దిగుబడితోపాటు ఎన్నో దుష్ఫలితాలను కూడా తీసుకొచ్చింది. ఆలస్యంగానైనా సరే వాటిని గ్రహించి కారణాలను వెతుక్కుని విశ్లేషించుకున్నాం.

హరిత విప్లవం మంచిఊపు మీద వున్న తరుణంలోనే 1972లో మొదటిసారి రెండు వేరువేరు ప్రాణుల డి.ఎన్.ఎ.ని కలిపి ఒక ప్రయోగం చేశారు. Recombinant DNA technology గా పిలవబడే ఈ ప్రక్రియ జన్యుశాస్త్రంలో ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. జి.ఎం. విధానానికి మూలంగా కూడా దీన్ని చెప్పవచ్చు. అక్కడితో Genetic Engineering అనే కొత్త శాస్త్రం పుట్టుకొచ్చింది. ఒక ప్రాణి కణంలోకి, పూర్తిగా సంబంధం లేని మరొక జాతి (వేరే జీనస్‌కు చెందిన) ప్రాణి జన్యుభాగాన్ని ప్రవేశపెడితే, ఆ కలయిక వల్ల కొన్ని నూతన లక్షణాలు ఏర్పడతాయి. అలా పుట్టుకొచ్చిన వాటినే 'ట్రాన్స్‌జెనిక్' అని అంటారు. మొట్టమొదటిసారి ఈ ప్రక్రియ 'ఈకోలై' అనే బాక్టీరియాలోకి ఆఫ్రికన్ జాతి కప్ప జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా సాధించారు. శాస్త్రవేత్తల సమాజంలో అప్పుడది చాలా చర్చనీయాంశం అయింది. శాస్త్రీయ ప్రక్రియలకు కూడా కొన్ని నైతిక హద్దులు వుండాలని కొంతమంది గొడవచేస్తే, మరి కొంతమంది



జన్యుమార్పిడి చెందిన ప్రాణుల ప్రవర్తన గురించి, వాటి మంచిచెడ్డల గురించి సంపూర్ణజ్ఞానం లేకుండా వాటిని సమాజంలో ఇతర ప్రాణుల మధ్య వదిలితే అనర్థాలు జరగవచ్చునని హెచ్చరించారు. ఈ కారణాల రీత్యా అప్పటినుంచి ఈ పరిశోధనల్ని ప్రయోగశాలలకే పరిమితం చేశారు.

అయితే దీని కథ అంతటితో ముగిసిపోలేదు. ఆనాటి నుండి బహుళజాతి సంస్థలు జి.ఎం. రంగంలో ఎంతో డబ్బును ధారపోసి పరిశోధనలు చేపట్టాయి. ప్రభుత్వ పరిశోధనలకన్నా (అన్ని దేశాల ప్రభుత్వాలు) ఈ కార్పొరేషన్లే చాలా వేగంగా ఈ దిశలో పరిశోధనలు జరిపాయి. 1992 నుండి జి.ఎం. విత్తనాలను వాణిజ్య పరంగా విడుదల చేస్తున్నారు. మొత్తం 60 రకాల పంటల మీద ఈ ప్రక్రియ ద్వారా పరిశోధనలు జరిపి ఒక 20 రకాలను విడుదల చేశారు. పెద్దపెద్ద బహుళ జాతి సంస్థలన్నీ ఈ వ్యాపారంలోకి దిగి జన్యువుల మీద, జన్యుమార్పిడి పంటల మీద, ఆఖరుకి జన్యుమార్పిడి చేసే విధాన ప్రక్రియల మీద కూడా ముందుగానే పేటెంట్లు సంపాదించి పెట్టుకున్నాయి.

## డిజైనర్ విత్తనాలు

ఈ జి.ఎం. పంటలు డిజైనర్ దుస్తుల లాంటివని ఎవరో మంచి పోలికే తెచ్చారు. మనకు కావలసిన గుణ గణాలను చొప్పించి ఏ పంటనైనా పండించే పరిజ్ఞానం రావడంతో అధిక ప్రొటీన్ కలిగిన మొక్కజొన్న, అధిక పీచుపదార్థం వున్న సోయా లాంటివి అమెరికా, యూరప్ దేశాలలో ప్రవేశించాయి. ఇవికాక ప్రత్యేక ఔషధ గుణాలను కూడా జన్యువుల ద్వారా ప్రవేశపెట్టి ఫార్మా ఉత్పత్తులను తేలిగ్గా తయారుచేయాలనే యోచన వుంది. అలాగే పాడి పశువుల్లోకి కూడా జి.ఎం. విధానాన్ని త్వరలో ప్రవేశపెట్టనున్నారు. వీటి దుష్ఫలి తాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఒక వృక్ష జాతి కణంలోకి పశుజాతి జన్యుభాగాన్ని ప్రవేశపెట్టాక అది మానవులపై ఎలాంటి ప్రభావం చూపగలదో పూర్తిగా ఎవరూ పరీక్షలు నిర్వహించలేదు. అమెరికా,

### గోల్డెన్ రైస్!

ప్రపంచంలో సగం మందికి ప్రధాన ఆహార పంట వరి. 200 సంవత్సరాలుగా రెండు లక్షల వరి రకాలు ప్రపంచంలో చెలామణిలో వున్నాయి. అవి ఎవరి సొత్తూ కాదు. గాలి నీరు లాగా అందరికీ చెందినవని మనం అనుకుం టాము. కాని గతంలో రైస్‌టెక్ అనే అమెరికన్ కంపెనీ బాస్మతి వరిని తామే కనిపెట్టినట్లు పేటెంట్ హక్కును ప్రకటించు కుంది. అయితే భారత ప్రభుత్వం, కొన్ని ఎన్.జి.ఓలు బాగా గొడవ చేయడంతో అది ప్రస్తుతానికి ఆగింది.

వరి మొక్క కణంలో మొత్తం 12 క్రోమోజోములు వుంటాయి. వాటిలో 140 మిలియన్ డి.ఎన్.ఎ. జంటలుంటాయి. అంటే దాదాపు 50,000 జన్యు వులు ఒక వరస క్రమంలో వుం టాయి. సింజెంటా కంపెనీ ఆ క్రమంలో 99.5 శాతం వరకు కనిపెట్టిందని భోగట్టా. (దాన్నే Genome mapping అంటారు) ఇప్పుడు ఏ క్షణంలోనైనా దానిపై పేటెంట్ హక్కును సంపాదిస్తే, వరిలో ఇకమీదట ఏ రకాన్ని విడు దల చేయాలన్నా సింజెంటాకి రాయల్టీ చెల్లించాలి. అంటే ప్రపంచ జనాభాలో సగాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నట్లే!

యూరప్‌లో చాలామందికి జి.ఎం. మొక్కజొన్న పదార్థాలు తినడం వల్ల ఎలర్జీలు వచ్చాయి. దాంతో ఈ ఉత్పత్తులు మళ్ళీ వివాదాస్పదం అయ్యాయి. జి.ఎం. లేబిల్ లేనిదే ఆ ఉత్పత్తులు అమ్మరాదని యూరప్ దేశాలు పట్టుబట్టసాగాయి.

పాశ్చాత్య దేశాల్లో ఈ గొడవ జరుగుతుండగానే ఇవి మనదేశంలోకీ ప్రవేశించాయి. మొదట మన దేశంలోకి ప్రవేశించిన జి.ఎం. పంట, 'బి.టి. పత్తి'. మూడు సంవత్సరాల క్రితం మొన్‌శాంటో అనే బహుళజాతి కంపెనీ ప్రభుత్వ ఆమోదంతో క్షేత్రీయ పరిశోధనలు జరిపి ఆ తర్వాత బి.టి. విత్తనాలను వాణిజ్యపరంగా విడుదల చేసింది. మొత్తం ఆరు రాష్ట్రాల్లో మూడు రకాల బి.టి. పత్తి విత్తనాల సాగుకు ప్రభుత్వం లైసెన్సు జారీచేసింది. అది కూడా నిబంధనలకు వ్యతిరేకంగా, GEAC (Genetic Engineering Approval Committee) అనుమతి లేకుండానే ఇవ్వడం జరిగింది. తర్వాత గత్యంతరం లేక GEAC కూడా ఆమోదముద్ర వేసి మూడు సంవత్సరాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. 2005లో పునఃపరిశీలన చేయాలని చెప్పింది. అక్కడనుండి రైతుల కష్టాలు మొదలయ్యాయి. మామూలు పత్తి విత్తనం ఖరీదు కేజీకి రూ.400 అయితే బిటి విత్తనం ఖరీదు రూ.1600. ఆ తర్వాత పంటకాలంలో కూడా వారికి ఖర్చు ఎక్కువే అయింది. గత మూడు సంవత్సరాలలో మన రాష్ట్రంలో బిటి పత్తిని సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారు. అనేకరకాల కొత్త చీడలు రావడమేకాక దిగుబడి కూడా మామూలు పత్తికంటే తక్కువే వచ్చింది. పత్తికాయల సంఖ్య, సైజు రెండూ తక్కువేనని రుజువైంది. కొంతమంది శాస్త్రజ్ఞులు, ఎన్‌జివోలు కలిసి స్వతంత్ర బృందాలుగా ఏర్పడి పరిశోధనలు జరిపారు. వారి పరిశోధనా ఫలితాలను ప్రభుత్వానికి, GEACకి కూడా పంపారు. అనేకచోట్ల రైతులు విత్తనాల కొట్లపై దండెత్తి ఆందోళనకు దిగారు. ఒక్క వరంగల్ జిల్లాలోనే 25,000 ఎకరాల్లో వేసిన బిటి పత్తి పూర్తిగా నాశనం అయ్యింది. జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు (జాయింట్ డైరెక్టర్) స్వయంగా కమిటీలు వేసి, పరిశీలించి దీన్ని ధృవీకరించారు. మొన్‌శాంటో కంపెనీతో వున్న ఒప్పందం (MOU) ప్రకారం ఎకరానికి 20,000 రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించమని ఆదేశించారు. ముందు రైతులను శాంతింపజేయడానికి సరేనని ఒప్పుకున్న కంపెనీ, ఆ తర్వాత కోర్టును ఆశ్రయించి అడ్డం తిరిగింది. మెల్లగా వ్యవసాయ శాఖ కూడా మాట మార్చి దిగుబడులు తగ్గడానికి ఇతర కారణాలను వెతకడం మొదలుపెట్టింది.

## బి.టి. పత్తి అంటే..

అసలు బి.టి. పత్తి అంటే ఏమిటి? మట్టిలో వుండే బాసిల్లిస్ థురింజి ఎన్సిస్ అనే బాక్టీరియా నుండి ఒక జన్యు భాగాన్ని పత్తి మొక్క కణంలోకి ప్రవేశపెడితే అది బి.టి. పత్తి అయింది. బాక్టీరియా జన్యువులు పత్తి మొక్కలో బి.టి. ప్రొటాక్సిన్ అనే ప్రొటీన్‌ని తయారుచేస్తాయి. ఈ బి.టి. ప్రొటీన్ పత్తి మొక్కకి ఒక రక్షణ కవచంలాగా పనిచేసి, పత్తిని ఆశించే పురుగులను (ముఖ్యగా కాయతొలుచు పురుగును) చంపేస్తుంది. ఇతర చీడల నుండి మాత్రం అది కాపాడలేదు. ఉత్పత్తిని పెంచలేదు. కాని మొన్‌శాంటో మాత్రం రకరకాల గుణాలను బి.టి. పత్తికి ఆపాదించి రైతులను మోసం చేస్తోంది. ఏ పురుగు మందులూ వాడనవసరం లేదని, ఉత్పత్తులు నాలుగింతలు అవుతాయని ప్రకటించింది. అయినా వాస్తవానికి పురుగు మందుల



వాడకం బాగా పెరిగి ఖర్చులు నాలుగింతలయ్యాయి. దిగుబడి బాగా తగ్గింది. ఈ సంవత్సరంతో మొన్‌శాంటోకి ఇచ్చిన లైసెన్సు గడువు ముగిసింది. మార్చి 4, 2005 నాడు దీనిమీద పునః సమీక్షకి GEAC సమావేశం అయింది. దేశవ్యాప్తంగా చాలామంది మేధావులు, రైతుసంఘాలు, ఎన్‌జివోలు లైసెన్సు రద్దుచేయమని గొడవ చేశారు. కాని మొన్‌శాంటో శక్తిముందు వారెంత! బి.టి. పత్తి విత్తనాల అమ్మకాన్ని ఆపకపోగా GEAC పరొక మూడు ఉత్తరాది రాష్ట్రాలకు దాన్ని విస్తరింపజేస్తూ మరో ఆరు రకాలకు కూడా కొత్తగా లైసెన్సు మంజూరు చేసింది.

బిటి పత్తి లాంటివే బి.టి. వరి, గోల్డెన్ రైస్ వంగడాలు. వరిమొక్క కణాల్లోకి విటమిన్ ఎ కలిగిన మరొక ప్రాణి జన్యు సముదాయాన్ని ప్రవేశపెడితే, అప్పుడు మనం తినే అన్నంలో పిండి పదార్ధంతోపాటు విటమిన్ ఎ కూడా వుంటుంది; దీనివల్ల ఎందరో పేదవారికి సంపూర్ణ ఆహారం దొరుకుతుందని వారి వాదన. మన శాస్త్రవేత్తలు నిజంగా పేదవారిమీద ప్రేమతోనే ఈ కార్పొరేషన్లకు మద్దతు పలుకుతున్నారా? పేదవారికిచ్చిన పనికి ఆహారం బియ్యాన్ని కూడా అమ్ముకుతినే మన రాజకీయ నాయకులు, వారిని ఉద్ధరించడానికే ఇప్పుడు ఈ 'గోల్డెన్ రైస్'ను అనుమతిస్తున్నారా? ఇతర దేశాల్లో ఇలాంటి ఫోర్టిఫైడ్ (ఇతర పౌష్టికాలతో సమ్మేళనం చేసిన) పంటలు ఎన్నో దుష్ఫలితాలనిచ్చాయని తెలిసినపుడు ఈ అనుమానం రాక మానదు.

ఇన్ని అనుభవాల తర్వాత కూడా జి.ఎం. విధానం మన దేశంలోకి రావాలనే ప్రభుత్వం ఉత్సాహపడుతోంది. దీనికి మూలకర్త ఎవరో కాదు, హరిత విప్లవానికి అధినేతగా పేరుపొందిన ఎం.ఎస్.స్వామినాథన్ స్వయంగా దీనిని మోసుకు తిరుగుతున్నారు. జి.ఎం. టెక్నాలజీ పూర్వా

### ఆహార సహాయంలోనూ వ్యాపారబుద్ధే

ప్రపంచంలో ఎక్కడ కరువు కాటకాలు సంభవించినా, ప్రకృతి వైషమ్యాల వల్ల నష్టం జరిగినా మిగతా దేశాలు ఆర్థికంగా, ఆహారపరంగా ఆదుకోవడం పరిపాటి. అయితే ఆహారపరమైన సహాయాన్ని కూడా అతి నీచంగా తమ ప్రయోజనాలకు వాడుకోవడం మాత్రం అమెరికాకే చెల్లింది. ప్రపంచ ఆహార కార్యక్రమాన్ని (World Food Programme) తమ చెప్పుచేతల్లో పెట్టుకుని తమ దేశంలో చెల్లుబాటు కాని జి.ఎం. మొక్కజొన్నను అది 'ఆహార సహాయం' పేరుతో వదిలించుకుంటోంది. ఆఫ్రికాలో చిన్నపిల్లల మధ్యాహ్న భోజన పథకానికి ఇలాంటి సహాయాన్నే చేసింది.

2002 సంవత్సరంలో జాంబియా, జింబాబ్వే, మొజాంబిక్, మలావి దేశాల్లో భయంకరమైన కరువు వల్ల 130 లక్షల మంది జనం ఆకలితో అలమటిస్తుంటే, అమెరికా జి.ఎం. మొక్కజొన్న కొనడానికి ఒప్పుకుంటేనే జింబాబ్వేకి 50 మిలియన్ డాలర్ల సహాయం చేస్తానని ఒత్తిడి చేసింది. అయినా జాంబియా, మలావి రెండు దేశాలూ ఈ సహాయాన్ని నిరాకరించాయి. అంతకంటే ఆకలితో చావటం మేలని ప్రకటించాయి. జింబాబ్వే మాత్రం ఎక్కువకాలం బెట్టుగా వుండలేకపోయింది.

ఆఖరికి ఆహార సహాయం కూడా కార్పొరేట్ పరిశ్రమ చేతికి అందొచ్చిన ఆయుధంగా మారింది.

## ఏదీ నష్టపరిహారం?

ఆంధ్రప్రదేశ్‌లో మోనాశాంటో వారి బిటి విత్తనాన్ని అమ్ముతున్న కంపెనీ మహికో. వారికీ రాష్ట్ర ప్రభుత్వానికీ ఉన్న ఒప్పందం ప్రకారం, బి.టి. సాగులో పంట నష్టమయినట్టయితే రైతుకు కంపెనీ నష్టపరిహారం ఇయ్యవలసి ఉంటుంది. (i) విత్తనంలో జన్యు సంబంధమైన దోషం ఉండడం వల్ల, (ii) విత్తనం కల్తీ అయి ఉండడం వల్ల, లేక (iii) స్థానిక పరిస్థితులకు బి.టి. విత్తనం పొసగని కారణం వల్ల వచ్చిన పంట నష్టానికి మాత్రమే ఇది వర్తిస్తుంది. రైతులు పంట నష్టాన్ని గురించి చేసే ఫిర్యాదుల పైన విచారణ జరపడానికి ప్రతీ జిల్లాలోనూ జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అధ్యక్షునిగా ఒక జిల్లాస్థాయి కమిటీ ఉంటుంది. చెప్పుకోవలసిన అవసరం లేని విషయం ఏమిటంటే ఈ కమిటీ ఎక్కడా తన పనిచేయడం లేదు. 2002-03 సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లాలో బి.టి. సాగు వల్ల రైతులు చాలా నష్టపోయారని జాయింట్ డైరెక్టర్ హోదాలో నిజాయితీగానే రిపోర్టు పంపిన అధికారి, జిల్లాస్థాయి కమిటీ అధ్యక్షునిగా మాత్రం రైతులిచ్చిన ఫిర్యాదులకు స్పందించలేదు, వారికి కలిగిన నష్టం పైన నివేదిక ఇవ్వలేదు. ఏమని అడిగితే పంట ఇంకా చేతిలో ఉండగానే ఫిర్యాదు చేయాలనీ, కాయలు ఏరేసిన తరువాత చేస్తే తానేమీ చేయలేననీ అంటాడు. కానీ కాయలింకా ఏరకముందే పంట నష్టం రాబోతుందని రైతుకు ఎట్లా తెలియాలి?

పరాలను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక టాస్క్‌ఫోర్స్‌ని నియమించింది. ఆ టాస్క్‌ఫోర్స్ అధిపతిగా స్వామినాథన్‌ను నియమించింది. మనదేశం నుండి ఆకలిని, పేదరికాన్ని పోగొట్టాలంటే ఇంతకుమించిన మార్గం లేదని స్వామినాథన్ తేల్చేశారు. ఆయన ప్రతిపాదనలు చాలా ప్రమాదకరమైనవి అయినా ఎన్నో మేలిముసుగులతో వాటిని అందంగా ముందుకు తెచ్చారు. ఆయన ఒకపక్క జీవసాంకేతిక జ్ఞానాన్ని గ్రామీణ భారతదేశానికి అన్వయించాలంటాడు, మరోపక్క స్త్రీలకు సాధికారత వుండాలంటాడు, జీవావరణం భగ్నం కాకూడదంటాడు. ఇవన్నీ జరిగితే జి.ఎం. మంచి ఫలితాలను తప్పక సాధిస్తుందని, చిన్న రైతులు సైతం ఎంతో అభివృద్ధి అవుతారని అంటాడు. ఏ పరిశోధనల ఆధారంగా జి.ఎం. పంటలు మేలుచేస్తాయని భావిస్తున్నాడో ఎక్కడా వివరించరు. ప్రజల రక్షణ నిమిత్తం కొన్ని నియంత్రణలు వుంటే చాలట. ఆ కమిటీ చేసిన సిఫార్సుల్లో ముఖ్యమైనవి చూద్దాం.

- GEAC శక్తిని తగ్గించి పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రతిపాదన మొదటిది. ట్రాన్స్‌జెనిక్ పంటల విత్తనాలను విడుదల చేయాలంటే GEAC తో సంబంధం లేకుండానే, భారత వ్యవసాయ పరిశోధనా మండలి-ICAR (Indian Council of Agricultural Research), కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖలు కలిసి నిర్ణయించేయవచ్చునని ప్రతిపాదించింది. (ICAR పూర్తిగా స్వామినాథన్ చెప్పుచేతల్లో వుంటుందన్నది వేరే చెప్పనవసరం లేదు). బి.టి. పత్తికి సరిగ్గా ఇలాగే అనుమతి లభించింది. అది ఎలాంటి పరిణామాలకు దారితీసిందో చూశాం.
- రెండవ ముఖ్యమైన ప్రతిపాదన జి.ఎం. పంటలను అభివృద్ధి చేసే పరిశ్రమలకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలని. (దీనివల్ల ఎవరికి ఉపయోగం?!)
- జి.ఎం. పంటల విడుదలకు త్వరగా అనుమతి లభించేందుకు వీలుగా మరొక ప్రమాదకరమైన ప్రతిపాదన ఏమిటంటే, ఒకసారి ఒక ట్రాన్స్‌జెనిక్ పంటని హాని చేయదని గుర్తించి State Certificate ఇచ్చాక, దానినుండి పుట్టుకొచ్చే వివిధ రకాల జన్యు సముదాయాలకు ప్రతిసారి Safety పరీక్షలు చేయాల్సిన పనిలేదని. అసలు జి.ఎం. పంటల్లో వచ్చే సమస్యలన్నీ అక్కడే వస్తున్నాయి. కొత్తగా చేర్చిన జన్యువులు వాటి పాత స్వభావంతో వుండడం లేదు. అనేక విధాలుగా ప్రతిస్పందించి కొత్త సముదాయాలుగా ఏర్పడుతున్నాయి. ఒక్కోసారి ఆ కొత్త జన్యువు నిర్ధారించిన మొక్కలోనే వుండిపోక, పరపరాగ సంపర్కం ద్వారా ఇతర మొక్కల్లోకి ప్రవేశించి కొత్తకొత్త సముదాయాలుగా ఏర్పడుతున్నాయి. కాబట్టి మొదటిసారి ఇచ్చే Safety Certificate సరిపోదు. ఇది ఖచ్చితంగా విత్తనాల కంపెనీల ప్రయోజనాలను రక్షించడానికి చేసిన ప్రతిపాదనే.
- ఇవికాక కంటితుడుపులుగా కొన్ని నియంత్రణలను మాత్రం ప్రతిపాదించారు. ఎక్కడికక్కడ కొన్ని జీవవైవిధ్యం గల పార్కులను నెలకొల్పాలని, సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం చేసే ఆదివాసీ ప్రాంతాలను కాపాడాలని, జి.ఎం. పంటలకు బీమా పథకం అమలుచేయాలని వగైరా. ఇవి అర్థంలేని ప్రతిపాదనలు. జి.ఎం. పంటల ధాటికి ఎన్ని జీవవైవిధ్య పార్కులు పెట్టినా ఉపయోగం వుండదనేది మెక్సికోలో ఇప్పటికే రుజువయ్యింది. అక్కడ సంప్రదాయక మొక్కజొన్న రకాలేవీ జన్యుకాలుష్యాన్ని తప్పించుకోలేకపోయాయి. ఇక బీమా విషయానికొస్తే, ఈరోజున మామూలు పంటలకే బీమా సౌకర్యం సరిగా లేదు, మరి జి.ఎం. పంటలకు బీమా చేయడానికి ఏ సంస్థలు వున్నాయో స్వామినాథన్ గారికే తెలియాలి.

స్వామినాథన్ గారి టాస్క్‌ఫోర్స్ సభ్యులు ప్రపంచంలోని ఇతరచోట్ల జి.ఎం. పంటల గురించి జరుగుతున్న వివాదాన్ని పరిగణనలోకి తీసుకున్నారో లేదో తెలియదుగాని ఈ రంగంలో అతివేగంగా ముందుకు దూసుకు వస్తున్న 'సింజెంటా' అనే మరో బహుళజాతి సంస్థ సలహాలు మాత్రం తూచా తప్పకుండా తీసుకున్నారనేది స్పష్టంగా తెలుస్తోంది.

### యూరప్‌లో వ్యతిరేకత

అమెరికాలో జి.ఎం. టెక్నాలజీకి ప్రధాన సూత్రధారులు మొన్శాంటో, సింజెంటా బహుళజాతి కార్పొరేషన్లే. వాళ్ళకు అమెరికా తర్వాత యూరప్ పెద్ద మార్కెట్‌గా కనిపించింది. కాని యూరప్‌లో వాళ్ళు అనుకున్నంత తేలిగ్గా బండి నడవలేదు. అక్కడి బలమైన పర్యావరణ ఉద్యమాల వల్లగాని, ప్రజల్లో బాగా అవగాహన వుండడం వల్లగాని ఈ పంటల పట్ల బాగా వ్యతిరేకత వ్యక్తమైంది. జి.ఎం. విత్తనాలపైన, ఆ పంటల నుండి తయారైన ఉత్పత్తులపైన తప్పనిసరిగా జి.ఎం. లేబిల్ వుండాలని అక్కడి ప్రజలు పట్టుబట్టారు. ఈ గొడవ ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా యూరప్‌పై ఒత్తిడి తీసుకొచ్చేంతవరకూ వెళ్ళింది. యూరప్‌తో విసుగు చెందిన ఈ కార్పొరేషన్లు ఇతరచోట్ల మార్కెట్లను విస్తరించే క్రమంలో వర్ధమాన దేశాల మీద దృష్టిపెట్టాయి.

ఇప్పటికే బ్రెజిల్, అర్జెంటీనాలలో మంచి లాభాలను గడిస్తున్న ఈ కంపెనీలు ఈమధ్యే

బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్‌లలో అడుగుపెట్టాయి. భారతదేశంలో కూడా వేళ్ళూనుకోవడంకోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకే సింజెంటా ఇటీవల జి.ఎం. పంటలను ఎలా నియంత్రించాలనే అంశంపై పెద్ద సెమినార్ నిర్వహించింది. ఆ సదస్సు ఆధారంగా కొన్ని సూత్రీకరణలు కూడా చేసింది. ఆశ్చర్యం ఏమిటంటే ఆ సూత్రీకరణలకు, స్వామినాథన్ పేనల్ సిఫార్సులకు పెద్ద తేడా లేదు. సింజెంటా సదస్సు టాస్క్‌ఫోర్స్ రిపోర్టు సమర్పించకముందే జరిగింది కాబట్టి మన శాస్త్రవేత్తలు ఎంతగా బహుళజాతి కార్పొరేషన్ల చెప్పుచేతల్లో వున్నారో తేలిగ్గా అర్థం అవుతోంది.

భారతదేశం ఎంతో వృక్షసంపద, పశుసంద కలిగిన దేశం. జీవ వైవిధ్యానికి పెట్టింది పేరు. యాభైవేలకు పైగా పంట రకాలు మనదేశంలో వున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్క గ్రామంలోనే, ఒకే పంటకు చెందిన 70 రకాలను ఒక సర్వేలో గుర్తించారు. ఇంతటి విశాల జన్యుసంపద వున్నచోట, అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడగలిగే జన్యువులను పంట మొక్కలు సహజంగానే కలిగివుంటాయి. జి.ఎం. పంటల ప్రవేశంతో ఈ ఏర్పాటు దెబ్బతినక తప్పదు. సహజ పరిణామ క్రమంలో ఈ రకంగా కలుగజేసుకోవడం వల్ల జరిగే నష్టం ఎంత అనేది శాస్త్రవేత్తలు ఇంకా పూర్తిగా నిర్ధారించలేదు. కాని జీవవైవిధ్యానికి మాత్రం తీరని నష్టాలు జరుగుతాయని అందరూ ఒప్పుకుంటున్నారు. ముఖ్యంగా జన్యువులు స్థానిక రకాల్లోకి ప్రవేశించడం వల్ల చాలా నష్టమే జరుగుతుందని భావిస్తున్నారు. మెక్సికోలో మొక్కజొన్న విషయంలో ఇదే జరిగింది. మొక్కజొన్నకి పుట్టినిల్లయిన మెక్సికోలో కొన్ని వందల రకాల వంగడాలు వుండేవి. ఇప్పుడు ఆ రకాలన్నీ కూడా జి.ఎం. రకాల జన్యువులతో కలుషితం అయిపోయాయి.

జరగబోయే ఈ ఉపద్రవాన్ని 'జన్యుకాలుష్యంగా' పర్యావరణ ఉద్యమకారులు పిలుస్తున్నారు. దీనివల్ల ముఖ్యంగా మనుషులకు ఎన్నో ఆరోగ్యపరమైన సమస్యలు రావచ్చు. క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. రకరకాల ఎలర్జీల శాతం పెరుగుతుంది. యాంటీబయోటిక్స్ పని చేయకుండా పోవచ్చు. అనూహ్యమైన కొత్తరకం సూక్ష్మజీవుల ప్రవేశంతో కొత్తరకం అంటు వ్యాధులు రావచ్చు. ప్రస్తుతం జి.ఎం. పంటలు హానికరమా కాదా అని తేల్చడానికి చేసే పరీక్షలు సమగ్రంగా లేవు. శాస్త్రీయ రంగంలోనే అత్యంత గౌరవప్రదమైన సంస్థలుగా భావించబడే రాయల్ సొసైటీ ఆఫ్ లండన్, రాయల్ సొసైటీ ఆఫ్ కెనడా సంస్థలు ఈ పరీక్షలను దుయ్యబట్టాయి. ఇంతవరకు క్షేత్రపరిశోధనల రూపంలో జరిపిన పరీక్షలు ఒకటి లేక రెండు పంటలకే పరిమితం అయ్యాయి. అది కూడా ఫలితాలను పరిశీలించడానికే పరిమితం అయ్యాయి తప్ప దీర్ఘకాలంలో వాటి ప్రభావం (risk assessment) మీద ఎటువంటి పరిశోధనలూ జరగలేదు. అలాంటి పరిశోధనలు చాలా ఖర్చుతో కూడుకున్నవి. Risk assessment కోసం అంత డబ్బును వెచ్చించడానికి ఏ బహుళజాతి కంపెనీ ముందుకు వస్తుంది? లాభాలకోసం అంతకాలం వేచివుండే ఓపిక ఎక్కడిది? ప్రభుత్వ పరిశోధనా కేంద్రాల దగ్గరేమో అంత డబ్బు వుండదు. అందుకే Genetic Engineering అనే ఈ శాస్త్రంపై సమాజానికి గాని, రైతాంగానికి గాని ఎటువంటి అదుపు లేకుండా పోయింది.

జన్యుకాలుష్యాన్ని ఎంతోకొంత అనుభవించినందువల్ల పాశ్చాత్య దేశాల్లో తీవ్రస్థాయిలో



వ్యతిరేకత వచ్చింది. ఆ దేశాల్లో మోన్‌శాంటో కంపెనీకి 188 మిలియన్ డాలర్ల నష్టం రాగా, బేయర్ అనే మరొక సంస్థ పూర్తిగా ఈ రంగంనుంచి వైదొలగింది. బ్రిటన్‌లో దేశవ్యాప్తంగా జరిగిన చర్చలో 98 శాతంమంది జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా ఓటువేశారు.

ఇన్ని పరిణామాల తర్వాత కూడా మన కేంద్ర ప్రభుత్వం ఈ పంటలపై ఎందుకు ఉత్సాహం చూపుతోందో ఆలోచించాలి. ఎన్నికల్లో గెలిచిన వెంటనే శాస్త్ర సాంకేతిక శాఖమంత్రి కపిల్‌సిబాల్ చేసిన మొట్టమొదటి ప్రకటన జి.ఎం. టెక్నాలజీకి ఎటువంటి అడ్డంకులు లేకుండా వెంటనే జాతీయ జీవసాంకేతిక విధానాన్ని (National Policy on Biotechnology) రూపొందించాలన్నది. కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్ పవార్ కూడా జి.ఎం. పంటలను వెంటనే ప్రవేశపెట్టకపోతే కొంప మునుగుతుందని ప్రకటించారు. అందరూ చూపించే బూచి ఒక్కటే 'ఆకలి', 'పేదరికం'. వాటిని పారద్రోలాలంటే జి.ఎం. పంటలు తప్పనిసరని.

## ఆహార భద్రత ఒక నెపం మాత్రమే

ఈ ఉత్పత్తుల వల్ల పంట దిగుబడి నాలుగింతలైనా ఆహార భద్రత కలుగుతుందన్న నమ్మకమేమిటో తెలియదు. ఈరోజున తిండిగింజల ఉత్పాదనలో దేశం స్వయంసమృద్ధిని సాధించినా పేదరికాన్ని, ఆకలిని పారద్రోలలేకపోయాము. గత సంవత్సరం గోడౌన్లలో 65 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు నిలువ వున్నా ప్రజలకు కొనుక్కునే స్థోమత లేక అవి అక్కడే కుళ్ళి పాడైపోయిన విషయం మనకు తెలుసు. కాబట్టి ఆహార భద్రతకు ఈ టెక్నాలజీతో పనిలేదు. గత నవంబర్‌లో

## ఆర్థికంగా నష్టదాయకం

**2002** సంవత్సరంలో మన రాష్ట్రానికి చెందిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు తెలంగాణ జిల్లాలలోనూ, కర్నూలు జిల్లాలోనూ బి.టి. కాటన్ సాగునూ, ఇతర విత్తనాలతో పత్తిసాగునూ పోల్చుతూ ఒక నివేదిక ప్రకటించారు. ఆ నివేదిక ప్రకారం,

1. బి.టి. విత్తనం ఇతర హైబ్రిడ్ విత్తనాల కంటే దాదాపు మూడున్నర రెట్లు ఖరీదయినది.
2. హెక్టారుకు ఇతర హైబ్రిడ్ పత్తి విత్తనాలతో వచ్చే పంట 16 క్వింటాళ్లు కాగా బి.టి. విత్తనం వేయగా వచ్చిన పంట 12 క్వింటాళ్ల కంటే లేదు.
3. బి.టి. కాటన్ స్టేపుల్ పొడవు 18-22 మి.మీ.లు ఉండగా ఇతర హైబ్రిడ్ పత్తిరకాల స్టేపుల్ పొడవు 28-22 మి.మీ.లు. పొడవు స్టేపుల్‌కే మార్కెట్‌లో ధర ఎక్కువ ఉంటుంది.
4. ఎరువులు రెండింటికీ ఒకే మోతాదులో అవసరం.
5. పురుగులలో ఒక్క Boll worm కు సంబంధించిన క్రిమిసంహారక గుణం మాత్రమే బి.టి. విత్తనంలో ఉంటుంది. మిగిలిన క్రిములకు మందులు యధావిధిగా వాడవలసిందే. అందువల్ల పురుగుల మందుపైన పెట్టిన ఖర్చు ఐదుశాతం మాత్రమే తగ్గింది.

వెరసి, బి.టి. కాటన్ సాగుకంటే ఇతర హైబ్రిడ్ విత్తనాలతో పత్తిసాగు ఎన్నోరెట్లు లాభదాయకం అని ఈ పరిశోధన అభిప్రాయపడింది.

World Conservation Union జి.ఎం. పంటలపై మారటోరియంని ప్రకటించింది. అవి పూర్తిగా హాని చేయవని నిర్ధారణ జరిగేవరకు నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ సంస్థలో భారతదేశం కూడా సభ్యత్వం కలిగి వుంది కాబట్టి మనమూ ఆ నిర్ణయంలో భాగస్వాములమని ప్రభుత్వం గుర్తించాలి. ఆహార భద్రత పేరుమీద ఈ ప్రమాదకరమైన టెక్నాలజీని ప్రవేశపెడుతున్న ప్రభుత్వాల బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించాల్సిన అవసరం వుంది. ఒకపక్క దేశంలో పుష్కలంగా పంటలు పండుతూంటే కరవు ఎందుకుందో ఆలోచించాలి. నిత్యం కరవు కోరల్లో నలిగే కలహండిలో సైతం పంటలకు కొరత లేదు. 1996 నుండి 2001 దాకా ఏటా 50,000 టన్నుల ధాన్యాన్ని అది ప్రభుత్వ ఆహార నిల్వలకు అందించింది. ఇంకా వెనక్కి వెళ్ళి చూస్తే 1943లో బెంగాల్ కరువు సంభవించినపుడు ఆ ప్రాంతానికి అందరికంటే ఎక్కువ ధాన్యాన్ని పంపి ఆదుకున్నది కలహండీనే. అంతటి సుభిక్ష ప్రాంతంలో ఈరోజున ఆకలిచావులు జరుగుతున్నాయంటే అక్కడ ఆహార ధాన్యాలు పండక కాదు. ప్రజలకు కొనుక్కునే స్థోమత లేక మాత్రమే. ఒక్క కలహండీలోనే కాదు, దేశంలో ఇతరచోట్ల కూడా పేదరికం, ఉపాధి లేకపోవడం, వ్యవసాయం చేతివృత్తులు చితికిపోవడం వల్ల ప్రజలు ఆర్థికంగా చితికిపోయి ఆహారాన్ని కొనుక్కోలేకపోతున్నారు. బయోటెక్నాలజీ వచ్చినంతమాత్రాన ఈ ప్రజలకు ఆహారం అందుబాటులోకి వస్తుందన్న నమ్మకమేమీ లేదు. గోల్డెన్ రైస్ అయినా మామూలు బియ్యమైనా కొనుక్కుని తినాల్సిందే కదా.

Genetic Engineering రంగానికి ముందుముందు మంచి వ్యాపార భవిష్యత్తు వుందనే నమ్మకంతోనే ఎన్నో బహుళజాతి కార్పొరేషన్లు ఆహార పంటలు, పాడి పశువులకు సంబంధించిన పేటెంట్లను పొందివున్నారు. అంటే భవిష్యత్తును తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం కూడా వాళ్ళ పాటే పాడడం శోచనీయమనుకుంటే పాడి, పంటలను అభివృద్ధి చేయడానికి పరిశోధనలు జరిపి, దేశానికి మంచి భవిష్యత్తును అందించాల్సిన శాస్త్రవేత్తలు కడూ ఆపాటే పాడటం మరింత శోచనీయం. అందుకని వాళ్ళు చేయాల్సిన పని ఇప్పుడు మానవ హక్కుల కార్యకర్తలు, మేధావులు చేయాల్సి వస్తోంది. జన్యుమార్పిడి పంటల వల్ల జరిగే హానిని ఇప్పుడు ప్రజలకు మనమే తెలియజేయాలి. ప్రభుత్వంపై వత్తిడి తేవాలి. లేకపోతే వ్యవసాయ రంగంలో రాబోయే మరో సంక్షోభానికి మనమూ సాక్షులుగా మిగిలిపోతాం.

❖



# జీవోకు పట్టిన గతే గిర్‌గ్లానీ కమిషన్‌కూ!

-సి.విఠల్*
-యం.కోదండరామ్*

అసెంబ్లీలో దుమారం లేపిన గిర్‌గ్లానీ కమిషన్ నివేదిక స్థానికులకు ఉద్యోగాలలో కల్పించిన రిజర్వేషన్ల పైన కొత్తకోణాన్ని ఆవిష్కరించింది. అన్ని ప్రాంతాల వారికి పాలనా యంత్రాంగంలో సమాన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికే లోకల్ రిజర్వేషన్లు కల్పించారని నివేదిక పేర్కొన్నది.

గిర్‌గ్లానీ కమిషన్‌ను జూన్ 2001లో నాటి చంద్రబాబు ప్రభుత్వం నియమించింది. స్థానికులకు రిజర్వేషన్లు, 610 జీవో అమలు తీరుతెన్నులను పరిశీలించి తగు సూచనలను ఇవ్వమని జె.ఎం.గిర్‌గ్లానీ సభ్యుడిగా ఈ ఏకసభ్య కమిషన్ ఏర్పడింది.

కమిషన్ 6 అక్టోబర్ 2001 నాడు మధ్యంతర నివేదికను, 30 సెప్టెంబర్, 2004 నాడు తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. తుది నివేదికలో మూడు సంపుటాలున్నాయి. ఇందులో మొదటిది ముఖ్యమైనది. రాష్ట్రపతి ఉత్త

సి.విఠల్ తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు.

ర్వుల అమలుపైన కమిషన్ నివేదిక మొదటి సంపుటిలో ఉన్నది. మిగతా రెంటిలో కమిషన్ సేకరించిన సమాచారాన్ని పొందుపర్చారు.

తెలంగాణ వాదులు, తెలంగాణ ఉద్యోగులు ఆందోళన చేపట్టిన తరువాతే ప్రభుత్వం నివేదికను బహిర్గతం చేసింది. నివేదిక మొదటి అధ్యాయంలోనే స్థానికులకు కల్పించిన రిజర్వేషన్ల స్వభావాన్ని, వాటి ఉల్లంఘనకు దారితీసిన పరిస్థితులను వివరించింది. నివేదికను అర్థం చేసుకోవాలంటే రిజర్వేషన్ల చరిత్ర కొంత తెలుసుకోవడం అవసరం.

స్థానికులకు రిజర్వేషన్లు తెలంగాణలో స్వాతంత్ర్యానికి పూర్వమే అమలులోకి వచ్చాయి. ఈ రిజర్వేషన్లనే ముల్కీ నిబంధనలని అంటారు. 1956లో తెలంగాణ ఆంధ్ర రాష్ట్రంలో విలీనం అయినప్పుడు ముల్కీ రూల్సును కొనసాగిస్తామని పెద్దమనుషుల ఒప్పందం ద్వారా హామీ ఇచ్చారు. అయితే ఈ రూల్సు సక్రమంగా అమలు కాలేదు. 1968లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తలెత్తడానికి ఇది ఒక ప్రధాన కారణం. అప్పుడు ప్రభుత్వం ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా నియమించబడిన 28,000 ఉద్యోగులను వెనక్కి పంపిస్తామని హామీ ఇచ్చింది. ఆ నిర్ణయం మేరకు జీవో 36ను జారీచేసింది. ఈ జీవో అమలును, ముల్కీ రూల్సును వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టులో కేసు వేశారు. కేసు హైకోర్టులో, సుప్రీంకోర్టులో చాలాకాలం సాగింది. చివరకు సుప్రీమ్‌కోర్టు 1972లో ముల్కీ రూల్సు రాజ్యాంగబద్దమేనని చారిత్రాత్మక తీర్పునిచ్చింది.

సుప్రీంకోర్టు తీర్పు నచ్చని ఆంధ్ర నాయకులు జై ఆంధ్ర ఉద్యమాన్ని ఉసిగొల్పారు. ఆ ఉద్యమ లక్ష్యం తెలంగాణకున్న రక్షణలను రద్దుచేయించడం. ఉద్యమ ఫలితంగానే ముల్కీ నిబంధనలు రద్దయ్యాయి. ముల్కీ నిబంధనలు, తెలంగాణకున్న ఇతర రక్షణలను రద్దుచేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం 1973లో ఆరుసూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలోని మూడవ అంశం ప్రకారం ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంత ఉద్యోగాలలో రిజర్వేషన్లుంటాయి. ఆరు సూత్రాల పథకానికి రాజ్యాంగ బద్దతని కల్పించడానికి ప్రభుత్వం 32వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో ఆర్టికల్ 371(డి)ని ప్రవేశపెట్టింది. విద్యా, ఉద్యోగ రంగాలలో రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాల వారికి సమానావకాశాలను కల్పించడానికి తగు ఉత్తర్వులను జారీచేసే అధికారాన్ని పై ఆర్టికల్ రాష్ట్రపతికి కల్పించింది.

రాష్ట్రపతి 371(డి) ఆర్టికల్ ప్రకారం 18-10-1975 నాడు స్థానికులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లను కల్పిస్తూ ఉత్తర్వులను జారీచేశాడు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించారు. ఇందులో ఉత్తర తెలంగాణ జిల్లాలు ఐదవ జోనులోను, దక్షిణ తెలంగాణ జిల్లాలు ఆరవ జోనులోను భాగమయ్యాయి.

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లను ఈ కింది విధంగా కల్పించడం జరిగింది. జూనియర్ అసిస్టెంట్ దాని సమాన క్యాడర్ వరకు జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. అంటే ఏ జిల్లావారు ఆ జిల్లా స్థాయి ఉద్యోగాలలో రిజర్వేషన్లకు అర్హులు. ఈ స్థాయి ఉద్యోగాలలో స్థానికులకు 80 శాతం రిజర్వేషన్ 20 శాతం ఓపెన్ కోటా ఉద్యోగాలుగా ప్రకటించారు.

జూనియర్ అసిస్టెంట్ పైస్థాయిలో ఉన్న నాన్ గెజిటెడ్ క్యాటగిరీ పోస్టులకు జోన్‌ను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఈ పోస్టులలో జోను వారికి 70 శాతం ఉద్యోగాలు రిజర్వు అవుతాయి. మిగతా 30 శాతం ఉద్యోగాలను ఓపెన్ కేటగిరీ ఉద్యోగాలుగా పరిగణిస్తారు.

గెజిటెడ్ పోస్టులలో సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ ఇంజనీర్, తాసీల్దార్ పోస్టులకు కూడా (వీటిని స్పెషల్ గెజిటెడ్ పోస్టులు అంటారు) జోనును ఒక యూనిట్‌గా గుర్తిస్తారు. ఈ ఉద్యోగాలలో జోనుకు చెందిన స్థానికులకు 60 శాతం రిజర్వు అవుతాయి. మిగిలిన 40 శాతం ఓపెన్ కేటగిరీ పోస్టులవుతాయి.

ఆరు సూత్రాల పథకం ప్రకారం ఒక వ్యక్తి నాలుగు సంవత్సరాలు ఒక ప్రాంతంలో నివసిస్తే స్థానికుడవుతాడు. అంతకు ముందున్న ముల్కీ నిబంధనల ప్రకారం 12 సంవత్సరాల స్థిర నివాసం ఉంటేనే స్థానికుడిగా గుర్తించేవారు. అంతేకాదు ముల్కీ నిబంధనల ప్రకారం మొత్తం ఉద్యోగాలను స్థానికులకే ఇచ్చేవారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం దిగువ ఆఫీసులలో స్థానిక రిజర్వేషన్లు వర్తించవు.

1. రాష్ట్ర సచివాలయం
2. శాఖాధిపతుల (హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్) కార్యాలయాలు
3. రాష్ట్ర స్థాయి స్పెషల్ ఆఫీసులు
4. రాష్ట్ర స్థాయి ఆఫీసులు, సంస్థలు
5. ఐదు కోట్లకు పైబడిన మేజర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు. (ఈ భారీ ప్రాజెక్టులను 1985లో రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి తెచ్చారు. అయితే జూనియర్ ఇంజనీర్ స్థాయి స్పెషల్ గెజిటెడ్ పోస్టులను మినహాయించారు)

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పై ఆఫీసుల్లోనూ అన్ని ప్రాంతాల వారికి న్యాయసమ్మతమైన వాటా కల్పించాలి.

1975లో వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులను తెలంగాణలో సక్రమంగా అమలు కాలేదని, ఆరు సూత్రాల పథకం అతిక్రమించబడిందనీ 1985లో ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులపై అప్పటి ప్రభుత్వం ఐ.ఎ.ఎస్. అధికారులైన జయభారతరెడ్డి, కమలనాథన్, ఉమాపతిలతో ఒక కమిటీని వేసింది. ఈ కమిటీ 36 పేజీల నివేదికను అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 1985 నాటికే 59,000 స్థానికేతరులు నియమించబడినారు. వారిని వెనుకకు పంపించడానికి త్రిసభ్య కమిటీ సూచనల మేరకే ప్రభుత్వం 610 జీవోను జారీచేసింది. రాయలసీమ ఉద్యోగులు రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు గురించి అదేరకమైన ఫిర్యాదులు చేయగా, వారికి అదే రకమైన హామీలు ఇస్తూ జీవో 504 జారీచేసింది ప్రభుత్వం. డిసెంబర్ 30, 1985న జారీఅయిన జీవో 610ని మార్చి 31, 1986లోగా అమలు చేయవలసి ఉండగా ఇప్పటివరకు కూడా అది అమలు కాలేదు.

జీవో 610 ప్రకారం అక్రమంగా నియమించబడిన స్థానికేతరులను వెనుకకు పంపించాలి. రాష్ట్రపతి ఉత్తర్వులలో లేని గెజిటెడ్ పోస్టులను ఉత్తర్వుల పరిధిలోకి తేవాలి. రాష్ట్ర స్థాయి ఆఫీసులలో అన్ని ప్రాంతాల వారికి న్యాయసమ్మతమైన వాటా కల్పించాలి. రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన బదిలీలను రద్దుచేయాలి.

కాని జీవో 610 ఆ తరువాత కనుమరుగైంది. 2001లో తెలంగాణ ఉద్యమం బలపడిన తరువాతే అది మళ్ళీ వెలుగులోకి వచ్చింది. శాసనసభలో జీవో పైన చర్చ చెలరేగింది. చర్చ

పర్యవసానంగానే స్థానిక రిజర్వేషన్లను, దాని ఉల్లంఘనను సవరించడానికి ఉద్దేశించబడిన 610 జీవోను సక్రమంగా అమలు చేయడానికి సూచనలిమ్మని ప్రభుత్వం గిర్‌గ్లానీ కమిషన్‌ను నియమించింది.

స్థానిక రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించినవే కాబట్టి వాటిని ఉల్లంఘించడమంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని గిర్‌గ్లాని కమిషన్ ప్రకటించింది. దాంతోపాటు గత 30 సంవత్సరాలుగా పాలనా యంత్రాంగం నిర్ణయాలను తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఉత్తర్వుల స్పృహ లేకుండా పనిచేసిందని, మారుతున్న పరిస్థితులకు తగినట్టుగా పాలనా యంత్రాంగంలో మార్పులు అనివార్యమే అయినా ఆ మార్పులు ఆరు సూత్రాల పథకానికి లోబడి, ఆ చట్టానికి భంగం కలుగకుండా జరుగవలసి ఉండిందని, అయితే అధికారులు రాష్ట్రపతి ఉత్తర్వులనే పట్టించుకోలేదని నివేదిక పేర్కొన్నది. రిజర్వేషన్ల అమలును పర్యవేక్షించే సంస్థ లేకపోవడం వలన ఉల్లంఘనలు నిరాటంకంగా సాగిపోయాయని చెప్పింది.

కమిషన్ ఉల్లంఘన రూపాలను కూడా వివరించింది. మొత్తం 18 రకాల ఉల్లంఘనలు జరిగాయి. అందులో కొన్ని ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

1. శాఖాధిపతుల (హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్) కార్యాలయాల సంఖ్యను పెంచడం ద్వారా ఆరు సూత్రాల పథకం పరిధిలోకి వచ్చే ఉద్యోగాలను కుదించారు. 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల అనుబంధంలో 51 శాఖాధిపతుల కార్యాలయాలను పేర్కొన్నారు. కానీ నేడు 145 శాఖాధిపతుల కార్యాలయాలున్నాయి. ఇది పెరుగుతున్న పాలనావసరాల రీత్యా మాత్రమే జరిగినది కాదు. ఒకే శాఖకు ఒకటి కంటె ఎక్కువ శాఖాధిపతుల కార్యాలయాలను చూపించడం కూడా జరిగింది. ఏ శాఖకయినా ఒకే శాఖాధిపతి ఉంటారు, ఒకే శాఖాధిపతి కార్యాలయం ఉంటుంది. కానీ జోనల్ ఆఫీసులను కూడా శాఖాధిపతుల కార్యాలయాలుగా చూపిన సందర్భాలున్నాయి. తత్ఫలితంగా లోకల్ రిజర్వేషన్లు నీరుగారిపోయాయి.

2. మొదట్లో రాష్ట్రపతి ఉత్తర్వులలో భారీ ప్రాజెక్టుల కార్యాలయాలను మినహాయించారు. 1985లో రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించి భారీ ప్రాజెక్టులను కూడా స్థానిక రిజర్వేషన్ల పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే అప్పుడు ఏ కారణంగానో స్పెషల్ గెజిటెడ్ పోస్టులయిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులను మినహాయించారు. దీనివలన ఈ పోస్టులన్నిటిలోనూ స్థానిక రిజర్వేషన్లు లేకుండా పోయాయి. తెలంగాణ ఉద్యోగుల ఫిర్యాదులకు సమాధానంగా జారీచేసిన జీవో 610లోనూ రాయలసీమ ఉద్యోగులు చేసిన ఫిర్యాదుకు సమాధానంగా జారీచేసిన జీవో 564 లోనూ కూడా ఈ స్పెషల్ గెజిటెడ్ పోస్టులను స్థానిక రిజర్వేషన్ల పరిధిలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. సాధారణ ఇరిగేషన్ శాఖలో ఈ పోస్టులు స్థానిక రిజర్వేషన్ల పరిధిలోకి వస్తాయి కాబట్టి అది న్యాయమైనదే. కానీ ఆ హామీ అమలు కాలేదు. అంతేకాక, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయిపోయిన తరువాత ఆ పోస్టులను కొనసాగించి ప్రాజెక్టు మెయింటెనెన్స్ వగైరాల కోసం వినియోగించుకోవడం మొదలుపెట్టిన తరువాత వాటిని సాధారణ ఇరిగేషన్ శాఖ పోస్టులుగా చూడవలసి ఉండింది. అప్పుడైనా స్థానిక రిజర్వేషన్లు వర్తించేవి. కాని ఆ పని చేయకుండా వాటిని ఇంకా ప్రాజెక్టు పోస్టులుగానే చూపించి స్థానిక రిజర్వేషన్లు వర్తించకుండా చేశారు.



3. పట్టణాభివృద్ధి సంస్థలలో ఒక్క హుడా మాత్రమే స్థానిక రిజర్వేషన్లు పాటిస్తున్నది. అవి ప్రభుత్వ సంస్థలే కాబట్టి వాటినీ రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి తేవలసి ఉండింది. తెలంగాణకు సంబంధించినంత వరకు హైదరాబాద్ పాత నగరంలోని కులీ కుతుబ్‌షా పట్టణాభివృద్ధి సంస్థ, వరంగల్-కరీంనగర్‌లకు వర్తించే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థలలో ఇది జరగని కారణంగా స్థానిక రిజర్వేషన్లు లేకుండా పోయాయి.

4. ఉద్యోగాల హోదాను మార్చడం ద్వారా రిజర్వేషన్ల పరిధిని కుదించారు. జిల్లా స్థాయి ఉద్యోగాలను జోన్ స్థాయి ఉద్యోగంగా మార్చి లోకల్ రిజర్వేషన్లు 80 శాతం నుండి 70 శాతానికి తగ్గించారు. అదేవిధంగా జోనల్ స్థాయి నాన్ గెజిటెడ్ ఉద్యోగాన్ని గెజిటెడ్ ఉద్యోగంగా మార్చడం వలన రిజర్వేషన్లని 70 నుంచి 60 శాతానికి కుదించారు. కొన్ని గెజిటెడ్ ఉద్యోగాలను రాష్ట్రస్థాయి గెజిటెడ్ ఉద్యోగాలుగా మార్చి అసలు లోకల్ రిజర్వేషను లేకుండా చేశారు. ఇలా కేడరు స్థాయిలో మార్పు చేర్పులన్నీ రాష్ట్రపతి అనుమతితోనే జరగాల్సి ఉండగా రాష్ట్రపతి అనుమతిని పొందకుండానే కేడరు స్థాయిలో మార్పు చేశారు. తద్వారా స్థానికుల కోటాను కుదించారు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల హోదాను, ఆఫీసుల స్థాయిని పెంచినా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టుగానే ఆయా ఉద్యోగాలలో లోకల్ రిజర్వేషన్లు పాటించాలి. ఉదాహరణకు ఒక నాన్ గెజిటెడ్ ఉద్యోగాన్ని ప్రభుత్వం గెజిటెడ్ ఉద్యోగంగా మార్చవచ్చు. కానీ ఆ ఉద్యోగాలకు సంబంధించిన రిక్రూట్‌మెంటులో రాష్ట్రపతి ఉత్తర్వులలో కల్పించిన రిజర్వేషన్ సూత్రాలే వర్తిస్తాయి. అదేవిధంగా ఒక ఆఫీసును రాష్ట్ర స్థాయి ఆఫీసుగా మార్చినా ఆ ఉద్యోగాలను లోకల్ రిజర్వేషన్ల పరిధి నుండి మినహాయించే అధికారం ప్రభుత్వానికి లేదు.

ఉద్యోగాల హోదాను మార్చినా, ఆఫీసుల పరిధిని మార్చినా నియామకాలకు సంబంధించినంత మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు ఆ ఉద్యోగాలకు కల్పించిన ప్రతిపత్తి మాత్రం మారదు. అంటే ఆ ఉద్యోగానికి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో కల్పించిన స్థాయిని బట్టే రిజర్వేషన్‌ను పాటించాలి. ఈ విషయంలో మార్పులు చేసే అధికారం రాష్ట్రానికి లేదు.

5. వివిధ స్థాయిలలో ఉండే పోస్టులలో 80, 70, 60 శాతం రిజర్వేషన్ పోగా మిగతావి ఓపెన్ కేటగిరీలో భర్తీచేయాలి. ఈ కేటగిరీలో అందరితో పాటు స్థానికులూ అర్హులు. ఇట్లాకాక ఓపెన్ కేటగిరీ పోస్టులను నాన్ లోకల్స్‌కు రిజర్వు చేయబడిన పోస్టులుగా పరిగణించి వారిని మాత్రమే ఈ పోస్టులలో భర్తీ చేశారు. ఇది చట్ట విరుద్ధం. ఓపెన్ పోస్టులకు మెరిట్‌లో వచ్చిన అభ్యర్థులను మాత్రమే నియమించాలి.

6. చాలా రీజనల్ ఆఫీసుల పరిధికి జోన్ల సరిహద్దులకు మధ్య సమన్వయం ఉండటం లేదు. ఆఫీసుల పరిధి రెండు మూడు జోన్లకు విస్తరిస్తున్నది. తత్ఫలితంగా లోకల్ రిజర్వేషన్ల అమలుకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. కనుక రీజనల్ ఆఫీసుల పరిధిని మార్చాలి. జోన్ల పరిధి, రీజనల్ ఆఫీసుల పరిధిని సవరించి లోకల్ రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలి.

7. ఇంజనీరింగ్ శాఖలలో ఏదయినా ఒక పని చేపట్టినప్పుడు ఆ పని నిమిత్తం ఉద్యోగులను నియమించడం జరుగుతుంది. భారీ ప్రాజెక్టులలో ఇది తరచుగా జరుగుతుంటుంది. వీరిని 'వర్క్-ఛార్జ్‌డ్' ఉద్యోగులు అంటారు. ఇవి కూడా ప్రభుత్వ ఉద్యోగాలే కాబట్టి వీటికి ఎట్టి మినహాయింపూ లేకుండా రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించాలి. రాష్ట్రపతి ఉత్తర్వులలో వర్క్-ఛార్జ్‌డ్ ఉద్యోగులకు ఏ

మినహాయింపూ ఇవ్వలేదు. అయినప్పటికీ ఈ ఉద్యోగాలను స్థానిక రిజర్వేషన్ల నుండి పూర్తిగా మినహాయించారు. ఎందుకని అడిగితే ఒకచోట పని అయిపోతే వారు మిషన్లతో సహా వేరొక చోటికి బదిలీ కావలసి ఉంటుంది కాబట్టి ఆ ఉద్యోగాలకు స్థానిక రిజర్వేషన్లు వర్తింప చేయలేం అన్నారు. కానీ ప్రతీ ప్రాజెక్టుకూ కొత్తగా వర్క్-చార్జ్డ్ ఉద్యోగులను తీసుకున్నారే తప్ప, ముగిసిన ప్రాజెక్టు నుండి ఎవరినీ ఎక్కడా బదిలీ చేయలేదు. మరి ముగిసిన ప్రాజెక్టులో పనిచేసిన వర్క్-చార్జ్డ్ సిబ్బంది ఏమయ్యారంటే ఆయా శాఖలలో పర్మనెంట్ ఉద్యోగులయ్యారు. ఈ విధంగా వేల మందిని స్థానిక రిజర్వేషన్లకు విరుద్ధంగా పర్మనెంట్ చేశారు. ఒక్క నీటి పారుదల శాఖలోనే ఇటువంటి చట్ట విరుద్ధ నియామకాలు 17,161 జరిగాయని గిర్‌గ్లానీ కమిషన్ లెక్కపెట్టింది.

8. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ప్రజావసరాల దృష్ట్యా ఒక స్థానిక ప్రాంతం వారిని ఇంకొక స్థానిక ప్రాంతానికి బదిలీ చేయవచ్చు. (అది జిల్లా కావచ్చు, జోన్ కావచ్చు) దీనికి పరిమితులేవీ రాష్ట్రపతి ఉత్తర్వులు నిర్దేశించలేదు. అయితే బదిలీలు స్థానిక రిజర్వేషన్లను వమ్ముచేసే మోతాదులో గానీ, దొడ్డిదారిన స్థానికేతరులను నియమించే ఎత్తుగడగా గానీ ఉండకూడదనేది స్పష్టమే. 'రాష్ట్రపతి ఉత్తర్వుల చరిత్రను దృష్టిలో ఉంచుకున్నప్పుడు, బదిలీలు చేయడానికి ఆ ఉత్తర్వులలో ఉన్న అవకాశాన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వినియోగించుకోవాలని గుర్తించక తప్పదు. ఇటువంటి బదిలీ ఏదైనా రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా రూపొందించిన స్థానిక రిజర్వేషన్ల సూత్రానికి మినహాయింపు అవుతుందని గుర్తించి, అంతటి అవసరం ఉందని భావించినప్పుడే చేయాలి' అని హైకోర్టు అనింది. విచ్చలవిడి బదిలీలను హైకోర్టు తీవ్రంగా దుయ్యబట్టింది. స్థానిక రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బదిలీలు ఎప్పుడు చేసినా కారణాలు స్పష్టంగా చెప్పాలనీ, అవి ప్రజావసరాల దృష్ట్యా గానీ సమర్థవంతమైన పాలనా ప్రయోజనాల దృష్ట్యా గానీ అత్యవసరమని తెలిపేవిగా ఉండాలనీ కూడా హైకోర్టు చెప్పింది. గిర్‌గ్లానీ కమిషన్ వివిధ ప్రభుత్వ శాఖల నుండి బదిలీల గురించి సమాచారం కోరగా 50 శాఖలు మాత్రం ఇచ్చాయి. ఈ 50 శాఖలు 716 బదిలీలకు సంబంధించిన సమాచారం ఇచ్చాయి. అందులో 208 బదిలీలకు ఏ కారణమూ చెప్పకపోగా, 160 బదిలీలు 'కోరిక మేరకు' చేశాం అన్నారు. అంటే మొత్తం బదిలీలలో 50 శాతం పైగా హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా జరిగాయని ఈ 'శాంపిల్'ను బట్టి తెలుస్తుంది. సమాచారం అందిన 716 బదిలీలలో అత్యధికంగా (79) హైదరాబాద్‌కు కాగా, రెండవ స్థానం (61) చిత్తూరుది (వెంకటేశ్వరుడి పుణ్యమేమో!). కాగా బయటికి పోవాలనుకున్నది అత్యధికంగా (60) ఆదిలాబాద్ నుండి!

9. బదిలీలకు తోడుపోయినవే డిప్యుటేషన్లు కూడా. వేరే స్థానిక ప్రాంతానికి చెందినవారు 'డిప్యుటేషన్' పేరుమీద (ప్రధానంగా హైదరాబాద్‌కు) బదిలీ అయి రావడం వల్ల స్థానికుల అవకాశాలు దెబ్బతింటున్నాయి. స్థానిక రిజర్వేషన్లు వర్తించని రాష్ట్ర స్థాయి సంస్థలు, శాఖాధిపతుల కార్యాలయాలు వగైరాల విషయంలో 12.5 శాతం పోస్టులు మాత్రమే డిప్యుటేషన్ ద్వారా నింపవచ్చుననీ, అందులో స్థానికుల వాటా, స్థానికేతరుల వాటా న్యాయబద్ధంగా నిర్ణయించాలనీ రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుబంధంగా జారీఅయిన జీవో 728 అంటుంది. దానిని విరివిగా అతిక్రమించడం ద్వారా స్థానికులకు (ప్రధానంగా హైదరాబాద్ భాగంగా ఉన్న ఆరవ జోన్ వారికి) అవకాశాలు దెబ్బతిన్నాయి. నియమిత శాతాన్ని మించి డిప్యుటేషన్ మీద పంపించిన వారినందరినీ వెనక్కి పంపించివేయాలని గిర్‌గ్లాని కమిషన్ సూచించింది.

10. ప్రభుత్వం కొందరిని ప్రత్యేకంగా ఆదుకునే లక్ష్యంతో ఉద్యోగాలను ఇస్తుంది.



ఉదాహరణకు విధి నిర్వహణలో భాగంగా మరణించిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగం ఇస్తున్నారు. అయితే అటువంటి నియామకాలలో రిజర్వేషన్లను పాటించడంలేదు. ఖాళీ ఎక్కడుంటే అక్కడ ఇస్తున్నారు. ఆంధ్ర ప్రాంతంలో ఉద్యోగులు మరణిస్తే వారి పిల్లలకు హైదరాబాద్‌లో ఉద్యోగాల నిచ్చారు. ఇటువంటి నియామకాలను రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడే చేపట్టాల్సి ఉన్నప్పటికీ దానిని తెలిసీ అతిక్రమించారు. దీనివల్ల కూడా హైదరాబాద్ భాగంగా ఉన్న ఆరవ జోన్ వాసులు ప్రధానంగా నష్టపోయారు.

11. బోగస్ నివాస సర్టిఫికెట్లను సృష్టించి, ఎంప్లాయిమెంటు ఆఫీసుల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని చాలామంది లోకల్ రిజర్వేషను కింద ఉద్యోగాలను పొందారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే ఒక్క సంవత్సరం జరిగిన టీచర్ల సెలెక్షన్‌లో 40 బోగస్ స్థానిక సర్టిఫికేట్లు తేలాయని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చెప్పినట్టు గిర్‌గ్లాని కమిషన్ అంటుంది. నియామకాలు చేసే అధికారులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజి ఇచ్చే కార్డును ప్రమాణంగా తీసుకుంటున్నారు తప్ప తాము విచారణ ఏదీ జరపడంలేదు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజి వారు అభ్యర్థి ఇచ్చిన సమాచారాన్ని బట్టి పోతున్నారు తప్ప దానిపైన ఏ విచారణా చేపట్టడంలేదు. ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లు అక్రమ నియామకాలకు దోహదపడకుండా చూడాలని కమిషన్ సూచించింది.

12. హైదరాబాద్ నగరం ఏడవ జోన్ అనీ, ఫ్రీ జోన్ అనీ రాష్ట్రపతి ఉత్తర్వులలో లేని కల్పన ఒకటి తరచుగా ప్రభుత్వ ఆదేశాలలో కనిపిస్తుంది. ఏడవ జోన్ గానీ, స్థానిక రిజర్వేషన్లకు అతీతమైన ఫ్రీ జోన్ గానీ ఏదీ లేదు. హైదరాబాద్ ఆరవ జోన్‌లో భాగం. జిల్లా స్థాయి పోస్టులకు హైదరాబాద్ జిల్లా ప్రాతిపదికన స్థానిక రిజర్వేషన్లు పాటించాలి. జోనల్ పోస్టులకు ఆరవ జోన్‌లో భాగంగా స్థానిక రిజర్వేషన్లు పాటించాలి. హైదరాబాద్ ఏడవ జోన్ అనే తప్పుడు అభిప్రాయం కలగడానికి గల కారణాన్ని గిర్‌గ్లాని కమిషన్ చర్చించింది. అయితే అది స్థానిక రిజర్వేషన్లకు అతీతమైన 'ఫ్రీజోన్' అనే అభిప్రాయానికి ఏ ఆధారమూ లేదు. అయినప్పటికీ- కోర్టులు తప్పుపట్టేదాకా- ఆ అభిప్రాయాన్ని అమలు చేస్తూ పోవడం జరిగింది. స్థానిక రిజర్వేషన్ల ప్రాముఖ్యాన్ని గిర్‌గ్లాని కమిషన్ తన తొలి నివేదికలో చాలా స్పష్టంగా, సూటిగా వివరించింది. రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ ఆదేశాలు. కేవలం ఒక చట్టం కాదు. ఈ రాష్ట్రం ఒకటిగా ఉండడానికి అవసరమైన సున్నితమైన సమతుల్యాన్ని అది నిర్దేశించింది. కాబట్టి అన్ని పాలనాపరమైన మార్పులూ రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రాతిపదికపైననే జరగాలి. ఆ 'పునాది చట్టాన్ని' అతిక్రమించడానికి వీలులేదు. రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పునాదిని సవరిస్తే తప్ప దానికి తప్పనిసరిగా కట్టుబడి ఉండాలి.

రాజ్యాంగపరంగాను, రాజకీయంగాను రాష్ట్రపతి ఉత్తర్వుల కుండే ప్రాముఖ్యాన్ని ఈ అభిప్రాయం చక్కగా గుర్తించింది.

కానీ ప్రభుత్వం ఆ ప్రాముఖ్యాన్ని గుర్తించకపోగా, గిర్‌గ్లాని కమిషన్ కృషికి సరయిన సహకారం సహితం ఇవ్వలేదు. రిజర్వేషన్లకు సంబంధించిన సమాచారాన్ని అడిగితే రాష్ట్రంలోని మూడింట ఒకవంతు శాఖలు మాత్రమే కమిషన్‌కు సమాచారాన్ని ఇచ్చాయి. సత్పాలన అంటే ఇదేనా అని కమిషన్ వాపోయింది. కంప్యూటర్ యుగంలో కూడా స్వయానా ప్రభుత్వం పూనుకుంటే తప్ప కిందిస్థాయి నుంచి సమాచారం వచ్చేటట్టు లేదని కమిషన్ పేర్కొన్నది.

రిజర్వేషన్ల ఉల్లంఘనలను రూపుమాపడానికి కమిషన్ స్పష్టమైన చర్యలను సూచించింది. అవి

ఇలా ఉన్నాయి.

1. లోకల్ రిజర్వేషన్ల అమలులో లోపాలను సరిదిద్దేవరకు నియామకాలను ఆపాలి.
2. రిజర్వేషన్ల అమలుకు శాసనసభా కమిటీని, మానిటరింగ్ అథారిటీని ఏర్పాటు చేయాలి.
3. ఉద్దేశపూర్వకంగా, పక్షపాత ధోరణితో రిజర్వేషన్లను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.
4. కార్పొరేషన్లకు, రాష్ట్రస్థాయి ఆఫీసులకు లోకల్ రిజర్వేషన్లను విస్తరించాలి.
5. ఉద్యోగుల సర్వీస్ రిజిష్టరులో నియామకం ఏ కోటాలో జరిగింది వివరించాలి.

స్థానిక రిజర్వేషన్లపైన ఈ నివేదిక సమగ్రమైన సమాచారాన్ని, లోతైన విశ్లేషణను అందించింది. లోకల్ రిజర్వేషన్లు ఒక పద్ధతి ప్రకారం ఉల్లంఘించడం జరిగిందని ఈ నివేదిక రుజువు చేసింది. అయితే ఇంత స్పష్టంగా రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతున్న తీరును గిర్‌గ్లాని కమిషన్ వివరించినా, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. నివేదిక అమలుకు తొందరపడమని, స్థానిక రిజర్వేషన్ల అమలు గురించి ఆలోచించి చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఇది ఇలా ఉండగా హైదరాబాదును ఫ్రీ జోనుగానే పరిగణించాలని, కార్పొరేషన్లకు, రాష్ట్రస్థాయి ఉద్యోగాలకు లోకల్ రిజర్వేషన్లను విస్తరించవద్దని కోస్తాంధ్ర నాయకులు ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారు. మారిన ఈ పరిస్థితిలో కమిషన్ నివేదిక అమలవుతుందన్న ఆశలేదు.

ఎప్పుడో 1986లో అమలు కావలసిన 610 జీవో ఎందుకు అమలు కాలేదన్న ప్రశ్నకు జవాబుగా వచ్చిన గిర్‌గ్లాని కమిషన్ నివేదిక అమలు కోసం ప్రభుత్వం ఏ చర్యా తీసుకోదని, తెలంగాణ వారికి పాలనా యంత్రాంగంలో సమాన భాగస్వామ్యం కల్పించదని అసెంబ్లీ చర్చను పరిశీలించిన వారికి స్పష్టంగానే అర్థమై ఉంటుంది. రాజ్యాంగ బద్ధంగా స్థానిక రిజర్వేషన్లు కల్పించినా ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదంటే తెలంగాణ పట్ల కొనసాగుతున్న వివక్షకు ఇంతకన్నా సాక్ష్యాలు ఇంకేం కావాలి?

❖



# ఆస్తిహక్కు లేని ఆదివాసీ స్త్రీలు

-కె.సుధ *

(ఆదివాసీ స్త్రీల ఆస్తి హక్కు అనే అంశంపై ఆదివాసి మహిళా సంఘాల సమాఖ్య రాజమండ్రిలో మార్చి 31న బహిరంగ విచారణ జరిపింది. ఈ సందర్భంగా సేకరించిన కొంత సమాచారం, కలిగిన కొన్ని ఆలోచనలు, అభిప్రాయాలు)

**ఆ**దివాసులలో అనేక తెగలున్నాయి. ఈ తెగలన్నీ విడివిడిగా నిర్దిష్టమైన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కలిగివున్నాయి. కాబట్టి ఆదివాసులందరికీ ఒకే సంప్రదాయ చట్టమంటూ లేదు. ఒక్కో తెగకి ఒక్కో సంప్రదాయ చట్టం అమలవుతుంది. ఆదివాసీ స్త్రీల ఆస్తి హక్కు పూర్తిగా ఈ సంప్రదాయ చట్టాలపై ఆధారపడి ఉంది. అయితే కొన్ని ఆదివాసీ తెగలు హైందవీకరణకు గురయ్యాయి. అటువంటి ఆదివాసీ తెగలకు హిందూ వారసత్వ చట్టం 1956, హిందూ దత్తత, మనోవర్తి చట్టం 1956, మొదలైన చట్టాలు వర్తిస్తాయి. ఏ తెగ ఆదివాసులను హిందువులుగా గుర్తించాలి, వేటిని కాదు అనే విషయంలో న్యాయస్థానాలు హేతుబద్ధమైన వైఖరిని అవలంబించటం లేదు. ఉదాహరణకు గోండుల్లో కొన్ని తెగలను హిందువులుగా గుర్తించారు. కొన్ని

మానవహక్కుల కార్యకర్త. విజయవాడలో న్యాయవాది.

కాదని నిర్ధారించారు. సాధారణంగా జార్‌లలోని తెగలన్నిటికీ హిందూ లా వర్తిస్తుంది, కానీ సాంస్కృత్, యాదవ జార్‌లకు దత్తత విషయంలో మాత్రం సంప్రదాయ చట్టం వర్తిస్తుంది.

ఈ గందరగోళానికి హిందు పర్సనల్ చట్టాలు కూడా కొంత కారణం. 'హిందువు' అనే పదానికి నిర్వచనం హిందు మహా సముద్రమంత విశాలంగా రూపొందించారు. క్రైస్తవులు, పార్శీలు, ముస్లింలు కాని వారంతా హిందువులే! ఎక్కడ పొరబడతామోనని బౌద్ధులు, జైనులు, సిక్కులు కూడా హిందువులేనని గట్టిగా వక్కాణించారు. దేనిమీదైతే శక్తివంచన లేకుండా పోరాడామో దాని జాబితాలో మనల్ని కూడా చేర్చేశారే అని బుద్ధుడు, మహావీరుడు, సిక్కు గురువుల ఆత్మలు ఎంత ఘోషిస్తూ ఉంటాయో. మేము హిందువులం కాము అని ఘంటాపథంగా ఆ మతస్తులే చెప్పుకోలే నప్పుడు ఊరూ పేరూ లేని ఆదివాసీ తెగలు ఏం చెప్పగలవు? ఆదివాసులను హిందువులుగా పరిగణిస్తే ఏమిటి, కాకుంటే ఏమిటి అని అనుకోవడం శుద్ధ అమాయకత్వం. వారిని హిందువులుగా గుర్తిస్తే ఆదివాసీ స్త్రీలకు వారి తెగ సంప్రదాయ చట్టాలు వర్తించవు. మేలు చేస్తాయా హాని చేస్తాయా అనే విషయంతో నిమిత్తం లేకుండా హిందు పర్సనల్ చట్టాలను వారిపై రుద్దడమనేది పరమ అప్రజాస్వామిక చర్య. ఆదివాసులను హిందువులలో కలపాలా వద్దా అనే విషయంలో ఆదివాసుల శ్రేయస్సయితే దృష్టిలో ఉంచుకుని ఆలోచించడం లేదు. పోనీ వారి సంప్రదాయ చట్టాలేమైనా ఆదివాసీ స్త్రీకి ఆస్తి విషయంలో మేలు చేస్తున్నాయా అంటే అదీ లేదు. కొన్ని జాతుల్లో మినహా ఆదివాసీ స్త్రీలకు సాంప్రదాయకంగా లభిస్తున్న ఆస్తి హక్కులు కూడా ఏమీ లేవు.

అలాగని మనమే మేలు అని వేరే వారు మురిసిపోనవసరం లేదు. లైంగికత్వం, వివాహం, విడాకులు, పునర్వివాహం వంటి విషయాలలో మిగిలిన స్త్రీలకంటే ఆదివాసీ స్త్రీలపై ఆంక్షలు తక్కువ. ఆదివాసీయేతర సమాజం పెళ్లి కాని తల్లుల బ్రతుకును దుర్భరం చేసి పెడుతుంది కాని ఆదివాసులు మాత్రం దాన్ని అతి మామూలు విషయంగా భావిస్తారు. రచ్చ చెయ్యరు. కాని దీనివల్ల ఆదివాసీ స్త్రీల లైంగిక స్వేచ్ఛను ఆదివాసీయేతర పురుషులు దుర్వినియోగం చేసుకోవడం పరిపాటయిపోయింది. ఉద్యోగం, వ్యాపారం ఇత్యాది అవసరాల రీత్యా ఆదివాసులు నివసించే ప్రాంతాలకు వెళ్లే వీరు ఆదివాసీ స్త్రీల జీవితాల్లో ప్రవేశించడం, ఆ బాంధవ్యం ఫలితంగా తలెత్తే బాధ్యతలను దులిపేసుకుని తిరిగి వెళ్లిపోవడం చాలా సాధారణ విషయం అయిపోయింది. ఆ బంధానికి ఒక గుర్తింపు ఉండదు. ఆ బంధం ద్వారా కలిగే సంతతికి గుర్తింపు ఉండదు. పెళ్లికాని తల్లులను ఆదివాసులు ఈసడించుకోకపోయినా పిల్లల సంరక్షణ బాధ్యత మటుకు పూర్తిగా ఆ స్త్రీలపైనే పడుతుంది. తమ బాంధవ్యానికి 'వివాహం' అనే గుర్తింపు లేనందున ఈ ఆదివాసీ స్త్రీలు ఆ బాంధవ్యం నుంచి ఎటువంటి చట్టపరమైన హక్కులు పొందలేరు. ఒక సుదీర్ఘ న్యాయ పోరాటానికి ఆ స్త్రీలు సిద్ధపడితే పిల్లల వరకూ సిఆర్‌పిసి సెక్షన్ 125 కింద మనోవర్తి పొందవచ్చు.

ఆదివాసీ స్త్రీలకు బాధ్యతారహిత ఆదివాసీయేతరుల పురుషుల నుంచే కాదు సజాత పురుషుల నుంచి కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సగటు ఆదివాసీ కుటుంబం పోషణలో స్త్రీలకు ప్రధాన పాత్ర ఉంది. ఆదివాసీ జీవనం అటవీ సంపద సేకరణపైన, సేద్యంపైన ఆధార పడింది. ఈ బాధ్యతలు స్త్రీ పురుషులిద్దరూ చేపడతారుగానీ కొన్నిరకాల అటవీ సంపద సేకరణ, దాదాపు అన్నిరకాల అమ్మకం స్త్రీల బాధ్యతే. సేద్యంలోనూ ఎక్కువ పని స్త్రీలే చేస్తారు. అయినా భూమిపై మటుకు ఈ భూమిపుత్రికలకు ఎటువంటి హక్కులేదు. వారి సంప్రదాయంలో పురుషులకే వారసత్వ హక్కుంది. ఒక వ్యక్తికి కొడుకులు లేకపోతే ఆ ఆస్తి అతని అన్నదమ్ముల కొడుకులకు



చెందుతుంది కాని తన సొంత కూతురికి దక్కదు. సంప్రదాయ చట్టంలో అదే ఉంది కనుక మేము చేయగలిగేది ఏమీ లేదని న్యాయస్థానాలు చేతులెత్తేస్తాయి.

కొన్ని జాతులలో బహుభార్యాత్వం కొనసాగుతోంది. సంప్రదాయ చట్టం ఒప్పుకుంటుంది కనుక కోర్టులు కాదనవు. అయితే మనోవర్తి భార్యలందరికీ లభిస్తుందని కోర్టు తీర్పు ఇచ్చిన సందర్భాలున్నాయి.

## ఆదివాసుల భూమి- స్త్రీలు

భూమి యాజమాన్యాన్ని రికార్డులలో నమోదు చేయించుకోవాలని తెలియక ఆదివాసులు ఇప్పటికే ఎంతో మోసపోయారు. యాజమాన్యం రికార్డయిన చోట కూడా అది మగవారి పేరనే ఉంటుంది. భూమి స్త్రీల పేరపెడితే ఆదివాసీయేతరులు వారిని లోబర్చుకుని భూమిని కాజేస్తారు కనుక భూమి మగవారి పేరనే పెట్టాలనేది ఒక వాదన. దానివల్ల నష్టపోతున్నది మళ్లీ ఆదివాసీ స్త్రీలే. భూమి ఆదివాసీయేతరులు కాజేయకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రస్తావించ కుండా ఆదివాసీ స్త్రీల కాలికింద భూమిని లాగేస్తే ఎలా? ఆదివాసుల భూములను ఆదివాసీయే తరులు కాజేయకుండా రాజ్యాంగంలోని ఐదు, ఆరవ షెడ్యూల్స్, వాటికింది జారీచేసిన 1/70 చట్టం లాంటి చట్టాలు ఉన్నాయి. ఆ చట్టాలేవీ లింగభేదం పాటించనపుడు (ఆదివాసీయేతరులు ఆదివాసీ పురుషుడి నుండి భూమి కొనుక్కుంటే చెల్లదుగానీ స్త్రీ నుండి కొనుక్కుంటే చెల్లుతుందనడం లేదే.) ఆదివాసీయేతరుల బూచి చూపించి ఆదివాసీ స్త్రీలకు భూమిపై హక్కును నిరాకరించడం ఏం సమంజసం?

అయితే శాసనకర్తలు కూడా ఈ విషయంలో ఇప్పుడు లింగభేదం పాటించే చట్టాలను ప్రవేశ పెడుతున్నారు. కేవలం మగవారికే భూమిపై యాజమాన్య, కౌలుదారీ హక్కులు కల్పిస్తూ కొన్నిచోట్ల చట్టాలు ప్రవేశపెట్టారు. ఈ రకంగా ఆదివాసీ స్త్రీలకు సంప్రదాయ చట్టాలే కాదు ఈ లిఖితపూర్వక చట్టాల బెడద కూడా పట్టుకుంది. అటువంటి ఒక చట్టమే ఛోటానాగ్‌పూర్ కౌలుదారీ చట్టం, 1908. ఆదివాసీ కౌలుదారులను సక్రమంగా వర్గీకరించి, వారి హక్కులను కాపాడడం కోసం ఈ చట్టాన్ని చేశారు. పనిలో పనిగా, కౌలుదారు చనిపోయిన తరువాత అతని పేరుమీద ఉన్న కౌలుదారీ హక్కు అతని మగవారసులకే సంక్రమిస్తుందని ఈ చట్టంలోని సెక్షన్ 7, 8లలో అన్నారు. ఈ లింగ వివక్షను సవాలుచేస్తూ 'మానుషి' పత్రిక సంపాదకురాలు మధు కిష్వార్, జులియానా లాక్రా అనే ఆదివాసీ స్త్రీ, మరికొందరు కలిసి సుప్రీంకోర్టులో రెండు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. (1996(5) సుప్రీంకోర్టు కేసెస్ 125).

దీనిపై అన్ని ఆదివాసీ సంప్రదాయాలను 14, 15, 21 అధికరణాల ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేయడం సమంజసం కాదనీ, ఏ కేసుకా కేసులోని అంశాలను విడివిడిగా పరిగణనలోకి తీసుకుని పరిశీలించాల్సిందేననీ ముగ్గురు సభ్యులు గల ధర్మాసనం ఏకాభిప్రాయానికి వచ్చింది. (వారికా సందేహం రావలసిన అవసరం ఉండలేదు. చట్టమే కాదు, చట్టం స్వభావం గల సంప్రదాయాలు కూడా రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విరుద్ధమైతే చెల్లదని రాజ్యాంగమే అంటుంది. అయితే సంప్రదాయాల విషయంలో- ఒక్క ఆదివాసీ సంప్రదాయాల విషయంలోనే కాదు- ఈ రాజ్యాంగ సూత్రాన్ని అమలు చేయడానికి మన కోర్టులు ఎంత మాత్రం సుముఖంగా లేవు.) అయితే ఈ కేసులోని ముఖ్య విషయంలో న్యాయమూర్తుల మధ్య విభేదాలు తలెత్తాయి.

## మెజారిటీ తీర్పులోని ముఖ్యాంశాలు

వ్యవసాయం కేవలం వ్యక్తిగత వ్యాపకం కాదు. కుటుంబంలో చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా అందరూ ఉమ్మడిగా పనిచేస్తారు. ఈ ఉమ్మడి కుటుంబానికి ఇంటికి పెద్దాయన సారథ్యం వహిస్తాడు. ఇంటి యజమాని మరణిస్తే ఛోటానాగ్‌పూర్ కౌలుదారీ చట్టం ఆ యజమాని తల్లి, వితంతువు, కూతుర్లు, కోడళ్లు, మనవరాళ్లు మొదలైన స్త్రీ వారసులను భూమి నుండి, జీవనోపాధి హక్కు నుండి వేరుచేసి ఆ హక్కులన్నీ మగవారసులకే పట్టం కడుతుంది. ఇది ఆదివాసీ సంప్రదాయాన్ని అనుసరించి ఉంది కాబట్టి దీనిని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించలేము. అయితే, ఇందువల్ల ఆ స్త్రీలు నిరాధారులవుతున్నారు కాబట్టి ఆ స్త్రీలకు తాము బతికి ఉన్నంతకాలం ఆ భూమిని అనుభవించే హక్కు ఉంటుంది. వారి జీవితకాలంలో ఆ భూమికి వారసులైన మగవారికి సంపూర్ణ యాజమాన్య హక్కు లభించదు. వారు చనిపోయిన తరువాత, లేదా వారు ఆ భూమిని స్వచ్ఛంగా వదిలి వెళ్లిపోయిన తరువాత లభిస్తుంది. ఇదీ స్థూలంగా మెజారిటీ తీర్పు సారాంశం. చట్టంలో లింగ వివక్ష పాటించే అంశాలు సమానత్వ హక్కుకి భంగకరమని చెప్పడానికి వీరు విపరీతంగా మొహమాట పడ్డారు. కానీ మనస్సాక్షి ఊరుకున్నట్లు లేదు, అందుకే ఆకలితో మలమలా మాడిపోకుండా ఉండటానికి జీవనోపాధి హక్కు మటుకు వారసులైన స్త్రీలకు కల్పించారు. రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు భంగకరమైన చట్టాలు గానీ చట్టం స్వభావం గల సంప్రదాయాలు గానీ చెల్లవని రాజ్యాంగంలోని ఆర్టికల్ 13 అంటుంది. అయినప్పటికీ, కంటికి స్పష్టంగా కనిపిస్తున్న లిఖితపూర్వక శాసనంలోని వివక్షను కొట్టివేయడానికే సిద్ధపడని వారు ఇక సంప్రదాయ చట్టాల మాయాజాలంలోకి అడుగుపెడతారా?

## మైనారిటీ తీర్పు

1) ఉమ్మడి కుటుంబంలోని భూమిపై స్త్రీలకు కూడా వారసత్వ హక్కు కల్పిస్తే భూమి ముక్క చెక్కలవుతుంది అనడం సరైనది కాదు. ఉమ్మడాస్తిని పురుషులు పంచుకున్నప్పుడు భూమి ముక్క చెక్కలవ్వదా? కనుక స్త్రీలకు వారసత్వ హక్కు నిరాకరణ అనేది సమానత్వ హక్కు, సామాజిక న్యాయానికి విరుద్ధం. న్యాయ, సమానత్వ భావాలకు విరుద్ధం.

2) ఆదివాసీ స్త్రీలకు వారసత్వ హక్కు నిరాకరణకు మరో కారణం ఏమిటంటే భూమి ఆదివాసీయేతరులకు వెళ్లిపోతుందని. ఆదివాసుల భూమిని ఆదివాసీయేతరులు కాజేయకుండా అనేక చట్టాలున్నాయి. వాటిని పకడ్బందీగా అమలు చేయాలి. అంతేకాని స్త్రీలకు వారసత్వ హక్కు నిరాకరించకూడదు. ఒక ఆదివాసీ స్త్రీ వారసత్వంగా పొందిన భూమిని అమ్మదల్చుకుంటే మొదట తన తోబుట్టువులకు తెలపాలి. వారి మధ్య బేరం కుదరకపోతే న్యాయస్థానం సహాయం పొందాలి. అటువంటి జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే ఆదివాసీయేతరులకు అమ్మవచ్చు. ఇవీ న్యాయమూర్తి రామస్వామి అభిప్రాయాలు.

రాజమండ్రిలో జరిగిన బహిరంగ విచారణలో ప్రధానంగా ముందుకి వచ్చిన డిమాండ్ ప్రభుత్వం భూములిచ్చేటప్పుడు స్త్రీ పురుషులకు జాయింట్ పట్టాలివ్వాలని.

హిందూ వారసత్వ చట్టాన్ని, ఇతర హిందూ పర్సనల్ చట్టాలను ఆదివాసులపై రుద్దడం ఎవరూ కోరుకోని విషయం. అలాగని ఆదివాసీ సంప్రదాయ చట్టాలను యధాతథంగా ఉంచితే ఆదివాసీ స్త్రీలు ఎప్పటికీ భూమిపై హక్కును పొందలేరు. అయితే సాధారణ న్యాయ సూత్రాల ప్రకారం కొన్ని



సంప్రదాయాలు చెల్లవు. ఏమిటంటే– చెల్లని సందర్భాలు:–

1) అవి రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు. ఉదాహరణకు అస్పృశ్యత
2) అనైతికం అయినప్పుడు
3) సమానత్వ, న్యాయ సూత్రాలకు విరుద్ధమైనప్పుడు (Equity, Justice and fairness)
4) ఆ సంప్రదాయాన్ని తోసిపుచ్చి ఒక శాసనాన్ని ప్రవేశపెట్టినప్పుడు. ఉదాహరణకు సతీసహగమనం.

ఆదివాసీ స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించే విధంగా శాసనం రావాలనే ఆలోచన ఇప్పటికే మొదలైంది. అయితే ఏ రకమైన శాసనమైనా ఆదివాసీయేతరులచే దుర్వినియోగం కాకుండా ఆ శాసనంలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ శాసనకర్తలు ఇప్పట్లో ఈ విషయంపై ఆసక్తి చూపకపోయినా మించిపోయింది లేదు. రాజ్యాంగం ఉంది, న్యాయ సమానత్వ సూత్రాలు ఉండనే ఉన్నాయి. వాటి ఆధారంగా తమ సంప్రదాయ చట్టాలను, చట్రాలను ఆదివాసీ స్త్రీలు సవాలు చేయవచ్చు. భూమిపై హక్కును సాధించుకోవచ్చు.

❖

# ఆకలి చావులు-తిండి హక్కు

-ఎం.కోదండరామ్ *

'**గు**ర్తింపు'కు సైతం నోచుకోని చావులు ఆకలిచావులు. సమస్యను గుర్తించకపోవడమే సమస్యకు పరిష్కారం అని మన ప్రభుత్వం భావిస్తున్నట్టుంది. రెండు ఘటనలలో జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రతినిధి విచారణ జరిపి అవి ఆకలిచావులేనని నిర్ధారించినా, జయతీ ఘోష్ కమిషన్ గ్రామాల్లో చాలామందికి చాలినంత పౌష్టికాహారం లభించడం లేదని, దానివల్ల ఆకలిచావులు జరుగుతున్నాయని చెప్పినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలలో కొందరికైనా సహాయం అందజేశారు కాని ఆకలి చావులకు గురైన కుటుంబాల వారికి మాత్రం ఎటువంటి సహాయాన్నీ ఇవ్వలేదు.

పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం 2004 సంవత్సరంలో ఒక్క మెదక్ జిల్లాలోనే 143 ఆకలి చావులయ్యాయి. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోను వీటి సంఖ్య ఎక్కువగానే ఉంది. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కూడా తిండిలేక చనిపోయిన వారి గురించి అడపా దడపా వార్తలు వస్తున్నాయి. మెదక్ మృతులలో పురుషులు 106 మంది యితే స్త్రీలు 37 మంది ఉన్నారు. మరొక ఆశ్చర్యకర విషయమేమిటంటే మృతులలో యువకులు కూడా ఎక్కువమందే ఉండడం. దిగువ

* మానవహక్కుల కార్యకర్త, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్



పట్టిక చూడండి.

| **వయస్సు** | **మృతుల సంఖ్య** | **మొత్తంలో శాతం** |
|---|---|---|
| 18 సం॥ల లోపు | 2 | 1.40 |
| 18-24 | 2 | 1.40 |
| 25-29 | 12 | 8.40 |
| 30-34 | 13 | 9.09 |
| 35-44 | 27 | 18.88 |
| 45-49 | 20 | 13.99 |
| 50-59 | 34 | 23.78 |
| 60-69 | 21 | 14.68 |
| 70+ | 4 | 2.80 |
| వివరాలు తెలియవు | 8 | 5.60 |
| **మొత్తం** | **143** | |

వీరిలో సుమారు 47 శాతం 50 సంవత్సరాల కన్నా పైబడిన వయసు వారైతే, 42 శాతం మంది 30-50 సంవత్సరాల మధ్యవయస్కులు. కేవలం వయసు మళ్ళిన వాళ్ళే ఆకలి చావులకు లోనవుతున్నారనే అభిప్రాయం నిజం కాదని పై పట్టిక సూచిస్తున్నది. ఏదో ఒక పని చేసుకుంటూ తమ కాళ్ళమీద తాము నిలబడి కుటుంబాన్ని పోషించగలవారు సైతం ఆకలి చావులకు గురవడం ఒక విషాదం. మరొక విషయమేమిటంటే చనిపోయిన వారిలో పదిమందిని మినహాయిస్తే మిగతా అందరూ ఎస్‌సి, బిసి కులాలవారే.

రోజుల తరబడి తిండి లేకుండా ఎవరైనా చనిపోతేనే ప్రభుత్వం దృష్టిలో అది ఆకలిచావు. కాని వీరిలో ఆ విధంగా అస్సలు తిండి లేకుండా చనిపోయిన వారెవ్వరూ లేరు. చనిపోయిన వారంతా చాలినంత తిండి లేకపోవడం వల్ల మాత్రమే చనిపోయారు. చాలినంత తిండి లేకపోవడం వలన ఆరోగ్యం క్షీణించి చనిపోతే అటువంటి మరణాన్ని కూడా ఆకలి చావుగానే పరిగణించాలని వైద్య నిపుణులు చెప్పినా మన ప్రభుత్వం వారి అభిప్రాయాన్ని అంగీకరించడంలేదు.

చాలినంత తిండి తినకపోతే శరీరంలో ఏం జరుగుతుందో చూద్దాం.

చాలినంత తిండి తినకపోతే ముందు కొవ్వు కరిగిపోతుంది. ఆ తరువాత ప్రొటీన్లు కరిగి కండరాలు బలహీనమవుతాయి. ఈ పరిణామాల ఫలితంగా చివరకు మనిషి రోగాలపాలై చనిపోతాడు. ప్రభుత్వాధికారులు తిండిలేమి పర్యవసానంగా సంభవించిన ఈ చివరి ఘటనను వేరు చేసి చూస్తున్నారు. అందుకని చావుకు తిండిలేమి, ఆకలి కారణంగా వారికి కనబడవు. కేవలం రోగం వల్లనే చనిపోయాడని అభిప్రాయపడతారు. ఒకవేళ చనిపోయిన వ్యక్తి ఇంట్లో తిండిగింజలున్నా, రేషన్ కార్డుపైన తిండి గింజలు కొన్న దాఖలాలు కనిపించినా ఇక ఆ చావు ఆకలిచావే కాదని అధికారులు అంటారు.

ఎవరైనా నిజంగానే తిండిలేక చనిపోయినా దాన్ని కూడా అధికారులు ఆకలి చావుగా గుర్తించరు. అలా గుర్తించితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ప్రభుత్వం బదనామ్ కాకుండా

చూడటానికే వాస్తవాలను దాచేస్తున్నారు. ఆకలి చావును అర్థం చేసుకోవాలంటే మానవ హక్కుల కార్యకర్తలు ముందుగా ప్రభుత్వ వాదనలోని లోపాలను తెలుసుకోవాలి.

జన్‌స్వాస్థ్ అభియాన్ వారు ఆకలి చావుకు, ఇతర మరణాలకు తేడాలను జాగ్రత్తగా చూడాలంటున్నారు. రోగం వలన జరిగే మరణానికి వ్యక్తి శారీరక పరిస్థితి కారణం. కానీ ఆకలి చావులకు కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితి మూలకారణం. మొత్తంగా పౌష్టికాహార లోపాన్ని ఎదుర్కొనే సమూహంలోనే ఆకలి చావులు జరుగుతుంటాయి. కనుక ఆకలి చావులను నిర్ధారించడానికి కుటుంబ ఆర్థిక పరిస్థితిపైన, గ్రామ ఆర్థిక పరిస్థితిపైన అవగాహన ఉండాలి. జీవనోపాధి అవకాశాలు తగ్గి, చాలినంత తిండి దొరకనప్పుడే ఆకలిచావులు జరుగుతాయి. ఆకలి చావులను గుర్తించడానికి వ్యవసాయ పరిస్థితిని కూడా చూడాలి. పనులు దొరుకుతున్నాయో లేదో, దొరకకపోతే వ్యవసాయేతర రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలేమిటో పరిశీలించాలి. వాటివలన బతుకుతెరువు ఎంతమేరకు కలుగుతున్నదో చూడాలి. ఇన్ని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినపుడే అసలు విషయం తెలుస్తుంది. ఆకలిచావును గుర్తించడానికి అనుసరించే ఈ పద్ధతిని మౌఖిక శవ పరీక్ష అంటారు. ఈ పద్ధతిని ఇప్పుడు ప్రభుత్వం చేత ఆమోదింప చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వరుస కరువుల వలన మన రాష్ట్రంలోని గ్రామాలలో అటు వ్యవసాయ రంగంలోను, ఇటు వ్యవసాయేతర రంగంలోను ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఇందుకు ప్రకృతి కారణం కాదు. వ్యవసాయ రంగంలో సంక్షోభం కారణంగానే గ్రామాల్లో బతుకుతెరువు అవకాశాలు దెబ్బతిన్నాయి. మన రాష్ట్రంలో మొత్తం పనిచేసే వారిలో 63 శాతం వ్యవసాయ రంగంపైన ఆధారపడి బతుకుతున్నారు. ఇతర రాష్ట్రాలలో వ్యవసాయంపైన ఆధారపడిన వారు ఇంతమంది లేరు. మహారాష్ట్రలో 56 శాతం, గుజరాత్‌లో 52 శాతం, తమిళనాడులో 49 శాతం, పంజాబ్‌లో 39 శాతం మాత్రమే వ్యవసాయం నుండి జీవనోపాధిని పొందుతున్నారు.

వ్యవసాయ రంగంపైన ఆధారపడి బతుకుతున్న 63 శాతంలో 40 శాతం వ్యవసాయ కూలీలయితే 23 శాతం మాత్రమే వ్యవసాయదారులు. పైన పేర్కొన్న ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలు లేరు. పంజాబ్‌లో 16 శాతం, తమిళనాడులో 31 శాతం, గుజరాత్‌లో 24 శాతం, మహారాష్ట్రలో 27 శాతం, కర్ణాటకలో 26 శాతం మాత్రమే వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. మన రాష్ట్రంలో మరొక విషయమేమిటంటే రైతుల్లో ఎక్కువ మంది చిన్న రైతులే. మొత్తం కమతాలలో ఒక హెక్టారు లోపు భూమి కలిగిన కమతాలు 60 శాతం ఉండగా మొత్తం సాగుభూమిలో 20 శాతం భూమి మాత్రమే వారి అధీనంలో ఉన్నది.

మరి ఇంతమందికి ఉపాధి కల్పించవలసిన వ్యవసాయ రంగంలో మౌలిక వసతులు లేనేలేవు. మొత్తం సాగుభూమిలో 60 శాతం భూమికి ఎటువంటి సాగునీటి సౌకర్యం లేదు. వానపడితేనే పంటలు పండుతాయి. సాగునీటి సౌకర్యం గల భూముల్లోనూ 50 శాతం బావుల కింద సాగవుతున్నది. బావుల కింద కూడా వర్షం పడితేనే సాగవుతుంది. కాబట్టి మూడింట రెండు వంతుల భూమిలో వర్షాధారంగా వ్యవసాయం సాగుతున్నది.

ప్రపంచ ఆహార సంస్థ, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి పథకం ఆంధ్రప్రదేశ్ పైన విడివిడిగా జరిపిన అధ్యయనాలు మెట్ట వ్యవసాయానికున్న పరిమితులను వెలుగులోకి తెచ్చాయి. ఈ నివేదిక ప్రకారం



మెట్ట భూముల్లో సాగుకు తగిన పంటలు కాని, అనువైన పరిజ్ఞానం కాని పెంపొందలేదు. ఉత్పత్తి, ఉత్పాదకత తక్కువ. ఇటువంటి భూముల్ని సాగుచేసే రైతులకు ప్రత్యేక విస్తరణ సేవలు లేవు. మెట్ట భూముల రైతుల వద్ద పెట్టుబడి అసలు లేదు. కనుక మెట్ట వ్యవసాయం ఉపాధిని కల్పించలేకపోతున్నది.

మరోవైపు మెట్ట ప్రాంతాలలో పరిస్థితి ఏమాత్రం సానుకూలంగా లేకపోయినా, ఆదాయాన్ని పొందడానికి మెట్ట రైతులు కూడా వరి, పత్తి, మిర్చి, చెరుకు వంటి వాణిజ్య పంటల్ని పండించక తప్పడంలేదు. అందుకోసం బావులు తవ్వి భూగర్భ జలాలను వినియోగంలోకి తెస్తున్నారు. తత్ఫలితంగా భూములు నిస్సారంగా మారిపోయాయి. ఇప్పటికే రాష్ట్రంలో 28 శాతం భూమి పడావున్నది. పడావు భూమి 1.6 శాతం చొప్పున విస్తరిస్తున్నదని నిపుణుల అంచనా. తెలంగాణలో సాగుభూమిలో 50 శాతం బీడు ఉన్నదంటే పరిస్థితి ఎంతగా విషమించిందో అర్థం చేసుకోవచ్చు.

వ్యవసాయం దెబ్బతినేసరికి గ్రామాల్లోని వ్యవసాయేతర రంగాలు కూడా కుంటుబడి పోయినాయి. వరుస కరువుల వలన నీళ్ళులేక చాకలి, మత్స్యకారుల వంటి వృత్తులు చితికి పోయాయి. 1993-94 - 1999-2000 మధ్యకాలంలో మన గ్రామాల్లో వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు 23 శాతం నుండి 21 శాతానికి పడిపోతే దేశంలో ఈ అవకాశాలు 18 నుండి 23 శాతానికి పెరిగాయి. ఈ విధంగా గ్రామాల్లో పంటలూ పండడం లేదు. ఇతర పనులూ దొరక కుండా పోయాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థ కూడా ఈ కాలంలోనే కుప్పకూలిపోయింది. 1994లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చేనాటికి తెల్లకార్డుల మీద ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోలు, కిలో 3.50 రేటుకు బియ్యం ఇచ్చేవారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకం వల్లనే ఖజానా ఖాళీ అయిపోతున్నదని, అభివృద్ధికి కాదు కదా జీతభత్యాలకూ పైసలు ఉండటం లేదని ప్రచారం చేసింది. ఈలోగా ప్రపంచ బ్యాంకు తిండిపైన సబ్సిడీని తగ్గించాలని ఆంక్షలు విధించింది. ఫలితంగా తెల్లకార్డు పైన కోటా తగ్గిపోయింది. ఒక్కొక్కరికి నాలుగు కిలోల చొప్పున 20 కిలోల దాకా మాత్రమే ఇస్తున్నారు. దీనితో పాటు రేటునూ పెంచారు. ప్రస్తుతం 5.25కు కిలో బియ్యం ఇస్తున్నారు.

పనులు దొరకక గ్రామాల్లో చాలామంది ఈ బియ్యం కూడా కొనలేకపోతున్నారు. రేషన్ దుకాణాలలో నెల మొత్తం బియ్యం స్టాకు ఉంచితే ఎప్పుడు పైసలు దొరికితే అప్పుడు బియ్యం కొనుక్కుంటారు. కానీ అలా నెల మొత్తం స్టాకు ఉంచే రేషన్ డీలర్లు చాలా తక్కువ. ఎక్కువ భాగం ఒక్క వారం మాత్రమే నిల్వ ఉంచుతారు. ఎందుకంటే రేషన్ డీలర్లు ముందు పైసలు కడితేనే స్టాకు విడుదల చేస్తారు. చాలామంది డీలర్లు పెట్టుబడి లేక 24 నుంచి 36 శాతం వడ్డీకి అప్పుతెచ్చి ప్రభుత్వానికి జమచేసి స్టాకు తీసుకొస్తుంటారు. నెలంతా స్టాకు ఉంచితే వడ్డీ భారం పెరుగుతుంది. కాబట్టి వారం రోజులు మాత్రమే ఉంచి, ఆ తరువాత మిగిలిన ధాన్యాన్ని బయట మార్కెట్‌లో అమ్మి అప్పు తీర్చుతుంటారు. ఇంకో విషయమేమిటంటే గ్రామాల్లో ఏడు శాతం అర్హులకు తెల్లకార్డులు లేవని ప్రభుత్వ అధ్యయనంలోనే తేలింది. ఉన్న వాళ్ళలోను కొందరికి కొనగలిగేటంతటి ఆదాయం లేదు. ఒకవేళ కొన్నా అది మొత్తం అవసరాలలో పదిశాతం అవసరాలను కూడా తీర్చడంలేదు. రేషన్ వ్యవస్థ ఆహార భద్రతను పెంపొందించే స్థితిలో లేదు.

మొత్తం గ్రామీణ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే తేలేదేమిటంటే 1993-94 - 2003-04 మధ్య కాలంలో గ్రామీణ తలసరి ఆదాయం 12 శాతం చొప్పున పడిపోయింది. తలసరి వినిమయ ఖర్చు ఇదే కాలానికి సుమారు 450 నుండి 400 రూపాయలకు పడిపోయింది. చవకగా తిండి అందించవలసిన ప్రభుత్వం ఇదే కాలంలో రేషన్ కార్డులపై ఇచ్చే బియ్యం కోటాను తగ్గించింది. ధరను పెంచింది. ఆహార భద్రత క్షీణించడానికి స్థూలంగా ఈ పరిస్థితి కారణమైంది. ఈ నేపథ్యంలోనే ఆకలి చావులు జరిగాయి.

ఇలాంటి స్థూల వివరణ ఆకలి చావులకు గల కారణాలను తెలుసుకోడానికి తోడ్పడుతుంది. అయితే దీని ఆధారంగా నిర్దిష్టమైన ఆకలి చావుపైన నివేదికను తయారు చేయలేము. అటువంటి నివేదికను తయారు చేయాలంటే వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభం ఆ గ్రామంలో ఎలా వ్యక్తమవుతున్నదో చూడాలి. పైన చెప్పినట్టు గ్రామ ఆర్థిక పరిస్థితిని, బతుకు తెరువు అవకాశాలను, కుటుంబ ఆదాయాన్ని పరిగణనలోనికి తీసుకుని నివేదిక రూపొందించుకోవాలి. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఫిబ్రవరి 2004లో నల్లగొండ జిల్లా మట్టంపల్లి మండలం లాలీతండాకు చెందిన ధరావత్ కామ్లీ (32) అనే మహిళ ఆకలి చావుపై తయారుచేసిన నివేదిక ఇందుకు నమూనాగా పనికొస్తుంది.

- లాలీ తండాలో 120 కుటుంబాలుండగా అందులో 70 మందికి అసలు భూమిలేదు. మిగిలిన 50 కుటుంబాలలో 40 కుటుంబాలు వ్యవసాయంతో పాటు బతుకుదెరువు కోసం కూలిపనికి కూడా పోతారు.
- గ్రామంలో అందరికీ చాలినంత పని దొరకదు. సంవత్సరానికి రెండుసార్లు వలస పోవడం ఇక్కడ మామూలే.
- అయితే వరుస కరువుల వలన గత మూడేళ్ళుగా వలస పోతున్న వారి సంఖ్య పెరిగింది. అంతేకాదు, గతం కన్నా ఇప్పుడు ఎక్కువ రోజులు వలస పోతున్నారు. ఆ విధంగా వలసపోయి తెచ్చిన డబ్బులతోనే తినగలుగుతున్నారు.
- ప్రభుత్వం ఈ మూడేళ్ళలో ఒక నెలరోజులు మాత్రమే పని కల్పించింది.
- రేషన్ దుకాణం సరిగ్గా నడవడం లేదు. అంత్యోదయ కార్డులు ఉన్న వారెవ్వరికీ బియ్యం ఇవ్వలేదు.
- ఈ పరిస్థితుల్లో 60 కుటుంబాల వారికి చాలినంత తిండి దొరకడంలేదు. అక్కడికీ ఖర్చు తగ్గించుకోవడానికి నూకలు తెచ్చుకుంటున్నారు. గంజి కాసుకొని తాగుతున్నారు. అయినా వారి ఆదాయాలతో చాలినంత తిండి సమకూర్చుకోలేకపోతున్నారు.
- భర్త వదిలేస్తే ధరావత్ కామ్లీ తల్లిదండ్రులతోనే ఉంటున్నది. ఆమె ముగ్గురు సోదరులు కామ్లీ చనిపోవడానికి మూడేళ్ళ ముందటే బతకబోయారు. తిరిగి రాలేదు. అందువలన ముసలి తల్లిదండ్రుల బాధ్యత కామ్లీ నెత్తిన బడింది.
- గ్రామంలో పని దొరకక కామ్లీ పనుల కొరకు చుట్టుపక్కల గ్రామాలకు పోయేది. దొరికినంత తెచ్చి తల్లిదండ్రులను ఆదుకునేది. చావడానికి రెండు నెలల ముందు ఆమెకు అస్సలు పని దొరకలేదు. చనిపోవడానికి ముందు ఆరు రోజులు అస్సలు తిండి తినలేదు. ఆకలి బాధకు చివరకు ఇంటి తొవ్వబట్టింది. గ్రామానికి తిరిగి వచ్చిన మరుసటిరోజే చనిపోయింది. కామ్లీ తిరిగి రాగానే తండ్రి అప్పుచేసి బియ్యం కొని కూతురుకు పెడదామని ఆరాటపడ్డాడు. కానీ అప్పు తెచ్చి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న హూజూర్‌నగర్ వెళ్ళి బియ్యం తెచ్చేసరికి ఆమె ప్రాణం పోనే పోయింది.
- కామ్లీకి పని చేసినప్పుడు రోజుకు 25 రూపాయల కూలీ వచ్చేది. అందులో 15 రూపాయలు ఇంటికి పంపి తాను మిగిలిన పది రూపాయలతో తిండి తినేది.

ఇన్ని వివరాలు సేకరించాక దీన్ని ఆకలిచావు కాదని ఎవరు అనగలరు?

ఆకలి చావులను చాలా కాలంపాటు మనం మానవహక్కుల దృక్పథం నుండి చూడలేదు. మానవతా దృక్పథంతో జాలిపడడం తప్ప అవి హక్కుల ఉల్లంఘన లేదా లేమి ఫలితంగా జరుగుతున్నాయని గుర్తించలేదు. ఇప్పుడు అవగాహన మారింది. మనిషి బతకాలంటే తిండి ఉండాలి. తిండి కలిగినప్పుడే జీవించే హక్కు నిలబడుతుంది. ఆ విధంగా జీవించే హక్కును గుర్తించినప్పుడు, తిండిని హక్కుగా అడిగే అవకాశాన్ని కలిగించినప్పుడు మాత్రమే ఆకలి చావులను నివారించవచ్చునన్న ఆలోచన ప్రపంచ వ్యాప్తంగా పెంపొందుతున్నది. ఆహార భద్రతను పెంపొందించి ఆకలి చావులను నివారించడానికి తిండి హక్కు తోడ్పడుతుందని అంతర్జాతీయ సంస్థలు కూడా గుర్తిస్తున్నాయి.

నిజానికి తిండి హక్కు ఇవ్వాళ కొత్తగా వచ్చింది కాదు. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన మొట్టమొదటి సారిగా తిండి హక్కును గుర్తించింది. ఆ ప్రకటనలోని ఆర్టికల్ 25(1) ప్రకారం "ప్రతి వ్యక్తికి తిండి, బట్ట, ఇల్లు, వైద్య సదుపాయం, తన కుటుంబ ఆరోగ్య సంక్షేమాలకు తగినట్టి జీవన ప్రమాణాన్ని పొందే హక్కు ఉంది. అలాగే నిరుద్యోగం, అస్వస్థత, అశక్తత, వైధవ్యం, వృద్ధాప్యం, జీవనోపాధి లేని పరిస్థితి ఏర్పడినప్పుడు ప్రభుత్వం నుంచి ఆహార భద్రతను పొందే హక్కు ఉంది.

1967లో జారీఅయిన సామాజిక, ఆర్థిక హక్కుల ఒడంబడికలో తిండి హక్కును మరింత విపులీకరించారు. ఆర్టికల్ 11(2) "ఆకలి బాధ లేకుండా జీవించేందుకు ప్రతి వ్యక్తికీ ప్రాథమిక హక్కు" ఉంటుందని గుర్తించింది. 11(2)(అ) ప్రకారం "ఆహార ఉత్పత్తి, నిల్వ, పంపిణీ పద్ధతులను మెరుగుపరచడానికి కావలసిన సాంకేతిక, వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. పోషకాహార సూత్రాలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని అందరికీ తెలియజేయాలి. భూ వ్యవస్థను సంస్కరించి అభివృద్ధి పరచాలి. దీనివల్ల సహజ వనరులను అత్యుత్తమంగా పెంపొందించి వినియోగించుకోవడానికి వీలవుతుంది.

11(2)(ఆ) ననుసరించి "ఆహార పదార్థాలను దిగుమతి చేసుకునే దేశాలకూ, ఎగుమతి చేసే దేశాలకూ ఎదురవుతున్న సమస్యలను లెక్కలోకి తీసుకొని, అవసరాన్ని బట్టి ప్రపంచ ఆహార సరఫరాలు న్యాయోచితంగా పంపిణీ అయ్యేటట్లు చూడాలి."

1974లో జారీఅయిన ఆకలి, పౌష్టికాహార లోప నివారణ అంతర్జాతీయ ప్రకటన ఇప్పుడున్న వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ శక్తితో ఆకలిని, పౌష్టికాహార లోపాన్ని నివారించ వచ్చునని, తిండి హక్కును అమలు చేయవచ్చునని పేర్కొన్నది.

ఇన్ని ప్రకటనలు ఉన్నా 1996లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన ప్రపంచ ఆహార సదస్సు తిండి హక్కును మరోసారి వెలుగులోకి తీసుకురావాల్సి వచ్చింది. తిండి హక్కును అమలు

చేయడం ద్వారా ఆహార భద్రతను పెంపొందించ వచ్చునని ఆ సదస్సు తీర్మానించింది. ఈ హక్కును స్పష్టంగా నిర్వచించి అమలులోకి తేవడానికి తగు చర్యలను తీసుకోవలసిందిగా ఐక్య రాజ్య సమితి మానవహక్కుల హైకమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. సమితి మానవ హక్కుల కమిషనర్ కృషి ఫలితంగానే తిండి హక్కుకు ఇప్పుడు మళ్లీ ప్రాచుర్యం లభించింది.

మన సుప్రీంకోర్టు కూడా ఆహార భద్రతను ఒక హక్కుగా గుర్తించింది. కోర్టు దృష్టిలో ఆహార భద్రత అంటే కనీస పౌష్టికాహార విలువలు గల తిండిగింజలు ప్రజలకు అందాలి. వాటిని పొంద డానికి వీలుగా ప్రజలకు పని కల్పించాలి. చవకగా ధాన్యం అందుబాటులో ఉంచాలి. స్త్రీలకు, పిల్లలకు, వృద్ధులకు ఉచితంగా సహాయం అందజేయాలి వగైరా. నిజానికి ఆహార భద్రత కలగాలంటే ఇంతకంటే విస్తృతమైన చర్యలు తీసుకోవాలి. అందరికీ భూమి ఇవ్వాలి. ఆ భూమి నుండి ఆదాయాన్ని పొందడానికి వీలుగా సాగునీటి సౌకర్యం, పెట్టుబడి, పండిన పంటకు మార్కెట్‌ను కల్పించాలి. ఇవన్నీ ఆహార భద్రతలో అంతర్భాగమే. కానీ కోర్టు ఇచ్చిన తీర్పులో ఇవి అంతర్భాగం కాలేదు. కోర్టు కల్పించిన ఆహారపు హక్కు కూడా నేటి సంస్కరణల యుగంలో ప్రజాసంఘాలు ఒత్తిడి చేయకుండ అమలులోకి రావడం కష్టమే.

❖



**జ్యుడీషియరీ వాచ్:**

## ఎ.బి.సి.డి. పైన సుప్రీంకోర్టు తీర్పు

# విజ్ఞత లేదు, తర్కమూ లేదు

-కె. బాలగోపాల్

షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ వర్గీకరణ చెల్లదంటూ అయిదుగురు జడ్జిల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం* ఇచ్చిన తీర్పుమీద దీర్ఘమైన సమీక్ష రాయనవసరం లేదు. ఒక తీర్పులో గట్టి తర్కమున్నా లోతయిన విజ్ఞత ఉన్నా దానిని వివరంగా సమీక్షించే అవసరం ఉంటుంది. అది అంగీకార పూర్వకమయిన సమీక్ష అయినా, అనంగీకార పూర్వకమయినదయినా అటువంటి సమీక్ష న్యాయ సిద్ధాంతాన్ని గురించీ, దానికీ సమాజానికీ ఉన్న సంబంధాన్ని గురించీ మనకు ఎంతో కొంత నేర్పగలదు. కానీ తర్కమూ విజ్ఞతా రెండూ లేని తీర్పును దీర్ఘంగా సమీక్షించడం వల్ల నేర్చుకునేదేమీ ఉండదు. కాగితాలు వృధా చేయడం తప్ప జరిగేదీ ఒరిగేదీ ఏమీ ఉండదు.

ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డు కులాల మధ్య అంతరాలేవీ లేవని గానీ, అభివృద్ధిలోనూ, సాంఘిక ప్రతిపత్తిలోనూ అందరూ సమానంగా ఉన్నారని గానీ సుప్రీంకోర్టు అనలేదు. అంటే, ఏ వాస్తవ పరిస్థితిని ఆసరా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టిందో ఆ పరిస్థితి వాస్తవం కాదని సుప్రీంకోర్టు అనలేదు. అయినప్పటికీ వర్గీకరణ చెల్లదని చెప్పింది.

అదీ విశేషం.

వర్గీకరణ చేపట్టే అధికారం రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదనీ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందనీ అని ఊరుకోలేదు. రాష్ట్రంలో గానీ, కేంద్రంలో గానీ ఎవరూ వర్గీకరణ చేయడానికి వీలులేదని కూడా అనింది. షెడ్యూల్డు కులాలలో అంతర్గత భేదాలు ఉంటే ఉండవచ్చు. ఉండవని కాదు. వాటిని ప్రభుత్వం గుర్తిస్తే గుర్తించవచ్చు. గుర్తించడానికి వీలులేదని కాదు. కానీ ఏమీ చేయడానికి మాత్రం వీలులేదు. కేంద్ర ప్రభుత్వమూ ఏమీ చేయడానికి లేదు, రాష్ట్ర ప్రభుత్వమూ ఏమీ చేయడానికి లేదు.

ఇదీ సుప్రీంకోర్టు తీర్పు సారాంశం.

జస్టిస్ చిన్నపరెడ్డిగారు అప్పుడెప్పుడో ఒక తీర్పులో సుప్రీంకోర్టును ఎందుకు అత్యున్నత

* ఇ.వి. చిన్నయ్య వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, (2005) 1 *SCC* 394

న్యాయస్థానం అంటారో వివరిస్తూ, 'దాని విజ్ఞత అత్యుత్తమం కాబట్టి దానిని అత్యున్నత న్యాయస్థానం అనరు, అది అత్యున్నత న్యాయస్థానం కాబట్టి దాని విజ్ఞత అత్యుత్తమం' అన్నారు. అంటే సుప్రీంకోర్టు ప్రకటించే న్యాయంమీద అప్పీల్ లేదు కాబట్టే అది తుదిన్యాయం. వేరే ఏ అర్థంలోనూ కాదని ఆయన భావం. ఇటువంటి తీర్పులు చదివినప్పుడు అది ఎంత సరయిన వ్యాఖ్యో కదా అనిపిస్తుంది.

ఇంతకూ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేసిందని సుప్రీంకోర్టు భావించింది?

భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల జాబితాను ఆర్టికల్స్ 341, 342ల ననుసరించి రాష్ట్రపతి అన్ని రాష్ట్రాల గవర్నర్‌లను సంప్రదించి ప్రకటిస్తారు. ఒక్కొక్క రాష్ట్రానికి రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టిల జాబితా ఉంటుంది. ఒకసారి రాష్ట్రపతి (గవర్నర్‌ను సంప్రదించి) ఈ జాబితాను ప్రకటించిన తరువాత దానిలో ఏదైనా ఒక కులాన్ని చేర్చే అధికారం గానీ, తీసేసే అధికారం గానీ రాష్ట్రపతికి లేదు, గవర్నర్‌కూ లేదు. పార్లమెంటుకు మాత్రమే ఉంది. ప్రకటించేది రాష్ట్రపతే అయినప్పుడు సవరించే అధికారం రాష్ట్రపతికే ఎందుకివ్వకూడదు అన్న చర్చ రాజ్యాంగ సభలో వచ్చినప్పుడు, అంబేద్కర్ ఏమన్నాడంటే సవరించే అధికారం రాష్ట్రపతి చేతిలో పెడితే అది రాజకీయ దుర్వినియోగానికి దారితీస్తుందని. పార్లమెంటులో రాజకీయాలుండవని ఆయన ఉద్దేశ్యం కాదు. రాష్ట్రపతి పాలక పార్టీ మనిషిగా వ్యవహరించబోతాడని ఆయన ఆనాడే ఊహించినట్టున్నాడు. కాబట్టి షెడ్యూల్డు కులాల లేక తెగల జాబితాలో చేర్పులు తీసివేతలు చేసే అధికారం రాష్ట్రపతి చేతిలో పెడితే పాలక పార్టీల ఇష్టానుసారం ఆ జాబితా మారే ప్రమాదం ఉంటుంది. పార్లమెంటులోనూ పాలక పార్టీకి మెజారిటీ ఉంటుంది గానీ పార్లమెంటులో ప్రతిపక్షమూ ఉంటుంది, వారి అభిప్రాయాలను వినవలసిన అగత్యమూ ఉంటుంది. అక్కడ జరిగే చర్చ బయటి ప్రపంచానికి తెలిసే అవకాశమూ ఉంటుంది.

ఇదీ షెడ్యూల్డు కులాలు, తెగల జాబితా రూపకల్పన, సవరణల సంగతి. రాష్ట్రపతి ప్రకటించి, పార్లమెంటుకు మాత్రమే సవరించే అధికారం ఉన్న ఈ ఎస్‌సి, ఎస్‌టి జాబితాను ఇతర సంస్థలన్నీ ఉన్నదున్నట్టు స్వీకరించవలసిందే. ఒక రాష్ట్ర ప్రభుత్వం, ఒక విశ్వవిద్యాలయం, ఒక ప్రభుత్వరంగ సంస్థ, ఒక మునిసిపాలిటీ ఎస్‌సిలకు గానీ, ఎస్‌టిలకు గానీ రిజర్వేషన్లు ఇయ్యదలచుకున్నా, స్కాలర్‌షిప్పులు ఇయ్యదలచుకున్నా, ఇతర ప్రోత్సాహకాలు ఇయ్యదలచుకున్నా ఈ జాబితాల ప్రకారమే ఇయ్యాలి. ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా తన రాష్ట్రానికి సంబంధించిన కులాన్నో లేక తెగనో చేర్చాలనో, తీసివేయాలనో అనిపిస్తే, కేంద్ర ప్రభుత్వానికి తెలిపి, వారిని ఒప్పించి పార్లమెంటులో చట్టం చేయించి ఆ పని చేయాలి.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఏమంటుందంటే, షెడ్యూల్డు కులాలు లేక తెగల జాబితాలో ఒక కులాన్నో, తెగనో చేర్చే అధికారం లేక తీసివేసే అధికారం మాత్రమే కాదు, జాబితాను ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తూ ఆ జాబితాలో ఉన్న కులాలకు ఇచ్చే ప్రత్యేకు హక్కులను హేతుబద్ధంగా వర్గీకరించే అధికారం కూడా పార్లమెంటుకు మాత్రమే ఉందని.

ఇది సబబేనా?

ఒకసారి ఎస్‌సి లేక ఎస్‌టి జాబితాను ప్రకటించిన తరువాత ఆ జాబితాలోని కులాలకు లేక తెగలకు ప్రత్యేక అవకాశాలు, హక్కులు, సదుపాయాలు కల్పించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా



లకే కాదు, ప్రతీ ప్రభుత్వ సంస్థకు, ప్రతీ స్థానిక సంస్థకు, ప్రతీ పబ్లిక్ సెక్టార్ సంస్థకూ ఉంది. దానికి వారు పార్లమెంటు అనుమతి తీసుకోనక్కరలేదు. ఉదాహరణకు మీ ఊరి మునిసిపాలిటీ వారు మంచినీటి వసతికి కేటాయించిన డబ్బులలో 30 శాతం దళిత కుటుంబాలకు నీటి కనెక్షన్లవ్వడానికి ఖర్చుపెట్టాలని నిర్ణయించుకోవచ్చు. రాష్ట్రానికి సంబంధించిన 59 ఎస్‌సి కులాలనూ ఎస్‌సి కులాలుగా స్వీకరించాలంతే. ఆ విషయంలో ఎస్‌సి జాబితాను అతిక్రమించకుండా ఉన్నంత కాలం, ఆ నిర్ణయం తీసుకోవడానికి మునిసిపాలిటీకి పార్లమెంటు అనుమతి గానీ, ఎవరి అనుమతి గానీ అక్కరలేదు.

మీది విశాఖపట్నం అనుకోండి. మీ ఊరిలోని దళితులందరికన్నా రెల్లీలు ఎక్కువ వెనుకబడి ఉన్నారని మీ మునిసిపాలిటీ భావించిందనుకోండి. దళిత కుటుంబాల కోసం ఖర్చుపెట్టదలచుకున్న 30 శాతం మంచినీటి వ్యవస్థ వనరులలో 20 శాతం మీ మునిసిపాలిటీ వారు రెల్లీల కోసం ఖర్చుపెట్టి మిగిలిన పదిశాతం ఇతర దళిత కుటుంబాల కోసం ఖర్చుపెట్టాలని నిర్ణయించుకున్నారనుకోండి. ఆ స్వేచ్ఛ మీ మునిసిపాలిటీకి ఉంటుందా ఉండదా?

మునిసిపాలిటీ నిధుల గురించి రేపెప్పుడయినా కేసు కోర్టుకెక్కితే సుప్రీంకోర్టు ఏమంటుందో గానీ విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో ఆ స్వేచ్ఛ మునిసిపాలిటీకీ, జిల్లాపరిషత్‌కే కాదు, పార్లమెంటొక చట్టం చేసేదాకా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలకు సహితం లేదని అనింది. నిజానికి పైన ఇచ్చిన ఉదాహరణలో రెల్లీలు మరీ వెనుకబడి ఉన్నారని చెప్పి, దళిత కుటుంబాల నీటి కనెక్షన్ల కోసం కేటాయించిన నిధులలో కొంచెం ఎక్కువ వారికి కేటాయించినట్టు చెప్పాను. మన రాష్ట్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్ల వర్గీకరణలో అది సహితం లేదు. రెల్లీలకూ, మాదిగలకూ వారి దామాషా కంటె ఎక్కువ ఇచ్చే ఆలోచన చేయలేదు. ఎవరి వాటా వారికిచ్చే ఆలోచన మాత్రమే చేసింది.

ఇది చెల్లదనడంలో సుప్రీంకోర్టు అనుసరించిన తర్కం ఏమిటి? ఆర్టికల్ 341(2) ఏమంటుందంటే, రాష్ట్రపతి ప్రకటించిన షెడ్యూల్డు కులాల జాబితాలో పార్లమెంటు ఒక చట్టం చేయడం ద్వారా ఒక కులాన్ని లేక కులంలో భాగాన్ని చేర్చవచ్చు, తీసేయవచ్చు. ఈ విధంగా తప్ప 'వేరే ఏ విధంగానూ రాష్ట్రపతి జారీచేసిన జాబితాను మార్చడానికి వీలులేదు, ఇక్కడ జాబితాను మార్చడం అంటే అందులో ఒక కులాన్ని చేర్చడం లేక తీసివేయడం అని మాత్రమే అర్థం. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ ఫలితంగా ఆ జాబితాలో కొత్తగా ఒక్క కులమూ ప్రవేశించలేదు, ఒక్క కులమూ బయటకు పోలేదు. అన్ని ఎస్‌సి కులాలకూ కలిపి ఇచ్చిన రిజర్వేషన్‌ను నాలుగుగా విడగొట్టి జాబితాలో నాలుగు ఉపవర్గాలకు ఎవరి కోటా వారికి ఇవ్వడం జరిగిందంతే.

ఇది ఆర్టికల్ 341(2) ప్రకారం పార్లమెంటుకు మాత్రమే ఉండే అధికారం అని సుప్రీంకోర్టు ఏ విధంగా అనింది? 341(2)లో లేని మాటలు చేర్చి, రాష్ట్రపతి ప్రకటించిన జాబితాలో ఏ రకంగా జోక్యం చేసుకున్నా, దానిని కదిలించినా, దానిలో ఉపవర్గాలను గుర్తించినా అది కూడా ఆర్టికల్ 341(2)లోని నిషేధానికి గురి అవుతుందని అనింది. కులాలను ఆ జాబితాలోకి 'చేర్చడం, తొలగించడం' అన్న స్పష్టమైన మాటలకు ఇంతటి విపరీత అర్థం ఎక్కడినుండి వచ్చింది? సుప్రీంకోర్టయినా ఏ కోర్టయినా చట్టాన్నీ, రాజ్యాంగాన్నీ వ్యాఖ్యానిస్తాయి తప్ప తిరగరాయవని న్యాయసిద్ధాంతం అంటుంది. తిరగరాసే అధికారం ప్రజలు ఎన్నుకునే శాసనసభలకు మాత్రమే ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఉండే ఆరోగ్యకరమైన లక్షణాలలో ఒకటి. ఆ మాటే సుప్రీంకోర్టు వేరే

సందర్భాలలో అంటూ ఉంటుంది. కానీ తానే ఇప్పుడు ఆర్టికల్ 341(2)ను పూర్తిగా తిరగరాసింది.

ఒక చట్టం అస్పష్టంగానో, అసంపూర్ణంగానో ఉన్నప్పుడు దానిని వ్యాఖ్యానించే క్రమంలో కోర్టులు ఆ ఖాళీని పూరించవచ్చు. ఆ విధంగా కోర్టులు కూడా కొంతమేరకు శాసనాధికారం చలాయిస్తుంటాయి. కానీ ఆర్టికల్ 341(2)లో ఎటువంటి అస్పష్టతా లేదు. శాసనకర్తలు వాడిన భాషలో అస్పష్టత ఏదీ లేనప్పుడు దానిలో మార్పులూ చేర్పులూ చేసే అధికారం న్యాయస్థానాలకు లేదనేది అందరూ అంగీకరించే న్యాయసిద్ధాంత సూత్రం. అటువంటప్పుడు ఆర్టికల్ 341(2)కు విపరీత అర్థం కల్పించే అధికారం సుప్రీంకోర్టుకు ఎవరిచ్చారు?

ఇక్కడితో ఆగిపోయి ఉన్నా ఒక రకం. లేని పెత్తనం చలాయించిందని సుప్రీంకోర్టును విమర్శించినా, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణ సాధించుకునే అవకాశం ఇంకా మిగిలి ఉందని సర్దుకుపోదుము.

కానీ పార్లమెంటుకు మాత్రమే ఆ అధికారం ఉందని చెప్పిన తరువాత, పార్లమెంటుకు కూడా ఆ అధికారం లేదని ప్రకటించింది రాజ్యాంగ ధర్మాసనం. ఎందుకంట? షెడ్యూల్డు కులాలు అనేది ఒక అవిభాజ్యమైన (హోమోజెనస్) వర్గమంట. అని ఎవరు చెప్పారు? రాజ్యాంగమే చెప్పిందంట.

రాజ్యాంగం అంతమాటేం అనలేదు. రాష్ట్రపతి ఒక్కొక్క రాష్ట్రానికీ సంబంధించి ఆ రాష్ట్ర గవర్నర్‌ను సంప్రదించి ఏ కులాలు లేక తెగలు లేక జాతులు లేక కులాలలో తెగలలో జాతులలో భాగాలు షెడ్యూల్డు కులాలుగా పరిగణించబడతాయో నిర్ణయించి ప్రకటిస్తాడు. అవే షెడ్యూల్డు కులాలు అని రాజ్యాంగం ఆర్టికల్ 341(1)లో అంటుంది.

ఈ నిర్వచనం చదవగానే మొదట స్ఫురించేది దానిలోని బహుళత్వం. కొన్ని కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాలు కలిసి 'షెడ్యూల్డు కులాలు' అవుతాయి. అదొక అవిభాజ్యమైన వర్గం అన్న భావం ఈ నిర్వచనంలో ఎక్కడుంది? అయిదుగురు జడ్జీలకు కనిపించింది మరి.

ఏ విధంగా?

రాజ్యాంగం రాకముందు అవి వేరు వేరు కులాలు అయి ఉండవచ్చు. ఇప్పటికీ సాంఘికంగా వేరు వేరు కులాలే కావచ్చు. అయితే ఆ కులాలన్నీ చాలా అణగారి ఉన్నాయని గుర్తించి ప్రత్యేకమైన ప్రభుత్వ అండ వారికి అవసరమని గుర్తించి వాటినన్నిటికీ కలిపి 'షెడ్యూల్డు కులాలు' అని ఎప్పుడయితే రాజ్యాంగం పేరు పెట్టిందో అప్పుడిక రాజ్యాంగానికి సంబంధించినంత వరకు అవన్నీ కలిసి ఒకే వర్గం అయిపోయినట్టే, అవిభాజ్యం అయిపోయినట్టేనని వాదించడం ద్వారా అది సాధ్యం అయింది. ఎప్పుడయితే ఆ కులాలన్నీ (రాజ్యాంగానికి సంబంధించినంతవరకు) తమ ప్రత్యేకతలన్నీ కోల్పోయి ఒకే అవిభాజ్యమైన వర్గం అయిపోయాయో ఇక రాజ్యాంగం నుండి సంక్రమించే అధికారం చలాయించే వారెవ్వరూ ఆ కులాలలో ఒకరెక్కువ ఒకరు తక్కువ, ఒకరు మరీ వెనుకబడి ఉన్నారు, ఒకరి స్థితి కొంచెం ఫరవాలేదు, అని వర్గీకరించడానికి వీలులేదని దీనినుండి నిర్ధారించారు.

1976లో ఇచ్చిన ఒక తీర్పులో జస్టిస్ కృష్ణయ్యర్ చేసిన వ్యాఖ్య భావాన్నే మార్చేసి, కృష్ణయ్యర్ కూడా ఇదే అన్నాడు అన్నారు ఈ అయిదుగురు న్యాయకోవిదులు. 'షెడ్యూల్డు కులాలు అనేది ఒక కులం కాదు. అది కొన్ని కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాల సముదాయం. వీరు చాలా అణగారి ఉన్నారనీ వీరికి భారీగా ప్రభుత్వ సహాయం అవసరం అనీ గుర్తించి ఈ కులాలు, తెగలు,



జాతులు, వాటి శకలాలన్నిటినీ ఒక సముదాయంగా గుర్తించగా ఏర్పడిందే షెడ్యూల్డు కులాలు అనే జాబితా' అని జస్టిస్ కృష్ణయ్యర్ అన్నారు. 'కాబట్టి షెడ్యూల్డు కులాలు అనేది ఒక అవిభాజ్యమైన వర్గం' అని అయిదుగురు జడ్జిలు వ్యాఖ్యానించారు. అది ఎంత విజ్ఞత గల వ్యాఖ్యో మీరే నిర్ణయించండి.

నిజానికి, ఒక వెనుకబడిన సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించిన తరువాత ఆ రిజర్వేషన్లు ఆ వర్గంలోని వారందరూ సంపూర్ణంగా అందుకోవడం కోసం ఆ వర్గాన్ని వెనుకబడినవారు, మరీ వెనుకబడిన వారు అని వర్గీకరించవచ్చునా అన్న ప్రశ్న ఇవాళ కొత్తగా కోర్టుముందుకొస్తున్నది కాదు. మన రాష్ట్రంలో బిసిలను ఎబిసిడిలుగా విభజించడం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు 1972 లోనే ప్రకటించింది. బిసిలకు వర్తించేది ఎస్‌సిలకు వర్తిస్తుందా అన్న సందేహానికి ఆస్కారం లేకుండ మండల్ కమిషన్ కేసు (ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా) విచారించిన తొమ్మిది మంది జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం అటువంటి వర్గీకరణ ఎస్‌సీలలో చేసినా తప్పు లేదనింది. మండల్ కమిషన్ కేసుకున్న ప్రత్యేకత ఏమిటంటే, ఆ కమిషన్ రిపోర్టు ఆధారంగా బిసిలకు ఇచ్చిన రిజర్వేషన్ చెల్లుతుందా అన్నది ఆ కేసు వేసిన వారు లేవదీసిన ప్రశ్న కాగా, దానిని విచారించిన ధర్మాసనం 'రిజర్వేషన్ల విషయంలో పదే పదే తలెత్తుతున్న అన్ని ప్రశ్నలకూ జవాబు చెప్పదలచుకున్నాం' అని ప్రకటించి, 14 ప్రశ్నలు వేసుకొని, అన్నిటి గురించీ వాదనలు విని తీర్పు ప్రకటించింది. ఆ 14లో అయిదవ ప్రశ్న వర్గీకరణకు సంబంధించినది. సహేతుకమయితే వర్గీకరణ చేయవచ్చునని ఆ ధర్మాసనం చెప్పింది. ఆ కేసు బిసి రిజర్వేషన్ల కేసు కాబట్టి ఆ అభిప్రాయం బిసి రిజర్వేషన్లకే వర్తిస్తుందని వాదించడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ఆ ధర్మాసనం ఉద్దేశ్యపూర్వకంగానే రిజర్వేషన్లకు సంబంధించిన 'అన్ని ప్రశ్నలకూ' జవాబు చెప్పడానికి పూనుకుంది. మామూలుగా, పెద్ద ధర్మాసనం తీర్పుకు చిన్న ధర్మాసనం కట్టుబడి ఉంటుందనేది న్యాయవ్యవస్థ క్రమశిక్షణలో అనుల్లంఘనీయమైన నియమం. ఈ కేసులో సుప్రీంకోర్టు దానిని కూడా అతిక్రమించింది.

షెడ్యూల్డు కులాలన్నీ నిజంగానే ఒకే స్థాయిలో, ఒకే అభివృద్ధి దశలో ఉన్నాయని గానీ, ఆ కులాల మధ్య హెచ్చుతగ్గులు లేవని గానీ సుప్రీంకోర్టు భావించలేదని మొదట్లో చెప్పిన విషయం మరొకసారి జ్ఞాపకం చేయాలి. ఆ విధంగా భావించి ఉంటే, దానికి కనీసం వారికి సంతృప్తినిచ్చే ఆధారాలు ఉండి ఉంటే, తక్కిన అభిప్రాయాలను క్షమించి ఉండవచ్చునేమో. కానీ అసమానతలనూ, అంతరాలనూ ఒప్పుకుంటూనే వాటి గురించి ఏమీ చేయడానికి వీలులేదనే వైఖరిని క్షమించడం కష్టం. పైగా రాజ్యాంగం అవకాశం ఇవ్వదనడం విడ్డూరం కూడా. భారత రాజ్యాంగంలో లోపాలు చాలానే ఉన్నాయి గానీ ఒక అన్యాయాన్ని గుర్తించిన తరువాత, అది అన్యాయమేనని అందరూ అంగీకరించిన తరువాత, దాని పరిష్కారానికి ఏ అవకాశమూ రాజ్యాంగంలో లేదనడం, దానికి అన్యాయమని పేరు పెట్టడాన్నే రాజ్యాంగం ఒప్పుకోదనడం, భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్న వారెవరూ అంగీకరించగల విషయం కాదు. రాజ్యాంగం కల్పించే అవకాశం రాజకీయంగా ఎంతయినా కష్టతరం కావచ్చు. అది వేరే సంగతి. కానీ ఫలానా అసమానతను చూడడానికే వీలులేదని భారత రాజ్యాంగం అంటుందంటే ఒప్పుకోవడం కష్టం (జాతుల స్వయం నిర్ణయాధికార కాంక్ష ఒక్కటే దీనికి మినహాయింపు).

వివిధ షెడ్యూల్డు కులాలు రిజర్వేషన్లను ఒకే దామాషాలో అందుకోలేకపోతున్నాయనేది

అందరూ ఒప్పుకుంటున్న వాస్తవం. సంస్కృతిలో, ఆచారాలలో కూడా షెడ్యూల్డు కులాలలో నిచ్చెన మెట్ల అంతరాలు ఉన్న మాట వాస్తవం. రిజర్వేషన్లలో ఎవరి వాటా వారికిచ్చేయడం ఈ స్థితిని కొంతవరకు మెరుగుపరచగలదనేది నిర్వివాదం. అయినప్పటికీ రాజ్యాంగం షెడ్యూల్డు కులాలను అవిభాజ్యమైన వర్గంగా గుర్తించింది కాబట్టి ఆచరణాత్మకమైన ఈ (పాక్షిక) పరిష్కారం రాజ్యాంగం పరిధిలో సాధ్యం కాదనేది భారత రాజ్యాంగానికున్న స్వాభావికమైన తర్కానికి అతికే అభిప్రాయ మయితే కాదు. అయిదుగురు సుప్రీంకోర్టు జడ్జీలు ఏకగ్రీవంగా ప్రకటించినంత మాత్రాన అయిపోదు.

అంతా అయిన తరువాత, దళితుల లోపలి అసమానతల గురించి ఏమీ అనకపోతే బాగుండదనుకున్నారో ఏమో, అయిదుగురు జడ్జిలలో ఒకరయిన జస్టిస్ సత్యబ్రత సిన్హాగారు రెల్లీల గురించి ప్రస్తావించి 'ఆ కులానికి చెందిన వారెవ్వరూ ఇంజనీరింగ్ లేక మెడికల్ కాలేజీలలో సీట్లు పొందలేదు. వాళ్లకు ఇంజనీరింగ్ కాలేజీలలో, మెడికల్ కాలేజీలలో రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ఏం ప్రయోజనం?' అన్నారు. 'వాళ్లకు స్కాలర్‌షిప్పులు, హాస్టళ్లు, స్పెషల్ కోచింగ్' ఇవ్వాలన్నారు. ఇవ్వాల్సిందే. స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లయితే ఇస్తున్నారు కూడా. కానీ వాటిని ఉపయోగించుకొని కొంచెం మంచి మార్కులు తెచ్చుకున్నా వృత్తివిద్యా కోర్సులలో సీట్లు రావు. ఎస్‌సి కోటాలో కూడా రావు. అప్పుడేం చేయాలి? మొట్టమొదట శూద్ర కులాలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నప్పుడు బ్రాహ్మ ణులు ఇవే మాటలన్నారు. స్కాలర్‌షిప్పులివ్వండి, స్పెషల్ కోచింగ్ ఇవ్వండి, రిజర్వేషన్లు వద్దు అన్నారు. బిసిలకు రిజర్వేషన్లివ్వాలని మండల్ కమిషన్ సూచించినప్పుడు బ్రాహ్మణ-శూద్ర అగ్రకులాల వారు ఇదే అన్నారు. స్కాలర్‌షిప్పులివ్వండి, హాస్టళ్లు నెలకొల్పండి, రిజర్వేషన్లు వద్దు అన్నారు. ప్రతీసారీ కోర్టులే అవన్నీ వేరు, రిజర్వేషన్లు వేరు, దేని అవసరం దానిదే, దేని పాత్ర దానిదే అంటూ తీర్పులిచ్చాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు 'రెల్లీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఏం ప్రయోజనం? కోచింగ్ ఇవ్వండి, స్కాలర్‌షిప్పులివ్వండి' అంటున్నది. భూమి గుండ్రంగా తిరిగి మొదటికొచ్చి నట్టుంది.

ఈ తిరోగమనం జస్టిస్ సిన్హా గారి నోట వెలువడడం ఉచితమే. ఆయన మన హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి సుప్రీంకోర్టుకు పోయారు. రాజ్యాంగంలో ఉండే సామాజిక న్యాయ స్ఫూర్తి పట్ల ఆయనకు ఏ మాత్రం ఏకీభావం లేదనేది ఆయన తీర్పులెరిగిన వారికి కొత్త కాదు. ఈ మధ్యనే వేరొక తీర్పులో ఆయన ప్రపంచీకరణను ప్రస్తావిస్తూ, ప్రపంచంలో వీస్తున్న గాలులను కోర్టులు చూడడానికి నిరాకరించకూడదనీ, పాతకాలపు ఆలోచనలను పట్టుకొని వేళ్లాడకూడదనీ అన్నారు. సామాజిక న్యాయం కూడా ఒక పాతకాలపు ఆలోచనే మరి.

❖



**రివ్యూ:**

# దేశ స్వాతంత్ర్య ఉద్యమం - ముస్లింలు

-కె. బాలగోపాల్ *

## సయ్యద్ నశీర్ అహమ్మద్ రచనలపైన సమీక్షా వ్యాసం

ఏ ప్రజలయినా తాము సహితం దేశ భక్తులేనని రుజువు చేసుకునే స్థితిలో ఉండడం - లేక రుజువు చేసుకోవలసిన స్థితిలోకి నెట్టబడడం - అన్యాయమంటే అందరూ ఒప్పుకుంటారు. 'ఇన్ జనరల్' ఒప్పుకోవడం పెద్దగా కష్టం కూడా కాదు. కానీ ఎందుకు అన్యాయం అన్న ప్రశ్న వేసుకొని కొంచెం లోతుగా విశ్లేషిస్తే అందరికీ కాకున్నా కొందరికి ఇబ్బంది అనిపించే జవాబులు దొరకగలవు.

దేశభక్తి అనేది వివాదానికి అతీతమైన సద్గుణం అనీ, మంచివాళ్లందరూ ఆ అర్థంలో దేశభక్తులు అయ్యే ఉంటారనీ అనుకుంటే 'ఎందుకు అన్యాయం' అన్న ప్రశ్నకు సులభమయిన జవాబు దొరుకు తుంది. మేము సహితం మంచివాళ్లమేనని రుజువు చేసుకోవలసి రావడం అన్యాయమే మరి.

కానీ దేశభక్తి అనేదే సమస్యాత్మకమైన భావన. కొన్ని కోణాలలో, కొన్ని అర్థాలలో అది ప్రజాస్వామిక భావనే కాగలదు. కొన్నిటిలో కాదు. తాము సహితం దేశభక్తులేనని రుజువు చేసుకోవలసిన స్థితికి నెట్టబడిన వారికి జరిగే ముఖ్యమైన అన్యాయం, ఈ సంగతి చెప్పలేకపోవడం, ఈ మాటలు అనలేకపోవడం. గుడిపాటి వెంకటచలం అనే హిందూ అగ్రకులానికి చెందిన రచయిత (మతాన్ని గురించి, కులాన్ని గురించి ఆయన అభిప్రాయం ఏమయినప్పటికీ) దేశభక్తి కంటే హీనమైన పాపం వేరే ఏదీ లేదని అనగలిగాడు. దానిని జోక్‌గా తీసుకున్నవారు జోక్‌గా తీసు కున్నారు, వ్యంగ్యంగా భావించిన వారు వ్యంగ్యంగా భావించారు, సమకాలీన రాజకీయాల మీద సీరియస్ వ్యాఖ్యగా అర్థం చేసుకున్నవారు ఆ విధంగా అర్థం చేసుకున్నారు. చలం గారికి ఆ వ్యాఖ్య వల్ల ఏ కష్టమూ రాలేదు. ఒక ఇండియన్ ముస్లిం, ఒక ఇండియన్ క్రిష్టియన్ అంత సులభంగా ఆ మాట అనగలరా?

అంబేద్కర్‌కే ఎంత కష్టమయింది! కాంగ్రెస్‌వారి జాతీయోద్యమం ప్రచారం చేసిన అర్థంలో 'దేశభక్తులు' కావడమే రాజకీయ కార్యకర్తలందరి కర్తవ్యం కాదనీ, దానికంటే సాంఘిక సంస్కరణ కోసం, సాంఘిక విప్లవం కోసం పనిచేయడం గొప్ప విషయమనీ అన్నందుకు ఆయన బ్రిటిష్ ఏజెంట్ అన్న నింద ఎన్నేళ్లు మోయవలసి వచ్చింది! ఆ నిందకు కాలం చెల్లిపోయిందని అనుకుం టున్న దశలో అరుణ్‌శౌరి దానికి మళ్లీ ప్రాణం పోయగలిగాడంటే ఈ 'దేశభక్తి' అనేది నిజంగానే

* మానవహక్కుల కార్యకర్త, హైకోర్టు న్యాయవాది

అతి హేయమయిన పాపం అనిపిస్తుంది. అంబేద్కర్ గొప్పదనమేమిటంటే, దేశభక్తి అనే మాటకు భయపడి సాంఘిక విప్లవం కోసం పనిచేయడమే నిజమయిన దేశభక్తి అని వాదించే ప్రయత్నం (నాకు తెలిసి) చేయలేదు. చేస్తే తప్పు కాకపోవచ్చును గానీ చేయలేదు. తాను అత్యవసరమని భావించిన రాజకీయ కార్యాచరణలో తన పాటికి తాను నిమగ్నం అయ్యాడు.

ఈ ఉపోద్ఘాతానికి అర్థం, భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను వెలికి తీయడానికి సయ్యద్ నశీర్ అహమ్మద్ చేసిన (ఇంకా చేస్తూనే ఉన్న) ప్రయత్నం వృధా అనిగానీ గాడితప్పిన ప్రయాస అనిగానీ చెప్పడం కాదు. నశీర్ అహమ్మద్‌ది ప్రశంసనీయమైన కృషి అనడంలో సందేహమేమీ లేదు. ఒక నిందకు జవాబు వివిధ స్థాయిలలో చెప్పవచ్చు. నిందవేసే వారి విలువల పరిధి లోనూ జవాబు చెప్పవచ్చు, ఆ విలువలను విమర్శించడం ద్వారానూ చెప్పవచ్చు. తరచుగా రెండూ అవసరమవుతాయి. ఇప్పటివరకు మొదటి పని చేస్తూ వున్న నశీర్ అహమ్మద్ రెండవది కూడా మొదలుపెట్టగలడన్న ఆశతో ఈ నాలుగు మాటలు అనడం జరిగింది.

బ్రిటిష్ పాలన నుండి భారత్‌కు విముక్తి సాధించిపెట్టేదే దేశభక్తియుతమయిన రాజకీయాచరణ అని ఒప్పుకున్నా, ఆ రకమైన దేశభక్తి ప్రదర్శించిన వారే గొప్పవారనుకున్నా, అటువంటి గొప్ప వారిలో ముస్లింల పాలు ఎంతమాత్రం తక్కువ కాదని నశీర్ అహమ్మద్ చాలా వివరంగా నిరూపించారు. అరుణ్‌శౌరీ వంటివారు రేపు ఏం మాట్లాడినా దానికి జవాబు చెప్పడానికి కావలసిన సమాచారం తెలుగు సమాజానికి అందిచ్చారు.

నిజానికి మనిషి ఆలోచనలకు ముఖ్యమైన మూలం చుట్టూ ఉన్న పరిస్థితులనీ, వాటిలో మతం ఒకానొకటి మాత్రమేననీ, ఎప్పుడో తప్ప అదే ప్రధానం కాదనీ గుర్తించినట్టయితే బ్రిటిష్ వలస పాలనకు తొలినాడు వ్యతిరేకత హిందువుల కంటె ముస్లింలలోనే ఎక్కువ ఉండే అవకాశం ఉందని గ్రహించడానికి నశీర్ అహమ్మద్ రచనలు చదవనక్కరలేదు- కొంచెం చరిత్ర తెలిస్తేచాలు. బ్రిటిష్ వాళ్లు భారతదేశంలో రాజ్యాధికారం నెలకొల్పే ప్రయత్నం మొదలుపెట్టేసరికి ఇక్కడ పాలకులు ఎక్కువగా మతం రీత్యా ముస్లింలు. యుద్ధాలలో ఓడిపోయి బ్రిటిష్ వారికి అధికారం అప్పగించిందీ ఎక్కువగా ముస్లిం రాజులే. బ్రిటిష్ విజయాన్ని 'ముస్లింల' ఓటమిగా భావించడం 18, 19 శతాబ్దాలలో సాధారణ విషయంగా ఉండేది. బ్రిటిష్ పాలనను తొలినాడు హిందువుల కంటె ముస్లింలే ఎక్కువ నిరసించారు. హిందూ సమాజానికి చెందిన ఆధిపత్య వర్గాలు - బ్రాహ్మణ, కాయస్త, బనియా, రాజపుత్ర కులాలు - త్వరలోనే బ్రిటిష్ పాలనకు 'అడ్జస్ట్' అయ్యారు. పర్షియన్ మరచిపోయి ఇంగ్లీష్ నేర్చుకున్నారు. కొత్త పాలనలో తమ స్థితిగతులకు ఉచితమైన హోదా వెతుక్కున్నారు. ముస్లిం పాలకవర్గాలు, మధ్యతరగతి అంత సులభంగా అడ్జస్ట్ కాలేదు. బ్రిటిష్ వ్యతిరేకతను చాలా కాలం పోగొట్టుకోలేదు. ఈ కారణంగా వారు పాశ్చాత్యీకరణలో వెనకబడి 20వ శతాబ్దం వచ్చేసరికి అభివృద్ధిలోనూ హిందూ అగ్రకులాల కంటె వెనకబడి పోయారు. అది వేరే చరిత్ర.

అందువల్ల తొలినాటి నుండీ బ్రిటిష్ పాలనను వ్యతిరేకించిన వారిలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదు. కనీస చరిత్ర జ్ఞానం లేకుండ, తమ సంకుచితమైన నినాదాలే సత్యం అనుకునే వారిది వేరే సంగతి.

ఇక మామూలు జనం విషయానికొస్తే, బ్రిటిష్ వలస వాదం సంప్రదాయ వృత్తులపైన, వ్యవసాయ రంగంపైన వేసిన దుష్ప్రభావం మతంతో నిమిత్తం లేకుండా అందరి మీదా ఒకే విధంగా పడింది. కొందరు మౌనంగా సహించారు, కొందరు సాధారణ స్థాయిలో నిరసించారు, కొందరు తిరగబడ్డారు. అన్ని శ్రేణులలోనూ అన్ని మతాలవారూ ఉన్నారు. అయితే బ్రిటిష్ పాలన తొలుత స్థిరపడింది బెంగాల్‌లో కావడం వల్ల, జమీందారీ వ్యవస్థను తొలుత ప్రవేశపెట్టింది అక్కడే కావడం వల్ల, దానికి బలయిన బెంగాల్ రైతాంగం (ముఖ్యంగా తూర్పు బెంగాల్ రైతాంగం) ఎక్కువగా ముస్లింలు కావడం వల్ల, తొలినాటి గ్రామీణ అలజడులలోనూ ముస్లింల భాగస్వామ్యమే అధికం.

## టిప్పు విశిష్టత

పాలకవర్గ తిరుగుబాటుదార్లను మొదట తీసుకుంటే, బ్రిటిష్ వాళ్లు టిప్పు సుల్తాన్‌కు భయపడినంతగా వేరే ఎవరికీ భయపడలేదు. భయం అంటే కేవలం సైనిక భయం కాదు. టిప్పుది హేతుబద్ధమైన ఆధునిక ఆలోచనారీతి. తన చుట్టూ ఉన్న ఇతర - హిందూ, ముస్లిం - వైరి రాజుల వల్ల తన రాజ్య సౌభాగ్యానికేం నష్టంలేదు గానీ, బ్రిటిష్ వారి విషయం వేరే అని స్పష్టంగా గ్రహించిన అతికొద్ది మంది ఇండియన్ పాలకులలో టిప్పు ఒకడు. తక్కినవాళ్లు ఒకసారి కాకపోతే ఒకసారి తమ పొరుగు రాజులను ఓడించడానికి బ్రిటిష్ వారితో చేతులు కలిపారు గానీ టిప్పు ఒక్కడే ఆ పని ఎన్నడూ చేయలేదు. అందుకు భిన్నంగా, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దక్కన్‌లోని రాజ్యాలన్నిటినీ ఏకం చేయాలని (ఫ్రెంచి వారి సాయం కూడా తీసుకోవాలని) ప్రయత్నించాడు. తన ప్రయత్నాన్ని అర్థం చేసుకోలేకపోయిన తన ఇరుగు పొరుగు రాజుల తెలివితక్కువతనానికి విసుక్కున్నాడు. కానీ చివరి వరకు బ్రిటిష్ వారిని కేవలం మరొక వైరి రాజుగా చూడడానికి వీలులేదన్న తన అవగాహనను వదులుకోలేదు. చివరి మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ చనిపోయాడని తెలిసి 'ఇక ఇండియా మనదే'నని బ్రిటిష్ సైనిక అధికారి ఒకరు సంతోషం పట్టలేక ప్రకటించాడనీ, టిప్పు సుల్తాన్‌ను ప్రశంసిస్తూ 'ప్రపంచం నిన్నూ నన్నూ మరచిపోయిన తరువాత చాలాకాలం వరకు కూడా టిప్పు సుల్తాన్‌ను జ్ఞాపకం పెట్టుకుంటుంది అని గవర్నర్ జనరల్ వెల్లెస్లీ అన్నాడనీ, చరిత్రకారులు చెప్తారు. నశీర్ అహమ్మద్ ప్రచురించిన పుస్తకాల పరంపరలో టిప్పు సుల్తాన్ మీద ప్రత్యేకంగా ఒక చిన్న రచన ('మైసూర్ పులి టిప్పుసుల్తాన్') ఉండడం ఉచితమే. దానిని విస్తరించి ఇంకా వివరంగా రాయగలిగితే బాగుంటుంది.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనీ, సిపాయి తిరుగుబాటు అనీ వివిధ పేర్లతో పిలవబడే 1857 తిరుగుబాటు ఒక మతానికీ, ఒక మతస్తులకూ చెందినది కాదుగానీ దానిని ఒకరి తిరుగుబాటుగా చూడదలచుకుంటే అది ప్రధానంగా ముస్లింల తిరుగుబాటు. బ్రిటిష్ వాళ్లు దానిని ఆ రకంగానే అర్థం చేసుకున్నారు. ఏక సమయంలో 1857ను మహత్తర స్వాతంత్ర్య పోరాటంగా ప్రస్తుతిస్తూ, ముస్లింలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని నిందించే వారికిది మింగుడుపడక పోవచ్చుగాక. ఆ పోరాటంలో పాల్గొన్న సంస్థానాధీశులంతా తమ సింహాసనాలు, రాచరికాలు కాపాడుకోవడానికే పాల్గొన్నారని వ్యాఖ్యానించేటట్టయితే అది ముస్లింలకెంత వర్తిస్తుందో హిందువులకూ అంతే వర్తిస్తుంది. రాజ్యాధికారం కోల్పోయామన్న దుగ్ధతోనే వారు కదిలినప్పటికీ అది స్వాతంత్ర్య పోరాటమేననుకుంటే అది ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ఎంతమేరకు వర్తిస్తుందో, అవధ్ రాణి బేగం హజ్రత్ మహల్‌కూ అంతే వర్తిస్తుంది. అయినప్పటికీ లక్ష్మీబాయి దేశభక్తికి చిహ్నంగా దేశమంతా పరిచయం కాగా (తెలుగునాట - కనీసం కోస్తాంధ్రలో - ఒక తరంలో ప్రతీ రెండవ ఇంటా ఒక ఝాన్సీ ఉండేది), బేగం హజ్రత్ మహల్ గురించి నశీర్ అహమ్మద్ వంటివారు చెప్తే

తప్ప తెలియని దుస్థితి దేశానికి పట్టింది.

1857 మేనెల 10వ తేదీన మీరట్‌లో తిరగబడ్డ సిపాయిలు ఢిల్లీకి వచ్చి తమ తిరుగుబాటుకు నాయకత్వం వహించమని ఆఖరి ముఘల్ 'చక్రవర్తి' బహదూర్ షా జఫర్‌ను కోరగా, తొలుత అంతగా ఆసక్తి చూపని జఫర్ తరువాత అంగీకరించాడు. నాలుగు నెలలపాటు సాగిన పోరాటానికి అతనే కేంద్రం అయ్యాడు. తానొక్కడే పోరాడలేనని గ్రహించి దేశంలోని సంస్థానాధీశులందరికీ తనతో కలిసిరమ్మని ఆహ్వానం పంపాడు. ఇది ముఘల్ పాలన పునరుజ్జీవనానికి దారితీస్తుందన్న సందేహంతో కొందరు రాజులు తటపటాయించడాన్ని గమనించి, బ్రిటిష్ వారిని నిలువరించి నట్టయితే దేశంలో సమాఖ్య తరహా పాలన నెలకొల్పుదామని కూడా జఫర్ సూచించాడు. దేశంలోని సంస్థానాధీశులంతా టిప్పు సుల్తాన్ లాంటివాళ్ళయివుంటే- తమలో తమకు ఎన్ని ఘర్షణలున్నా బ్రిటిష్ వారి వ్యాప్తిని నిలువరించడానికి ఒకటి కావడం అవసరం అని గుర్తించి ఉంటే - జఫర్ సూచన కొంతయినా ఫలితం ఇచ్చేదేమో. అప్పుడు బ్రిటిషిండియా చరిత్ర ఏ విధంగా ఉండేదో! ముఘలుల పట్ల వ్యతిరేకత ఈ ఏకీకరణకు అడ్డం వచ్చిందన్న సూచనకు మన 'దేశభక్తులు' ఏ విధంగా అర్థం చేసుకుంటారో, ఏ విధంగా వ్యాఖ్యానిస్తారో! ఆ వ్యతిరేకతే లేక పోయినట్లయితే మొదటి స్వాతంత్ర్య సంగ్రామమే చివరిది అయివుండేదని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు గానీ ఆ సంగ్రామాన్ని అధికారం కోల్పోయిన ముస్లిం పాలకుల ప్రతి చర్యగా ఒక్క బ్రిటిష్‌వారే కాదు, చాలామంది సంస్థానాధీశులు చూసారనేది వాస్తవం. అయినప్పటికీ ఈనాటి దేశభక్తి భావనలో ప్రముఖ స్థానం ఉన్న ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనే ఘట్టంలో బహదూర్ షా జఫర్‌కు గానీ బేగం హజ్రత్ మహల్‌కు గానీ మన హైదరాబాద్‌కు చెందిన రోహిల్లా యోధుడు తుర్రేబాజ్‌ఖాన్‌కు గానీ సంఘ్ పరివార్ ఆధ్యాత్మిక గురువు వినాయకరావు దామోదర్ సావర్కర్ సహితం మెచ్చుకున్న కాన్పూరు పాలకుడు నానాసాహెబ్ మిత్రుడు అజీముల్లాఖాన్‌కు గానీ మద్రాసులో పుట్టి ప్రపంచమంతా తిరిగి లక్నోలో పోరాటంలో భాగమయిన మౌల్వీ అహ్మదుల్లా ఖాన్‌కు గానీ చోటులేకపోవడం ఏ రకంగానూ న్యాయం కాదు. ఈ పోరాటకారులొక్కక్కరి జీవితాన్నీ పాత్రనూ క్లుప్తంగానే అయినా చరిత్రకెక్కించడం నశీర్ అహమ్మద్ చేసిన మంచిపని.

రాజులు, రాణులు, సంస్థానాధీశులూ చేసిన పోరాటాలు ఒకెత్తయితే, ప్రజల నుండి గెరిల్లా పద్ధతిలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు ఇంకొకెత్తు. 19వ శతాబ్దం ఆద్యంతం ఆదివాసులు మధ్యభారతంలో చేసిన తిరుగుబాట్లను దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చూడడం మన దేశ భక్తులింకా నేర్చుకోలేదు. అదే కోవకు చెందినవి పరిశుద్ధ ఇస్లాంను సిద్ధాంతంగా కలిగిన తిరుగు బాట్లు.

## ఇవీ స్వాతంత్ర్య పోరాటాలే

వహాబీ, ఫరాజీ, మోప్లా తిరుగుబాట్లు ఈ కోవకు చెందినవి. శుద్ధ ఇస్లాం అనే తాత్విక ధోరణి వీటిలో బలంగా ఉన్న కారణంగా వీటిని మతపరమయిన ఉద్యమాలుగా వర్గీకరించే అవకాశం ఉంది. బ్రిటిష్ పాలనా యంత్రాంగం ఆ పనే చేసింది. అయితే ఈ గెరిల్లా పోరాటాల విశేషం ఏమి టంటే ఇవి పుట్టింది ముస్లిం జమీందారులు, భూస్వాములు ఉన్న ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలలో కాదు. ముస్లింలు కాయకష్టం చేసుకుని బతికే రైతులు, కూలీలుగా, హిందువులు జమీందార్లు, భూస్వాములు, సంప్రదాయక పెత్తందార్లుగా ఉన్న తూర్పు బెంగాల్ (ఇవ్వాల్టి బంగ్లాదేశ్), మలబార్ (కేరళ రాష్ట్రం ఉత్తర భాగం) ప్రాంతాలలో. ఈ కారణంగా ఈ ఉద్యమాలు సారాంశంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాలేనని విశ్లేషించిన వారున్నారు.

నశీర్ అహమ్మద్ ఈ పోరాటాలను స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చూసి వీటి గురించి విస్తృతంగా రాశారు. ఇది చాలామంచి కృషి. 19వ శతాబ్దం ఆద్యంతం ఈ పోరాటాలు, వాటి పాయలు బ్రిటిష్ వారిని చాలా ఇబ్బంది పెట్టాయి. ఎక్కడ ఏ అలజడి జరిగినా దాని వెనక వహాబీ లేక ఫరాజీ ఆందోళనకారులున్నారేమో అని బ్రిటిష్ ఇండియా పాలకులు అనుమానించేవారు.

20వ శతాబ్దంలో పట్టణ ప్రాంతాల మధ్యతరగతికి చెందిన యువకులు హైందవ దృక్పథంతోనూ సెక్యులర్ దృక్పథంతోనూ బ్రిటిష్ పాలనపైన చేపట్టిన మిలిటెంట్ పోరాటాల గురించి మనకు బాగానే తెలుసును. బెంగాల్ విప్లవకారులకు, హిందూస్తాన్ రిపబ్లికన్ ఆర్మీకీ, గదర్ పార్టీకీ న్యాయమైన గుర్తింపు, గౌరవం లభించాయి. కానీ 19వ శతాబ్దంలో గ్రామీణ ప్రాంతా లలో ఆదివాసులు, బక్కచిక్కిన ముస్లిం రైతులూ అంతే పట్టుదలతో చేసిన మిలిటెంట్ పోరాటాలకు ఇప్పటికీ ఆ గుర్తింపు లేదు. నిజానికి 20వ శతాబ్దపు 'టెర్రరిస్టుల' కంటె వారే ఎక్కువ కాలం, ఎక్కువ పట్టుదలతో, ఎక్కువగా ప్రజలను సమీకరించి బ్రిటిష్ ఇండియా పాలకులపైన పోరాటం చేశారు.

18వ శతాబ్దపు ద్వితీయార్థంలో బెంగాల్ ప్రాంతంలో వచ్చిన తీవ్రమైన కరువుకు ప్రజలు పిట్టల వలె చనిపోతున్నపుడు కూడా తూర్పు ఇండియా కంపెనీ పాలనా యంత్రాంగం రెవెన్యూ వసూలును నిర్దయగా కొనసాగించింది. జనాభాలో దాదాపు మూడవ వంతు కరువు వాతపడి చనిపోయినప్పటికీ, రెవెన్యూ వసూలు పదిశాతం పెరిగిందని 1770-71 సంవత్సరపు రిపోర్టులో ఒక ఇంగ్లీష్ విశ్లేషకుడే అంచనా వేశాడంటే కంపెనీ క్రూరత్వం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అప్పటికే పది సంవత్సరాలుగా పరాయి పాలనకు వ్యతిరేకంగా ప్రజలకు ఉద్బోధిస్తున్న ముస్లిం ఫకీర్లు ఈ ఘోర క్షామ కాలంలో విజృంభించారు. వీరి నాయకుడు మజ్నూషా ఫకీర్. నాగాలుగా పిలవబడే హిందూ సన్యాసులు కూడా వారికి తోడయ్యారు. 1771లో ఫకీర్ల సమావేశంపైన ఇంగ్లీష్ సైనికులు కాల్పులు జరిపి 150 మందిని చంపారు.

ఆ తరువాత ఫకీర్ల, గెరిల్లా పోరాటం విస్తృతమై ప్రస్తుత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రాంతాలనేకాక బీహార్, అస్సాం, భూటాన్, నేపాల్ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. ధాన్యం గిడ్డంగుల మీద దాడిచేసి ధాన్యాన్ని కరువు పీడిత ప్రజలకు పంచేవారు, వడ్డీ వ్యాపారుల వద్దనున్న రుణ పత్రాలు తగలబెట్టేవారు, తూర్పు ఇండియా కంపెనీ ఏజెంట్లను కఠినంగా శిక్షించేవారు. ప్రజలను పీడించవద్దనీ, స్వచ్ఛందంగా ఇచ్చే చందాలు తీసుకోవాలే తప్ప బలవంతంగా డబ్బుల వసూలు చేపట్టకూడదనీ మజ్నూషా తన అనుచరులను ఆదేశించాడని బ్రిటిష్ అధికారులే చెప్పు కున్నారు. ఫకీర్లు, నాగా సన్యాసులు కలిసి పోరాటం చేయడం వల్ల ఏ హిందూ ముస్లిం ఐక్యత అసాధ్యం అని బ్రిటిష్ వారు తమకు తాము నచ్చజెప్పుకున్నారో అది సాధ్యమేనని రుజువు చేశారు కూడా. అయితే కంపెనీ అధికారులు విపరీతమైన హింస ప్రయోగించి క్రీ.శ. 1800 నాటికి ఫకీర్ల తిరుగుబాటును అణచివేశారు.

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రాజులు, నవాబులు, వివిధ సంస్థానాధీశులు అప్పటికే తిరుగు బాట్లు చేస్తున్నారు. అందులో సూత్రబద్ధమైన వలసవాద వ్యతిరేకత పాలు ఎంత, కేవలం తమ

ప్రశాసనాన్ని కాపాడుకోవాలన్న ఆరాటం ఎంత అంటే అందరికీ వర్తించే సూత్రీకరణ చేయడం కష్టం. అయినప్పటికీ వారి ప్రతిఘటన మొత్తం స్వాతంత్ర పోరాటంలో భాగంగానే గుర్తించబడుతున్నది. కాగా, ప్రజల వైపు నుండి జరిగిన మొట్టమొదటి విస్తృత సమీకరణ, పోరాటం ఫకీర్ల నాయకత్వం వహించినదే. వీరికి హిందూ సన్యాసులూ తోడయ్యారు. దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? హైందవ సమాజంలో సన్యాసులు, భారతీయ ముస్లిం సమాజంలో ఫకీర్లు, సమాజం కట్టుబాట్లకు ఎడంగా ఉండి ప్రజల మీద జరిగే అణచివేతకూ అన్యాయానికీ వ్యతిరేకంగా గొంతు విప్పేవారనీ, నిరసనకు గళం ఇచ్చేవారనీ రొమిల్లా థాపర్ వంటి విశ్లేషకులు గుర్తించారు. ఈ ఫకీర్లు– సన్యాసుల తిరుగుబాటు ఆ సంప్రదాయక పాత్రనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిందనుకోవాలా? లేకపోతే మత భావాల ప్రేరణతో జీవించే ఫకీర్లు క్రైస్తవ పాలనను సహించలేక 'ఫిరంగీ'లను పారద్రోలమన్న నినాదంతో తిరగబడ్డారనుకోవాలా? 'ఆధునికత'కు వ్యతిరేకంగా 'సంప్రదాయకత' చేసిన తిరుగుబాటు అనుకోవాలా? లేక కోల్పోయిన ముస్లిం రాజవంశాల, సంస్థానాధీశుల వైభవాన్ని తిరిగి సాధించడం కోసం పోరాడారనుకోవాలా? లేక అది కరువు పీడిత రైతాంగాన్ని వలస పాలకులకూ, వారి ఏజెంట్లయిన జమీందార్లకూ వ్యతిరేకంగా సమీకరించిన వర్గ పోరాటం అనుకోవాలా? బెంగాల్ ప్రాంతంలో జమీందార్లు ఎక్కువగా హిందువులు, రైతులు ఎక్కువగా ముస్లింలు అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇది హిందువుల సంపదను దోచుకున్న ముస్లిం తిరుగుబాటు అనుకోవాలా?

ఈ ప్రశ్నలకు వివరంగా జవాబు చెప్పుకోవడానికి కావలసిన సమాచారం చరిత్రకారులకు అందుబాట్లో ఉందో లేదో. అది మన చేతిలో లేని పరిమితి కాగా, బ్రిటిష్ పాలనను మొత్తంగా అంతమొందించి దాని స్థానంలో ఏకీకృత స్వదేశీ రాజ్యాన్ని నెలకొల్పే ప్రయత్నాన్ని మాత్రమే స్వాతంత్ర పోరాటంగా అర్థం చేసుకునే వైఖరి భావజాల సంబంధమైన పరిమితి. దీనిని వదులుకొని, బ్రిటిష్ వలస పాలన ఫలితాలను నిరసించి దానిని తొలగించాలన్న సంకల్పంతో ఏ ప్రత్యామ్నాయాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేసినా, అసలు ఏ ప్రత్యామ్నాయమూ స్పష్టంగా లేకున్నా– అది స్వాతంత్ర పోరాటంలో భాగమేననుకుంటే ఫకీర్ల తిరుగుబాటు స్వాతంత్ర పోరాటాలలో భాగమే. ఒక ముఖ్యమైన భాగమే.

## వహాబీ ఉద్యమం

ఫకీర్ల తిరుగుబాటు అంతమైన తరువాత బెంగాల్ నుండే మళ్లీ మొదలయిన వహాబీ–ఫరాజీ ఉద్యమాలకు కూడా ఇది వర్తిస్తుంది. వీటిలో మత ప్రేరణ ఇంకా ఎక్కువ. ముస్లింలు పరాయి ప్రభావానికి లోనయి తమ మత ఆచారాలను మరచి ప్రవర్తిస్తున్నారన్న ఆవేదనతో, శుద్ధమైన ఇస్లామిక్ ఆచరణను తిరిగి ప్రవేశపెట్టే లక్ష్యంతో అరేబియాకు చెందిన అబ్దుల్ వహాబ్ మొదలు పెట్టిన కఠినమైన సంస్కరణను వహాబీ ఉద్యమం అంటారు. ఇది అరేబియాకు పరిమితమై ఉండలేదు. ముస్లిం ప్రపంచమంతటా వ్యాపించింది. ఈ ఉద్యమాన్ని ఆధునికతకు వ్యతిరేకంగా సంప్రదాయకత చేసిన తిరుగుబాటుగా అర్థం చేసుకున్న వారున్నారు. ఇస్లాం అరేబియా నుండి బయటకు వ్యాపించిన క్రమంలో ముస్లిం సమాజంలో అనివార్యంగా వచ్చి చేరిన భిన్నత్వాన్ని నిరసించిన మూర్ఖవాదంగా విశ్లేషించిన వారూ ఉన్నారు. ఇవి రెండూ కొంతమేరకు నిజమే కావచ్చు. వారి కఠోరమైన వ్యవహారశైలి వల్ల వహాబీలు పనిచేసిన ప్రాంతాలలో పరమతస్థులతో ఘర్షణలు రావడమే



కాదు, ముస్లింలలోనే వ్యతిరేకత చాలా వచ్చింది. ఈ 'శాంతి భద్రతల' కోణం వహాబీలను అణచి వేయడానికి బ్రిటిష్ వారికి బాగా తోడ్పడింది కూడా.

అయితే ముస్లిం సమాజంలో ఒక కఠినమైన అంతర్గత సంస్కరణ ఉద్యమంగా ప్రారంభమైనది, ఇండియాకొచ్చేసరికి క్రైస్తవ పాలనను తొలగించి ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పాలన్న రాజకీయ నినాదంగానూ మారింది, అత్యధికంగా బక్క చిక్కిన వ్యవసాయదారులు, చేతివృత్తుల వారు అయిన ముస్లిం ప్రజల మీద ప్రభుత్వము, జమీందార్లు, వడ్డీ వ్యాపారులు అమలు చేస్తున్న అణచివేతను బలంగా వ్యతిరేకించిన మిలిటెంట్ పోరాటంగానూ మారింది. కరువు పీడిత బెంగాల్‌లో టిటూమీర్ (మీర్ నిస్సార్ అలీ) నాయకత్వంలో నడిచిన వహాబీ ఉద్యమానికి ఈ చివరి లక్షణం దండిగా ఉండింది. వహాబీ ఉద్యమంలోని ఈ భిన్న కోణాలలో ఈనాటి రాజకీయ సందర్భంలో ఒక్కొక్కరికీ కొన్ని కొన్ని నచ్చుతాయి, కొన్ని నచ్చవు కాబట్టి వీటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకొని ఇదే వహాబీ ఉద్యమం అసలు గుణం అని విశ్లేషించడం జరుగుతుంటుంది. విశ్లేషకులకు 'అసలు విషయం'గా కనిపించేది లౌకిక ప్రజాతంత్ర వర్గ పోరాటం కావచ్చు, కరడుగట్టిన మతవాదం కావచ్చు. కానీ ఈ విశ్లేషణలు ఊహించుకునే తేడాలు, విభజన రేఖలు వహాబీ ఉద్యమంలో నిజంగా ఉన్నాయని రుజువు చేయడం కష్టం. ఒక కాలానికి, ఒక దృష్టి కోణానికి, పరస్పరం అసంబద్ధంగా తోచే విషయాలు మరొక కాలానికీ మరొక దృష్టి కోణానికీ ఆ విధంగా తోచకపోవచ్చు.

అదెట్లాగున్నా ఒకటి మాత్రం సత్యం. బ్రిటిష్ పాలకులు 19వ శతాబ్దం యావత్తు చాలా ఆందోళన చెందిన మిలిటెంట్ పోరాటం వహాబీ ఉద్యమం. పంతొమ్మిదవ శతాబ్దం తొలి దశాబ్దాల నాటికే ఆచార వ్యవహారాల సంస్కరణ ఉద్యమంగానూ సామాజిక స్థితిగతుల పట్ల నిరసన ఉద్యమంగానూ ముస్లిం సమాజంలో వహాబీ ఆలోచనారీతి బాగా వ్యాపించింది. గ్రామీణ రైతాంగం, పట్టణ ప్రాంత దిగువ మధ్యతరగతి, నిరుద్యోగ యువత బాగా ఆకర్షితులయ్యారు. 1831లో బెంగాల్‌లోని పూర్వా అనే గ్రామం జమీందారు కృష్ణదేవరాయ్ గడ్డం పెట్టుకునే ముస్లింలపైన పన్ను విధించడంతో వహాబీల తిరుగుబాటు మిలిటెంట్ రూపం తీసుకుంది. తన మాట విననందుకు గుంపును పోగుచేసి ముస్లింలపైన దాడిచేసి వారి మసీదును ధ్వంసం చేసిన జమీందారు చర్యకు నిరసనగా టిటూమీర్ నాయకత్వంలో మొదటి పెద్దదాడి జరిగింది. ఆ తరువాత జమీందార్లపైన, 'ఫిరంగీల'పైన దాడులు కొనసాగాయి. మతపరమైన అవమానానికి నిరసనగా మొదలైన తిరుగుబాటు మొదట్లో మత అసహనాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత జమీందార్లు, నీలిమందు, ప్లాంటర్లు, తూర్పు ఇండియా కంపెనీ పాలకుల దోపిడీ దౌర్జన్యాలను ఎదుర్కున్న మిలిటెంట్ పోరాటంగా వహాబీ ఉద్యమం బెంగాల్ అంతటా వ్యాపించింది. ఉద్యమం ముస్లింలకే పరిమితం అయినప్పటికీ తూర్పు బెంగాల్ ప్రాంతంలో ముస్లింలు మెజారిటీగా ఉన్న రైతాంగం పైన హిందువులు మెజారిటీగా ఉన్న జమీందార్ల దోపిడీ దౌర్జన్యాలు ఒక సామాజిక వాస్తవం కాబట్టి ఇది రైతాంగ తిరుగుబాటు స్వభావాన్ని కలిగి ఉంది. హిందువులయినా తమకు అడ్డం రాకపోతే ఏమీ చేయవద్దనీ ముస్లింలయినా తమకు అడ్డం వస్తే క్షమించవద్దనీ టిటూమీర్ తన అనుచరులను ఆదేశించిన విషయం విశ్లేషకులు చెప్తారు. హిందూ సమాజానికి చెందిన పేద రైతాంగమూ వహాబీలకు సహకరించిన సందర్భాలున్నాయి.

పూర్వా గ్రామంలో జమీందారు అనాగరిక వైఖరికి వ్యతిరేకంగా మొదలయిన వహాబీల పోరాటం త్వరలోనే కంపెనీ సేనలతో యుద్ధంగా మారి ఒక సంవత్సరం పాటు సాగింది. చివరి

ఘట్టంలో టిటూమీర్‌తో సహా 50 మంది చనిపోగా, మరొక ముఖ్యుడు గులాం మాసుంను కంపెనీ పాలకులు బహిరంగంగా ఉరితీశారు. ఇంకొక 197 మందికి కఠిన శిక్షలు వేశారు. అయితే వహాబీ తత్వం, ఉద్యమం దేశమంతటా వ్యాపించి 19వ శతాబ్దం చివరి దాకా బ్రిటిష్ పాలకులను ఇబ్బంది పెడుతూనే ఉంది. ఈ కథను నశీర్ అహమ్మద్ 'భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లిం ప్రజా పోరాటాలు' అనే ప్రచురణలో వివరంగా చెప్పారు. వహాబీలు వలస పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను ప్రశంసిస్తూ, వారి మతపరమైన అసహనం వల్ల జరిగిన నష్టాన్ని వివరించారు.

## ఫరాజీ ఉద్యమం

వహాబీ ఉద్యమం తరువాత వచ్చిన ఫరాజీ ఉద్యమం స్థూలంగా అదే స్వభావాన్ని కలిగినది. 'ఫర్జ్' అనే మాట నుండి 'ఫరాజీ' పుట్టింది. ఫర్జ్ అనేది సాధారణ సంభాషణలో అనుల్లంఘనీయమైన విధి లేక కర్తవ్యం అన్న అర్థాన్ని ఇస్తుంది. అది ధార్మిక కర్తవ్యం కానవసరం లేదు. కానీ ఫరాజీ ఉద్యమకారులు ప్రయోగించిన అర్థంలో అది ధార్మికమే. ముస్లింల జీవిత ఆచారాలలోకి వచ్చి చేరిన అన్య ప్రభావాలను తొలగించడం, శత్రువు పాలనలో ఉన్న దేశాన్ని విముక్తిచేసి ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పడం వారు ఎంచుకున్న కర్తవ్యాలు. ఫరాజీ ఉద్యమ వ్యవస్థాపకుడు తూర్పు బెంగాల్‌లోని ఒక చేనేత కార్మిక కుటుంబంలో పుట్టిన హాజీ షరియతుల్లా. ఇతను హజ్‌కు మక్కాకు పోయి వహాబీ ఉద్యమాన్ని గురించి తెలుసుకొని ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత అదే నమూనా గల కర్తవ్యాన్ని తనకు తాను నిర్దేశించుకున్నాడు.

శుద్ధ ఇస్లాం ప్రబోధం కారణంగా ఫరాజీలకు ముస్లింలతోనే ఘర్షణ ఏర్పడగా, ఫిరంగీ రాజ్యాన్ని పారదోలాలన్న లక్ష్యంతో జమీందార్లకు శిస్తు చెల్లించవద్దన్న పిలుపు ఇవ్వడం వల్ల జమీందార్లతోనూ పాలనా యంత్రాంగంతోనూ ఘర్షణ ఏర్పడింది. పాలనా యంత్రాంగం షరియతుల్లానూ, అతని అనుచరులనూ అణచివేసే కొద్దీ జమీందార్ల దోపిడీకీ ఇండిగో ప్లాంటర్ల దోపిడీకీ గురైన రైతాంగానికి అతను విముక్తి సంకేతం అయ్యాడని సమకాలీన బ్రిటిష్ వ్యాఖ్యాతలే అన్నారు. అతని కొడుకు దూదుమియా (మహమ్మద్ మోసిన్) నాయకత్వంలో ఫరాజీ ఉద్యమం ధార్మిక కోణం తగ్గి రాజకీయార్థిక కోణం పెరిగిన కారణంగా అది ప్రధానంగా జమీందార్లు, కంపెనీ పాలకులు, ఇండిగో ప్లాంటర్ల వ్యతిరేక పోరాటంగా సాగింది. తన ముస్లిం స్వభావాన్ని వదులుకోకపోయినా వైరుధ్యం రాకపోవడానికి కారణం తూర్పు బెంగాల్‌లో రైతాంగం, నేత కార్మికులు ఎక్కువగా ముస్లింలు కావడం, ధనిక వర్గాలకు చెందిన ముస్లింలకు ఫరాజీల ధార్మిక ప్రచారమూ రాజకీయార్థిక ప్రణాళికా రెండూ నచ్చకపోవడం వల్ల వారు (కొన్ని మినహాయింపులతో) జమీందార్లతో ప్లాంటర్లతో ఒకటి కావడం. పేద హిందువులు ఎంత మేరకు ఫరాజీ ఉద్యమంలో భాగం అయ్యారన్న విషయంలో సమాచారం అంతగా లేదుగానీ బ్రిటిష్ నివేదికలలో తరచుగా పేదలంతా దూదుమియా వెంట పోయారన్న భావం వ్యక్తమయిన మాట వాస్తవం.

1847 నాటికే తూర్పు బెంగాలులో ఫరాజీల వెనక 50 వేల జనం ఉన్నారని తూర్పు ఇండియా కంపెనీ నివేదికలు తెలియజేస్తాయి. వారు గ్రామాలలో సమాంతర పాలనా యంత్రాంగాన్ని నెలకొల్పారు. ఈ ఫరాజీ ఖలీఫత్ (పాలనా వ్యవస్థ) ధార్మిక వ్యవహారాలనూ లౌకిక వ్యవహారాలనూ కూడ చూసుకునేది. అందులో ముస్లిమేతరులు ఉండడమే కాక మైనారిటీలయిన హిందువులు, క్రైస్తవుల మత విశ్వాసాలు దెబ్బతినకుండా జాగ్రత్త తీసుకున్నారని కూడా సమకాలీన బ్రిటిష్ వ్యాఖ్యాతలన్నారు.

ప్రజలను పెద్దయెత్తున సమీకరించి మిలిటెంట్‌గా దాడులు చేయడానికి వెనకాడని దూదు మియాకు వ్యతిరేకంగా డన్‌లప్ అనే నీలిమందు ప్లాంటర్ కంపెనీ అధికారులను, జమీందారులను సమీకరించాడు. ఇది దాడులు, ఎదురుదాడులు, క్రిమినల్ కేసులకు దారితీసిన వైనం నశీర్ అహమ్మద్ తన 'ముస్లిం ప్రజా పోరాటాలు' పుస్తకంలో చక్కగా వివరించారు. పోలీసు యంత్రాంగం ఈ ప్లాంటర్ తొత్తులుగా మారి దూదుమియాపైన తప్పుడు కేసులు పెట్టి సతాయించిన విషయాన్ని ఈ ఘర్షణపైన విచారణ జరిపిన బ్రిటిష్ అధికారులు సహితం గుర్తించారు.

1857 సంగ్రామం గురించి చాలా తెలిసిన వారికి సహితం తెలియనిది ఏమిటంటే ఆ పోరాటంలో ఫరాజీలు చురుగ్గా పాల్గొన్నారని. అప్పటికి పది సంవత్సరాలు ముందే 50 వేల అనుచరగణం ఉన్నట్టు కంపెనీ పాలకులే గుర్తించిన ఫరాజీ ఉద్యమం 1857 సంగ్రామంలోని ప్రధాన ప్రజా ఉద్యమం. తక్కిన పాయలెక్కువగా అప్పటికప్పుడు ఏర్పడిన చిన్న చిన్న బృందాలు, లేక సంస్థానాధీశుల సైనిక బృందాలు. అప్పటికే సంఘటితంగా ఉండి కంపెనీ పాలన మీదా జమీందార్ల మీదా అనేక పోరాటాలు చేసిన ఫరాజీలు ఆ తిరుగుబాటులో పాల్గొనడం బ్రిటిష్‌వారిని చాలా కలవరపెట్టిందనడానికి గల నిదర్శనాలు నశీర్ అహమ్మద్ అనేకం ఉటంకించారు. అందులో ప్రధానమైనది దూదుమియాను ఒక సంవత్సరన్నర కాలం నిర్బంధించి 1857 తిరుగుబాటును మొత్తంగా అణచివేసే దాకా విడిచిపెట్టకపోవడం.

1857 తిరుగుబాటు చల్లారిన తరువాత కూడా ఫరాజీల పోరాటం కొనసాగింది. దాదాపు 19వ శతాబ్దం చివరి భాగం దాకా సజీవంగానే కాక చురుకుగానూ ఉంది. అయితే వహాబీల లాగ


**సయ్యద్ నశీర్ అహమ్మద్ రచనల జాబితా:**

1. భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లిం మహిళలు
   (పేజీలు 80, వెల: రూ.20.00)
2. భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లింలు
   (పేజీలు 44, వెల: రూ.10.00)
3. భారత స్వాతంత్ర్యోద్యమం: ఆంధ్రప్రదేశ్ ముస్లింలు
   (పేజీలు 80, వెల: రూ.30.00)
4. మైసూరు పులి: టిప్పుసుల్తాన్
   (పేజీలు 28, వెల: రూ.10.00)
5. షహీద్-ఎ-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్
   (పేజీలు 24, వెల: రూ.10.00)
6. భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లిం ప్రజా పోరాటాలు
   (పేజీలు 176, వెల: రూ.50.00)
7. భారత స్వాతంత్ర్య సంగ్రామం - ముస్లిం యోధులు (ప్రథమ భాగం)
   (పేజీలు 318, వెల: రూ.100.00)

ప్రతులకు: ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్
3-506, అప్సాఘర్, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా-522 501

వీరు కూడా 'పరిశుద్ధ ఇస్లాం'కు తమను తాము ప్రతినిధులుగా భావించుకోవడం వల్ల, పరిశుద్ధ ఇస్లాంను ఈ గడ్డ మీద అప్రతిహతంగా నిలబెట్టాలనుకోవడం వల్ల, ఇతర మతస్తులనే కాదు, ముస్లింలను సహితం చాలావరకు దూరం చేసుకున్నారు. తమతో ఏకీభవించిన ముస్లిం ప్రజలనే కాదు, మౌల్వీలను సహితం కించపరచడం వల్ల తమ మతంలోనే ధార్మిక విషయంలో ఒంటరి వారయ్యారు. ఈ బలహీనత ఫరాజీ ఉద్యమానికి నష్టదాయకమయింది.

## మోప్లా పోరాటం

వహాబీ, ఫరాజీ ఉద్యమాలతో సమాంతరంగా సాగి వాటి కంటె ఎక్కువ కాలం మనగలిగిన 'ముస్లిం' రైతాంగ పోరాటం మోప్లా పోరాటం. కేరళ రాష్ట్రం ఉత్తర భాగాన ఉన్న మలబారులో ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తారు. మోప్లా అనేది మలబారుకు చెందిన ముస్లింలను మలయాళ భాషలో పిలిచే పేరు. మలబారులోని భూ సంబంధాలలో మోప్లాలు అడుగున ఉన్న రైతులు, కూలీలు కాగా భూమి ముఖం ఎన్నడూ చూడకుండా రైతు కష్టం మీద బతికే 'జెన్మి' (భూస్వామి) హిందూ అగ్రకులాలకు చెందినవాడు. రైతులలో 70 శాతం మోప్లాలు కాగా, భూమిలో 40 శాతం జెన్మిలది. మైసూరు రాజు టిప్పు సుల్తాన్ మలబారును జయించినప్పుడు ఈ 'జెన్మి'ల హక్కులు తొలగించి రైతులకే భూమిమీద హక్కు కల్పించాడు. 1799లో నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పు ఓడిపోయి మలబారు తూర్పు ఇండియా కంపెనీ హస్తగతం అయిన తరువాత జెన్మిల అధికారాన్ని కొత్త రూపంలో తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది. కొంతకాలం స్వేచ్ఛ, హక్కులు రుచిచూసిన మోప్లా రైతాంగం జెన్మిల మీద, వారి అధికారాన్ని నిలబెట్టిన బ్రిటిష్ వారి మీద తిరుగుబాటు చేశారు. 1800లో మొదలయిన ఈ తిరుగుబాటు 1922 దాకా సాగింది. 'భూస్వాముల మీద ప్రారంభమైన ఈ తిరుగుబాటు భూస్వాముల మద్దతుదారులు, బ్రిటిష్ పోలీసులు, న్యాయస్థానాలు, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, చివరికి బ్రిటిష్ సైనికులు, అధికార్ల మీద' ఎక్కుపెట్టబడింది అని చారిత్రక పరిశోధనల ఆధారంగా నశీర్ అహమ్మద్ అంటారు.

మొట్టమొదటి చర్యగానే మోప్లాలు జార్జి వాడెల్ అనే తూర్పు ఇండియా కంపెనీ అధికారిని హతమార్చారు. దానికి ప్రతీకారంగా కంపెనీ బలగాలు ముగ్గురు మోప్లా నాయకులను కాల్చి చంపారు. దానితో కొంతకాలం స్తబ్దం అయిన మోప్లా తిరుగుబాటు 1821 నుండి మళ్లీ విజృంభించింది. 1921లోగా 51 పోరాటాలు జరిగాయని బ్రిటిష్ పరిశోధకులు లెక్కపెట్టారు.

ఉర్దూలో మౌల్వీ లేక ముల్లా అనే మతగురువును మోప్లాలు మాట్లాడే మలయాళంలో తంగల్ అంటారు. తంగల్‌ల నాయకత్వంలో భూస్వాములయిన జెన్మిలపైన, వారిని కాపాడుతున్న తూర్పు ఇండియా కంపెనీ పైన పోరాటం చేయడం తమ ధార్మిక విధి అని మోప్లాలు భావించారు. ఖురాన్ అటువంటి పోరాటాన్ని బోధిస్తుందని నమ్మారు. ఈ విధంగా జెన్మిలకూ, వారి సంరక్షకులకూ వ్యతిరేకంగా మోప్లా రైతాంగం చేసిన పోరాటానికి ధార్మిక స్వభావం వచ్చింది.

పోరాటంలోకి దిగిన మోప్లాలు కర్మకాండను పోలిన తంతు నిర్వహించేవారని నశీర్ అహమ్మద్ సవివరంగా చెప్పారు. శత్రువుకు సజీవంగా చిక్కకూడదన్న నిర్ణయం కారణంగా మరణమే వారి అంతిమ మజిలీ. అందుకే పోరాటంలోకి పోయేముందే ఆస్తిని భార్య, పిల్లలకు పంచేసి, భార్యకు విడాకులిచ్చేవారు. ఒకరికంటె ఒకరు బలవంతులయిన శత్రువులనెంచుకొని ద్వంద్వ యుద్ధానికి సవాలుచేసి తాము చచ్చేదాకా శత్రు సంహారం చేసేవారు. 1821-1921 మధ్య జరిగిన ఈ 51 పోరాటాలలో ఒక్కదాని వివరాలైనా ఇక్కడ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది.

ఈ తిరుగుబాటు 1849 ఆగస్టు 25న మొదలయింది. అతన్ గురుక్కల్ అనే తంగల్ నాయకత్వంలో జరిగింది. రైతాంగాన్ని పీడిస్తున్న పండిక్కడ్ నంబూద్రి అనే జెన్మి కచ్చేరి మీదికి అతను 15 మందితో వెళ్లి అక్రమ వసూళ్లను ప్రశ్నించాడు. జెన్మి జారుకున్నాడు. మోప్లాలు అక్కడి నుండి ఆ జెన్మికి అధిపతి అయిన మంజేరి రాజా భవనం మీదికి పోయారు. వారి రాక గురించి తెలుసుకున్న బ్రిటిష్ సైనికులు, పోలీసులు రాజాకు అండగా మంజేరికి బయలుదేరారు. కానీ మోప్లాల దాడికి సైనికులు తట్టుకోలేక పరారయ్యారు.

ఆ తరువాత మోప్లాలు తమ మార్చ్ కొనసాగించారు. వేరే ఊర్ల నుండి వచ్చిన మోప్లాలు వారితో చేరడంతో వారి సంఖ్య పెరిగింది. దారిలో ముస్లింలే కాక ముస్లిమేతర రైతాంగం సహితం వారికి తిండి, నీళ్లు, వసతి ఏర్పాటు చేశారు. వారిని అట్లాగే సాగనిస్తే పెద్ద తిరుగుబాటు జరగగలదని గ్రహించిన కంపెనీ సైనికులు పెద్దయెత్తున సమీకృతమై మోప్లాల పైన దాడిచేశారు. భీకరంగా సాగిన ఈ పోరులో 64 మంది మోప్లాలు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు అయిదుగురు మాత్రమే చనిపోయారు.

అయితే మోప్లాలది కేవలం తమను పీడిస్తున్న జెన్మిల మీద పోరాటం కాదనీ, తూర్పు ఇండియా కంపెనీ పాలనను అంతం చేసే ఆలోచనా వారిలో ఉండిందనీ గుర్తించడానికి నిదర్శనం ఏమిటంటే 1857 తిరుగుబాటు ప్రారంభం అయిందని తెలియగానే వారు కనబరచిన స్పందన. ఉత్తర హిందుస్థానంలో తిరుగుబాటు మొదలయింది, ఇక మనం కూడా కదలాలి అని మలబారు ప్రాంతంలో వారు ప్రచారం మొదలుపెట్టారు. అయితే ఆదిలోనే ఈ విషయాన్ని బ్రిటిష్ పాలకులు పసిగట్టి ఈ ప్రయత్నానికి పూనుకున్న నాయకులను అరెస్టుచేసి జైలులో పడేశారు.

1920ల నాటికి మోప్లా తిరుగుబాటు కాంగ్రెస్ వారు చేపట్టిన ఖిలాఫత్ ఉద్యమంలో భాగమైన వైనం, సహాయ నిరాకరణోద్యమం ద్వారా గాంధేయ రాజకీయాలలో భాగమైన వైనం, అయితే తమ పద్ధతిలో దానికి మిలిటెంట్ రూపం ఇచ్చి పెద్దయెత్తున తిరగబడి బ్రిటిష్ పాలనా యంత్రాంగాన్ని తరిమేసి 'ఖిలాఫత్' రాజ్యాన్ని ఒక ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైనం, తరువాత బ్రిటిష్ పాలకులు వారిపైన విరుచుకుపడి అతి క్రూరంగా వేల మందిని చంపి ఆ పోరాటాన్ని అణిచిన వైనం, నశీర్ అహమ్మద్ మాటలలోనే 'ముస్లిం ప్రజా పోరాటాలు' పుస్తకంలో చదివితే బాగుంటుంది.

ఇది స్వాతంత్ర్య పోరాటాలుగా గుర్తింపు పొందని ముస్లిం ప్రజల విషయం కాగా, గుర్తింపు పొందిన పోరాటాలలో ముస్లింల పాత్రను తక్కువచేసి చెప్పడం లేదా అసలే కనుమరుగు చేయడం జరిగిందని నశీర్ అహమ్మద్ అభియోగం. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తింపు పొందిన 1857 తిరుగుబాటులో లోతుగా పాల్గొన్నప్పటికీ లక్ష్మీబాయి, తాంతియాతోపేలతో సమానంగా గుర్తింపు పొందని ముస్లింల గురించి పైన చూశాం.

## అష్ఫాఖుల్లాను ఎందుకు తక్కువచేశారు?

హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యుడు, కాకోరి కుట్ర కేసులోని ఏకైక ముస్లిం ముద్దాయి అయిన అష్ఫాఖుల్లా ఖాన్ గురించి నశీర్ అహమ్మద్ రాసిన చిన్న పుస్తకం చదివిన వారెవరికైనా, అష్ఫాఖుల్లా ఖాన్ వేరే ఏ రకంగానూ భగత్‌సింగ్‌కూ, చంద్రశేఖర్ ఆజాద్‌కూ తీసిపోకున్నా కేవలం

ముస్లిం అయినందుకు ఎదుర్కున్న అనుమానాలూ, సందేహాలూ బాధించక మానవు. అప్పటికే విప్లవకారుడిగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న రాంప్రసాద్ బిస్మిల్ తన ఊరివాడే అయినా అతనికి తనపైన నమ్మకం కలిగించి హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందడానికి అష్ఫాఖుల్లా ఖాన్ చాలా అవమానాన్ని భరించవలసి వచ్చింది. ఆ 'విప్లవకారుడు' ముస్లింలను అనుమానించడం తన హక్కయినట్లు ప్రవర్తించగా, అతనిని మంచి చేసుకొని, అతని మనసు గెలుచుకొని, ఆ సంస్థలో తానూ సభ్యత్వం పొందడానికి అష్ఫాఖుల్లా చాలా కష్టపడవలసి వచ్చింది. గాంధీ మార్గాన్ని తిరస్కరించిన పోరాటకారులందరిలోకీ భగత్‌సింగ్ ఎక్కువ గౌరవం పొందడానికి కారణం అతను లౌకికవాది, ప్రజాతంత్రవాది, సమసమాజవాది కావడం, తన లక్ష్యాల కోసం చిరునవ్వుతో ఉరికంబం ఎక్కడం. కాని భగత్‌సింగ్ కంటే నాలుగేళ్లు సీనియర్ అయిన అష్ఫాఖుల్లా ఖాన్ ఆలోచనలలోనూ ఆ లక్షణాలన్నీ ఉన్నాయి. అతనూ 27వ ఏట నిశ్చల చిత్తంతో ఉరికంబం ఎక్కాడు. అయినప్పటికీ 'ముస్లిం' అన్న ముద్రను జయించనిదే అతనికి విప్లవకారుల బృందంలో చోటు లభించలేదు. ముస్లిం అయినందుకే స్వాతంత్ర్య పోరాటకారుల జాబితాలో ఉచిత స్థానం లభించలేదు. 'ఈ పరిస్థితి ఆనాడు ఒక్క అష్ఫాఖాన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. మాతృదేశం కోసం ప్రాణాలు తృణప్రాయంగా భావించిన ముస్లిం విప్లవకారులలో పలువురికి ఈ చేదు అనుభవాలు తప్పలేదు' అన్న నశీర్ అహమ్మద్ వ్యాఖ్య సగటు పాఠకులకు సిగ్గు కలిగించక మానదు.

సమీక్ష ఎక్కడో ఒకచోట ఆపాలి కాబట్టి ఇక్కడ ఆపుతాను. నశీర్ అహమ్మద్ జాతీయోద్యమ రాజకీయాలలో ముస్లింల పాత్ర గురించి, స్థానం గురించి జరిగిన పరిశోధనను లోతుగానే అధ్యయనం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు స్వయంగా కొంత విషయ సేకరణ కూడా చేశారు. చరిత్ర చీకటి కోణాలలో ఉండిపోయిన అనేకుల గురించి సమాచారం అందించారు. ముస్లిం స్త్రీల పాత్ర గురించి, ఆంధ్రప్రదేశ్ భూభాగానికి చెందిన ముస్లింల గురించి విడిగా సమాచారం ఇచ్చారు. 2005లో ప్రచురించిన భారత స్వాతంత్ర్య సమరం– ముస్లిం యోధులు (ప్రథమ భాగం)లో ఇచ్చిన సమాచారాన్ని బట్టి, ఆయన ఇప్పుడు స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర గురించే కాక స్వాతంత్ర్యానంతరం సమాజంలో ముస్లింల స్థితిగతుల గురించి, స్వాతంత్ర్యానికి పూర్వమూ, అనంతరమూ కూడా ముస్లింల గురించి హిందువులలో నెలకొని ఉన్న అపోహల గురించి రచనలు చేపడుతున్నట్టు తెలుస్తున్నది. ఇది ఆహ్వానించదగ్గ ప్రయత్నం.

దానితోబాటు దేశభక్తి, స్వాతంత్ర్య ఉద్యమం మొదలయిన మాటలనే మైనారిటీల దృక్కోణం నుండి విమర్శనాత్మకంగా పరిశీలించే ప్రయత్నం కూడా నశీర్ అహమ్మద్ ఏదో ఒకరోజు మొదలుపెడతారని ఆశిద్దాం. ఇప్పటివరకు చేసిన రచనలలో ఆయన ఈ మాటలకు 'ప్రధాన రాజకీయ స్రవంతి'లో ఉన్న అర్థాన్నే స్వీకరించారు. ఉదాహరణకు బ్రిటిష్ పాలన అంతం కావాలని కోరుకుంటూనే బ్రిటిష్ వారి నిష్క్రమణ తరువాత ముస్లింలకు వేరే భూభాగం కావాలని కోరుకున్న వారెవ్వరి ప్రస్తావనా ఈ రచనలలో లేదు. వారిది స్వాతంత్ర్య పిపాస ఎందుకు కాకుండా పోయింది? ఇండియా ఆనాడు విడిపోకుండా ఉండడం అసాధ్యమా, విడిపోవడం వల్ల నష్టమే ఎక్కువ జరిగిందా అన్న ప్రశ్నలను నేనిక్కడ చర్చించడం లేదు. అదెట్లాగున్నా, అల్లమా ఇక్బాల్ వంటివారూ మహమ్మద్ ఆలీ జిన్నా వంటివారూ దేశభక్తులు కారనీ, వారిది స్వాతంత్ర్య పిపాస కాదనీ అనగలమా?



**రిపోర్టులు:**

## రైతుల ఆత్మహత్యలకు నష్టపరిహారం

# అది 420 జీవో కాదుగానీ...

రైతుల ఆత్మహత్యలను నివారించడానికి ఏం చేయాలో సూచించేటందుకు ఒక కమిషన్‌ను నియమించబోతామనీ, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే ఏర్పాటు చేస్తామనీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రకటించింది.

నివారణ మార్గాల అధ్యయనం కోసం జయతి ఘోష్ కమిషన్‌ను నియమించింది. పరిహారం నిమిత్తం జీవో నెం.421, రెవెన్యూ శాఖ (తేదీ, జూన్ 2004) జారీ చేసింది.

జీవో నెం.421 అమలు గురించి మానవహక్కుల వేదిక కరీంనగర్, గుంటూరు, కృష్ణా, అనంతపురం, రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, వరంగల్, కడప జిల్లాలలో పర్యటించి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించాము.

రైతుల ఆత్మహత్యలు, వాటిపైన అధికార విచారణలు, నష్టపరిహారం మంజూరు లేక నిరాకరణ నిత్యం జరుగుతూనే ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం ఎంతమందికి నష్టపరిహారం ఇచ్చింది అనే ప్రశ్నకు తుది సమాధానమేదీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 2000కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పత్రికలలో వచ్చిన వార్తలు తెలుపుతున్నాయి. అందులో ఈ సంవత్సరం మార్చి 10వ తేదీ నాటికి 665 కేసులలో మృతులకు కుటుంబాలకు నష్టపరిహారం అందజేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆమోదం పొంది ఇంకా నష్టపరిహారం అందజేయని కేసులు కూడా కలుపుకున్నా, మొత్తం మీద 50 శాతం మించి నష్టపరిహారం పొందలేదని భావించవచ్చు.

నష్టపరిహారం నిరాకరించినవన్నీ అబద్ధపు కేసులే అయివుంటే ఇందులో ఆందోళన చెందవలసిందేమీ లేదు. కానీ అన్నీ అబద్ధపు కేసులు కావు. కొన్ని అటువంటివి కూడా ఉన్నాయి. కానీ జీవో 421లోని లోపాలు, దాని అమలులోని లోపాలు నష్టపరిహారం నిరాకరణకు ముఖ్య కారణం.

### జీవో 421లో ఏముంది?

'వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమస్యల' కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డవారి కుటుంబాలకు ఆర్థికంగా ఆధారం కల్పించడానికి లక్ష రూపాయలు, బాకీలు తీర్చడానికి గరిష్ఠంగా 50,000 రూపాయలు ఇచ్చే ఏర్పాటు చేస్తుంది ఈ జీవో. 'వ్యవసాయ కార్యకలాపాలు, ఆర్థిక సమస్యలు, సమాజం ఎదుట అవమానం, తత్ఫలితమైన ఆత్మహత్య' అనే అంశాల మధ్య సంబంధం రుజువయినట్టయితే ఈ నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని అంటుంది.

ఒక ఆత్మహత్య ఘటన ఈ పరిధిలోకి వస్తుందా రాదా అని నిర్ణయించడానికి ఈ జీవో ఒక త్రిసభ్య కమిటీని నియమిస్తుంది. సంబంధిత డివిజన్‌కు చెందిన ఆర్డీవో, డిఎస్‌పి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ కమిటీలో సభ్యులు. వీరు ఆ ఘటన నష్టపరిహారం పొందగల ఆత్మహత్యా కాదా అని నిర్ణయిస్తారు. తదుపరి అప్పుల వాళ్లతోనూ, ఊరిపెద్దలతోనూ కుటుంబ సభ్యులతోనూ కూర్చొని అన్ని బాకీలూ ఒక్కసారి సెటిల్ చేయడం కోసం ప్రయత్నిస్తారు.

నష్టపరిహారం ఇవ్వడానికి ఈ జీవో ప్రకటించిన ప్రమాణంలోనే అస్పష్టత ఉంది. 'వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమస్యలు' అంటే అర్థం ఏమిటి? రైతుకు ఆదాయం వ్యవసాయం నుండి వస్తుంది. కాని ఖర్చు వ్యవసాయ సంబంధమైనదీ ఉంటుంది (ఎరువులు, మందులు, విత్తనాలు, కరెంటు వగైరాల కోసం), ఇతరమూ ఉంటుంది. దైనందిన ఖర్చులు, పిల్లల చదువులు, అందరి ఆరోగ్యం, కూతుర్ల పెళ్లిళ్లు, వగైరాలు తప్పనిసరి ఖర్చులు. ఈ ఖర్చుకు చాలినంత ఆదాయం వ్యవసాయం నుండి రానట్టయితే, ఈ రాకపోవడం అప్పుడప్పుడు కాక ప్రతీ సంవత్సరమూ జరిగి నట్టయితే రాబడికీ ఖర్చుకూ మధ్య ఏర్పడే ఖాళీని పూరించడానికి అప్పుచేయక తప్పదు. సరళమైన పద్ధతిలో అప్పు దొరకకపోతే కఠినమైన షరతులతోనయినా సరే అప్పు చేయక తప్పదు. సంవత్సరం సంవత్సరం చేసిన అప్పు పోగుపడి ఇంక తీర్చలేమనుకున్నప్పుడో ఇంక అప్పు పుట్టదనుకున్నప్పుడో ఆత్మహత్య చేసుకోవడం తప్ప గత్యంతరం లేదన్న మానసిక స్థితిని చేరుకోవడం, ప్రాణం తీసు కోవడం జరుగుతున్నది.

అవసరమయిన ఖర్చుకూ వ్యవసాయ ఆదాయానికీ మధ్యనున్న అంతరాన్ని పూడ్చలేని నిస్సహాయ స్థితిని చేరుకోవడం అనేదాన్ని 'వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమస్య' అని క్లుప్తీకరించదలచుకుంటే అభ్యంతరం చెప్పనక్కరలేదుగానీ, దాని భావం ప్రజలకూ అధికార్లకూ కూడా స్పష్టంగా ఉండాలి. దానిని విడమరచి చెప్పు, 'వ్యవసాయ కార్యకలాపాలు, ఆర్థిక సమస్యలు, సమాజం ఎదుట అవమానం, తత్ఫలితమైన ఆత్మహత్య'ల మధ్య సంబంధం రుజువయితేనే మృతుని కుటంబానికి నష్టపరిహారం దక్కుతుందన్నారు. ఇక్కడ 'ఆర్థిక సమస్యలు' అనే దానిని కేవలం వ్యవసాయ ఆదాయానికీ వ్యవసాయ సంబంధమైన వ్యయానికీ చెందిన సమస్యగా అర్థం చేసు కోకుంటే తప్పులేదు. ఆ విధంగానే అర్థం చేసుకోవాలని జీవోలో అనలేదు. కానీ ఏవిధంగా అర్థం చేసుకోవాలో స్పష్టంగా చెప్పనూ లేదు.

దీనివల్ల చాలా కుటుంబాలు నష్టపరిహారం పొందలేక పోయిన వైనాన్ని చూస్తే తప్ప ఈ అస్పష్టత కల్గించిన నష్టం అర్థంకాదు. అప్పు తీసుకున్నది కేవలం వ్యవసాయ అవసరాల కోసం అయినట్టయితేనే ఆ అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనకు జీవో 421 వర్తిస్తుందని ఎమ్మార్వోలూ, ఆర్డీవోలూ అంటున్నారు. జీవో అస్పష్టంగా ఉందే తప్ప ఇంత కచ్చితంగా వ్యవసాయేతర అవసరాల కోసం తీసుకున్న అప్పు లెక్కలోకి రాదని అనలేదు కదా అంటే, ప్రభుత్వం ఆ రకంగా 'ఇన్‌స్ట్రక్షన్స్' ఇచ్చిందని అంటున్నారు.

కొన్ని ఉదాహరణలు చూద్దాం.

కరీంనగర్ జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట గ్రామస్థురాలు పులి సత్తవ్వ 2004 సెప్టెంబర్ 23న పురుగుల మందు తాగి చనిపోయింది. ఆమె భర్త గౌరయ్యకు గుండె జబ్బు తీవ్రంగా ఉన్న కారణంగా వ్యవసాయ పనులు ఆమే చూసుకునేది. వారికి రెండున్నర ఎకరాలుండె.



బావి కూడా ఉండింది. బావికింద వడ్లు పండించేది. నాలుగేళ్ల కింద 80 వేలు ఖర్చుపెట్టి బావి రిపేరు చేయించి మోటార్ పెట్టింది. అప్పటి నుండి బావిలో నీళ్లు లేవు. ఆ తరువాత ఒక బిడ్డకు పెండ్లి చేసింది. దానికి లక్షా 80 వేలు ఖర్చయింది. భర్తకు అవసరమయ్యే వైద్యానికి నెలకు 800 రూపాయలు ఖర్చయ్యేవి. మూడేళ్లుగా వర్షాలు లేక పంట దిగుబడి బాగా దెబ్బతినగా, అప్పు లక్షా 50 వేలకు చేరుకుంది. సెప్టెంబర్ 23 నాడు సత్తవ్వ బావికాడికి పోయి ఏడ్చింది. ఆ తరువాత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునింది. అయితే ఆమె అప్పు చేసింది బిడ్డ పెండ్లి కోసం అన్న మిషమీద ఆమె కుటుంబానికి అధికారులు నష్టపరిహారం నిరాకరించారు.

కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం మల్లెంపాడు గ్రామానికి చెందిన మానుకొండ రాంబాబుకు పది ఎకరాల భూమి ఉండేది. ఇది సాగర్ ఎడమ కాలవ చివరి భూమి. నాలుగేళ్లుగా కాలవ నీళ్లు రావడంలేదు. బోరుగానీ వేరే ఇతర నీటివనరు గానీ లేదు. పత్తి, మిర్చి వేయగా ప్రతీ సంవత్సరం నష్టం రాసాగింది. పంట బాగున్న రోజులలో రెండున్నర లక్షలు పెట్టి ఇల్లు కట్టాడు. ఆ బాకీ మిగిలిపోయింది. ఆ తరువాత జరుగుబాటు కోసం తీసుకున్న అప్పులు కూడా తోడయి బాకీ బాగా పెరిగింది. మూడు ఎకరాలు అమ్మి తీర్చింది తీర్చగా ఇంకా ఆరు లక్షల అప్పు మిగిలింది. 21 జూన్ 2004 నాడు రాంబాబు పొలం దగ్గరే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పు ఇల్లు కట్టడం కోసం తీసుకున్నాడని చెప్పి అతని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వలేదు.

ఇటువంటి ఉదాహరణలు దాదాపు అన్ని జిల్లాలలోనూ ఉన్నాయి.

'వ్యవసాయ కార్యకలాపాల'తో ముడిపడి ఉన్న ఆర్థిక సమస్యలే అయివుండాలి అనడం ఇంకొక రకంగా కూడా వారికి అన్యాయం చేసింది. వ్యవసాయం చేసి చేసి అప్పులపాలయి, ఇంక చేసే పరిస్థితి లేక మానేసి కూలి చేసుకొని బతుకుదామంటే కూలి కూడా సరిగ్గా దొరకక, అప్పు ఎన్నటికీ తీరే మార్గం కనిపించక ఆత్మహత్య చేసుకుంటే జీవో 421 ప్రకారం అది రైతు ఆత్మహత్య కాదు అని అధికారులు అంటున్నారు.

కరీంనగర్ జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామస్థుడు సోమశెట్టి కిష్టయ్యకు మూడు ఎకరాల భూమి ఉంది. ఊరందరిలాగే పత్తి పండించడం మొదలుపెట్టాడు. మూడేళ్లుగా వర్షాలు లేక పంట విపరీతంగా నష్టమయింది. 2003లో రెండెకరాలు అమ్మేశాడు. మిగిలిన ఒక ఎకరం పెట్టుబడులు లేక ఆ ఏడు, మరుసటి ఏడు కూడా బీడు పెట్టాడు. లక్షా 30 వేల అప్పు తేలింది. ఊరిలో చిట్టీ పాడి ఏవయినా పని దొరుకుతుందేమోనని బొంబాయికి పోయాడు. ఇంత తిని ఇంత మిగిలించి మెల్లగా అప్పు తీర్చుదామనుకున్నాడు. అక్కడ కూడా పని దొరకక వెనక్కి వచ్చి 2004 ఆగస్టు 19న ఆత్మహత్య చేసుకున్నాడు. రెండేళ్లుగా వ్యవసాయమే చేయడం లేదు కాబట్టి ఇది వ్యవసాయ కార్యకలాపాలతో ముడిపడిన ఆర్థిక సమస్యల వల్ల సంభవించిన మరణం కాదని చెప్పి అధికారులు కిష్టయ్య కుటుంబానికి నష్టపరిహారం మంజూరు చేయలేదు.

అప్పుల బరువు వల్ల కుటుంబంపైన పడే ఒత్తిడి ఆ ఇంటి ఆస్తికి యజమాని అయిన మగవాడిపైన మాత్రమే పడదు. ఇతరులపైన కూడా పడుతుంది. వారు కూడా తరచుగా కుటుంబానికి సంపాదనాపరులు అయివుంటారు. అప్పుల భారానికి తట్టుకోలేక వారు సహితం ప్రాణం తీసుకోవచ్చు. కానీ వారు 'రైతులు' కారు– అంటే భూమి వారి పేరిట లేదు– అన్న మిషతో ఆ చావులు జీవో 421 పరిధిలోకి రావని అధికారులు అంటున్నారు.

వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరుకు చెందిన చిట్యాల పద్మ 2004 జూన్ నెల 19న ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త పాల్ ఎకరం 35 గుంటలకు యజమాని. వారి కుటుంబాని కది చాలని కారణంగా పద్మ కూలికి పోయేది, పాల్ పాలేరుగా పనిచేసేవాడు. వారికి 12, 10, 4 సంవత్సరాల వయసున్న ముగ్గురు కుమార్తెలున్నారు. చేయగా చేయగా రూ.80 వేలు చేరుకున్న అప్పుంది. 2004లో 25 గుంటలలో వరి పంట పెట్టగా రాళ్లవాన కురిసి అది మొత్తం ధ్వంసం అయింది. ఆ బాధతో పద్మ ఆత్మహత్య చేసుకుంది. భూమి యజమానురాలు ఆమె కాదన్న కారణంగా అది రైతు హత్య కాదన్నారు.

వరంగల్ జిల్లాలోనే హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో ముల్కలపల్లి లక్ష్మి 14.6.2000 తేదీనాడు ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త పేరిట ఎకరన్నర భూమి ఉండింది. లక్షా 30 వేల అప్పు కూడా ఉండింది. బిడ్డ పెండ్లికి 60,000 కట్నం ఇస్తామని ఒప్పుకొని 10,000 మాత్రమే ఇచ్చిన కారణంగా అల్లుడు బిడ్డను వెనక్కి పంపాడు. బావి కింద కూరగాయలు పండించుకునేవారు గానీ బావి ఎండిపోవడంతో ఆ ఇంత భూమి కూడా అమ్ముకున్నారు. పోగైన బాకీ తీర్చే మార్గం కానరాక లక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. ఎఫ్ఐఆర్‌లో లక్ష్మి చావుకు కడుపునొప్పి, భర్త తాగుడు, మానసిక ఒత్తిడి కారణం అని రాశారు. భూమిగానీ, దానిని నమ్ముకొని చేసిన అప్పుగానీ ఆమె పేరు మీద లేనందున ఆమె మానసిక వేదనకు అప్పుల బాధ అని అధికారులు పేరుపెట్టలేదు. జీవో 421 కింద ఆమె కుటుంబానికి నష్టపరిహారమూ ఇవ్వలేదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పై రెండు ఉదంతాలలోనూ ఆ అప్పు ఎన్నడయినా తీర్చడం అంటూ జరిగి ఉంటే అందులో లక్ష్మి శ్రమ, పద్మ శ్రమ, వారి భర్తల శ్రమతో సమానంగా ఉండేది. అయినప్పటికీ వారి చావుకు ఆ అప్పుతో సంబంధం లేదనే ప్రభుత్వం భావించింది.

నష్టపరిహారం చాలా కేసులలో ఇవ్వకపోవడానికి మరొక కారణం శవానికి పోస్టుమార్టం జరగ లేదు అనేది. పోస్టుమార్టం జరగకపోతే ఏమి? మృతుని చావు ఆత్మహత్య వల్లనే జరిగిందన్న రుజువు అవసరం కాబట్టి పోస్ట్‌మార్టం జరిగి తీరాలంటున్నారు. ఆత్మహత్య అన్న నిర్ధారణ జీవో 421 పరిధిలో అవసరమే గానీ దానికి పోస్టుమార్టం తప్పనిసరిగా ఎందుకు జరగాలి? శవ పంచ నామా ఎట్లాగూ జరుగుతుంది. పోలీసులూ ఎమ్మార్వో హాజరవుతారు. గ్రామస్థులు సాక్షులుగా ఉంటారు. శవపంచనామాలో మరణానికి కారణం ఆత్మహత్యేనని వీరంతా అభిప్రాయపడినట్టయితే అదెందుకు సరిపోకూడదు? జీవో 421 కింద జరిపే విచారణ క్రిమినల్ నేర విచారణ కాదు కదా!

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాహెబ్ పేటకు చెందిన జవ్వాది లచ్చయ్య నాలుగు ఎకరాల రైతు. అదొక కుంట కింద భూమేగానీ ఆ కుంట నీటిని గ్రామస్థులు పొలాలకు పారించకుండా నిలువ ఉంచుకోవాలని నిర్ణయించుకోవడంతో ఆయకట్టులో ఉండీ లేనట్టయింది. సాగర్ ఎడమ కాలువ నీళ్లు కూడా కొంత అందేవిగానీ నాలుగేళ్లుగా అదీ లేదు. బావి తవ్వితే రేగడి మట్టి కావడం వల్ల రెండుసార్లు కూలిపోయింది. బోర్లు కూడా రెండు వేయించాడు గానీ అవి కూడా ఫలించలేదు. ఇదికాక అతని అనారోగ్యం కారణంగా ఆస్పత్రి ఖర్చు బాగా అయింది. వెరసి, రెండు లక్షల అప్పయింది. 2004 మార్చి 23 నాడు అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య నేరం అని ఎవరో చెప్పడం వల్ల కేసవుతుందని భయపడి అతని కుటుంబ సభ్యులు పోలీస్ కంప్ల యింట్ ఇవ్వలేదు, అతని శవానికి పోస్టుమార్టం జరగలేదు. అతను ఆత్మహత్య చేసుకున్నాడన్న



విషయంలో ఎవరికీ విభేదం లేదుగానీ పోస్టుమార్టం జరగలేదని చెప్పి నష్టపరిహారం ఇవ్వలేదు.

అధికారులకు తెలిసిన తరువాత కూడా పోస్టుమార్టం జరగని సందర్భాలలో సహితం పోస్టు మార్టం జరగలేదు అని చెప్పి నష్టపరిహారం ఇవ్వని ఉదంతాలున్నాయి. ఇది పూర్తిగా అన్యాయం. ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో చనిపోతే పోస్టుమార్టం జరిపించడం ప్రభుత్వం బాధ్యత. చనిపోయిన వారి కుటుంబానిది కాదు. కుటుంబ సభ్యుల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ అధికారులు జరిపించాలి. (పరిటాల రవి మృతదేహానికి రెండవ పోస్టుమార్టం జరిపించడం కోసం అతని కుటుంబం సమ్మతి పొందడానికి సిబిఐ వారు పడిన ఆరాటాన్ని గురించి పత్రికలలో చదివినవారు అదే చట్టం కాబోలుననుకొని ఉండవచ్చు. అది చట్టం కాదు. పరిటాల రవి బతుకు లోనే కాదు, చావులో కూడా చట్టం కంటే ఎక్కువని రుజువు చేసిన ఘట్టం మాత్రమే).

కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని అక్కలరెడ్డిపల్లి ఒక మారుమూల గ్రామం. ఆ ఊరిలో ఎనుముల వీరయ్య అనే రైతు ఉండేవాడు. కులం రీత్యా వాళ్లు దేవాంగులు. అయితే కుల వృత్తి 15 ఏళ్ల కిందే నాశనం కాగా, ఉన్న అర ఎకరం భూమికి తోడు రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయసాగాడు. ఆ భూమికి ఆధారంగా బావి ఉండిందిగానీ ఊరిలో మిగిలిన రైతులు బోర్లు వేయడంతో బావి ఎండిపోయింది. వర్షాధారంగా వేసిన పంటతో జరుగుబాటు కాకపోగా 30 వేలు అప్పు మిగిలింది. 2004 జూన్ 16 నాడు అతను ఆత్మహత్య చేసుకునే నాటికి ఇంట్లో పిడికెడు బియ్యం కూడా లేవు. అతని శవం ఇంటి బయట ఉండగానే ఎమ్మార్వో, ఆర్డీవో గ్రామానికి వచ్చారు. ఇద్దరూ శవాన్ని చూశారు. పత్రికల వారితో మాట్లాడుతూ అది ఆత్మహత్యేననీ, అప్పుల వల్లనే చనిపోయాడనీ అన్నారు. అయినప్పటికీ పోస్టుమార్టం జరిపించే ప్రయత్నమేదీ వారు చేయ లేదు. కుటుంబ సభ్యుల మాటకొస్తే, పోస్టుమార్టం జరిపించడానికి మృతదేహాన్ని బద్వేల్ తీసుకు పోయి అక్కడ మోసేవాళ్లకూ, కోసేవాళ్లకూ డబ్బులిచ్చుకోవాలంటే ఎంత తక్కువనుకొన్నా ఎనిమిది వేల రూపాయలు ఖర్చవుతాయని భయపడ్డారు. అంత డబ్బు ఉంటే వీరయ్య చనిపోయేవాడే కాదు! అందువల్ల వారు పోస్టుమార్టం జరిపించలేదు. కాబట్టి ఆత్మహత్య రుజువు కాలేదన్న నెపంతో అధికారులు వీరయ్య కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వలేదు.

అప్పుల భారం వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందనీ, అందువల్ల చనిపోయిన విషయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనీ, ఎమ్మార్వో వచ్చినప్పుడు అప్పుల విషయం చెప్పాలనీ తెలియని 'ఎడ్డి' మనుషులూ చాలామంది ఉన్నారు. అటువంటి వారు వట్టి అమాయకత్వం వల్ల ప్రభుత్వ సహాయం పొందలేకపోయారు. తాను చేయదలచుకున్న సహా యాన్ని ప్రజలకు తెలియజెప్పాలని, వాళ్లొకవేళ తెలియక సకాలంలో సమాచారం అధికారులకు అందించని పక్షంలో తరువాతయినా వారి నుండి సమాచారం స్వీకరించి దానిని సరిచూసుకొని తగు చర్య చేపట్టే ఏర్పాటు రూపొందించుకోవాలని ప్రభుత్వం అనుకోలేదు.

గుంటూరు జిల్లా నగరం మండలం ఇంకొల్లువారి పాలెంకు చెందిన ఇంకొల్లు వెంకట నారాయణకు ఎనిమిది ఎకరాల భూమి ఉండేది. అది కృష్ణా డెల్టా ప్రాంతం. వెంకట నారాయణ భూమి ఆయకట్టులో లేదుగానీ కాలవ నుండి మోటార్ పెట్టి తన పొలాలకు పారించుకునేవాడు. అయితే రెండేళ్లుగా కృష్ణా డెల్టా కాలవలలో నీళ్లు సరిగ్గా రాకపోవడం వల్ల వెంకట నారాయణ వంటి అదనపు వాడకందార్లకు నీరు కరువయింది. అప్పటినుండి అప్పులు మొదలయ్యాయి. దీనికి

కొడుకు బిఇడి చదువు ఖర్చు తోడయింది. పొలం తగాదాల కేసుల ఖర్చూ ఉండింది. మొత్తానికి అప్పు లక్ష దాకా అయిన తరువాత 2004 మే 29న వెంకట నారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడానికి నగరం పోలీస్ స్టేషన్‌కు పోగా, అక్కడి ఎస్ఐగారు కేసు కట్టడానికీ, పోస్టుమార్టం జరిపించడానికీ బద్ధకించి కాబోలు 'మీకు నష్టపరిహారం రాదులే - ఈ కేసులెందుకు' అన్నాడంట. వాళ్లు అంతే కాబోలునుకొని ఇంటికొచ్చేశారు.

ఇవి- స్థూలంగా- జీవో 421లోని లోపాలు కాగా, దాని అమలు కూడా చాలా అస్తవ్యస్తంగా ఉంది. మొదటి విషయం, ఈ జీవో కాపీ ఎమ్మార్వో ఆఫీసులో సయితం లేకపోవడం. ఏ పరిస్థితులలో మృతుల కుటుంబాలు నష్టపరిహారానికి అర్హమవుతాయో ప్రజలకు చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడం. కనీసం జీవో తెలుగు ప్రతి గ్రామపంచాయతీలలో ప్రజలకు అందుబాట్లో పెట్టి ఉంటే చదువొచ్చిన వారయినా తెలుసుకుందురు. తెలియక పోవడం వల్ల అధికారులకు ఏయే విషయాలు చెప్పాలో అర్థంకాక నష్టపరిహారం పొందలేకపోయిన వారున్నారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం సీతారాంపురానికి చెందిన పోతురాజు నర్సింహులుకు ఎకరం సొంత భూమి ఉండేది. మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని చేసేవాడు. మూడేళ్లుగా పంట పండలేదు. అప్పులు పెరిగాయి. దానితోపాటు ఇల్లు కట్టుకునే ప్రయత్నంలో ఇంకొంచెం అప్పు చేశాడు. అప్పు 48 వేలకు చేరేసరికి బేజారయి 2004 జూన్ 28న ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మార్వో వచ్చినప్పుడు అతని భార్య సబిత మనసులో ఇంటి ఖర్చే ప్రధానంగా ఉండింది. ఆమె దాని గురించే చెప్పింది. ఎమ్మార్వో వేరే ఏమీ అడగకుండా ఆమె చెప్పింది రాసుకుపోయి 'ఇల్లు కట్టుకోవడం కోసం అప్పుచేశాడు కాబట్టి ఇది వ్యవసాయ కార్యకలాపాలకు సంబంధించిన ఆర్థిక సమస్య కాదు' అని రిపోర్టు పంపాడు. జీవో 421లో ఏముందో సబితకు తెలిస్తే తన భర్త ఇంటికోసమే కాక పంట కోసమూ అప్పుచేశాడని- అది వాస్తవం కాబట్టి- చెప్పి ఉండేది. తెలియకపోవడం వల్ల అప్పటికి తన మనసులో ఏముందో అది మాత్రం చెప్పింది. ప్రజలను ఇట్లా మోసంచేసి ఇక్కడొక లక్షా అక్కడొక లక్షా మిగిలించుకోవాలని చూసే ప్రభుత్వాన్ని ఏమనాలి?

కాగా, ఆత్మహత్య జరిగిన వెంటనే శవపంచాయతీ చేసే సమయంలో పోలీసులు లేక ఎమ్మార్వో ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకొని పై అధికారులకు పంపాలనీ, దానిపైన ఆర్డీవో, డిఎస్‌పి, జెడి (వ్యవసాయ శాఖ)ల త్రిసభ్య కమిటీ పరిశీలన జరిపి ప్రభుత్వానికి సిఫారసు చేయాలనీ జీవో అంటోంది. ఈ క్రమం ఎక్కడా సరిగ్గా అమలు కాకపోవడం రెండవ విషయం.

ఎమ్మార్వోలు బాధిత కుటుంబాలతో మాట్లాడకుండా ఎవరో చెప్పింది రాసుకుపోయిన సందర్భాలు అనేకం.

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరుకు చెందిన ఆకుల సాంబయ్య 2004 సెప్టెంబర్ 28 నాడు ఆత్మహత్య చేసుకున్నాడు. వడ్రంగం కులవృత్తిగా గల సాంబయ్య ఆ వృత్తికి అవకాశాలు దెబ్బతిన్న కారణంగా మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని చేస్తున్నాడు. బావి ఉన్న భూమిని కౌలుకు తీసుకున్నప్పుడు వరిపంట వేశాడు, బావి లేనిది తీసుకున్నప్పుడు పత్తి పెట్టాడు. ఏం చేసినా నాలుగేళ్లగా నష్టమే. అప్పు 79 వేలకు చేరింది. అప్పు తెచ్చి వేసిన పత్తి పంటను కాపాడడానికి ఇంకొంచెం అప్పు అవసరమై ప్రయత్నం చేయగా పుట్టలేదు. దానితో విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నాడు. అతను చేసిన అప్పు బిడ్డ పెండ్లి కోసం అని ఎమ్మార్వో రిపోర్టు పంపిన కారణంగా సాంబయ్య కుటుంబానికి నష్టపరిహారం దక్కలేదు. తీరా చూస్తే సాంబయ్యకు ఉన్నది



ఒకే కూతురు రేణుక. ఆ అమ్మాయి వయసు కేవలం పది సంవత్సరాలే. ఆమె పెళ్లి గురించి సాంబయ్య గానీ, అతని భార్య గానీ అప్పటికి ఏ ఆలోచనా చేయలేదు. మరి జరిగిందేమిటంటే, సాంబయ్య తన ఊరిలో చనిపోలేదు. అప్పు కోసం దుద్దెనపల్లికి పోయి అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. శవపంచనామా అక్కడే జరిగింది. ఎమ్మార్వో అసలు ఆకునూరుకు రానేలేదు, సాంబయ్య కుటుంబాన్ని చూడనేలేదు. దుద్దెనపల్లిలో ఎవరో చెప్పిన దాన్ని బట్టి రిపోర్టు పంపించాడు.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం బొల్లిగుట్ట తాండాకు చెందిన లావ్రీ రాము 2004 ఆగస్టు 8న ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి ఉన్న రెండెకరాల భూమిలో మూడు బోర్లు వేశాడు. 60 వేల అప్పయింది. పత్తి పంట వేశాడు గానీ బొటాబొటిగా దిగుబడి వచ్చింది. పైగా అదనంగా ఖర్చయింది. 2003-04 సంవత్సరాలలో పత్తి దిగుబడి అసలే రాకపోయేసరికి తన ఇద్దరు కొడుకులకు భూమి తలా ఒక ఎకరం పంచి ఇచ్చి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి బిడ్డతో ఏదో తగాదా ఉండడం వల్ల ఆత్మహత్య చేసుకున్నాడే తప్ప పంట నష్టం వల్ల కాదని అతని కుటుంబంతో మాట్లాడకుండానే ఎమ్మార్వో రిపోర్టు పంపించాడు. ఆ సంగతి ఎట్లా కనుక్కున్నావని ఎమ్మార్వోను అడిగితే, ఎంపిపి చెప్పాడంటాడు.

ఎమ్మార్వో రిపోర్టును పరిశీలించి నష్టపరిహారం విషయంలో తుది నిర్ణయం చేయవలసిన త్రిసభ్య కమిటీ ఒక కమిటీగా ఎక్కడా పనిచేసిన దాఖలాలు లేవు. వారు పరిశీలన ఎక్కడ జరుపుతున్నారో గానీ గ్రామాలకు మాత్రం పోవడంలేదు, బాధిత కుటుంబంతో మాట్లాడడంలేదు. బాధిత కుటుంబంతోనూ, ఇరుగు పొరుగుతోనూ మాట్లాడడం, ఇంకా సందేహం అనిపిస్తే గ్రామసభ నిర్వహించి అందరి అభిప్రాయాలూ తీసుకోవడం ఉచితమైన మార్గం. అటువంటి ఆలోచనేదీ మన పాలకులు చేయడంలేదు.

కృష్ణా జిల్లాలో విజయవాడ సబ్-కలెక్టర్ గారు విజయవాడలోనే దర్బార్ నిర్వహించి మృతుల కుటుంబాలను రమ్మని పోలీసుల ద్వారా పిలిపించాడు. జీవో 421 అనేదొకటి ఉందనిగానీ, దానిలో ఫలానా విషయాలు ఉన్నాయని గానీ తెలియని జనం కొందరు పోయారు, కొందరు పోలేదు. పోయినవారిలో కొందరిని దర్బార్‌లో మాట్లాడనిచ్చారు, కొందరిని మాట్లాడనీయలేదు. ఆ రకంగా సాగింది త్రిసభ్య కమిటీ సమీక్ష.

కొన్నిచోట్ల ఆ మాత్రం కూడా జరగలేదు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాల గ్రామనివాసి జగమోని సురేందర్‌రెడ్డికి 30 గుంటల భూమి ఉంది. దానిలో మూడు బోర్లేస్తే మూడూ విఫలం కాగా దానిని అమ్మేసి నాలుగు ఎకరాల బోర్లున్న భూమిని కౌలుకు తీసుకున్నాడు. సిటీలో పాలు అమ్ముకుందామని మూడు బర్రెలు కొంటే రెండు చనిపోయాయి. లక్షా 88 వేల రూపాయల అప్పయింది. అది తీరే మార్గం కానరాక 2004 ఆగస్టు 5వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. విచారణ నిమిత్తం అదేనెల 16వ తేదీన ఆర్డీవో వస్తున్నాడని తెలిసి సురేందర్‌రెడ్డి కుటుంబమంతా ఎదురు చూశారు. ఆర్డీవో రాలేదు. కానీ కొన్ని రోజుల తరువాత పేపర్లో ఆర్డీవో ప్రకటన వచ్చింది. సురేందర్‌రెడ్డికి టిప్పర్లు ఉన్నాయనీ, అతను కేవలం రైతు కాదనీ, అందువల్ల అతని కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందదనీ ఆ ప్రకటన సారాంశం. మాకు టిప్పర్లు లేవు మొర్రో అని ఆ కుటుంబం ఎంత మొత్తుకున్నా ఆర్డీవో నుంచి మళ్లీ స్పందన లేదు, వివరణ లేదు, పునః పరిశీలన లేదు.

❖

# నగరాలలో పేదలకు చోటులేదా?

-ఎస్. జీవన్‌కుమార్

**కాం**గ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరంలోను, శివార్లలోను పేద ప్రజల ఇళ్ల కూల్చివేతకు సంబంధించి నాలుగు పెద్ద సంఘటనలు జరిగాయి. ఈ నాలుగు కూడా మామూలుగా కార్పొరేషన్ చేసే demolition లాంటివి కావు, ఈ సంఘటనల వెనుక బలమైన రాజకీయ శక్తుల ప్రయోజనాలు మనకు కనపడ్తాయి. నగరం నడిబొడ్డులోని బతుకమ్మకుంటలో, కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లిలో, శామీర్‌పేట మండలంలోని గబ్బిలాలపేట ప్రాంతంలో గుడిసెలు కూల్చివేయబడగా, సరూర్‌నగర్‌లోని సింగరేణి కాలరీస్ దగ్గరి ప్రాంతంలోని బస్తీలను మాత్రం ఒక పథకం ప్రకారం నిప్పుపెట్టి అగ్నికి ఆహుతి చేశారు.

## బతుకమ్మకుంట

అంబర్‌పేట దగ్గర వున్న బతుకమ్మకుంట దాదాపు 15 సంవత్సరాలుగా వార్తల్లో ఉంటోంది. మొదటిసారి 1986లో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ గుడిసెల్ని తొలగించారు. అప్పుడున్న దాదాపు 200 కుటుంబాలు చెల్లాచెదరై వివిధ ప్రాంతాలకు వెళ్ళిపోయాయి. వాళ్ళకు వేరే ప్రాంతాల్లో ఇళ్ళు నిర్మించి ఇస్తామని, బతుకమ్మకుంటలో ప్రజల కోసం పెద్ద పార్క్ నిర్మించబోతున్నామని ప్రకటించారు. అప్పుడు కుంట పెద్దగా ఉండేది. క్రమక్రమంగా బతుకమ్మకుంటను చెత్తతో, నగరంలో పాత ఇళ్ళను కూల్చడం వల్ల వచ్చిన మట్టితో పూడ్చడం మొదలుపెట్టారు. కుంట చుట్టూ గుడిసెలు వేసినప్పుడల్లా అధికారులు తీసివేస్తూ వచ్చారు. 2001వ సంవత్సరంలో కాంగ్రెస్, సి.పి.ఎం. నేతృత్వంలో అక్కడ దాదాపు 200 గుడిసెలు వేసుకున్నారు. కాని కొద్ది రోజుల్లోనే బుల్‌డోజర్లతో ఆ గుడిసెల్ని కూల్చివేసి, ఆ స్థలం చుట్టూ ఇనుప కంచె పెట్టారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన 'విజన్'లో భాగంగా ప్రభుత్వ స్థలాలన్నిటిని ఆదాయం కోసం వాడుకోవాలని, అవసరమయితే ఖాళీ ప్రదేశాలన్నీ అమ్మి రాష్ట్ర ఖజానాను ధనోపేతం చేయాలనే తలంపుతో ఉన్నారు. పైకి మాత్రం ఈ ప్రదేశంలో ప్రజల కోసం పార్క్ నిర్మిస్తామని, గుడిసెలు కోల్పోయిన వారందరికీ వేరేచోట పక్కా గృహాలు కట్టిస్తామని ప్రకటించారు. కాని ఇదివరకటిలాగానే అది హామీగా మాత్రమే మిగిలి, గుడిసెవాసులందరూ తలా ఒక దిక్కు చెల్లాచెదరై పోయారు.

మళ్ళీ 2004వ సంవత్సరంలో ముళ్ళ కంచెకివతల, రోడ్డు మార్జిన్‌లో (6వ నెంబర్ స్టేజి నుంచి శివం వైపు పోయే రోడ్డు) ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన కమ్మరి కులస్తులు (తెలంగాణలో వాళ్ళను బైటి కమ్మరోల్లు అంటారు) గుడిసెలు వేసుకున్నారు. వీళ్ళు భవన నిర్మాణంలో ఉపయోగించే



పనిముట్లయిన గడ్డపారలు, గొడ్డళ్లకు పదును పెడతారు. కొలిమిలో ఇనుప సామగ్రి, కొడవళ్ళు, గొడ్డళ్లు తయారు చేస్తారు. కొద్ది రోజుల తర్వాత వారి పక్కన వినాయకుడి బొమ్మలు, మూసలు ఉపయోగించి ఇతరరకాల బొమ్మలు చేసే ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన కళాకారుల కుటుంబాలు నివసించడం మొదలుపెట్టారు. కొంతకాలం తరువాత ఈ గుడిసెల వెనక ముళ్ళ కంచె లోపల తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో దాదాపు 200 గుడిసెలు వెలిశాయి. అధికారులు గమనించినా కూడా ఏమీ అనలేదు. ఈ సంవత్సరం జనవరి 29న 200 మంది పోలీసులు, ముగ్గురు ఎ.సి.పి.ల నాయకత్వంలో, దాదాపు వంద మంది మునిసిపాలిటీ సిబ్బందితో అకస్మాత్తుగా గుడిసెలపైబడి నాలుగు ప్రొక్లెయిన్‌ల సహాయంతో వాటన్నిటినీ తొలగించారు. పిల్లా, పాప, స్త్రీలు, వృద్ధులు చెల్లా చెదురైనారు. తిండి గింజలు, పాత్రలు, వస్తువులు తీసుకునే అవకాశం కూడా ప్రజలకు ఇవ్వలేదు. ఒకవైపు నుంచి తొలగిస్తూ వస్తుండగా ఇంకొక పక్కన అకస్మాత్తుగా మంటలు లేచాయి. అధికారులే గుడిసెలకు నిప్పుపెట్టారని ప్రజలు ఆరోపించగా, ప్రజలే కోపంతో అంటించుకున్నారని అధికారులు వాదించారు. 200 గుడిసెల్లో కొన్ని కాలిపోగా మిగతావి ప్రొక్లెయిన్లతో తొలగించి వెంటనే బుల్‌డోజర్లు తెచ్చి ఆ ప్రదేశాన్నంతా చదును చేశారు.

అంతేకాదు, చాలా కాలం నుంచి బతుకమ్మకుంట స్లమ్ పక్కన లోపలి వైపు నివసిస్తున్న చెంచుల గుడిసెలపై కూడా పడ్డారు. వాళ్ళు కొంచెం ప్రతిఘటించడంతో లాఠీచార్జి చేసి వాళ్ళ గుడిసెల్నీ తొలగించి బీభత్సం సృష్టించారు. సి.పి.ఎం. నాయకులు అడ్డుకోగా వాళ్ళను అరెస్టు చేశారు. ఆ రోజు సాయంత్రం కాంగ్రెస్, బిజెపి, టిడిపి నాయకులు బతుకమ్మకుంట ప్రాంతాన్ని దర్శించి పాపాజీ దాబా ఎదురుగా రోడ్డు మీద పిల్లా పాపలతో ఏడుస్తూ కూర్చున్న ప్రజలను కలిసి ఓదార్చారు. తెల్లవారి నగర పాలక సంస్థ కమిషనర్ చిత్రా రామచంద్రన్ ఒక ప్రకటన చేస్తూ 22 ఎకరాల స్థలంలో కొందరు స్వార్థపరశక్తులు, రాజకీయ నాయకుల అండతో గుడిసెలు వేసుకున్న 650 మంది ఆక్రమణదార్లను తొలగించామని చెప్పింది. బాగ్ అంబర్‌పేట సొసైటీ స్థలంలో 374 మంది లబ్దిదారులకు, తులసీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ స్థలంలో 300 మంది లబ్దిదారులకు ఇళ్ళను నిర్మించి ఇవ్వాలనే తలంపుతో ప్రభుత్వం ఉందని తెలిపారు. అక్కడక్కడ ధ్వంసమైన ముళ్ళ కంచెను మళ్ళీ రిపేరు చేశారు. ఇంకా 20 దాకా బయటి కమ్మరి కుటుంబాలు పాపాజీ దాబా ఎదురుగా రోడ్డు చివరలో గుడ్డతో వేసుకున్న టెంట్ల గుడిసెల్లో నివాసముంటున్నారు. తక్కిన వాళ్ళంతా ఎప్పటిలాగానే మళ్ళీ చెట్టుకొకరు, పుట్టకొకరుగా విడిపోయి బతుకుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో, తెలుగుదేశం నాయకుల ప్రోత్సాహంతో వేసిన గుడిసెల్ని తొలగించే ప్రక్రియ ఇట్లా జరిగింది.

## బాచుపల్లి

బతుకమ్మకుంట తర్వాత కొద్ది రోజుల్లోనే దాదాపు ఇదే పద్ధతిలో కుత్బుల్లాపూర్ మండలంలోని బాచుపల్లిలో కూడా గుడిసెల్ని తొలగించారు. తెలుగుదేశానికి చెందిన బడా నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా బాగా లబ్దిపొందిన ప్రాంతం ఇది. దాదాపు ఒక కోటి రూపాయల దాకా విలువచేసే ప్రభుత్వ భూములను వారు ప్లాట్లు చేసి అమ్మి, లాభాలు సంపాదించుకున్నారు. బాచుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్ బలహీన వర్గాల కాలనీలో సర్వే నంబర్లు 270, 292, 293లో అక్రమ నిర్మాణాలు చేశారని 27.10.2004 నాడు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల

మేరకు 300లకు పైగా ఉన్న పక్కా గృహాలను పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, ల్యాండ్ ప్రొటెక్షన్ సిబ్బంది కూల్చివేశారు. ఈ ఇళ్ళు పూర్తిగా పేదవారివి కావు. చాలామంది చిన్న చిన్న ఉద్యోగస్తులు. అందరి దగ్గరా పట్టా కాగితాలు ఉన్నాయి. ఇక్కడున్న మొత్తం స్థలం 40 ఎకరాలు. ఈ స్థలంలో కొంత భాగంలో కొంతకాలం క్రితం ప్రభుత్వం బలహీన వర్గాల వారికి 160 క్వార్టర్లు నిర్మించి ఇచ్చింది. ఆ క్వార్టర్లకు ఆనుకుని ఉన్న భూమిని 110 గజాల వైశాల్యం గల ప్లాట్లు చేసి కొందరు పెద్దమనుషులు అమ్మితే ప్రజలు డబ్బులు చెల్లించి కొనుక్కున్నారు. ఇళ్ళు కట్టుకోవడానికి పంచాయతీ అనుమతి ఇచ్చింది. కొనుక్కున్నవాళ్ళు ఇళ్ళు కట్టుకున్నారు. నిర్మాణం జరుగుతున్నప్పుడు అధికారులు నోరు మెదపలేదు. ఆ ప్లాట్లు అమ్మిన పెద్దమనుషులు అధికారం ఉన్న తెలుగుదేశం నాయకులే కాకుండా, స్వయానా రంగారెడ్డి జిల్లాపరిషత్ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ దగ్గరి బంధువులు. ఈ మొత్తం ప్రక్రియలో కాసాని జ్ఞానేశ్వర్ కూడా కోటి దాకా డబ్బులు చేసుకున్నాడని, ఎన్నికల ముందు లక్షలు ఖర్చుపెట్టి నిర్వహించిన 'ముదిరాజ్ మేళా'కు కూడా ఈ సంపాదనలో కొంత ఖర్చుచేశాడని, ప్రజలందరూ బహిరంగంగా చెప్పుకునే వాస్తవం.

ప్రజల దగ్గరున్న కాగితాలు పరిశీలించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అవి నకిలీ పత్రాలని, అయిదుగురు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి అమ్మారని, వారిపై పి.డి. యాక్టును ప్రయోగిస్తున్నామని ప్రకటించాడు. కాని వాళ్ళు గాని, వాళ్ళ నాయకుడైన జ్ఞానేశ్వర్ గాని పోలీసులకు దొరకలేదట. ప్రజలు ఆగ్రహంతో సర్పంచ్ ఇంటిముందు, కాసాని జ్ఞానేశ్వర్ ఇంటి ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా తనను ఇందులోకి లాగిందని, ఆ పట్టా కాగితాలన్నీ సరైనవేనని, సరైనవి కాకుండా గృహ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు ఎందుకు నివారించలేదని సదరు జ్ఞానేశ్వర్ ప్రభుత్వాన్నే ప్రశ్నించాడు. కోర్టు నుంచి ముందస్తు బెయిల్ తీసుకొని నష్టపోయిన ప్రజల్ని సమీకరించి కలెక్టర్ ఆఫీసు ముందు ధర్నా కూడా చేయించి తన రాజకీయ చతురతను ప్రదర్శించుకున్నాడు. 1992 తర్వాత చేసిన విక్రయాలన్నీ అక్రమమైనవని కలెక్టర్ ఆదేశాలు జారీచేయడంతో 1992 తర్వాత ప్లాట్లు కొని, పంచాయతీ అనుమతితో ఇళ్ళ నిర్మాణం చేసుకున్న వ్యక్తులు కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ పాపమంతా తెలుగుదేశం నాయకుడు జ్ఞానేశ్వర్, ఆయన బంధువులదని, నష్టపోయిన ప్రజలకు జ్ఞానేశ్వరే పరిహారం చెల్లించాలని కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు రాజకీయ డిమాండ్‌లు చేశారు. మోసపోయిన వంద కుటుంబాలకు వేరే ప్రదేశంలో ఇళ్ళ పట్టాలు ఇచ్చే ప్రయత్నం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కాని అప్పులు చేసుకుని కట్టుకుని, కూల్చివేతకు గురైన ఇళ్ళకు నష్టపరిహారం గురించి మాత్రం ప్రభుత్వాధికారులు ఏమీ హామీ ఇవ్వలేదు. ఈ మొత్తం ప్రక్రియలో రాజకీయ నాయకులతో పాటు, రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ ఉద్యోగులు ఎన్ని డబ్బులు సంపాదించారో విచారణ జరిపే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఒక గూడు సొంతం చేసుకునే ప్రయత్నంలో రాజకీయ నాయకుల, ప్రభుత్వాధికారుల చేతుల్లో ప్రజలు ఎట్లా మోసపోతారనే వాస్తవానికిదో మంచి ఉదాహరణ.

## గబ్బిలాలపేట

షామీర్‌పేట మండలంలోని గబ్బిలాలపేట ప్రాంతానికి సంబంధించిన గుడిసెవాసుల కథ ఇంకా విచిత్రంగాఉంటుంది. ఈ ప్రాంతంలో దాదాపు 6 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 102 ఎకరాలు పోలీసు కాలనీకి కేటాయించారు. 20 ఎకరాల్లో డెంటల్ కాలేజీ కట్టారు. 18 ఎకరాల స్థలాన్ని చెత్త వేయడానికి (Garbage dumping place) కేటాయించారు. మూడు సంవత్సరాల క్రితం గబ్బిలాలపేటలో, మాదిగ రిజర్వేషన్ పోరాటం ప్రారంభమైన తొలిదశలో, కొందరు దళిత యువకుల నాయకత్వంలో దాదాపు 500 కుటుంబాలు ఇక్కడ గుడిసెలు వేసుకున్నాయి. కొద్ది రోజుల తర్వాత అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించారని శామీర్‌పేట ఎమ్మార్వో ఈ గుడిసెలను తొలగించాడు. కొంతకాలం తర్వాత మళ్ళీ దాదాపు 400 కుటుంబాలు గుడిసెలు వేసుకొని, ఆ నియోజకవర్గం ప్రజా ప్రతినిధి, మంత్రి అయిన దేవేందర్‌గౌడ్‌ను కలిసి, పట్టాలిప్పించవలసిందిగా వేడుకున్నారు. చాలారోజులు తిప్పుకున్న తర్వాత దేవేందర్‌గౌడ్, మీరందరూ తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించి, గద్దె కట్టి తెలుగుదేశం జెండా స్థాపిస్తే సహాయం చేస్తానన్నాడు. ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలుగా ఉన్న యువకులు ఆయన సలహా మేరకు తెలుగుదేశం జెండా ప్రతిష్టించి, సమావేశం నిర్వహించి మంత్రిగారిని ఆహ్వానించారు కూడా. పలుమార్లు మంత్రిని కలిసి పట్టాల కోసం ప్రయత్నించారు.

ఈలోగా తెలంగాణ రాష్ట్ర సమితి నగరంలో కూడా తన బలాన్ని పెంచుకోవడం మొదలుపెట్టింది. టిఆర్ఎస్ వైపు ఆకర్షితులైన యువకులు ఒక బహిరంగ సభ పెట్టి కె.చంద్రశేఖర్‌రావును ఆహ్వానించారు. ఆయన సభకు వచ్చి ఆ ప్రాంతంలో టిఆర్ఎస్ జెండాను ప్రతిష్ఠాపన చేసి, వాళ్లకు పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానని, వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్‌కే ఓట్లు వేయమని చెప్పి వెళ్లాడు. ఈ విషయం దేవేందర్‌గౌడ్‌కు తెలిసి పట్టాల విషయం మాట్లాడడానికి వెళ్ళిన యువకులపై ఆగ్రహం వ్యక్తంచేసి, టిఆర్ఎస్ గద్దెను కూలగొట్టి జెండాను తీసివేసి, మళ్లీ తెలుగుదేశం జెండా పెడితే గాని తాను పట్టాల కోసం ఆదేశాలివ్వలేనని కచ్చితంగా చెప్పాడు. మంత్రి అభీష్టం మేరకు వారు టిఆర్ఎస్ గద్దెను కూల్చివేసిన తరువాతే, ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించి పట్టాలు పొందడానికి లబ్ధిదార్లను ఎంపికచేసే ప్రక్రియ మొదలుపెట్టమని రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగింది. సరిగ్గా ఇదే సమయంలో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల ప్రకటన వెలువడింది. ఎన్నికలు దగ్గర పడటంతో హడావిడిగా సర్వే జరిపి, గబ్బిలాలపేటలో 808 కుటుంబాలను, నందమూరి నగర్‌లో 803 కుటుంబాలను గుర్తించారు. 205 కుటుంబాలకు ప్లాటు నంబర్ కేటాయించకుండా, సర్వే నెంబర్ మాత్రం వేసి అప్పుడు హోంశాఖ మంత్రిగా ఉన్న దేవేందర్‌గౌడ్ చేత 27.2.2004 నాడు పట్టా సర్టిఫికెట్లు కూడా పంపిణీ చేశారు. ఈ రెండు కాలనీలలో సర్వే జరగడంతో, సిపిఐ నేతృత్వంలో రావి నారాయణరెడ్డినగర్‌లో ఆరువేల దాకా, రాజీవ్‌గాంధీ నగర్‌లో రెండువేల దాకా గుడిసెలు వెలిశాయి. గత ఆరు సంవత్సరాలలో అంబేద్కర్‌నగర్, శాంతినగర్, దేవేందర్‌నగర్, జన్మభూమినగర్, చెన్నాపురం, అరుంధతీనగర్ బస్తీలలో ఇళ్ళ పట్టాల క్రమబద్ధీకరణ జరిగింది. ఈ మొత్తం ప్రక్రియలో చోటా నాయకుల వాటా పోను లక్షల రూపాయలు స్థానిక ఎమ్మార్వోకు ముట్టినట్టు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే డిసెంబర్ 14, 2004 నాడు శామీర్‌పేట ఎమ్మార్వో నేతృత్వంలో సిపిఐ వారు వేయించిన గుడిసెలన్నింటినీ కూల్చివేశారు. రావి నారాయణరెడ్డినగర్‌లోని దాదాపు ఆరువేల గుడిసెలను, రాజీవ్‌గాంధీ నగర్‌లోని రెండువేల గుడిసెలను పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసుల సహాయంతో తీసివేశారు. ఇదే క్రమంలో గబ్బిలాలపేట, నందమూరినగర్‌కు రెవెన్యూ అధికారులు పోలీసు బలగంతో వచ్చి, ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వాళ్ళ ఇళ్ళను సైతం కూల్చివేసి నానా బీభత్సం చేశారు. ప్రజలు పట్టాలు చూపెట్టినా కూడా అధికారులు వినలేదు. తర్వాత క్షతగాత్రుల్ని పరామర్శించడానికి అన్ని పార్టీల నాయకులతో

బాటు దేవేందర్‌గౌడ్ కూడా వెళ్ళాడు. గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వాధికారులు ప్రతీకారం కోసం ప్రజలను ఇబ్బందిపెట్టారని, అందరికీ ప్లాట్ల నంబర్లతో పట్టాలు ఇవ్వాలని, రెవెన్యూ అధికారులు కావాలని చేసిన ఈ తతంగంపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. రావి నారాయణరెడ్డినగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని ప్రజలు సిపిఐ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకరరెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. న్యాయం చేస్తానని, రాజీవ్ గృహకల్ప పథకంలో బాధితులందరికీ ఇళ్ళు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చాడు. గబ్బిలాలపేట, నందమూరినగర్ ప్రజలు మానవహక్కుల వేదిక సహకారంతో జాయింట్ కలెక్టర్‌ను కలిసి సర్వే పూర్తయిన వాటికి పక్కా పట్టాలు ఇవ్వాలని, లిస్టులో చేర్చి కూడా సర్వే పూర్తికాని 838 కుటుంబాల వివరాలు కూడా సేకరించి పట్టాలివ్వాలని అభ్యర్థించారు. జాయింట్ కలెక్టర్ సరేనన్నాడు. వారానికొకసారి బాధితులు వేదిక బాధ్యుల్నీ, జాయింట్ కలెక్టర్‌ను కలుస్తూనే ఉన్నారు. అయినా ఇంతవరకు ఏమీ కాలేదు.

## సింగరేణి కాలరీస్ కాలనీ

మిట్టమధ్యాహ్నమే అగ్నికి ఆహుతి చేయబడ్డ సరూర్‌నగర్‌లోని సింగరేణి కాలరీస్ బస్తీ కథ కొంచెం భిన్నంగా ఉంటుంది. సరూర్‌నగర్ మండలంలో సింగరేణి ఉద్యోగుల సహకార గృహాల కాలనీ ఒకటుంది. దాని ప్రక్కనే ఉన్న ఒక ప్రైవేటు వ్యక్తి భూమి పట్టణ గరిష్ట పరిమితిలోకి వచ్చింది. 1976లో చేయబడ్డ ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి వెయ్యి మీటర్లకు మించి పట్టణ పరిధిలో స్థలం ఉండడానికి వీల్లేదు. అంతకంటే ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. అయితే చాలా చట్టాలకు మినహాయింపు ఉన్నట్టు ఈ చట్టానికే మినహాయింపు ఒకటి ఉంది. కొందరు వ్యక్తులు సహకార సంఘంగా ఏర్పడి ఇళ్ళు నిర్మించుకోవడానికి ఆ సంఘాన్ని రిజిస్టర్ చేసుకుంటే, అట్టి సంఘానికి ఇటువంటి భూమిని అమ్మవచ్చు. కాకపోతే అందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. ఈ మినహాయింపును ఉపయోగించుకుని 1981లో రౌద్రి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి 25 ఎకరాలు, ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీకి మరో 25 ఎకరాల భూమిని కేటాయించారు. 1984లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇటువంటి బోగస్ సొసైటీలను రద్దుచేసి ఒక కటాఫ్ తేదీకి ముందున్న సొసైటీలకు మాత్రం కొంత మినహాయింపు ఇచ్చారు. ఈ భూమిని ఈ ఉద్యోగ సంఘాలకు కేటాయించడం చట్ట విరుద్ధమని కొందరు న్యాయవాదులు కోర్టులో ఒక కేసు వేశారు. ఈ వ్యాజ్యాన్ని ఛాలెంజ్ చేస్తూ ఆ ఉద్యోగులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసు కోర్టు పరిశీలనలో ఉండగానే అక్కడ కొందరు ప్రజలు గుడిసెలు వేసుకున్నారు. 2002 సంవత్సరం జూన్ నెలలో ఈ గుడిసెల్ని అధికారుల తొలగించారు. 2003వ సంవత్సరంలో కోర్టు ఈ భూమిపై స్టేటస్‌కో (అంటే ఎట్లా ఉన్నది అట్లానే ఉంచాలి) అనే ఉత్తర్వు ఇచ్చినప్పటికీ అక్కడ గుడిసెలు వెలుస్తూనే ఉన్నాయి. కోర్టుకు వెళ్ళిన వాళ్ళు న్యాయవాదుల నల్లటి గౌనుల్లో ఉన్న భూబకాసురులని, వాళ్లు చేస్తున్నది అన్యాయం అని గ్రహించిన రాజకీయ పార్టీలు అక్కడ పేద ప్రజల చేత గుడిసెలు వేయిస్తూ వచ్చాయి. గత సంవత్సరం ఆ నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే కూడా అక్కడ కొన్ని గుడిసెలు వేయించారు. ఇంతకు ముందు రెండుసార్లు కొన్ని గుడిసెల్ని ఎవరో దగ్ధం చేశారు. దాని వెనుక అప్పటి బిజెపి ఎమ్మెల్యే హస్తముందని, ఆయన ఆ భూమిని కబ్జా చేసే ప్రయత్నంలో భాగంగా గుడిసెలు అంటుకున్నాయని అనుకున్నారు.



ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయి, ఆ పార్లమెంట్ సీటుకు సిపిఐ అభ్యర్థి గెలవడం, ఆయన గెలవడానికి చాలా రోజుల ముందు నుండే ఆ ప్రాంతంలో సిపిఐకి ప్రాబల్యం పెరగడంతో సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలు పెద్దయెత్తునే గుడిసెలు వేసుకున్నారు. ఈ పరిస్థితి అంతా భూ బకాసురులకు చాలా చికాకుగా మారింది. నల్లగొండలో సిపిఐ మహాసభకు గుడిసెవాసులంతా వెళ్ళిన రోజున అకస్మాత్తుగా నాలుగు వైపుల నుంచి గుడిసెలకు మంటలంటుకున్నాయి. రెండు గంటల్లో గుడిసెలన్నీ మసైపోయాయి. దాదాపు మూడువేల దాకా గుడిసెలు మంటలకు ఆహుతైనట్టు అంచనా వేశారు. పక్షవాతంతో మంచంలో పడ్డ ఒక మహిళ, ఒక బాలుడు, ఓ మధ్యవయస్కుడు మంటల్లో మరణించారు. తిండి గింజలు, పాత్రలు, దుస్తులు అన్నీ నాశనమైపోయాయి. వెంటనే ముఖ్యమంత్రి వెళ్ళి సహాయ కార్యక్రమాలు పరిశీలించారు. ప్రభుత్వం బియ్యం, కొంత నగదు ఇచ్చింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఆహారం, పాత్రలు, దుస్తులు పంపిణీ చేశాయి. 3200 మందికి వాంబే పథకం కింద 18 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇళ్ళు నిర్మించడానికి ప్రభుత్వం పూనుకుంది. సొసైటీలకిచ్చిన అనుమతి రద్దుచేసి ప్రభుత్వం పూర్తిగా భూమిని స్వాధీనం చేసుకుంటుందని ముఖ్యమంత్రి ప్రకటించాడు. ఆ మొత్తం స్థలాన్ని 126 బ్లాకులుగా విభజించి ఇళ్ళ నిర్మాణం చేపడతామని ప్రభుత్వం ప్రకటించి, భూమిపూజ కూడా నిర్వహించింది. లబ్దిదార్లను గుర్తించి జాబితా తయారు చేసే కార్యక్రమం కూడా మొదలైంది. లబ్దిదార్లను గుర్తించే విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, పైరవీకార్లు డబ్బులు తిని కొత్తవాళ్ళ పేర్లను జాబితాల్లో చేరుస్తున్నారనే ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యేవరకు నష్టపోయినట్టుగా గుర్తించిన వాళ్ళను తాత్కాలికంగా గుడిసెలు వేసుకొని నివసించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

పై సంఘటనలు గమనించినపుడు, నాయకులంతా తమ లాభాల కోసం, రాజకీయ ప్రాబల్యం కోసం ప్రజలను వాడుకుంటున్నట్టుగా కన్పిస్తుంది. అధికారులు కూడా దీనిని కొందరు రాజకీయ నాయకులు, స్వార్థపర శక్తులు సృష్టిస్తున్న సమస్యగానే చూస్తున్నారు. కానీ గుడిసె వేసుకునే వారి ప్రయత్నం వెనుక, ఉండడానికి ఇంత చోటు కోసం వారు పడే ప్రయత్నం, తాపత్రయంలో ఎవరు ఎట్లా చేయమని చెప్తే అట్లా చేయడానికి సిద్ధంగా ఉండే వారి మనస్థితిని ఎవరూ అర్థం చేసుకోరు. పని దొరికినా, దొరకకున్నా బతుకుదెరువు చాలా కష్టంగా ఉన్నా తలదాచుకునేందుకు చిన్న గూడు ఉండడం పేదవాడికి చాలా పెద్ద భద్రతను కలిగిస్తుంది. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే దాదాపు రెండు వేలకు పైగా మురికివాడలు (స్లమ్స్) ఉన్నాయి. ఇందులో 840 దాకా మునిసిపాలిటీ గుర్తించిన బస్తీలు. తక్కినవన్నీ మౌలిక సదుపాయాలు లేక చాలా భయంకరంగా ఉంటాయి. ప్రతి సంవత్సరం ఈ మురికివాడల జనాభా పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలో మూడేళ్ళుగా కొనసాగుతున్న కరువు కాటకాలు, వ్యవసాయరంగం సంక్షోభంలో పడటం, గ్రామాల్లో వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు పూర్తిగా మృగ్యం కావడం మనం అర్థం చేసుకుంటే తప్ప పట్టణాలలో ఈ మురికివాడల పెరుగుదల మనకు అర్థంకాదు. గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ జిల్లాలు కరువుతో విలవిలలాడుతున్నాయి. ఈ సంవత్సరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు కూడా కరువు బారిన పడ్డాయి. 2003 సంవత్సరంలో ప్రభుత్వం 441 మండలాల్ని కరువు మండలాలుగా ప్రకటిస్తే, ఈ సంవత్సరం రాష్ట్రంలోని 1040 మండలాల్లో 800 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో కోస్తా జిల్లాలలో మామూలు వర్షపాతం కన్నా 11 శాతం తక్కువ నమోదు కాగా, రాయలసీమలో 13 శాతం, తెలంగాణ ప్రాంతంలో 33 శాతం

తక్కువ నమోదైంది. రాష్ట్రం మొత్తంమీద చూస్తే 21 శాతం తగ్గింది. దాదాపు 509 లక్షల జనాభా కరువు మండలాల్లో ఉంది. 85 లక్షల వ్యవసాయ కూలీలు గ్రామాల్లో పని కోల్పోయారు. 16 లక్షల చిన్నకారు రైతులు, 38 లక్షల మంది సన్నకారు రైతుల వ్యవసాయం పూర్తిగా కుంటుపడింది. పనికోసం వలస వెళ్లే ప్రజల్లో ఈ సంవత్సరం చిన్న, సన్నకారు రైతులు కూడా చేరారు. గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి నెలకు దాదాపు పదివేల కుటుంబాల దాకా హైదరాబాద్ నగరానికి వలస వస్తున్నట్టు ఒక అంచనా. వాళ్ళందరికీ పని దొరకడం ఒక సమస్య అయితే, ఎక్కడో ఒక దగ్గర బసచేయడం వారికి అత్యవసర సమస్య. అందుకే తమ బంధువులో, గ్రామస్తులో, తమ ప్రాంతం వాళ్ళో ఉండే బస్తీలలో నివాసం ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు.

వలస వచ్చే కుటుంబాలను పర్యవేక్షించే ప్రభుత్వ సంస్థ ఏదీ లేదు. ఒక బస్తీ అక్రమంగా వెలసిందని కూల్చివేసినప్పుడు మాత్రమే ప్రభుత్వాధికారులు వాళ్ళ జాబితా తయారు చేస్తారు. చాలా సందర్భాలలో కూల్చివేత తర్వాతే ప్రభుత్వం వాళ్ల ఉనికిని గుర్తిస్తుంది. గత ప్రభుత్వం ఐదేళ్ళలో (1988-2003) 16 లక్షల గృహాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకొని నాలుగు లక్షలు మాత్రమే పూర్తిచేయగలిగింది. చివరి జన్మభూమిలో ఇళ్ళ స్థలాల కోసం దాదాపు 30 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 'రాజీవ్ గృహకల్ప' పేరుతో పేదలకు ఇళ్ళు కట్టించే కార్యక్రమం చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో రెండున్నర లక్షల గృహాలు నిర్మించడానికి 26 ప్రాంతాలలో స్థలాలను కూడా గుర్తించడం జరిగిందని చెప్తోంది.

ఇది ఇట్లా ఉంటే చాలా పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో దాదాపు ఏడువేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఒక సర్వేలో తేలింది. పేదవాడు గుడిసె వేసుకుంటే తొలగించినంత సులభంగా ఈ కబ్జాదారుల్ని తొలగించే పనిని ప్రభుత్వం చేపట్టడంలేదు. భూ రికార్డులు పర్యవేక్షించే రెవెన్యూ యంత్రాంగం బాగా అక్రమార్జనకు అలవాటు పడడం, భూమి వ్యాజ్యాలను (లిటిగేషన్) పెంచి, పోషించి అక్రమంగా ఆర్జించే వకీళ్ళు కుప్పలు తెప్పలుగా, చట్టంలోని లొసుగులను ఆసరాగా తీసుకుని కబ్జాదార్లకు సహాయం చేయడం అందరికీ తెలిసిన నిజం.

ఈ మొత్తం ప్రక్రియలో పేదవాడు జీవించే హక్కును కోల్పోతున్నాడు. పట్టణీకరణ, నగరాల వ్యాప్తిలో పేదవాడి స్థానం ఎక్కడ అనే విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదు. మాస్టర్ ప్లాన్‌లో సైతం, నగరంలో వివిధ నిర్మాణ కార్యక్రమాల వల్ల నిర్వాసితులయ్యే వారికోసం, పనికోసం వలస వస్తున్న వాళ్ళ నివాసం కోసం స్థలాల కేటాయింపు చేయలేదు. వలస వచ్చే వాళ్ళలో దాదాపు సగం మంది వర్షాలు కురిసి వ్యవసాయ కార్యక్రమాలు ఆరంభం కాగానే గ్రామాలకు తిరిగి వెళ్ళిపోతారు. మిగతా సగం మంది పూర్తిగా భూమిలేని వాళ్ళు. వర్షాలు పడ్డా కూడా గ్రామాలలో పని లభించే పరిస్థితి లేనివాళ్ళు ఇక్కడే ఉండిపోతారు.

భౌగోళికంగా నిరంతరం నగరం విస్తరిస్తూనే ఉంటుంది. హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ గాని, ప్రయివేటుగా భూమిని అభివృద్ధి చేసి ప్లాట్లు అమ్మే వ్యాపారస్తుడు గాని, గుడిసెవాసుల్ని అట్లా ఉంచి, కనీసం చిన్నాచితక ఉద్యోగాలు చేసుకునే వాళ్ళు ఖరీదు చేసుకోవడానికి, కూడా చిన్న ప్లాట్లను అందుబాటులో ఉంచరు. గత సంవత్సరం మాస్టర్ ప్లాన్ ముసాయిదా ప్రకటించినప్పుడు



ఇటువంటి వారి కోసం ప్రభుత్వం, ప్రయివేటు భూ వ్యాపారస్తులు కూడా తాము అమ్మే ఇళ్ళ స్థలాల్లో 20 శాతం కేటాయించాలని కొన్ని సంస్థలు ప్రభుత్వం ముందు ప్రతిపాదన ఉంచాయి. ప్రభుత్వం ఐదు శాతం వరకు కేటాయించడానికి సమ్మతి తెలిపింది.

అయితే మొత్తం నగరీకరణ ప్రక్రియలో పేదవాడి పాత్ర ఏమిటి, పేద ప్రజల వాటా ఎంత, ఇతర వర్గాల ప్రజలకు కల్పిస్తున్న ప్రాథమిక సౌకర్యాలు క్రింది స్థాయిలో జీవిస్తున్న ప్రజలకు కూడా హక్కుగా ఎట్లా అందుబాటులోకి వస్తాయనే విషయం మనం అందరం ఆలోచించవలసి ఉంది.

❖

## పోలవరం ప్రాజెక్టు

# ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదు

–కె. బాలగోపాల్

**జం**తువుకు తలా తోకా ఉంటాయి. జంతువు రూపురేఖలు అర్థం చేసుకోవాలంటే తల దగ్గర మొదలుపెట్టి తోకదాకా పరిశీలించడం మానవ మాత్రులయిన వారికి సహజం. తోక దగ్గర మొదలుపెడతాననే వాడిని మామూలుగా వెర్రివాడంటాం.

ఇప్పుడు మనకొక ముఖ్యమంత్రి వచ్చాడు. ఈయన వ్యవసాయదారులకు ఎట్టి పరిస్థితిలోనూ సాగునీరు ఇస్తానంటున్నాడు. ఎప్పటికైనా హామీ ఇచ్చిన అన్ని ప్రాజెక్టులూ కట్టేస్తానంటున్నాడు. కడుతున్నాడు కూడా. కానీ తోక దగ్గర మొదలుపెడుతున్నాడు. ఇది ఆయన సొంత విషయమయితే వెర్రివాడనుకుందుము. కానీ మనందరి విషయం కాబట్టి మనల్ని వెర్రివాళ్లను చేస్తున్నాడనక తప్పదు.

ఒక నీటి పారుదల ప్రాజెక్టు కట్టాలంటే మొదట నీళ్లుండాలి. దానిని వాడుకునే హక్కు మనకుండాలి. ఇది మొట్టమొదటి విషయం. ఆ తరువాత ప్రాజెక్టుకొక ప్రణాళిక ఉండాలి. అది సాంకేతికంగా ఆమోదనీయం కావాలి. ఆపైన ప్రాజెక్టుకయ్యే ఖర్చు, దాని వల్ల వచ్చే ప్రయోజనాల అంచనా ఉండాలి. దాని ప్రకారం కూడా అది ఆమోదనీయం కావాలి. ప్రాజెక్టు వల్ల అడవి మునిగేటట్టయితే కేంద్ర అటవీశాఖ ఆమోదం కావాలి. ఎంత అడవి భూమి మునిగితే అంత భూమిని అడవి పెంపకానికి వేరొకచోట అప్పగించనిదే కేంద్ర అటవీశాఖ సాధారణంగా ఆమోదం ఇవ్వదు. ప్రాజెక్టు వల్ల ఆదివాసులు నిర్వాసితులయ్యేటట్టయితే కేంద్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆమోదం కావాలి. పునరావాసం గురించి ఎంతో కొంత హామీ ఇవ్వనిదే ఆ ఆమోదం లభించడం కష్టం.

ఇవి పాలనా నియమాల ప్రకారం, చట్టం ప్రకారం తప్పనిసరి విషయాలు. ముంపుకు గురయ్యే ప్రజల పునరావాసం కూడా చట్టంలో ఒక హక్కయి ఉంటే ముంపుకు సంబంధించిన సమగ్రమైన అంచనా, ముంపుకు గురయ్యేవారికి కల్పించబోయే పునరావాసాన్ని గురించి సమగ్రమైన అంచనా కూడా తప్పనిసరి అయివుండేవి. కానీ పునరావాసం ఒక హక్కు కాకపోవడం భారతదేశపు చట్టాల లోని అత్యంత బాధాకరమైన లోపాలలో ఒకటి. అయినప్పటికీ ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విలువ కాబట్టి ముంపు, పునరావాసాల అంచనా కూడా ముందుగా ఉండాలని ప్రజా చరిత్ర ఉద్యమాలు అంటున్నాయి.



ఇవన్నీ అయిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం మొదలు కావాలి, దానికి టెండర్లు పిలవాలి, పని మొదలుపెట్టాలి. కానీ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మొదట చెప్పిన చర్యలేవీ చేపట్టకుండా నేరుగా టెండర్లు పిలవడం మొదలుపెట్టింది. వేల కోట్లు కేటాయించి కాలవలు తవ్విస్తూ ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా ప్రాజెక్టుల ప్రక్రియను తోక దగ్గర ఎందుకు మొదలుపెడుతున్నావు అని అడగకుండా తానూ తోక దగ్గరే చర్చ పెడుతున్నది. టెండర్లలో అక్రమాలు, ఏకపక్ష వైఖరి ప్రాజెక్టుల గురించి జరిగే ఏకైక చర్చ అయింది.

తలను విడిచిపెట్టి తోక దగ్గర మొదలుపెట్టిన భారీ ప్రాజెక్టులలో ఒకటి పోలవరం. అప్పుడెప్పుడో 1970లలో, 1980లలో తయారు చేసిన ప్రణాళిక తప్ప ఆ ప్రాజెక్టుకు ఈ మధ్య తయారుచేసిన ప్రణాళికేదీ లేదు. అప్పట్లో తయారుచేసిన ప్రణాళికకు ఆమోదమూ లేదు. ఎంత భూమి మునుగుతుందో, ఎంతమంది నిర్వాసితులవుతారో ఖచ్చితమైన అంచనా ఆనాడూ లేదు, ఈనాడూ లేదు. ఆనాడు ప్రభుత్వం చెప్పిన అంచనా సరయినది కాదని, ప్రభుత్వం 213 గ్రామాలు మునుగుతాయని అంటుండగా నిజానికి 276 గ్రామాలు మునుగుతాయని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) పరిశోధన చేసి తేల్చింది.

ఇప్పుడు ఆ మాత్రం అంచనా కూడా లేకుండా మళ్లీ ప్రభుత్వం పోలవరం పనులు మొదలు పెట్టింది. గతంలో పునాదిరాళ్లు వేయడంతో సంతృప్తి చెందింది. ఈసారి కాలవల తవ్వకం ఉధృతంగా సాగుతున్నది. కాబట్టి ప్రాజెక్టు నిజంగా కట్టేస్తారేమోనని ముంపుకు గురికాగల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, ఖమ్మం జిల్లాలలో ముంపుకు గురికాగల ప్రాంతాలలో మానవహక్కుల వేదిక పర్యటించింది. ఆదివాసుల సంఘాల ప్రతినిధులతో కలిసి చేసిన ఈ పర్యటనలో మేము గ్రామస్తులతో వివరంగా మాట్లాడాము. వారి ప్రస్తుత జీవిత స్థితిగతుల గురించి, రేపు నిర్వాసితులయితే కోల్పోయే జీవనాన్ని గురించి, హక్కుల గురించి వారిని అడిగి తెలుసుకున్నాము, ప్రాజెక్టు గురించి వారి అభిప్రాయం అడిగాము, మాకు తోచింది చెప్పాము.

ముంపుకు సంబంధించిన అధికారిక నివేదిక ఏదీ లేదు కాబట్టి తొలినాటి అంచనాల ననుసరించి 1996లో 'సెస్' వారు ప్రకటించిన రిపోర్టును ఆధారం చేసుకొని ఒక అవగాహనకు రావడం తప్ప చేయగలిగింది లేదు. ఆ నివేదిక ప్రకారం పోలవరం డ్యాం ఎత్తు (పూర్తి రిజర్వాయర్ స్థాయి – ఎఫ్ఆర్ఎల్) 150 అడుగుల కాంటూర్‌లో ఉంటుంది. కాబట్టి ఆ కాంటూర్ వరకు డ్యాంకు ఎగువన నది వెడల్పవుతుంది. ఆ కాంటూర్ వరకు నదికి ఇరువైపులా నీళ్లు నిలుస్తాయి. అయితే 'సెస్' నివేదిక గుర్తించినట్టు ఎఫ్ఆర్ఎల్ 150 అడుగుల కాంటూర్‌లో ఉన్నట్టయితే ముంపు కేవలం 150 అడుగుల కాంటూర్‌కే పరిమితం అవుతుందని అనుకోవడం సరయినది కాదు. నదిలో ప్రవాహం వేగంగా ఉన్నప్పుడు, అలల తాకిడి ఉన్నప్పుడు ఇంకా ఎక్కువ కాంటూర్‌లో ముంపు ఉండగలదు. కాబట్టి 160 అడుగుల కాంటూర్ దాకా మునుగుతుందని అంచనా వేయడం సబబు. అంతే కాకుండా కాగితం మీద కాంటూర్ వేసుకొని దాని ప్రకారం మాత్రమే ముంపును అంచనా వేసేటట్టయితే అసంబద్ధమైన పరిస్థితి తలెత్తవచ్చని కూడా సెస్ నివేదిక గుర్తించింది. ఒక ఊరిలో పొలాలు పొత్తం మునిగి ఆవాసాలు మాత్రం మిగలవచ్చు. అప్పుడు ఆ ఊరు 'ముంపు గ్రామం' కాదంటే ఎట్లా? పొలాలు మొత్తం పోగొట్టుకొని వాళ్లక్కడ ఏ విధంగా బతుకుతారు? ఇది

ఆదివాసుల గ్రామాలకు ఎక్కువగా వర్తిస్తుందని సెస్ నివేదిక గుర్తించింది. వారి సాగుభూములు నది ఒడ్డున ఉంటాయి, ఇళ్లు ఎత్తు మీద ఉంటాయి. నది వెడల్పయి సాగుభూములు మునిగి ఇళ్లు మిగిలితే వారక్కడ ఉండి ఏం చేసుకొని బతకాలి? ఏం తిని కడుపు నింపుకోవాలి?

ఈ విధంగా వివేచించి 'సెస్' నివేదిక 276 గ్రామాలు ముంపుకు గురవుతాయని, అప్పటి లెక్కల ప్రకారం 27,798 కుటుంబాలు, లక్షా 17 వేల జనాభా నిర్వాసితులవుతారని అంచనా వేసింది. ఆ నివేదిక తయారయి ఒక దశాబ్దం గడిచింది కాబట్టి గ్రామాలు అన్నే ఉన్నా కుటుంబాల సంఖ్య, జనాభా పెరిగే ఉంటాయి.

## మండలాల వారీగా ముంపుగ్రామాలు

| మండలం | గ్రామాల సంఖ్య |
|---|---|
| ఖమ్మం జిల్లా | |
| వరరామచంద్రాపురం | 45 |
| కూనవరం | 48 |
| చింతూరు | 17 |
| కుకునూరు | 34 |
| వేలేరుపాడు | 39 |
| భద్రాచలం | 13 |
| బూర్గంపాడు | 9 |
| పశ్చిమ గోదావరి జిల్లా | |
| పోలవరం | 29 |
| తూర్పు గోదావరి జిల్లా | |
| దేవీపట్నం | 42 |

ఈ గ్రామాల జనాభాలో 47 శాతం ఆదివాసులు, 15 శాతం దళితులు, 23 శాతం వెనుకబడిన కులాలు, 15 శాతం అగ్రకులాలు అని 'సెస్' అంచనా వేసింది. చింతూరు, పోలవరం, వేలేరుపాడు, దేవీపట్నం, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలలో నిర్వాసితులు కాగల జనాభాలో ఆది వాసులు సగం కంటె ఎక్కువ. కుకునూరు, బూర్గంపాడు మండలాలలో నిర్వాసితులలో మెజారిటీ దళితులు.

ముంపంటూ వస్తే ఈ ప్రజలు ఏం కోల్పోతారు? ఒక హక్కుగా ఏం పొందుతారు? ఇక్కడే నిర్వాసితులు కాబోయే వారిలో ఆదివాసులకూ ఇతరులకూ తేడా వస్తుంది. అందరూ ఎంతో కొంత కోల్పోతారు, అందరికీ ప్రాజెక్టు వల్ల నష్టం ఉంది, సందేహమేమీ లేదు. మా పర్యటనలో భాగంగా మేము వేలేరుపాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించినప్పుడు, మేము చెప్పిందంతా శ్రద్ధగా రాసుకున్న విలేకరులు ఆ శ్రద్ధకు కారణం మేము అడగకుండానే చెప్పారు. 'మండల కేంద్రం కూడా మునుగుతుంది కాబట్టి మేము కూడా వ్యతిరేకమే సార్ ఈ ప్రాజెక్టుకు. మీ వార్త బాగా రాస్తాం' అన్నారు.

అయితే ఆదివాసులకు ప్రత్యేకంగా ఉండే సమస్య ఏమిటంటే వారి జీవనాధారమైన వనరులపైన



వారికి ఉన్న చట్టపరమైన హక్కు చాలా స్వల్పం. చట్టపరమైన హక్కున్న స్థిరాస్తులు స్వాధీనం చేసుకున్నప్పుడు మాత్రమే చట్టపరమైన నష్టపరిహారం దక్కుతుంది. నిజానికి చట్టపరమైన హక్కున్న భూమిలో కూడా పూర్తిగా సొంత భూమి కాక ప్రభుత్వం డి-ఫారం పట్టా ఇచ్చిన భూమి అయినట్ట యితే నష్టపరిహారం దక్కదని మన హైకోర్టు ఒకనాడు అభిప్రాయపడిందిగానీ, ఈ మధ్యనే ఏడుగురు జడ్జిల బెంచి ఆ అభిప్రాయాన్ని తిరగదోడి నష్టపరిహారం విషయంలో సొంత పట్టా అయినా డి-ఫారం పట్టా అయినా ఒకటేననింది.

అయితే ఆదివాసులు చట్టపరమైన హక్కు ఉన్న భూమే కాక కొండపోడు భూములను కూడా దాదాపు ప్రతీ ఊరిలోనూ ఏదో ఒక మేరకు అనుభవిస్తున్నారు. వారిలో మరీ పేదలకు ఇదొక్కటే జీవనాధారం. ఈ భూమిని రేపు కోల్పోతారు గానీ దీనికేం నష్టపరిహారం దక్కదు. ఇదికాక, సంఘాలు గట్టిగా ఉన్నచోట వారు పోరాటాలు చేసి ఆక్రమించుకున్న గిరిజనేతరుల భూమి చాలా ఉంది. ఎల్‌టిఆర్ చట్టం కింద కేసు వేసి గెలిచినట్టయితే ఆ భూమికి పట్టాలు ఉండేవేమోగానీ అది అన్ని సందర్భాలలోనూ సాధ్యం కాకపోవచ్చు. కోర్టుకెక్కితే సాక్ష్యాలు చూపలేక ఓడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఆ విధంగా ఆక్రమించుకున్న భూమికి పట్టాలు ఉండవు కదా. పంట వేసుకొని పండించుకోవడానికి పట్టాలు అక్కరలేదు కాని ఆ భూమిని బ్యాంకులో తనఖాపెట్టడానికో మరొకరికి కుదువ పెట్టడానికో అయితే కావాలి. అలాగే రేపు ముంపు వస్తే పట్టాలు లేని కారణంగా వాళ్లకు దమ్మిడీ నష్టపరిహారం దక్కదు. మేము పర్యటించిన మేరకు దేవీపట్నం మండలం (తూర్పు గోదావరి జిల్లా)లో ఈ సమస్య పెద్ద ఎత్తునే ఉంది.

భూమికాక వారికి వేరే ప్రధానమైన జీవనాధారం అడవి నుండి సేకరించే చిన్నతరహా అటవీ ఉత్పత్తులు. దీనిలో మళ్లీ రెండు రకాలుంటాయి. ఒకటి అమ్మకానికి పనికొచ్చేవి. వీటిని గిరిజన సహకార సంఘానికో, వ్యాపారులకో అమ్ముకుంటారు. రెండు, నిత్య జీవితంలో వాడుకునేవి. మొదటి కోవకు చెందినవి జిగురు, తేనె, కరక్కాయలు, గానుగ గింజలు, ముష్టి గింజలు, కుంకుడు కాయలు, చిల్లగింజలు, నల్లజీడి గింజలు, చీపురు పుల్లలు, నరమామిడి చెక్క, శీకాకాయలు, కొండ జీడి పిక్కలు, తంగేడు గింజలు, అడ్డాకులు, విప్ప పలుకులు మొదలయినవి. వ్యవసాయ పనులు లేని సీజన్‌లో వీటి సేకరణ, అమ్మకం ప్రాణాన్ని నిలుపుతుంది. సంవత్సరంలో రెండు నెలలదాకా ఈ ఆదాయం మీదే బ్రతికే ఊర్లు చాలా ఉన్నాయి. రెండవ కోవకు చెందినవి రకరకాల దుంపలు, లేక గడ్డలు, బలుసాకు వంటి ఆకుకూరలు. ఇవి నేరుగా ఆహారంగా ఉపయోగపడతాయి. ఏ తిండీ దొరకనప్పుడు అడవికిపోయి దుంపలు (తేగదుంప, బల్లదుంప, అడవి కంద, కిరస దుంప, తాడిదుంప వగైరా) తెచ్చుకొని వండుకొని తిని బతుకుతారు.

అడవి నుండి బయటకు పోవలసి వస్తే ఈ ఆదాయం, ఈ ఆహారం మొత్తంగా పోతుంది. దీనికి ఏ నష్టపరిహారం ఉండదు, ఏ ప్రత్యామ్నాయమూ ఉండదు.

పశుగ్రాసానికి కొదవలేక పోవడం వల్ల అడవిలోని అన్ని ఊర్లలోనూ వందల సంఖ్యలో పశువులు - ముఖ్యంగా ఆవులు ఉన్నాయి. గోచీ తప్ప వేరే బట్ట ఎరుగనివారికి సహితం 10-15 ఆవులున్నాయి. వాటిని పోషించనక్కరలేకుండా అవే యజమానిని పోషిస్తాయి. రేపు ఈ పశువులను తోలుకొని అడవి బయటకు పోయినట్టయితే పశుగ్రాసం ప్రధానమయిన సమస్య అవుతుంది. ఈ మధ్య కాలంలో మైదాన ప్రాంత గ్రామాలలో పెద్ద రైతులు సహితం పది పశువులు ఉంచుకోవడానికి తటపటాయిస్తున్నారు. ఇంక ఆదివాసీ నిర్వాసితుల సంగతి ఏం చెప్పాలి?

ఊరుమ్మడి చెట్లు అడవిలో ఒక ముఖ్య ఆహార వనరు. చింతచెట్లు, మామిడిచెట్లు, తాడిచెట్లు వీటిలో ప్రధానమైనవి. తాటికల్లుకు ఆదివాసుల జీవితంలో చాలా ప్రాధాన్యత ఉంది. అది కేవలం నిషా ఇచ్చే మత్తు పదార్థం కాదు, పోషకాహారం. వేసవిలో ఊర్లకు ఊర్లు తాటి కల్లు మీదనే బతుకు తాయి. ఒక్కొక్క ఊరిలోనూ వందల సంఖ్యలో ఉన్న ఈ చెట్లను విడిచిపెట్టి రేపు బయటకు పోయినట్లయితే వారు కోల్పోయే ఈ ఆహారానికి నష్టపరిహారం ఏమీ దక్కదు.

ఆదివాసులకు ఏజెన్సీలో ఉండే ప్రత్యేకమైన హక్కులున్నాయి. ఇవి రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు కింద జారీ అయినవి. ఏజెన్సీలో ఉంటేనే ఈ హక్కులు ఉంటాయి. వారి భూములను గిరిజనేతరులు ఏ రకంగానూ సొంతం చేసుకోవడానికి వీలులేదు. ప్రభుత్వ బంజర్లు వారికి తప్ప వేరెవ్వరికీ సాగుకు ఇవ్వడానికి వీలులేదు. గ్రామ సర్పంచ్, మండల ప్రెసిడెంట్ పదవులకు నూటికి నూరుశాతం వారికే రిజర్వేషన్ ఉంది. టీచర్ పోస్టులలో 100 శాతం, కొన్ని ఇతర నాల్గవ తరగతి ఉద్యోగాలలో 75 శాతం దాకా ఆదివాసీ విద్యావంతులకే రిజర్వ్ అయి ఉన్నాయి. స్థానిక వనరుల యాజమాన్యానికీ అభివృద్ధి పనులకూ సంబంధించి ఆదివాసీ గ్రామ సభకు, గ్రామ పంచాయతీకీ ప్రత్యేక అధికారాలు పంచాయతీరాజ్ చట్టంలోని 6-ఎ అధ్యాయం కింద ఉన్నాయి. ఏజెన్సీని విడిచిపెట్టిపోతే ఇవన్నీ పోతాయి.

అన్నిటినీ మించి ఆదివాసీ గ్రామాలలో ఒక అనిర్వచనీయమైన ఉమ్మడితనం ఉంటుంది. ఇది మనుషులకే కాదు, వారి చుట్టూ ఉన్న చెట్లకూ కొండలకూ కూడా వర్తిస్తుంది. వారి జీవితం, ఆచారాలు, అలవాట్లు దీనిని పెనవేసుకొని ఉంటాయి. దానివల్ల పొందే మానసిక సంతృప్తికీ ప్రశాంతికీ 'నష్టపరిహారం' అంటూ ఏదీ ఉండదు. అడవి బయట దీనిని పునర్నిర్మించుకోవడం దాదాపు అసాధ్యం.

అందుకే పునరావాసం గురించి మాట్లాడితే ఆదివాసులు నవ్వుకుంటూ చెట్టుకు చెట్టు, పుట్టకు పుట్ట, కొండకు కొండ, వాగుకు వాగు ఇట్లాగే కట్టిస్తారా అని అడుగుతున్నారు. కట్టిచ్చేటట్టయితేనే ఇక్కడి నుండి పోతాం అంటున్నారు. చాలామంది నిక్కచ్చిగా ఇక్కడి నుంచి పోనే పోమంటున్నారు. వేరే ఎక్కడో వారికి పునరావాస కాలనీలు కట్టిచ్చి తలా ఎకరమో, రెండో బంజరు భూమి కేటాయిం చినా ఇప్పుడున్న జీవికలో సగం కూడా దొరకదు వాళ్లకు. ఆ మాత్రం పునరావాసం ఇస్తారన్న నమ్మకం లేదు, ఇవ్వాలని చెప్పే చట్టం గానీ పాలసీ నియమంగానీ ఏదీ లేదు. ఈ సంగతి మూడు జిల్లాలలోని ఆదివాసులకు బాగానే తెలుసును కాబట్టి అత్యధిక భాగం మంది అసలు పోలవరం వద్దే వద్దు అంటున్నారు.

ఇది అభివృద్ధికి అడ్డంపడే వైఖరి అన్న వాదనను వాళ్లూ విన్నారు. దానికి కూడా వాళ్ల దగ్గర జవాబుంది. గోదావరి నీళ్లు 'వృధాగా' సముద్రంలోకి వెళ్లిపోతున్నది కాబట్టి ప్రాజెక్టు కట్టి దానిని సాగుకోసం, తాగునీటి కోసం వాడుకోవాలని కదా ప్రభుత్వం ఆలోచిస్తున్నది? మరి ఆ సాగునీరేదో మా భూములకే ఇయ్యవచ్చుకదా? మా భూములు ముంచి మైదాన ప్రాంతాల భూములకెందు కివ్వాలి? అంటున్నారు.

పోలవరం డ్యాం సైట్ దగ్గర గోదావరిలోకి అకస్మాత్తుగా వచ్చి చేరే నీరేదీ లేదు. అక్కడ నిలప బోయేదంతా పైనుండి వచ్చి చేరే నీరే. ప్రాణహిత నుండి, ఇంద్రావతి నుండి, శబరి నుండి, దజన్ల సంఖ్యలో ఉన్న వాగులు, వంకల నుండి వచ్చి గోదావరిలో కలిసి అడవి గ్రామాలను దాటి ప్రవహించి పోలవరం చేరే నీటికే డ్యాం కట్టి విజయవాడ నుండి విశాఖపట్నం దాకా వాటిని తీసుకుపోయి 'అభివృద్ధి' సాధించాలని ప్రభుత్వం ఆలోచన. మరి మా ఊరి పక్కనే గోదావరిలో లిఫ్టు పెట్టి ఆ నీళ్లు మాకే ఇస్తే మేమే అభివృద్ధి చెందుతాము కదా? అని వారు అడుగుతున్నారు. అది అభివృద్ధి ఎందుకు కాదు, మైదాన ప్రాంతాలకు ఆ నీటిని పారిస్తేనే అది అభివృద్ధి ఎందుకవుతుందో చెప్పమంటున్నారు.

ఐటిడిఏ వారు చేపట్టిన కొన్ని లిఫ్టు ఇరిగేషన్ స్కీంలు ప్రస్తుతం లేకపోలేదు. ఒక్క తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం డివిజన్లోనే 36 స్కీంలు చేపట్టారు. కానీ అవన్నీ విచిత్రంగా ఫెయిల్ అయి కూర్చున్నాయి. స్థలం ఎంపికలో అసమర్థత వల్లనో, సరుకు కొనుగోలులో అవినీతి వల్లనో గానీ మినహాయింపు లేకుండా అన్ని లిఫ్టులూ ఫెయిల్ అయ్యాయి. కానీ సక్రమంగా చేస్తే పోలవరం కింద మునగబోయే అన్ని గ్రామాలకూ కాకున్నా గోదావరి, శబరి నదులకు దగ్గర ఉన్న గ్రామాలకు సాగునీరు ఇయ్యవచ్చు. ఆపైన మిగిలిన నీటికి పోలవరం దగ్గరే డ్యాం బదులు డైవర్షన్ (ఆనకట్ట) కట్టి ఏ ముంపూ లేకుండ మైదాన ప్రాంతాలకూ కొంత మేరకు పారించుకోవచ్చు.

ప్రాజెక్టుల వల్ల జరిగే ముంపు గురించి, నిర్వాసితుల సమస్యల గురించి ఎప్పుడు మాట్లాడినా 'అభివృద్ధి'కి అడ్డువస్తున్నారన్న చర్చ వస్తుంటుంది కాబట్టి ఇక్కడ రెండు మాటలు చెప్పడం అవసరం అనుకుంటున్నాము. మొదటిది, ప్రజాతంత్ర దృక్పథం అభివృద్ధికి వ్యతిరేకం కాదు, అసమ అభివృద్ధికి వ్యతిరేకం, విధ్వంసక అభివృద్ధికి వ్యతిరేకం. సాగునీటి విషయానికొస్తే, అది వ్యవసాయ అభివృద్ధికి అవసరమే. కానీ ప్రకృతి సిద్ధంగా మనిషికి లభించే ఈ వనరుపైన అందరికీ (సాంకేతిక సాధ్యాసాధ్యాల పరిధిలో) సమాన హక్కు ఉండాలి. పోలవరానికి ప్రతిపాదించిన ఆయకట్టు ఇప్పటికే సాగునీటి లభ్యత ఉన్న ప్రాంతాలలో ఉంది. దాని బదులు అదే నీటిని, విఫలమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలే తప్ప పనిచేసే సాగునీటి వ్యవస్థ లేని ఆదివాసీ ప్రాంతాలకే అందివ్వడం న్యాయం కాదా? దానివల్ల స్థూల రాష్ట్ర ఆదాయంలో రాగల పెరుగుదల తగ్గిపోవచ్చు. కానీ ఆ పెరుగుదల ఆదివాసులకు దక్కుతుంది కాబట్టి అదే ప్రజాస్వామికమైన అభివృద్ధి.

రెండవది నిర్వాసితుల హక్కుల సమస్య. భారీ ప్రాజెక్టులను అన్ని సందర్భాలలో వ్యతిరేకించవలసిందేనా అనే చర్చలోకి మేము ప్రస్తుతం పోవడంలేదు. ప్రాజెక్టును నిర్దిష్టంగా పరి శీలించి ఒక నిర్ణయానికి రావడమే ఉచితం అని ప్రస్తుతానికి అనుకుందాం. ఈ నిర్దిష్ట పరిశీలనలో ఏమేం విషయాలు చూడాలి?

ప్రాజెక్టు వల్ల అభివృద్ధి వస్తుంది అని అనుకున్నా, దానిని పొందేది మొత్తం సమాజం కాదు, కొందరేననేది స్పష్టమే. ప్రత్యక్ష ప్రయోజనాలూ పరోక్ష ప్రయోజనాలూ ఉంటాయని అనుకున్నా, రెండూ కలిపినా అది అందరికీ దక్కవు. కాబట్టి ప్రయోజనం పొందేవారు కొందరుంటారు. నష్ట పోయే వారూ ఉంటారు. ప్రయోజనం పొందేవారి జీవితాలు కచ్చితంగా బాగుపడతాయి. నష్టపోయే వారి జీవితాలు ఏ మేరకు నష్టపోతాయనేది వారికి దక్కే నష్టపరిహారం మీద, పునరావాసం మీద ఆధారపడి ఉంటుంది. ఒక ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారికి, ఆ ప్రాజెక్టు వల్ల వచ్చే ప్రయో జనంలో మొదటి వాటా ఇవ్వాలనేది – నీటిపారుదల ప్రాజెక్టయితే ఆ ప్రాజెక్టు చివరి భూములలో కాక మొదటి భూములలోనే వారికి సాగుభూములు ఇవ్వాలని – ఇవ్వాళ అంతర్జాతీయంగా రూపొందుతున్న నాగరికతా ప్రమాణం. మనం దాని అంచులకు కూడా చేరుకోలేదు.

కాబట్టి నిర్దిష్టమైన పరిశీలనలో వేసుకోవలసిన ప్రశ్నలు ఏమిటంటే ప్రయోజనం పొందేవారు ఎవరు? నష్టపోయేవారు ఎవరు? ప్రయోజనం పొందేవారికి ఈ ప్రయోజనం ఎంత అవసరం? నష్టపోయేవారికి ఆ నష్టం ఎంత వినాశకరం? ఈ ప్రాజెక్టు ద్వారా వినియోగించుకోబోయే వనరును ఇంకొక రకంగా వినియోగించినట్టయితే మొత్తం మీద సామాజిక న్యాయం ఇంకా ఎక్కువగా జరిగే అవకాశం ఉందా? ఇత్యాది.

పోలవరం ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం 7 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చి, విశాఖ పట్నంకు మంచినీళ్లిచ్చి, కృష్ణా బేసిన్ కోసం ప్రకాశం బ్యారేజికి 80 టిఎంసిల నీళ్లు తరలించ దలచుకుంది. సాగునీరు ఇచ్చేది తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు, కృష్ణా జిల్లాకు. ఆ జిల్లాలలో ఇప్పటికే డెల్టా కాలవల ద్వారా నీళ్లొచ్చే ప్రాంతం కంటె కొంచెం ఎగువన ఉన్న ప్రాంతానికి ఈ నీళ్లొస్తాయి తప్ప ఆ జిల్లాలలో కూడా పూర్తి మెట్ట ప్రాంతాలకు కాదు.

అవి వర్షపాతం బాగానే ఉండే ప్రాంతాలు. వ్యవసాయేతరంగా కూడా బాగానే అభివృద్ధి చెందిన ప్రాంతాలు. పోలవరం నీళ్లొస్తే అక్కడి ప్రజల జీవితాలు సుసంపన్నం అవుతాయనడంలో సందేహ మేమీ లేదుగానీ పోలవరం నీళ్లు దక్కడం వారికి జీవన్మరణ సమస్య కాదు. విశాఖపట్నంకు మంచినీళ్లు కూడా అంతే. విపరీతంగా పెరిగిపోతున్న ఆ నగరానికి మంచినీళ్లు చాలా అవసరం. కానీ దానికి ప్రత్యామ్నాయం స్థానికంగా లేదా అంటే ఉందనే చెప్పాలి. ఉత్తరాంధ్రలో అనకాపల్లి నుండి ఇచ్ఛాపురం దాకా ఉన్న నీటి వనరులను సరిగ్గా ఉపయోగపెట్టే ప్రయత్నం ప్రభుత్వాలు చేయలేదుగానీ చేస్తే ఆ మూడు జిల్లాల నీటి అవసరాలు స్థానికంగానే తీర్చవచ్చు. పోలవరం నీళ్లు రాకపోతే విశాఖపట్నంకు మంచినీళ్లు దొరకవన్న పరిస్థితేమీ లేదు. ఇక్కడ ఇంకొక అనుమానాన్ని కూడా ప్రస్తావించాలి. పోలవరం నుండి విశాఖపట్నంకు నీళ్లు తెచ్చే పైప్‌లైను రాజమండ్రి-విశాఖపట్నం రైల్వే లైనుకు ఎడమ పక్కన ఉండబోతుంది. ఆ రైల్వే లైనుకు కుడిపక్క నుండే ప్రాంతంలో విశాఖపట్నం-కాకినాడ-విజయవాడ కారిడార్ పేరిట ప్రభుత్వం వేగవంతమైన అభివృద్ధి పేరుతో అనుమతించబోయే స్పెషల్ జోన్‌లూ సాఫ్ట్‌వేర్ పార్కులూ రాబోతాయి. పోలవరం నీళ్లు నిజంగా విశాఖపట్నం ప్రజల తాగునీటి కోసం వినియోగించబోతారా, లేక దారిలో తూర్పుకు మళ్లించి ఈ 'కారిడార్'కు ఇవ్వబోతారా? అనే అనుమానమూ ఉంది.

ఇక కృష్ణా బేసిన్‌కు తరలించడానికి పోలవరం నుండి 80 టిఎంసిల నీళ్లు విజయవాడ దగ్గరున్న ప్రకాశం బ్యారేజికి తీసుకుపోయే విషయం చూద్దాం. ఇది కృష్ణానది ఎగువన ఉన్న తెలంగాణ, రాయలసీమలలోని దుర్భిక్ష ప్రాంతాల వినియోగానికి అని చెప్తున్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూలు, అనంతపురం జిల్లాలలో తీవ్ర దుర్భిక్షం ఉన్న మాట వాస్తవమే. కృష్ణా జలాల ప్రాజెక్టులు వారికి హామీ యిచ్చిన మాటా వాస్తవమే.

అయితే ఈ కారణంగా పోలవరం ప్రాజెక్టు సమర్ధనీయం అనే నిర్ణయానికొచ్చే ముందు కొన్ని విషయాలు చూడాలి. ఒకటి, 80 టిఎంసిల నీళ్లెప్పుడయితే పోలవరం నుండి కృష్ణా బేసిన్‌కు తరలించబడతాయో అప్పుడవి కృష్ణా జలాలలో భాగం అవుతాయి. మనం ఆ నీటిని కర్ణాటకతోనూ మహారాష్ట్రతోనూ పంచుకోక తప్పదు. 80 టిఎంసిలలో 35 వారు తీసుకోగా, 45 మాత్రమే మనకు దక్కుతాయి. ఈ 45 టిఎంసిలు నేరుగా దక్షిణ తెలంగాణకూ రాయలసీమకూ పోవు. ప్రకాశం బ్యారేజిలో చేరతాయి. నది పైభాగం నుండి ప్రకాశం బ్యారేజికి వచ్చే నీటిలో 45 టిఎంసి



ఎగువన ఆపుకున్నట్టయితేనే ఎగువ ప్రాంతాలు ఈ పంపిణీ వల్ల ప్రయోజనం పొందగలవు. అది ఏ సంవత్సరంలో ఎంత మేరకు సాధ్యం అవుతుంది, ఎంత ఎగువన సాధ్యం అవుతుంది అనేది ఆయా సంవత్సరాల వర్షపాతాన్ని బట్టి ఉంటుంది. కానీ 45 టిఎంసిల నీరు మాత్రం ప్రతీ సంవత్సరం పోలవరం నుండి ప్రకాశం బ్యారేజికి వచ్చి చేరుతుంది- ఎందుకంటే గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి కాబట్టి. అంటే ఈ మళ్లింపు తప్పకుండా సాధించేది కృష్ణా డెల్టా స్థిరీకరణ. తెలంగాణ రాయలసీమలకు ప్రయోజనం ఒనగూడవచ్చు, ఒనగూడకపోవచ్చు.

ఆ ప్రాంతాలకు వర్షాభావ సంవత్సరాలలో నష్టం కూడా జరగవచ్చు. పోలవరం నుండి మళ్లించే 80 టిఎంసిలలో మన వాటా 45 టిఎంసిలే అయినా మొత్తం 80 టిఎంసిలూ ప్రకాశం బ్యారేజికి పోతాయి. కర్ణాటక, మహారాష్ట్రలు తమ వాటా కింద నుండి తీసుకోలేవు. మీదనే ఆపుకుంటాయి. అంటే రాష్ట్రంలోకి కృష్ణ, తుంగభద్ర నదులు ప్రవేశించే లోపలే 35 టిఎంసిల నీళ్లు వాళ్లు తుంగభద్ర డ్యాం నుండి గానీ, ఆల్మట్టి నుండి గానీ మళ్లించుకోగలరు. ఇది సగటు సంవత్సరాలలో నష్టం చేయకపోవచ్చును గానీ వర్షాభావ సంవత్సరాలలో సహితం ఎగువ రాష్ట్రాలు 35 టిఎంసిలు ఉంచేసుకుంటాయి. కాబట్టి కృష్ణా తుంగభద్రలు రాష్ట్రంలోకి ప్రవేశించే దగ్గరే ఉన్న ప్రాజెక్టులకు నష్టం కలగగలదు. ఇవి తెలంగాణ, రాయలసీమలలోనే ఉన్నాయి: జూరాల, రాజోలిబండ, రేపు రాబోయే భీమ, తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలు.

కాగా, పోలవరం ద్వారా సుభిక్షమైన కోస్తాంధ్ర జిల్లాలకు, కృష్ణా బేసిన్‌లోని దుర్భిక్ష ప్రాంతాలకు గోదావరి జలాల్ని తరలించే ముందు గోదావరి జలాలు తప్ప వేరే గత్యంతరం లేని ఉత్తర తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాలకు సాగునీటి వసతి కల్పించడం అవసరం. సాగునీటి పైన సమాన హక్కు ఒక ప్రజాతంత్ర విలువ అన్న మా అభిప్రాయాన్ని పైన చెప్పాము. ఆ దృష్టితో చూసినప్పుడు ఉత్తర తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాలకు గోదావరి జలాలు తప్ప వేరే ఏ ఆధారమూ లేదు కాబట్టి ఆ ప్రాంతాల అవసరాలు తీర్చగల ఆచరణాత్మక పథకం చేపట్టిన తరువాతే వేరే అవసరాల కోసం - ఎంత న్యాయమైన అవసరాలయినా సరే - గోదావరి జలాల వినియోగాన్ని తలపెట్టాలి. నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలు కలుసుకునే ప్రాంతం (ప్రజ్ఞాపూర్-సిద్దిపేట రోడ్డు కేంద్రంగా ఒక అర్ధచంద్రాకారంలో పరచుకొని ఉన్న మెట్ట ప్రాంతం) దుర్భిక్షంలో దక్షిణ తెలంగాణ, రాయలసీమలకు పెద్దగా తీసిపోదు. ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లందించే కచ్చితమైన ప్రణాళిక ఇప్పటికీ లేదు. కాగితం మీద చూసినప్పుడు గోదావరిలో మన రాష్ట్ర వాటా చాలానే ఉన్నట్టు తోస్తుంది గానీ గోదావరి జలాల వినియోగంలోని సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు పరిస్థితి భిన్నంగా కనిపించక మానదు. కరెంటు పెట్టి భారీగా 'లిఫ్టు' చేయకుండ ఉత్తర తెలంగాణలోని మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలు చేరవేయడం సాధ్యపడదు. గోదావరిలో నీళ్లెంత ఉన్నాయనేది కాదు, దానిని తీసుకోవడానికి ప్రభుత్వం ఖర్చెంత పెట్టగలదనేది సమస్య. అంతంత ఖర్చుపెట్టి ఎన్ని ప్రాజెక్టులు కట్టగలదనేది సమస్య. కాబట్టి ఎగువ ప్రాంతాల హక్కులను వ్యవస్థీకరించకుండ దిగువన వేరే వినియోగానికి వనరులు, నీళ్లు కేటాయించడం భావ్యం కాదు.

ఇదంతా ఒకెత్తయితే పోలవరం వస్తే ముంపుకు గురికాగల ప్రజల - ముఖ్యంగా వారిలో సగం పైగా ఉన్న ఆదివాసుల - జీవనానికీ జీవితానికీ జరగగల హాని ఊహకు సహితం అందడం కష్టం. పైన చెప్పినట్టు వాళ్లకు నష్టపరిహారం రాగల స్థిరాస్తులున్నది కొంచెమే. వారి జీవనం ప్రధానంగా ప్రకృతిసిద్ధంగా లభించే సంపదను ఆధారం చేసుకొని సాగుతున్నది. ఆ ప్రకృతిని మొత్తం రేపు

కోల్పోతారు. దానిని తిరిగి ఎక్కడా ఏ రూపంలోనూ ప్రభుత్వం వారికి కల్పించలేదు. వారి విషయంలో పునరావాసం అనే మాటకు అర్థమే లేదు. మామూలు అర్థంలో ఏ ఊరి వెలుపలో ఒక కాలనీ కట్టిచ్చి ఎకరమో రెండెకరాలో బంజరు భూమి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, పోలవరంలో శతాంశం ముంపు ఉండే ప్రాజెక్టుల విషయంలో పునరావాసం ఏవిధంగా అమలయిందో చూస్తే అది కల్ల అని అర్థం అవుతుంది.

ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు పోలవరం ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించడమే సరయిన ప్రజాస్వామిక వైఖరి అని మేము భావిస్తున్నాం.

❖



## పాకీ పని

# దళితులకు ఇచ్చిన రిజర్వేషనా?

-విమల

మనిషన్నాక ఎంతటి వేదాంతికైనా, పేదవాడికైనా, ధనవంతుడికైనా తప్పని పని ఇది. మన దినచర్యలో భాగంగా, మలవిసర్జన చేశాక, మరుగుదొడ్లో కాసిన్ని నీళ్ళు గుమ్మరించాక, శరీరం, చేతులు కడుక్కొని బయటకు వచ్చాక, శరీరంలోని మాలిన్యం అంతా తొలగి శుభ్రపడినట్లు భావించడం అందరి అనుభవంలోని విషయమే. తరువాత ఆ విషయమే మరిచిపోతాం. మన శరీరాల నుండి, ఇండ్ల నుండి, వీధుల నుండి రోజూ టన్నుల కొద్దీ పోగయ్యే ఈ దుర్గంధ పూరిత మలం, చెత్త అంతా ఎక్కడికి పోతున్నట్లు? ఎవరు దీన్నంతా శుభ్రం చేస్తున్నట్లు? ఈ పని చేస్తున్న వాళ్ళు ఇకనుండి మేం ఇలాంటి పారిశుధ్యపు పనులను చేయమని మానివేస్తే ఏమవుతుంది? ఊహించండి.

ఇలా ప్రశ్నించుకోవడం మనకి చాలా అసౌకర్యంగా ఉంటుంది కాబట్టి, ఇలాంటి విషయాలను విస్మరించడానికే ఎక్కువ మందిమి ప్రయత్నిస్తాం.

మన మరుగుదొడ్లు కడుగుతున్న వాళ్ళు, వీధుల్లో మనం పారవేసే చెత్తను ఎత్తుతున్నవాళ్ళు, మనం విసర్జించిన మలాన్ని ఎత్తుతున్నవాళ్ళు, మలంతో నిండిన సెప్టిక్ ట్యాంకులను, డ్రైనేజీలను శుభ్రపరుస్తున్న వాళ్ళు మనతో పాటు ఈ సమాజంలోనే జీవిస్తున్నారు. ఏళ్ళ తరబడి ఇలాంటి పారిశుధ్యపు పనులను వాళ్ళు చేయబట్టే మిగిలిన మనుషులం పరిశుభ్రంగా, ఆరోగ్యంగా జీవించగలుగుతున్నాం.

కుల వ్యవస్థ బలంగా ఉన్న మన సమాజంలో మల విసర్జన కూడా ఆచార వ్యవహారాల స్థాయికి పోయింది. మలాన్ని తాకటం, దాని గురించి ప్రస్తావించడం కూడా హీనమైనదిగా పరిగణింపబడుతుంది. భోజనానికి, పవిత్రమైన పనులకు కుడిచేతిని ఉపయోగించడం, మలవిసర్జన తర్వాత శుభ్రం చేసుకోవడం లాంటి పనులకు ఎడమ చేతిని ఉపయోగించడం మనం బాల్యం నుండీ పాటించే అలవాట్లుగా స్థిరపడ్డాయి.

### డ్రైనేజీ వ్యవస్థ

మన దేశంలో ఇప్పటికీ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ బహిరంగ ప్రదేశాలనే మలవిసర్జనకై ప్రజలు వాడుతూ ఉన్నారు. మరుగుదొడ్లు ఉన్నచోట ఇంటి ఆవరణలో ఒక మూలకి కట్టుకునే పద్ధతే ఎక్కువగా ఉంది. గ్రామాలలో, టౌన్‌లలో, పెద్ద నగరాల చుట్టూ విస్తరించిన కాలనీలలో ఇంకా సెప్టిక్ లెట్రిన్‌లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. పెద్ద నగరాలలో

స్థలాభావం వల్ల ఇటీవలి కాలంలో మరుగుదొడ్లు ఇంటి లోపల పడక గదుల పక్కనే నిర్మించుకోవడం మొదలైంది. అయితే గ్రామాల నుండి మహానగరాల వరకూ ఇప్పటికీ లక్షల సంఖ్యలో డ్రై లెట్రిన్‌లు ఉన్నాయి. ఈ మరుగుదొడ్ల నుండి పాకీపనివారు మనుష్యుల మలాన్ని చేతులతో ఎత్తి శుభ్రం చేస్తారు. హైదరాబాద్ నగరంలో 1920లో నిజాం కాలంలో మొట్టమొదటిసారిగా ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటయింది. అయితే నిజాం రాజభవనాలు, పాతబస్తీలోని ధనికులు నివసించే ప్రాంతాలకే ఇది పరిమితం అయింది. అప్పటి నుండీ, ఇప్పటి వరకూ కూడా డ్రైనేజీ మురుగును మూసీ నదిలోకే వదులుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాల్లోనూ, నగరంలోని అనేకచోట్లా కూడా ఓపెన్ నాలాల వ్యవస్థనే ఇందుకోసం ఉపయోగిస్తున్నారు. మన రాష్ట్రంలోని 111 మునిసిపాలిటీలలో పాక్షికంగా సీవరేజ్ వ్యవస్థ ఉంది. 1975లో ఇది ప్రారంభం కాగా, తిరుపతిలో మాత్రం ఇంకా ఆలస్యంగా, 1999లో సీవరేజ్ వ్యవస్థ మొదలైంది. అదీ పాక్షికంగానే. డ్రైనేజీలు, ఓపెన్ నాలాలు, సెప్టిక్ లెట్రిన్‌లు, డ్రై టాయిలెట్స్ నుండి పోగయ్యే మానవ మలాన్ని ఎలాంటి శుద్ధీ చేయకుండానే సమీపంలోని నదులలోకి, సముద్రాలలోకి, ఊరవతల ఉండే బహిరంగ ప్రదేశాల్లోకి వదులుతున్నారు. విశాఖ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఇటీవలి కాలంలో వేళ్ళమీద లెక్కబెట్టేంత తక్కువ సంఖ్యలో ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను నిర్మించారు. ప్రభుత్వం మంచినీరు, రోడ్ల వంటి వాటిపై వెచ్చిస్తున్న ధనంలో పావువంతు కూడా సీవరేజ్ వ్యవస్థపై ఖర్చుపెట్టడంలేదు. ప్రజల నుండి మాత్రం నీరు, సీవరేజ్ నిర్వహణకై పన్నులు వసూలు చేస్తుంది.

నిత్యం మరుగుదొడ్లను వాడే ప్రజలకు గాని, ప్రభుత్వానికి గాని మానవ మలాన్ని ఆధునిక పద్ధతుల్లో డిస్‌పోజ్ చేయడం అనే విషయం పట్ల ఏమాత్రం శ్రద్ధలేదు. ఎందుకంటే, ఈ పని మనకోసం చేసిపెట్టేందుకు 'వేరే మనుషులు'న్నారు కాబట్టి. మన మలమూత్రాలను ఎత్తి, మనం పరిశుభ్రమైన వారుగా జీవించేందుకు దోహదపడుతున్న వాళ్ళని మిగిలిన సమాజం కనీసం మనుషులుగా కూడా చూడదు. వాళ్ళను చూసినా, వాళ్ళ స్పర్శ తగిలినా అపవిత్రులై పోతారంటూ ఊరవతలకి నెట్టివేయబడిన దళితులు వాళ్ళు. మరుగుదొడ్ల నుండి మలాన్ని ఎత్తేందుకో, వాటిని కడిగేందుకో వచ్చే పాకీవాళ్లు ఇంటి వెనుక గుమ్మం నుండి లోపలికి వస్తారు. లేదంటే మరుగుదొడ్డి వెనకవైపు ఉండే రంధ్రం నుండి మలాన్ని ఎత్తి శుభ్రం చేసి వెడతారు. మరుగుదొడ్లలోని బకెట్లను, నీళ్ళ కుళాయిలను కూడా తాకనీకపోవడం, డబ్బులు పై నుండి విసిరేయడం, ప్రక్కన పెట్టడం, నీళ్లు అడిగితే దోసిట్లో పై నుండి పోయడం, కొనుక్కునేందుకు దుకాణాలకి వెడితే డబ్బులు పక్కన పెట్టాల్సి రావడం, ఇండ్లలోకి రానీయకపోవడం, హోటళ్ళలో దూరంగా వేరే గ్లాసుల్లో టీ త్రాగటం లాంటి అనుభవాలు పాకీపనివాళ్ళ నిత్యజీవితంలో భాగమైపోయాయి.

కలుషితం, అపవిత్రం అని ఆధిపత్య కులాలు భావించే అన్ని పారిశుధ్యపు పనులూ అంటరాని కులాల నెత్తిన బలవంతంగా రుద్దబడ్డాయి. మనుషుల, జంతువుల కళేబరాలను తొలగించడం, తోళ్ళను శుద్ధిచేయడం, వీధులను శుభ్రపరచటం, జననం, మరణం, ఋతుస్రావం వంటి సందర్భాలలో 'మైల'ను తొలగించడం, మలాన్ని ఎత్తి శుభ్రపరచడం, అందుకు పందులను పెంచడం వంటి పనులన్నీ అణిచివేతకు గురవుతున్న కులాల వారే చేస్తున్నారు. కుల వ్యవస్థ వివిధ కులాలు పాటించాల్సిన ధర్మాలను, వృత్తులను స్థిరీకరించింది. అతిక్రమించడానికి వీలులేని పద్ధతులను, శిక్షలను రూపొందించింది. 'నారద సంహిత'లో బానిసలకు నిర్దేశించిన 15 కర్మలలో ఒకటి మానవ మలాన్ని ఎత్తి శుభ్రం చేయడం. ఈ విభజనను, కట్టుబాట్లను పాటించడం తమ విధి, కర్తవ్యం అని ఆయా



కులాలు అంగీకరించటమే కాకుండా వాటిని అంతర్లీనం చేసుకున్నాయి. ఆధిపత్య కులాలకు ఇతర పనులు నేర్చుకునేందుకు, వృత్తులు మారేందుకు వెసులుబాటు ఉండొచ్చుకానీ, శారీరక శ్రమ, సేవలను చేసే కులాలకు అలాంటి అవకాశాలు దొరకవు. పైగా ఇలాంటి పనిని తమ సొంత పనిగా భావించేలా వారిని మానసికంగా సిద్ధం చేశారు. ఈ విషవలయంలోనే పాకీవాళ్ళు కూడా చిక్కుకున్నారు. వాళ్ళు బతకాలంటే మలాన్ని ఎత్తి శుభ్రం చేయాలి. ఆ పని చేయకపోతే బతికేందుకు మరో ఆధారం ఉండదు. పాకీ పనివాళ్ళు ఎవరినైనా ఏం పని చేస్తున్నారని ప్రశ్నిస్తే "మన పనే చేస్తున్నానని" అంటారు. ఇతరుల మలం ఎత్తడం తమ సొంత పనిగా భావించే ఈ స్థితిని, ఈ వృత్తిని పాకీ పనివారు ఎంతగా తమలో జీర్ణింప చేసుకున్నారో ఆ మాట తెలియజేస్తుంది. పాకీ పని చేసే భంగీలు, మెహతర్‌లు మరో కులస్థులెవరూ ఆ పనిలోకి రాకుండా అడ్డుకుంటారు. అంతేకాదు, తాము పాకీ పని చేస్తున్న ఇండ్లపై, ఏరియాపై వంశపారంపర్య హక్కులు ఏర్పరచుకుంటారు. వారి కుటుంబంలో ఒక తరం నుండి మరో తరానికి ఆ హక్కులు సంక్రమిస్తాయి. ఈ హక్కులను తమ కులంలోని ఇతర పాకీ పనివారికి అమ్ముకోవడం, తాత్కాలికంగా బదిలీచేసి, డబ్బులు తీసుకోవడం కూడా సర్వ సాధారణం.

చేతులతో మానవ మలాన్ని ఎత్తి శుభ్రం చేసే పని ముందు నుండీ ఉన్నప్పటికీ, పెద్దయెత్తున ప్రారంభమైంది, వ్యవస్థీకృతం అయిందీ మాత్రం బ్రిటిష్ వారి కాలం నుండి. అస్తవ్యస్థంగా సాగిన నగరాల విస్తరణ, సరైన పారిశుధ్యపు సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రబలిన అంటువ్యాధుల కారణంగానే కాకుండా, తమ రక్షణ అవసరాల రీత్యా కూడా బ్రిటిష్ వారు ప్రధాన జనావాసాలకు దూరంగా సెటిల్‌మెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కాని ఆ కాలంలో వివిధ రకాలైన మరుగుదొడ్లను ఉపయోగించేవారు. బ్రిటిష్ ఆర్మీ బకెట్ మరుగుదొడ్లను వాడేది. ఒక చోట నుండి మరో చోటుకు మోసుకుపోయేందుకు వీలైన డబ్బాలవి. మలవిసర్జన చేశాక, ఆ డబ్బాలను భంగీవారు దూరంగా తీసుకువెళ్ళి శుభ్రంచేసి యథాస్థానంలో పెట్టేవారు. చుట్టూ ఎత్తైయిన గోడలు కట్టి, లోన 50 నుండి 400 సీట్లతో నిర్మించే సామూహిక డ్రై టాయిలెట్ల నుండి క్రింద గచ్చుపై పడే మలాన్ని పాకీ పనివారు చీపురుతో రేకు పైకి ఎత్తి, దానిని వెదురు తట్టలలో మోసి, బకెట్‌లో నింపి, ఎడ్లబండ్లల్లోని డ్రమ్ముల్లో లోడ్ చేసి, అక్కడ నుండి ఊరికి దూరంగా ఉండే డంపింగ్ సెంటర్లలో పడవేసేవారు. ఇప్పటికీ వేస్తున్నారు. ఆనాటి నుండి ఈ నాటికి వచ్చిన మార్పేమైనా ఉందంటే ఎడ్లబండ్ల స్థానంలో ట్రాక్టర్లు రావటం ఒక్కటే.

ప్రైవేటు ఇండ్లలో ఇలాంటి డ్రై లెట్రిన్‌లు ఇంటి ఆవరణలో ఒక మూలకి ఉంటాయి. ఈ మరుగుదొడ్లకి వెనుకవైపు ఉండే రంధ్రాల ద్వారా మలాన్ని సేకరించడమో, లేదా పాకీ వారి రాకకై ఏర్పాటుచేసే ప్రత్యేక వాకిలి ద్వారా లోనికి వచ్చి శుభ్రం చేయడమో సాధారణంగా జరుగుతుంది. గంపల నుండి మలం బయటకు కారకుండా గంపలలో ఆకులు పరుస్తారు. ఈ గంపలను లేదా బకెట్‌లను తలపైనో, భుజాలపైనో మోసుకెళ్ళి దూరంగా పడవేస్తారు. ఈ పని చేసేది ప్రధానంగా స్త్రీలు. అలా మోసుకు వెడుతున్నప్పుడు వాళ్ల మొఖంపైన, శరీరంపైన, దుస్తులపైనా మలం చిందిపడుతూనే ఉంటుంది.

ఇక వర్షాకాలం వచ్చిందంటే పాకీ పనివారి పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటుంది. రోజూ గంపలకొద్దీ మానవ మలాన్ని తలపై మోసి, మురికి, దుర్గంధం మధ్య పనిచేసే పాకీ పనివారికి, తిరిగి ఇంటికి వచ్చాక తాము చేసిన పని గుర్తుకొచ్చి, అన్నం తినాలన్నా సహించదు. రోగాలు,

క్రిములకు నిలయంగా ఉండే ఈ మలినాలతో ఏళ్ళ తరబడి పనిచేస్తూ ఉండటంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. ఇంతా చేస్తే వాళ్ళకు ఒక ఇంటికి దొరికే కూలీ నెలకి 20-25 రూపాయలు మాత్రమే. సామూహిక డ్రై లెట్రిన్‌లు శుభ్రంచేసే పాకీ పనివారికి నెలకు రూ.750 - 900 దొరుకుతాయి.

మన రాష్ట్రంలో నిజాం పాలన కింద ఉన్న ప్రాంతాల్లో ఉన్నత వర్గాల ముస్లింల ఇళ్ళల్లో, హిందూ ఆధిపత్య కులాల వారి ఇళ్ళల్లో డ్రై లెట్రిన్‌లను ఉపయోగించేవారు. బ్రిటిష్ వారి కంటోన్ మెంట్స్‌లో, సైన్యం, రైల్వేలు, కోర్టులు, ఇతర పాలనా శాఖల్లో, పారిశ్రామిక ప్రాంతాలలో కూడా డ్రై లెట్రిన్‌లు ఉండేవి. భూమి వ్యాపారీకరణ కావడం, చేతివృత్తులు విధ్వంసం కావడం, తరచూ వచ్చే కరువు కాటకాల కారణంగా గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయక వృత్తుల నుండీ, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల నుండీ దూరమై క్రమంగా ఊడ్వటం, పాకీ పని చేయడం వంటి పనులవైపు దళితులు నెట్టబడ్డారు. పట్టణీకరణ క్రమంలో ముందుకు వచ్చిన నూతన అవసరాలను అప్పటికే పారిశుధ్యపు పనులు చేస్తూ ఉన్న ఈ అంటరాని కులాలు తీర్చగలవని బ్రిటిష్‌వారు గుర్తించారు. ఊడ్వటం, డ్రై లెట్రిన్‌లను శుభ్రం చేయడం వంటి పనులను వేతం చెల్లించే ఉద్యోగా లుగా గుర్తిస్తూ, ఈ పనులను దళితులకిచ్చారు వాళ్ళు. సుమారు 200 సంవత్సరాల క్రితం ఢిల్లీలో పాకీ పని చేసేందుకు, వీధులు ఊడ్చేందుకు వచ్చిన 'చుహర్'లు పంజాబ్ గ్రామీణ ప్రాంతాల నుండి వలస వచ్చిన వ్యవసాయ కూలీలు. హైదరాబాద్ నగరంతో సహా మిగిలిన తొమ్మిది తెలంగాణ జిల్లాల్లో పాకీ పనిచేస్తున్న మెహతర్‌లు హర్యానా, ఢిల్లీ, పంజాబ్, యు.పి. తదితర ప్రాంతాల నుండి 150 సంవత్సరాల క్రితం నిజాం పాలకులచే తీసుకురాబడిన అంటరాని కులాల వారు. హైదరాబాద్‌లో మెహతర్ల మొదటి సెటిల్‌మెంట్ పాతనగరంలోని సుల్తాన్ షాహీలోని మెహతర్‌వాడి. అలా వలస వచ్చిన మెహతర్లు ఈ బస్తీ నుండే నాటి నిజాం రాజ్యంలోని నాందేడ్, జాల్నా, ఔరంగాబాద్, బీదర్, గుల్బర్గా మొదలైన ప్రాంతాల్లో పాకీపని చేసేందుకు వెళ్ళారు. హైదరాబాద్ నగర విస్తరణ, పెరిగిన పారిశుధ్యపు అవసరాల రీత్యా మెహతర్ బస్తీ నుండి ఇతర బస్తీలకు వెళ్ళారు వాళ్ళు. నేడు హైదరాబాద్ నగరంలోని 40 బస్తీలలో మెహతర్ల ఇండ్లున్నాయి. తెలంగాణ ప్రాంతంలో దాదాపు 60 వేల మంది మెహతర్లు ఉంటారని అంచనా.

పాత మదరాసు రాష్ట్రంలోనూ 120-130 సంవత్సరాల క్రితం పెద్దయెత్తున పట్టణీకరణ మొదలైంది. దానితో పాటు, మానవ మలాన్ని చేతులతో ఎత్తే పాకీపనివారి సంఖ్య కూడా పెరిగింది. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా నుండి మాదిగల్లో ఒక ఉపకులమైన రెల్లి కులం వారు. ఒంగోలు, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుండి యానాదులు, అనంతపురంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుండి ముస్లింలలోని ఒక తెగవారైన హలాల్‌కోర్లు ఈ పాకీపని చేయడానికి వెళ్లారు. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కువగా మాదిగలే ఈ పని చేస్తున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి యాభయ్యేళ్ళు గడిచిపోయాక కూడా జీవించేందుకు ఇతరుల మలాన్ని ఎత్తాల్సిన దుస్థితిలో 12 లక్షల మంది దళితులున్నారు. ఇంతకు రెట్టింపు సంఖ్యలో, మల మూత్రాలతో నిండిన డ్రైనేజీలను, సెప్టిక్ ట్యాంకులను, ఓపెన్ నాలాలను శుభ్రపరుస్తున్న సీవరేజి కార్మికులున్నారు. వీరిలోనూ 95 శాతం మంది దళితులే.

భారత రాజ్యాంగం పౌరులకు ఎన్నో ప్రాథమిక హక్కులను గ్యారెంటీ ఇస్తుంది. చట్టం ముందు



అందరూ సమానులే అని ఆర్టికల్ 14 చెపితే ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిర్మూలించడం గురించీ, ఆర్టికల్ 23 దోపిడీ నుంచి రక్షింపబడే హక్కు గురించీ చెబుతూ ఉన్నాయి. అంతేకాదు తనకు ఇష్టం వచ్చిన వృత్తిని ఎంచుకునే, ఇష్టం వచ్చిన దగ్గర నివసించే స్వేచ్ఛకు సంబంధించిన హక్కులు కూడా మనకున్నాయి. అయితే ఈ హక్కులేవీ పాకీపని వారియెడల అమలు కావడంలేదు.

'సఫాయి కర్మచారీల నియాయకం, డ్రై లెట్రిన్‌ల నిషేధ చట్టం, 1993 పాకీ పనివారిని నియమించడం, డ్రై లెట్రిన్‌లను కలిగి వుండటం రెండూ శిక్షార్హమైన నేరాలేనని చెబుతూ ఉంది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రోజుకు రూ.100/- జరిమానా విధించాల్సి ఉంటుంది. అంతేకాదు ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టం 1989 ప్రకారం కూడా ఇలాంటి పనిని దళితులతో చేయిస్తున్న వారు శిక్షకి అర్హులే అవుతారు.

అయితే జరుగుతున్నదేమిటి? ప్రభుత్వం రూపొందించిన గణాంక వివరాల ప్రకారం మన దేశంలో 8 లక్షల మంది పాకీపనివారున్నారని అంచనా. పాకీ పనివారిని సంఘటిత పరుస్తున్న సంస్థలు ఈ సంఖ్య 12 నుండి 13 లక్షల వరకూ ఉంటుందని అంటున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన వ్యూహపత్రం ప్రకారం మన రాష్ట్రంలో 20-50 సీట్లు గల 40,000 పబ్లిక్ డ్రై లెట్రిన్‌లున్నాయి. ఒక్కొక్క డ్రై లెట్రిన్‌ను 300-500 మంది వాడుతున్నారు. దాదాపు 5,000 పాకీ పని వారిని గ్రామ పంచాయితీలు, మునిసిపాలిటీలు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పనిలో పెట్టుకున్నాయి. ఇవి కాక రాష్ట్రంలో 2-3 లక్షల ప్రైయివేటు డ్రై లెట్రిన్‌లు ఉన్నాయని ఈ పత్రం అంచనా వేసింది. వీటిల్లో మరో 5,000 మంది పనిచేస్తున్నారు. సరైనటువంటి పారిశుధ్య వసతులు లేకపోవడం వల్ల అనారోగ్యం పాలై ఏటా దేశంలో 7 లక్షల మంది పిల్లలు చనిపోతున్నారని, పారిశుధ్య లేమివల్ల దేశంలో ఏటా పదివేల కోట్ల రూపాయల జాతీయ నష్టం సంభవిస్తున్నదని కూడా ఆ పత్రం పేర్కొంది.

భారత ప్రభుత్వం ఏర్పరచిన 'సాంఘిక న్యాయం - సాధికారత' మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలోని 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మొత్తం 96 లక్షల డ్రై లెట్రిన్‌లలో పాకీ పనివారు పనిచేస్తున్నారు. సఫాయి కర్మచారీ నేషనల్ కమీషన్ 2000 సంవత్సరంలో విడుదల చేసిన తమ మూడవ నివేదికలో మిలటరీ, ఇంజనీరింగ్, ఇతర సర్వీసులలో, ప్రభుత్వరంగ సంస్థలలో, భారతీయ రైల్వేలలో చేతులతో మలాన్ని ఎత్తి శుభ్రం చేసే పాకీ పనివారు పనిచేస్తున్నట్లు పేర్కొనింది.

ఇళ్ళలో ఉండే సెప్టిక్ లెట్రిన్‌ల ట్యాంకులను, గుంతలను శుభ్రం చేయించడం, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లలో నీటి ద్వారా కాక చేతులతో మలాన్ని ఎత్తేయించి శుభ్రపరచడం కూడా శిక్షార్హమైన నేరాలే. నిర్లక్ష్యం, నీటికొరత, నిర్వహణా లోపాల వల్ల నీటితో శుభ్రపరిచే ఫ్లష్ టాయిలెట్లు ఉన్న చోట్ల కూడా పాకీ పనివారు మలాన్ని చేతులతో ఎత్తి శుభ్రపరచాల్సి వస్తున్నది. నగరాలలో పట్టణ పేదలు, వలస కూలీలు మరుగుదొడ్ల సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. మురికివాడలలో సక్రమంగా మరుగుదొడ్లు లేకపోవడం, పబ్లిక్ టాయిలెట్లను ప్రభుత్వం క్రమంగా మూసివేస్తూ ఉండటంతో చాలామంది రోడ్లపైనే మల విసర్జన చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి ప్రదేశాల నుండి కూడా పాకీ పనివారితోనే మునిసిపాలిటీలు మలాన్ని ఎత్తిస్తున్నాయి.

తాను చేసిన చట్టాలను తానే ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాన్ని శిక్షించే వాళ్ళెవరు? ప్రభుత్వం, న్యాయ

వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరుకు అద్దం పడుతుంది ఇటీవల జరిగిన ఒక సంఘటన.

మన రాష్ట్రంలో పాకీ పనివారిని 1996 నుండీ సంఘటిత పరుస్తున్న సంస్థ సఫాయి కర్మచారీ ఆందోళన్. రాష్ట్రంలోని డ్రై లైట్రిన్‌ల కూల్చివేతకు ఈ సంఘం పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఆగస్టు 16, 2004న, అంటే స్వాతంత్ర్య దినోత్సవ పండుగ ముగిసిన మర్నాడు, సఫాయి కర్మచారీ ఆందోళన్ కార్యకర్తలు, ఈ ఆందోళనకు మద్దతునిస్తున్న ఇతర సంఘాలు, వ్యక్తులు కలిసి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డిపేటకు వెళ్ళారు. అక్కడ ప్రయివేటు ఇళ్ళలో 12 డ్రై లెట్రిన్‌లు, రెండు కమ్యూనిటీ డ్రై లెట్రిన్‌లు ఉన్నాయి. వీటిలో ఒకటి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఉంది. కోర్టు ఉద్యోగులు ఇప్పటికీ దాన్ని ఉపయోగిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఉన్న అన్ని డ్రై లెట్రిన్‌లను వినోద్ అనే మెహతర్ శుభ్రపరుస్తున్నాడు. కోర్టు ఆవరణలోని కమ్యూనిటీ డ్రై లెట్రిన్‌ను శుభ్రపరిచినందుకు గాను కోర్టు వారు అతనికి ప్రతినెల రూ.750/- చెల్లిస్తారు. పాకీ పనివారి జీవన స్థితిని వివరించి, ఈ పని మానివేసి, ఆ డ్రై లెట్రిన్‌ను కూల్చివేయడంలో సహకరించమని ఆందోళనకారులు చెప్పగానే వినోద్ ఎంతో సానుకూలంగా స్పందించాడు. కూల్చివేతకు మొదటివేటు వినోదే వేశాడు. వెంటనే కోర్టు అధికారులు పరుగెత్తుకు వచ్చి కూల్చివేతను ఆపివేయించడమే కాకుండా, జూనియర్ సివిల్ జడ్జి, చీఫ్ మినిస్టీరియల్ ఆఫీసరు సంతకంతో ఉన్న ఒక ఆర్డర్ కాపీని ఆందోళనకారులకు ఇచ్చి వెళ్ళారు. ఎల్లారెడ్డిపేట జూనియర్ సివిల్ జడ్జి ఆవరణలో ఉన్న డ్రై లెట్రిన్‌ను కూల్చేందుకు నిజామాబాద్ జిల్లా జడ్జిగారి అనుమతి లేదని, అలాంటి అనుమతి పొందేవరకూ, కోర్టు ఆస్తిని పరిరక్షించడం తమ బాధ్యత అనీ, కాబట్టి సదరు డ్రై లెట్రిన్‌లను కూల్చివేయకుండా నిరోధించడం జరుగుతున్నదని పేర్కొన్నారు.

ఈ చర్యను నిరసిస్తూ సఫాయి కర్మచారీ ఆందోళన్ వారు స్థానిక ఎస్.ఐ.కి ఫిర్యాదు చేయగా అతడు ఆ ఫిర్యాదును నమోదు చేసుకునేందుకు తిరస్కరించడమే కాదు, ఊరేగింపు తీస్తున్న వారు ప్రజలకి ఇబ్బంది కలిగిస్తూ, శాంతి భద్రతలకి విఘాతం కలిగిస్తున్నారు కాబట్టి అందరినీ అరెస్టు చేయాల్సి వస్తుందని హెచ్చరించాడు. పైగా 1993 నిషేధ చట్టం గురించి తనకేమీ తెలీదని కూడా అన్నాడు.

ఈ శాసన పరిరక్షకుల మలాన్ని ఇరయ్యేళ్ళుగా శుభ్రం చేసిన మెహతర్ ఇక ఆ పని తాను చేయనన్నందుకు చట్టాన్ని ధిక్కరించిన వాడయ్యాడు. ఇన్నేళ్ళుగా ఆ మెహతర్ చేత చేయించుకున్న పనికి కనీస వేతనం చెల్లించని, పర్మనెంటు చేయని, పాకీ పని నిషేధ చట్టాన్ని పాటించని ఇలాంటి న్యాయస్థానాల్లో దళితులకి, పేదలకి న్యాయం దొరుకుతుందని ఎలా విశ్వసించగలం?

పాకీ పనివారి జీవన పరిస్థితుల్లో మార్పుకోసం వివిధ సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం కమిటీలను, కమిషన్‌లను వేశాయి. 1949లో బొంబాయి ప్రభుత్వం బార్వే నేతృత్వంలో "పాకీ పనివారల జీవన పరిస్థితుల విచారణా కమిటీ"ని వేసింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1957లో మల్కానీ నేతృత్వంలో "స్కావెంజర్స్ కండిషన్స్ ఎంక్వయిరీ కమిటీ"ని ఏర్పరిచింది. 1965లో మరోమారు కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ అతని అధ్యక్షతనే రెండవ కమిటీని ఏర్పరిచింది. కర్ణాటకలో ఐ.పి. డి.సాలప్ప నేతృత్వంలో మరో కమిటీని వేశారు. ఈ కమిటీలన్నీ పాకీ పనివారి జీవన, పని పరిస్థితులలో మెరుగుదల గురించి సూచించాయి తప్ప మొత్తంగానే పాకీ పనిని, డ్రై లెట్రిన్‌ల విధానాన్ని రద్దుచేయడం గురించి మాట్లాడలేదు. 1969లో భారత ప్రభుత్వం డ్రై లెట్రిన్‌లను నీరుపోసి శుభ్రం చేసే ఫ్లష్ టాయిలెట్లుగా మార్చే ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం క్రింద ప్రభుత్వం 25 శాతం సబ్సిడీని, 75 శాతం రుణాన్ని ఇచ్చింది. ఇలాంటివే ఇతర పథకాలు కూడా వచ్చినప్పటికీ చెప్పుకోదగ్గ మార్పు రాలేదు.

1970లలో బిందేశ్వర్ పాఠక్ డ్రై లెట్రిన్‌లకు బదులు, రెండు గుంతల పద్ధతిని ఉపయోగించి నిర్మించే మరుగుదొడ్లను రూపొందించాక, నెమ్మదిగా ఈ పద్ధతిలో మార్పులు వచ్చాయి. పాఠక్ అంతర్జాతీయ సంస్థలు, భారత ప్రభుత్వం సహకారంతో దేశంలోని ప్రధాన పట్టణాలలో సులభ్ శౌచాలయాలను ఏర్పాటు చేశాడు. నగరాల్లోని బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, పబ్లిక్ స్థలాల్లో ఇవి ఇప్పుడు సర్వసాధారణం అయిపోయాయి. సులభ్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్‌లో 1985లో వీటిని ప్రారంభించింది. మన రాష్ట్రంలో సులభ్ శౌచాలయాలు 23 జిల్లాల్లో ఉన్నాయి. 355 కమ్యూనిటీ టాయిలెట్లను, ఒక మొబైల్ టాయిలెట్ వాహనాన్ని వాళ్ళు నిర్వహిస్తున్నారు. పాకీ పనిని, డ్రై లెట్రిన్‌లను రూపుమాపటం ఆశయంగా కలిగివున్న ఈ సంస్థలో పనిచేస్తున్న 2,176 మందిని వాళ్ళిప్పుడు "సంఘ సేవకుల"ని పిలుస్తున్నారు. అయితే విషాదం ఏమిటంటే పేరు మారినా, సులభ్‌లో పనిచేసే స్వీపర్లు, పాకీ పనివారు అందరూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మెహతర్‌లు, మాదిగలు, ఇతర అంటరాని కులాలవారే. వీళ్ళకి ఈ మరుగుదొడ్లను శుభ్రం చేసినందుకు నెలకు రూ.900 నుండి 1200 వరకూ చెల్లిస్తారు.

ఇక నగరాల్లో డ్రైనేజీల్లోకి దిగి పనిచేసే సివరేజ్ కార్మికుల్లో 95 శాతానికి పైగా మాదిగ కులం వారున్నారు. మునిసిపాలిటీల్లో 1984 నుండి నూతనంగా ఉద్యోగాలు ఇవ్వడంపై నిషేధం కొనసాగుతూ ఉంది. ఏళ్ళ తరబడి పనిచేస్తున్నా వీళ్ళంతా కాంట్రాక్ట్ కార్మికులే. గతంలో ఎన్.ఎమ్.ఆర్.ల పద్ధతి ఉన్నప్పుడు కార్మిక సంఘాల నేతృత్వంలో అనేక ఆందోళనలు చేసి ఈ కార్మికులు పర్మనెంటు ఉద్యోగాలు పొందగలిగారు. దీనితో ప్రభుత్వం హేండ్ రిసీప్ట్ లేబర్ సిస్టమ్ (హెచ్.ఆర్)ను ప్రవేశపెట్టింది. మునిసిపల్ కార్మికులుగా వీళ్ళు ఎక్కడా నమోదుకారు. చట్టబద్ధ హక్కులేవీ వీళ్ళకు వర్తించవు. ఇవ్వాళ సివరేజ్ కార్మికుల్లో మెజారిటీ హెచ్.ఆర్.లే ఉన్నారు. ప్రభుత్వమే మోసానికీ, దగాకీ దిగింది. పదిమంది చేసే పనిని ఒక కార్మికుడితో చేయిస్తున్నారు ఇవ్వాళ. ఇనుప సీకులు, బకెట్‌లు, పారలు తీసుకుని వాళ్ళకు కేటాయించిన ప్రాంతాల్లో డ్రైనేజీ మూతల్ని తీసి, మలంతో నిండిన ఆ గుంతల్లోకి దిగి, మురుగును పారతో బకెట్‌లలోకి ఎత్తి పారబోస్తారు. ఇనుప రాడ్స్‌ను పైప్‌లోకి పెట్టి శుభ్రం చేస్తారు.ప్రమాదకర వాయువులతో, మురుగుతో నిండివుండే డ్రైనేజీల్లోకి ఇనుప సీకుల్ని పెట్టి తీస్తేనే అవి నల్లగా మారిపోతాయి. అలాంటి డ్రైనేజీలోకి ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా నడుముకు తాడుకట్టుకుని, ఒక్కోసారి 20 అడుగుల లోతైన పెద్ద పెద్ద డ్రైనేజీల్లోకి సివరేజ్ కార్మికులు దిగుతారు. ఒంటికి నూనె పట్టిస్తే మలం శరీరానికి తక్కువగా అంటుతుంది. అయినా గుండె లోతు దాకా మలంలో దిగి పనిచేయడం వల్ల చాలామంది కార్మికులకు చర్మవ్యాధులు, ఊపిరితిత్తులకు సంబంధించిన రోగాలు, టి.బి., ఆస్తమా, కంటిచూపు మందగించడం వంటి జబ్బులు వస్తాయి. రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సివరేజ్ కార్మికుల్లో ఎక్కువ మంది వాళ్ళ సర్వీసు పూర్తి కాకుండానే అనారోగ్యంతోనో, పని ప్రమాదాలలోనో మరణిస్తున్నారు. కొన్నిచోట్ల మునిసిపాలిటీలు డ్రైనేజీలను శుభ్రం చేసేందుకు ఎయిర్‌టెక్ మిషన్స్‌ను వినియోగిస్తున్నది. అయినప్పటికీ డ్రైనేజీల్లోకి దిగి మురుగును ఎత్తే పనిని, మిషన్ పనిని కూడా సివరేజ్ కార్మికులే చేస్తున్నారు.

పాకీ పనివారి పునరావాసం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2001లో ఏర్పాటు చేసిన పథకాల వల్ల లబ్ధి పొందుతున్నవారు చాలా తక్కువ మంది.

పాకీ పనిచేస్తున్న దళితులను ఎవరిని ప్రశ్నించినా తాము ఈ పని మానివేసి, వేరే పనులు చేసుకోవాలని కోరుకుంటున్నామనే చెప్తారు. వాళ్ళు తమ జీవితాల్లో మార్పును కోరుకుంటున్నా వారిలో పారిశుధ్యపు పనులు చేయించుకుంటున్న మిగిలిన ప్రపంచానికి ఆ మార్పు పట్ల పట్టింపు లేదు. వాళ్ళ ఆవేదనను, సమస్యలను ఏ రాజకీయ పార్టీలూ సీరియస్‌గా పట్టించుకోలేదు. ప్రజా స్వామిక సంస్థలు, హక్కుల ఉద్యమాల గుర్తింపులోకి, ఎజెండాలోకి కూడా పాకీ పనివారల సమస్యలు వచ్చింది లేదు. మార్పు కోసం జరిగిన ప్రయత్నాలు ఏవైనా ఉన్నాయనంటే, అవి వాళ్ళ జీతాలు, పని పరిస్థితుల మెరుగుదల కోసం సాగినవి మాత్రమే. కుల వ్యవస్థతో ముడిపడి ఉన్న ఈ సమస్య మూలాలను అర్థం చేసుకుని, ఈ పనిని సమూలంగా రూపుమాపేందుకు సైద్ధాంతిక, ఆచరణాత్మక స్థాయిలో కృషి జరగాల్సిన అవసరం ఉంది. పాకీ పనివారి పేరును 'సంఘ సేవకులు'గా మార్చడంతోనో, ఆధునిక యంత్రాలు తెచ్చి, మళ్ళీ వాటితో వాళ్లచేత మాత్రమే పనిచేయించడంతోనో మార్పురాదనే గుర్తింపు అవసరం.

ఇన్నేళ్ళుగా సాటి మనుషుల ఎడల మిగిలిన వాళ్ళం ఎంత అమానవీయంగా ప్రవర్తించామో గ్రహించి వారి జీవితాల్లోను, పని పరిస్థితులలోను మార్పు కోసం కృషిచేయడం మనందరి బాధ్యత. మరీ ముఖ్యంగా హక్కుల సంఘాల బాధ్యత.

❖





# రైతుల ఆత్మహత్యల్ని ఆపుదాం

రోజుకు పదిమందికి తక్కువ కాకుండా చేజేతులా ప్రాణాలు తీసుకుంటున్న రైతుల మరణాలు అందరినీ కలవరపరుస్తున్నాయి. 1998లో వరంగల్, కరీంనగర్‌లలో మొదలయి ఆ తరువాత అనంతపురానికీ ఇతర తెలంగాణా రాయలసీమ జిల్లాలకూ పాకిన ఈ బలవన్మరణాలు ఈనెల రోజుల కాలంలో రాష్ట్రమంతటా జరుగుతున్నాయి. ఉత్తరాంధ్రలో అత్యల్పంగానూ, తెలంగాణాలో అత్యధికంగానూ జరుగుతున్న ఆత్మహత్యలు ఏ ఒక్క జిల్లానూ వదిలిపెట్టలేదు. అభివృద్ధికి పర్యాయపదంగా ఉన్న కృష్ణా, గుంటూరు జిల్లాలలో సహితం చెప్పుకోదగ్గ సంఖ్యలో రైతులు తమ ప్రాణాలు తాము తీసుకుంటున్నారు. ఎవరెన్ని విజ్ఞప్తులు చేసినా ఈ అఘాయిత్యాలు ఆగడం లేదు.

బాధాకరమైన విషయం ఏమిటంటే సమాజం – ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలోని బుద్ధిజీవులు – బాధిత రైతాంగం పట్ల సానుభూతి చూపించే బదులు అతితెలివి వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తానంటున్నది కాబట్టి అందుకోసం ప్రాణాలు తీసుకుంటున్నారని కొందరు, దానివల్లనే ఏవేవో చావులను అప్పుల వల్ల జరిగిన ఆత్మహత్యలుగా చూపిస్తున్నారని మరికొందరు బుద్ధికి తోచిన మాటలు అంటున్నారు. రైతులు తిన్నది అరగక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ గతంలో అన్న పుడు అందరికీ కోపం వచ్చిందిగానీ ఇప్పుడు వినిపిస్తున్న వ్యాఖ్యలు అంతకంటే భిన్నమైనవి కావు.

మానవహక్కుల వేదిక 14 జిల్లాలలో 50కి పైగా ఘటనలపైన నిజనిర్ధారణ జరిపింది. మృతుల గ్రామాలకు పోయి వారి కుటుంబ సభ్యులతోనూ, ఇరుగుపొరుగు వారితోనూ వివరంగా మాట్లాడింది. రెండే రెండు ఘటనలలో వేరే కారణాల వల్ల జరిగిన ఆత్మహత్యకు వ్యవసాయ రుణాలను కారణంగా చూపించే ప్రయత్నం జరిగిందనే అనుమానానికి ఆస్కారం ఉంది.

యాభైలో రెండంటే కేవలం నాలుగు శాతం.

ఇక నష్టపరిహారం కోసం ఆత్మహత్య చేసుకుంటున్నారా అంటే, ఈ అనుమానం వ్యక్తం చేసేవాళ్లతో మీ కుటుంబ సభ్యులకు చందాలు వేసుకొని రెండు లక్షలిస్తాం, మీరు పురుగుల మందు తాగుతారా అని ఎదురుప్రశ్న వేస్తే కోపం వస్తుంది. మేము పర్యటించిన ఏ ఒక్క గ్రామంలోనూ కూడా మృతుని గురించి, 'ప్రభుత్వం భార్యా పిల్లలకు నష్టపరిహారం ఇస్తానని అనకపోతే చచ్చిపోక పోతుండె'నని కుటుంబ సభ్యులు గానీ, ఇరుగుపొరుగు గానీ అనలేదు. అసలు ప్రభుత్వ హామీల ప్రస్తావనే ఎవరూ ఎక్కడా చేయలేదు.

నిజానికి 1998 తరువాత మన రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఆగిందెన్నడు?

# కొన్ని ఆత్మహత్య ఘటనలు

ఇవి ఆత్మహత్యల వెనుక ఉన్న కారణాలను సూచించే కొన్ని ఉదాహరణలు మాత్రమే.

- **దాసరి కృష్ణయ్య (35)** మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూలు మండలం నాగనూరు వాస్తవ్యుడు. సొంత భూమి రెండెకరాలకు తోడు రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. బావిగానీ, బోరుగానీ ఏదీ లేదు. ఆ ఊరిలో 600 ఎకరాల పారకం ఉన్న చెరువుంది గానీ అది క్రమంగా ఎండిపోయి రెండేళ్ల నుంచి చుక్కనీరు లేకుండా ఉంది. తన భూమి పత్తి పండే భూమికాకపోయినా గతంలో మూడు సంవత్సరాలు వర్షాధారంగా పత్తి వేశాడు కృష్ణయ్య. మూడేళ్లూ నష్టపోయాడు. తరువాత ఒక సంవత్సరం భార్యాభర్తలు హైదరాబాద్ పోయి కూలి చేసుకొని వెనక్కి వచ్చారు. తిరిగి మొక్కజొన్నలు వేశాడు గానీ వానలు లేక ఫలం దక్కలేదు. లక్ష రూపాయలు అప్పయింది. అప్పిచ్చిన ఆసామీ ఒకడు 42 వేలు కట్టమని నోటీసు ఇచ్చాడు. కృష్ణయ్య మే 21 నాడు ఇంట్లోనే పురుగుల మందు తాగి చనిపోయాడు.
- **మేడ వీరభద్రం (35)** ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం బస్వా పురం నివాసి. ఒకప్పుడు బాగా భూమి ఉన్నవారే గానీ చెల్లెళ్ల పెళ్లిళ్లకూ, ఇతర ఖర్చులకూ అమ్ముకోగా మూడున్నర ఎకరాలు మిగిలాయి. అవి నాగార్జునసాగర్ ఎడమ కాలువ చివరి భూములు. నాలుగేళ్లగా నీళ్లు రావడం లేదు. ఒకదాని వెంబడి ఒకటి రెండు బావులు తవ్వాడు. ఒకటి పూర్తిగా ఎండిపోయింది. రెండవది నిరుడు వేసిన మిర్చిపంటకు ఇంకా ఒక తడి అవసరం ఉండగా ఎండిపోయింది. అప్పటికే రెండు లక్షల రూపాయల అప్పయింది. ధైర్యంచేసి పత్తికి ఎకరానికి 15,000, మిర్చికి ఎకరానికి 25,000 రూపాయలు పెట్టుబడి పెట్టి నిరుడు పంట వేశాడు. అయితే బావి మధ్యలో ఇంకిపోవడమే కాక మిర్చి ధర ఫిబ్రవరిలో క్వింటాలుకు 4,000 రూపాయలుండింది, తన తోట కోసేసరికి 2,400కు పడిపోయింది. మే నెల 24 వీరభద్రం ఉరిపెట్టుకొని చనిపోయాడు.
- కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పెద్దకమ్మవారిపాలెంకు చెందిన **కైతేపల్లి శ్రీనివాసరావు (65)**కు మూడెకరాలు సొంత భూమి ఉండేది. కూతుళ్ల పెళ్లికి ఆ భూమి అమ్మేశాడు. 50 సంవత్సరాల వయసొచ్చేదాకా తన కులవృత్తి అయిన మంగలి పని చేసేవాడు. ఆ తరువాత అది సాధ్యంకాక కృష్ణా డెల్టా కాలువ కింద నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మూడు సంవత్సరాలుగా కృష్ణా డెల్టా కాలువలలకు నీళ్లు సరిగ్గా రాకపోవడం వల్ల రెండేళ్లు పంట బాగా నష్టం అయింది. నిరుడు కొంచెం వచ్చేదే గానీ తుపానులో పోయింది. పెద్దమ్మాయికి కిడ్నీ జబ్బేదో ఉండడం వల్ల రోజుకు 60 రూపాయలు మందులకవుతాయి. ఈ క్రమంలో శ్రీనివాస రావు రెండు రూపాయల వడ్డీకి 47,000 రూపాయలు అప్పుతెచ్చాడు. కానీ ఈ సంవత్సరం పంట వేయడానికి అప్పు పుట్టే పరిస్థితి కనిపించక మే 28న ఇంట్లోనే ఉరిపెట్టుకొని చనిపోయాడు.
- **గవ్వల రాజయ్య (45)**ది కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి. చాకలి కులస్తుడు. చాకలి పనిలో ఒకప్పుడు మిగులు ఉండేదిగానీ, సర్ఫ్, సోడా, బ్లీచింగ్ పౌడర్ వాడనిదే బట్టలు వేసేవారు సంతృప్తి చెందని దశ వచ్చేసరికి ఖర్చు లెక్కువయి మిగులు పోయింది. రాజయ్య 1982లో నాలుగెకరాల భూమి కొన్నాడు. బావి తవ్వించాడు. అయితే ఊరిలోని ఇతర రైతులు బోర్లు వేయడం మొదలుపెట్టేసరికి ఇతని బావి ఎండిపోయింది. దానిలోనే ఒక బోరు వేశాడు. అది రెండు సంవత్సరాల తరువాత వట్టిపోయింది. ఆ తరువాత మూడు బోర్లు వేశాడు. రెండు అసలే పారలేదు. ఒకటి కొంచెం పారుతున్నది. దానికింద నిరుడు రెండెకరాలు వరి సాగయింది గానీ వడగండ్ల వాన వచ్చి నాశనం అయింది. ఈ లోపల అప్పు మూడు లక్షలయింది. ఏయేటికాయేడు ఎండిన పంట వడ్డీలకు సరిపోలేదు. ఇద్దరు బిడ్డలకు పెళ్లిళ్లు చేశాడు గానీ అల్లుళ్లకు ఇస్తానన్న కట్నం ఇవ్వలేదు. అదికూడా బాకీయే! రాజయ్యే మే 17 నాడు ఆత్మహత్య చేసుకున్నాడు.
- **కొంగంటి కొమురయ్య (45)** వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరి (జాగీర్)కు చెందిన కురుమ కులస్తుడు. ఒకనాడు 60 గొర్రెలుండె. వాటికి మేత దొరుకక ఏడేళ్ల కింద గొర్రెలమ్మి ఒక దొర దగ్గర 8 గుట్ట పక్కన కంచె భూమి ఎకరా 45,000కు కొన్నాడు. బాగుచేయించి బావులు తవ్వాడు. ఒక్కదానిలో మాత్రం నీరు వచ్చింది. నాలుగింటిలో బోర్లు వేశాడు. వాటిలోనూ నీళ్లు పారలేదు. రెండు మూడేళ్లగా ఏ పంటా పండడంలేదు. ఐదు లక్షల అప్పయింది. ఎని మిదిలో ఆరెకరాలు అమ్మి రెండున్నర లక్షలు తీర్చాడు. ఇంక రెండున్నర లక్షలు మిగిలాయి. రెండెకరాలు మిగిలాయి. పెళ్లి కెదిగిన ఇద్దరమ్మాయిలు మిగిలారు. అవివాహితుడయిన కొడుకు కష్టపడి బి.కాం. పూర్తిచేశాడు గానీ ఉద్యోగం కనుచూపు మేరలో లేదు. వ్యవసాయం చేయలేడు. కొమురయ్య మే 28న ఆత్మహత్య చేసుకున్నాడు.
- **నారిశెట్టి నాగేశ్వరరావు (40)** గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం నివాసి. సాగర్ కుడికాలవ కింద ఒకటిన్నర ఎకరం ఉండేది. చివరి భూములు కావడం వల్ల నీళ్లు లేక ఆ భూమిని బీడుపెట్టి నాలుగెకరాల మెట్టభూమి కౌలుకు తీసుకొని మిర్చి వేశాడు. నీళ్లు సరిగా లేక 'తెల్ల కాయ' రావడం వల్ల, మిర్చిరేటు పడిపోవడం వల్ల ఆ ప్రయ త్నమూ విఫలం అయింది. లక్షన్నర అప్పు పేరుకుపోగా మూత్రపిండం అమ్మి తీరుద్దామనుకున్నాడు గానీ ఏ కారణం గానో అది సాధ్యంకాక మే 23న ఆత్మహత్య చేసుకున్నాడు.
- **హర్రెడ్డి లక్ష్మారెడ్డి (42)** నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం బచ్చువారిగూడెంకు చెందిన రెండెకరాల ఆసామీ. అందులో మామిడితోట ఉంది. అంతర్‌పంటలుగా కూరగాయలు, మిర్చి వగైరాలు వేశాడు. రెండు మూడు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. రెండు లక్షల అప్పు మిగిలింది. అప్పులవాళ్లు వచ్చి అసభ్యంగా తిట్టిపోవడంతో మే 24వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.
- **తిప్పన్న (35)** అనంతపురం జిల్లా కంబదూరు మండలం డి.చెన్నేపల్లి గ్రామానికి చెందిన ఐదెకరాల రైతు. దళితుడు. ఇతను నాలుగేళ్ళ క్రితం 50,000 రూపాయలు అప్పు చేశాడు. తరువాత నాలుగు సంవత్సరాలుగా పంట చేతికి రాకపోవడం వల్ల ఆ అప్పు తీర్చలేకపోవడమే కాక కొత్తగా అప్పుతేవలసి వచ్చింది. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో మళ్ళీ పెట్టుబడి కోసం ప్రయత్నం చేస్తే అప్పు ఎక్కడా దొరకలేదు. ఇక వ్యవసాయం చేసే అవకాశమే లేదని, అప్పు తీర్చే ఆశలేదని నిస్పృహచెంది మే 19న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

నష్టపరిహారం ఒకటి రెండు ఘటనలలో ఇచ్చినప్పుడూ జరిగాయి. ఇవ్వడం మానేసినాక కూడా జరిగాయి. అయ్యో పాపం అన్నప్పుడూ జరిగాయి. ఒళ్లు బలిసి చస్తున్నారన్నప్పుడూ జరిగాయి. పత్రికలకు ఈ బాధలు కొంతకాలం వార్తలుగా ఉండి ఆ తరువాత తెరమరుగయ్యాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను సీరియస్ విషయంగా తీసుకొని ఆపడానికి ప్రయత్నిస్తామని ప్రకటించడంతో ఈ చావులు మళ్లీ వార్తలయ్యాయి. అంతకంటే తేడా వచ్చిందని నమ్మడానికి ఆధారాలు లేవు.

కాబట్టి నిరర్ధకమైన ఈ అతి తెలివి అనుమానాలను పక్కనపెట్టి రైతాంగాన్ని నిరాశలోనికీ, నిస్పృహలోనికీ నెడుతున్న కారణాల గురించి చెప్పుకుందాం. ప్రాణం తీసుకుందామన్న చివరి నిర్ణయాన్ని ప్రభావితం చేసేవి వేరే ఏ కారణాలయినా ఉండవచ్చునేమోగానీ ఈ నిరాశా నిస్పృహలు తీవ్రంగా ఉన్నాయనడంలో మాత్రం సందేహమేమీ లేదు.

ఆత్మహత్య చేసుకున్న రైతులందరూ వ్యాపార పంటలు వేసి పెట్టుబడులు భారీగా పెట్టి నష్టపోయిన వారు కారు. తాత తండ్రుల నాటి బావుల కింద, కాలానుగుణంగా వచ్చిన కొద్దిపాటి మార్పులను మినహాయిస్తే ఆనాటి పద్ధతిలోనే జీవనం వెళ్లదీస్తున్న రైతులూ ఉన్నారు. అడపాదడపా

## ఇవి ఆకలి చావులే

**ఎమ్మార్వోలు, ఆర్డీవోలూ ఒప్పుకుంటారో ఒప్పుకోరోగానీ ఇవి ఆకలి చావులే.**

- నీరుడి లక్ష్మి (35) మెదక్ జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ నివాసి. ఆమె భర్త బతికి ఉండగా వారికి ఎకరం భూమి ఉండింది. అతనికి ఏదో పేరు తెలియని రోగం ఉండింది. వైద్యానికని ఉన్న ఎకరం అమ్మేశారుగానీ అతనికి బాగుకాలేదు, చనిపోయాడు. లక్ష్మి ఇద్దరు పిల్లలను పెట్టుకొని కూలిచేసుకొని బతకసాగింది. అయితే ప్రధానంగా బోర్ల మీద ఆధారపడిన ఆ ప్రాంతపు వ్యవసాయం బోర్లు అన్నీ ఎండిపోవడం వల్ల లక్ష్మి వంటి కూలి వాళ్లకు పని కల్పించలేకపోయింది. తినడానికి తగినంత తిండి దొరకక లక్ష్మి ఆరోగ్యం కూడా క్రమేపీ క్షీణించింది. పోషకాహార లేమి ఆ రోగానికి తోడయి లక్ష్మి మే 8న కన్నుమూసింది.
- కందుకూరి నందయ్య (25) వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి నివాసి. కుల వృత్తి వడ్రంగం. ఆ వృత్తికి అవకాశం తగ్గిపోగా సొంత భూమి 35 గుంటలకు ఎకరం 5 గుంటలు వేరొకరి దగ్గర పాలికి తీసుకున్నది జతచేసి రెండెకరాలు సాగుచేయసాగాడు. గ్రామంలోని చెరువు ఎండిపోయి, వర్షాధారంగా సరిగ్గా పండక మూడేళ్లుగా తిండికి కూడ కటకటగా ఉంది. 45 వేలు అప్పు చేశాడు. ఒక కొడుకు హైదరాబాద్‌లో కూలి చేసుకొని తన బతుకు వెళ్లదీస్తున్నాడు. ఇంకిద్దరు కొడుకులూ, కూతురూ తండ్రితోనే ఉన్నారు. 20 సంవత్సరాలుగా క్షయ రోగంతో బాధపడుతున్న నందయ్య అర్ధాకలితో బతక లేక క్షీణించి పోవడం చూసి తోటి గ్రామస్థులు మే 25న హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి నందయ్య ఆత్మహత్య చేసుకుంటాడేమోనని అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. కాని అధికార యంత్రాంగం (అంటే ఎమ్మార్వో) కదిలి వచ్చేసరికే నందయ్య చనిపోయాడు. అతను ఆత్మహత్య చేసుకోలేదు. ఆహారలేమి, క్షయ రోగం కలిసి అతనిని మే 27న కబళించి వేశాయి.



నెలకొంటున్న వర్షాభావ పరిస్థితులు వారిని క్రమంగా అప్పుల ఊబిలోకి నెట్టాయి. చెరువులు నాశనం కావడం వల్ల గ్రామాలలో నీటినిలువ అనేది లేకుండ పోయింది. భూగర్భ జలమట్టం పడిపోయింది. రెండేండ్లు వానలు పడకపోతే బావులలో ఊట తగ్గి పోయింది. బావిని మరింత లోతు చేయించవలసి వచ్చింది. అయినా ఫలితం లేకపోతే కొత్త బావి తవ్వవలసి వచ్చింది. ఆయిల్ ఇంజను పెట్టవలసి వచ్చింది. బోరు వేయవలసి వచ్చింది. అయినప్పటికీ ఫలం దక్కకపోతే భూమి బీడుపెట్టవలసి వచ్చింది.

మరొకపక్క రైతుల నిర్ణయాలతోనూ ఇష్టాయిష్టాలతోనూ నిమిత్తం లేకుండా జీవితపు ఖర్చులు పెరుగుతున్నాయి. రోగమొస్తే ప్రభుత్వ ఆస్పత్రికి పోయి బతికినా చచ్చినా ఖర్చెక్కువ కాకుండా కథ ముగించిన రోజులు పోయాయి. అతిపేదలు సహితం వేలు గుమ్మరించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే స్థితి వచ్చింది. పెండ్లి ఖర్చులు అన్ని కులాలలోనూ విపరీతంగా పెరిగాయి. కట్నమంటే ఎరుగని కులాలకూ ఆ జాడ్యం అంటుకుంది. ఇంక పిల్లలలో ఒకరినైనా కొంచెం చదివించుకుందామన్న కోరిక పొరబాటున కలిగినా ఆ ఖర్చు స్వల్పం కాదు. పూర్వీ కులు కట్టిచ్చిన ఇల్లు పాడయిపోతే దానిని బాగుచేసుకోవాలనుకున్నా, కొత్తది కట్టుకోవాలన్నా ఆనాడు గ్రామాలలో ఖర్చులేకుండా దొరికిన కట్టెగానీ, రాయిగానీ ఇవ్వాళ లేవు. అన్నీ డబ్బుపెట్టి కొనుక్కోవలసిందే.

ఇవేవీ దురాశ వల్ల, స్తోమతను మించి బతికే ప్రయత్నం చేయడం వల్ల పెరిగిన ఖర్చులు కావు. రైతుల అదుపులో లేని కారణాల వల్ల పెరుగుతున్నవి. ఒకవైపు వర్షాభావ పరిస్థితుల వల్ల, సాగునీటి లేమివల్ల ఎండిపోతున్న పంటలు, బీడుపడుతున్న భూములు, ఇంకొకవైపు తప్పనిసరిగా పెరుగుతున్న జీవన వ్యయం రైతులను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఇంక అప్పుతీర్చలేమన్న స్థితి వచ్చినప్పుడు – అంత కంటె ముఖ్యంగా, ఇంక అప్పుపుట్టదన్న స్థితి వచ్చినప్పుడు – బలవన్మరణమే శరణ్యమవుతున్నది. అది ఆత్మహత్య రూపంలో రావచ్చు, ఆకలిచావు రూపంలోనూ రావచ్చు. పేగులలో మెతుకు ముక్క లేకుండా చస్తేనే అది ఆకలిచావు అన్న తాసీల్దార్ నిర్వచనాన్ని వదిలిపెట్టి, తీవ్రమైన ఆకలి, పోషకాహార లోపం, ఇతర రోగాలకూ, అంటువ్యాధులకూ తోడయినప్పుడు ప్రాణాంతకం కాగలదని గ్రహించినట్టయితే మన రాష్ట్రంలో ఆకలి చావులూ చాలానే జరుగు తున్నాయని గుర్తిస్తాం.

పెరుగుతున్న జీవన వ్యయాన్ని ఎదుర్కోవాలన్నా, బొటాబొటిగా సాగుతున్న జీవితాన్ని కొంచెం మెరుగుపరచుకోవాలన్నా సాగునీరు కల్పించుకొని పెట్టుబడులు సమకూర్చుకొని అంగట్లో అమ్ముడుపోయే పంటలు పండించడ మొక్కటే మార్గం. రాష్ట్రంలో లక్షలాది రైతులు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఇది 'వ్యవసాయ అభివృద్ధి'కి దారితీస్తుంది కాబట్టి ప్రభుత్వా నికీ ఇష్టమే. కానీ ఈ మార్గాలలో ఎదురయ్యే సవా ళ్లను ఎదుర్కొనడానికి ప్రభుత్వం రైతు లకు ఏ ఆసరా ఇవ్వడం లేదు. **ఇది ఈ రోజు ప్రధానంగా చర్చించుకోవలసిన విషయం.** ప్రభుత్వం సాగునీరు కల్పించదు, రుణాలు తగినంత ఇవ్వదు, గిట్టుబాటు ధర దక్కేటట్టు చూడదు, విత్తనాలలో పురుగుల మందులలో, ఎరువులలో కల్తీని నిరోధించదు. కనీసం ఏవి వాడాలో, ఏవి వాడకూడదో సలహా కూడా సరిగా ఇవ్వదు. బరువంతా రైతులే మోయాలి. వారికది జీవనం సమస్య కాబట్టి చచ్చినట్టు మోస్తారు, మోయలేక పోతే చస్తారు.

వారు సాధిస్తే మాత్రం ఆ 'అభివృద్ధి' పాలకుల ఘనత అవుతుంది. చస్తే అది వారి పిరికితనమో, చేతకాని తనమో, దురాశో అవుతుంది.

ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టి రైతులకు చవ కగా నీరందించిన రోజులు ఉండేవి. పాత ప్రాజెక్టుల కింద నీళ్లు చవకగానే ఇప్పటికీ అందిస్తున్నారుగానీ కొత్తవేవీ చేపట్టక రెండు దశాబ్దాలయింది. ఈ కాలంలో సాగునీటి కల్పన రైతులు సొంత ఖర్చుతో బోర్ల ద్వారా చేసుకోవలసి వచ్చింది. తెలంగాణ, రాయలసీమ జిల్లాలలోనూ, కోస్తా జిల్లాలోని కొన్ని మెట్ట ప్రాంతాల లోనూ లక్షల సంఖ్యలో బోర్లు వేశారు. తగ్గిపోతున్న భూగర్భ జలమట్టాన్ని తరుముతూ బోర్లు లోలోపలికి వేసేకొద్దీ ఇవాళ వేసిన బోరు కొన్నాళ్లకు ఎండిపోతే మరొక బోరువేసి అది ఎండిపోతే ఇంకొక బోరువేసి – ఒక్కొక్కసారి వెంట వెంటనే మూడు నాలుగు బోర్లువేసి – రైతులు భారీ వ్యయంతో సాగునీరు కల్పించుకున్నారు. బోరులకు మోటారు పెట్టుకోవాలి, మోటారుకు కరెంటు కనెక్షన్ ఇవ్వడానికి అవసరం అయ్యే ఏర్పాటు యావత్తు రైతే చేసుకోవాలి. ఒక్కొక్క బోరుకు మోటారుతో సహ సగటున 50 వేల రూపాయలవుతుంది కాబట్టి బోర్లకోసం లక్షలు ఖర్చుపెట్టుకున్న రైతులున్నారు.

ఖర్చుకు ఇది మొదలు మాత్రమే. ఎక్కువ దిగుబడి రావాలంటే మేలురకం విత్తనాలు వేయాలి. మంచి మంచి ఎరువులు వేయాలి. పంటకు పట్టే పురుగులు చావాలంటే ఘాటయిన మందులు వేయాలి. వీటిలో ఏది నిజంగా మేలయినదో, ఏది నిజంగా ఘాటయినదో రైతు లకు చెప్పేవారు లేరు. అందుకోసమే జీతాలు తీసుకునే వ్యవసాయ శాఖ అధికార్లు ఎప్పుడోకానీ పల్లెలకు రారు, వచ్చినా నిర్దిష్టమైన సలహాలివ్వరు. రైతులు ఒకరిని చూసి ఒకరు, అడ్వర్టయిజ్‌మెంట్లు చూసి అందరూ నిర్ణయాలు తీసుకుంటుంటారు. చాలా తరచుగా మోసపోతుంటారు. విత్తనాలు, మందులు, ఎరువుల 'కల్తీ'కి రైతుల ఆత్మహత్యల కథలలో పెద్ద పాత్రే ఉంది. కల్తీని నిరోధించే అధికారమూ బాధ్యతా కూడా ప్రభుత్వానికి ఉన్నాయిగానీ అదేమీ అమలు కాదు.

అన్నిటికంటె ముఖ్యమైనది రుణసదుపాయం. బోర్లు వేసుకోవడానికీ, విత్తనాలూ, ఎరువులూ, మందులూ కొనుక్కోవడానికీ అవసరమైన పెట్టుబడి సగటు రైతు దగ్గర ఉండదు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు సగటున మూడు నాలుగెకరాలు ఆసాములేనని గుర్తుంచుకోవాలి. వీరు పెట్టుబడుల కోసం ప్రభుత్వేతర రుణదాతల మీద ఆధారపడవలసి రావడం ఆత్మహత్యల వెనక ఉన్న అత్యంత కీలకమైన కారణం. వ్యవసాయదారులకు పంట రుణాలూ, పెట్టుబడి రుణాలూ ఇవ్వడం కోసమే ఏర్పడిన సహకార పరపతి సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, జాతీయ బ్యాంకుల వ్యవసాయ అభివృద్ధి శాఖలూ ఉన్నమాట వాస్తవమే. ఈ వ్యవస్థలు రైతుల రుణ అవసరాలను ఒకనాడు కొంచెం భిన్నంగా చూసినమాటా వాస్తవమే. అయితే 1990లలో ఆర్థిక సంస్కరణలు మొదలయిన తరువాత, వీరికి జ్ఞానోదయమై 'అప్పు అప్పే, తీసుకున్న వాడెవడైతేనేమి – అందరికీ వ్యాపార నియమాల ప్రకారమే అప్పులిస్తాం' అని నిర్ణయించుకున్నారు. లాభార్జన కోసం పెట్టుబడి పెట్టడానికి రుణాలు తీసుకునే వర్తకుడినీ బతకడం కోసం, బతుకు కొంచెం మెరుగుపరచుకోవడం కోసం అప్పులడిగే రైతునూ ఒకేరకంగా చూడసాగారు. పాతబాకీ తీర్చేదాకా కొత్త అప్పు అడగొద్దు అనసాగారు. రెండు సంవత్సరాలు వరుసగా పంట నష్టమయితే ఈ ప్రభుత్వరంగ రుణవ్యవస్థలో అప్పుపుట్టడం అసాధ్యం అయింది.

అందువల్ల ఆత్మహత్య చేసుకుంటున్న రైతులు ప్రధానంగా బాకీ ఉన్నది ప్రైవేట్ వ్యక్తులకూ, సంస్థలకూ. ప్రధానంగా ఎరువుల అంగళ్లకూ, పురుగుల మందు అంగళ్లకూ, మార్కెట్ యార్డులోని



## ...ఓడితే రైతు ఒక్కడే చస్తాడు

రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి వ్యాపార పంటలు పండించి వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని కోరుకునే వాళ్లు సమాజంలో చాలామంది ఉన్నారు. ప్రభుత్వమొక్కటే కాదు.

పురుగుల మందు కంపెనీల వాళ్లు, ఎరువుల కంపెనీల వాళ్లు కూడా అదే కోరు కుంటారు. హైబ్రిడ్ విత్తనాల తయారీదార్లూ కోరుకుంటారు. వీటి హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ అమ్మకందార్లు, మార్కెట్‌లో సేఠ్‌లు, కమిషన్ ఏజెంట్లు కోరుకుంటారు. బోర్‌వెల్ కంపెనీల వాళ్లు, రిగ్గులు తయారు చేసేవాళ్లు, కరెంటు మోటార్లు, పైపులు తయారు చేసేవాళ్లు కోరుకుంటారు. ఉత్పత్తి పెరుగుదల రేటు నాగరికత పురోగమనాన్ని సూచిస్తుందని నమ్మే సామాజిక శాస్త్రవేత్తలు కోరుకుంటారు. మార్కెట్ వర్ధిల్లితే అందరూ వర్ధిల్లుతారని నమ్మే ఆర్థిక శాస్త్రవేత్తలూ, ప్రపంచ బ్యాంకు పెద్దలూ కోరుకుంటారు. మండలానికొక ఇంజనీరింగ్ కాలేజి పెట్టి విద్యార్థుల కోసం ఎదురుచూస్తున్న విద్యా వేత్తలు కోరుకుంటారు. కడుపునొప్పి అంటే చాలు అపెండిసెక్టమీ నుంచి హిస్టరెక్టమీ దాకా ఏదైనా చేసేయడానికి రెడీగా తాలూకా కేంద్రాలలో సహితం కత్తులు నూరుకొని రెడీగా ఉన్న వైద్య నిపుణులు కోరుకుంటారు. అర్బన్ మార్కెట్‌తో సంతృప్తి చెందక గ్రామాలవైపు ఆశగా చూస్తున్న టి.వి. కంపెనీల వాళ్లు ద్విచక్ర వాహన తయారీదార్లు మొదలయిన వారంతా కోరుకుంటారు.

పెట్టుబడులు పెరుగుతున్న వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో చిక్కుకున్న రైతులు విజయ వంతంగా బయటపడితే వీళ్లంతా వర్ధిల్లుతారు. అపజయం పాలయితే రైతు మాత్రమే చస్తాడు.

కరపత్రం

కమిషన్ ఏజెంట్లకూ. (ఇతర రైతులకూ, బంధుమిత్రులకూ, డ్వాక్రా గ్రూపులకూ కూడా రుణపడి ఉన్నప్పటికీ ఈ అప్పే ప్రధానం). ఈ అప్పుకు వడ్డీ నెలకు వందకు రెండు రూపాయల నుంచీ నాలుగు రూపాయల దాకా ఉం టుంది. ఆరునెలలకో, సంవత్సరానికో ఒకసారి వడ్డీని అసలుకు కలిపి మళ్లీ లెక్క కొత్తగా రాయడం జరుగుతుంది – అంటే ఇది చక్రవడ్డీకి ఇచ్చే అప్పు. ఏ పంటకోసం అప్పు తీసుకు న్నారో ఆ పంటను అప్పిచ్చిన ఆసామికే అమ్మాలన్న నియమమూ తరచుగా ఉండడం వల్ల అమ్మకం ధర విషయంలోనూ రైతులు నష్ట పోయే స్థితి ఉంది.

అట్లా కాకుండా మార్కెట్‌లోనే అమ్మినప్పటికీ ధర పలకక నష్టపోవడం తరచుగా జరుగుతుంటుంది. ఈ సంవత్సరం గుంటూరు మార్కెట్‌లో మిర్చి ధర రెండు నెలల కాలంలో దాదాపు 2000 రూపాయలు పడిపోవడం సాగర్ ఆయకట్టు రైతాంగాన్ని చాలా నష్టానికి గురిచేసింది. పంట బాగా పండి, పండినదంతా ఒకేసారి మార్కెట్‌కు వచ్చినప్పుడు ధర పడిపోవడం సహజం అని వ్యాపారస్తులు అంటుండగా, వర్తకులు సిండికేట్ అయి ధర పెరగకుండా చూస్తున్నారని రైతుల అభియోగం. మద్దతు ధరకు కొనుక్కోగల ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు చాలా పరిమితంగా కొనడం, ధర పెరిగేదాకా ఆగడానికి కావలసిన

స్టోరేజ్ వ్యవస్థ రైతులకు అందుబాట్లో లేకపోవడం రైతులకు మార్కెట్‌లో రక్షణ లేకుండా చేస్తున్నాయి.

ఈ కారణాలన్నీ కలిసి రైతులు అప్పుల విషవలయంలో చిక్కుకునేటట్టు చేస్తున్నాయి. అప్పు చేసేకొద్దీ మరింత అప్పుచేసి మరింత పంట తీస్తే తప్ప ఈ అప్పు తీరని పరిస్థితి కలుగు తున్నది. బోర్లు మరింత లోతుగా వేసి మరింత ఖరీదయిన ఎరువులూ, మందులూ వాడి మరింత ఆదాయం సంపాదించడం తప్ప వేరే మార్గం రైతుకు కనబడదు. చివరికి ఇంక అప్పే పుట్టని స్థితి వచ్చినప్పుడు కథ ముగింపుకొస్తుంది. 'సరిగ్గా ఇప్పుడే ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?' అని చాలా మంది అడుగుతున్నారు. ఇది ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే దశ. పెట్టుబడులు సమకూర్చుకొని విత్తనలూ వగైరా కొనుక్కునే దశ. పోగుపడిన అప్పు కారణంగా ఇంక అప్పు పుట్టదేమోనన్న భయం పట్టుకున్న రైతుకు సమీప భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తుంది. చావు ఒకానొక పరిష్కారంగా కనిపిస్తుంది. చివరి నిర్ణయానికి ఇదే కారణమని చాలా సంఘటనలలో బంధుమిత్రుల అభిప్రాయం. ఇంకొక్కసారి అప్పు పుట్టేటట్టయితే ఇంకొక్క ప్రయత్నం చేయడానికి సిద్ధపడే రైతు కూడా ఆ అవకాశం మూసుకుపోయేసరికి మృత్యువును ఆహ్వానిస్తున్నాడు.

అందుకే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయవలసిన పని, ప్రస్తుత అవసరాల మేరకు వ్యవసాయ రుణాలు ఏదో ఒక రూపంలో ప్రభుత్వం నుంచి లేక ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుంచి లభించే ఏర్పాటు చేయడం. ఆ ఏర్పాటుచేసి దానిని వెంటనే ఆచరణలో పెట్టి ఈ విషయాన్ని విస్తృ తంగా ప్రచారం చేసినట్టయితే ఆత్మహత్యలు గణనీయంగా ఆగుతాయి.

అంతకంటె ముఖ్యంగా, ఆత్మహత్యల వెనుక ఏవో అపసవ్యమైన కారణాలున్నాయని అనుమానించడం మానేసి అప్పుల ఊబిలో కూరుకున్న రైతాంగానికి మానసిక స్థైర్యం ఇవ్వడం మనందరి కర్తవ్యం.

1. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి రుణాలు ప్రధానంగా ప్రభుత్వరంగ (లేక సహకారరంగ) ద్రవ్య సంస్థలే ఇచ్చేటట్టు విధాన రూపకల్పన ప్రభుత్వం చేయాలి. వ్యవసాయ రుణాలను వ్యాపార రుణాలుగా కాక జీవనానికి సంబంధించిన ఆసరాగా అర్థం చేసుకోవాలి.
2. విత్తనాలు, మందులు, ఎరువులలో కల్తీని నివారించడానికీ కల్తీకి పాల్పడే వారిని శిక్షించడానికీ ఇప్పటికే ఉన్న చట్టాలకు పదునుపెట్టి సమర్థంగా అమలు చేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ సిబ్బందిపైన తగు చర్య తీసుకోవాలి.
3. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఉద్దేశించబడ్డ ప్రభుత్వ కొనుగోలు సంస్థల పరిధినీ వాటికి కేటాయించే నిధులనూ పెంచి రైతులు మార్కెట్‌లో నష్టపోకుండ ఆసరా కల్పించాలి. వివిధ పంటలకు తగిన స్టోరేజ్ సదుపాయం కల్పించాలి.
4. భూగర్భ జలాలపైన ఆధారపడే మెట్టప్రాంతాల సాగునీటి అవసరాలపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. నీటిపారుదల ప్రాజెక్టుల నుంచి చెరువుల మరమ్మతు, భూగర్భ జలాల పెంపుదల దాకా అన్ని చర్యలూ చేపట్టాలి.
5. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇంక ఆలస్యం చేయకుండ వెంటనే ఇవ్వాలి.

12 జూన్ 2004

హైదరాబాద్



తన పని కాదు

# చట్టం బాలకృష్ణ పని చేస్తోంది

**"చ**ట్టం తన పని తాను చేసుకుపోతుంది" అనీ,

'ఎంత పెద్దవారయినా చట్టం కంటే చిన్నవారే'ననీ గంభీరంగా అంటుంటారు.

బాలకృష్ణ అరెస్టు ప్రహసనం చూసిన తరువాత ఈ మాటలు ఇంకెప్పుడూ ఎవరూ అనకుండ ఉంటే బాగుంటుందని చాలామందికి అనిపించే ఉంటుంది.

అతను వర్తమాన తెలుగు సినిమా రంగంలోని ప్రముఖ నటులలో ఒకడట. అయి ఉండవచ్చు. మాకు తెలీదు. ప్రస్తుతం అతను ఒక తీవ్రమైన నేరం చేసిన వ్యక్తి. ఒకటేమిటి, రెండు తీవ్రమైన నేరాలు చేసిన వ్యక్తి. బుద్దెరిగి ఇద్దరి మీద కాల్పులు జరిపి వారిని తీవ్రంగా గాయపరిచాడు. ఆ సంగతి తెలియబరిచే సాక్ష్యాలను మాయం చేసే ప్రయత్నం చేశాడు. వేరే ఎవరైనా ఇటువంటి పనులు చేస్తే ఈపాటికి కట కటాల వెనుక భద్రంగా ఉండేవారు. బెయిలు ఎప్పుడు వస్తుందిరా దేవుడా అని ఘడియలూ ఊచలూ లెక్కపెడు తుండేవారు. ఈ లోపల ఏదయినా జ్వరమొచ్చినా ఒళ్లు నొొచ్చినా 'సార్! రెండు గోలీ లియ్యండి' అని జైలు డాక్టరు రౌండ్స్‌కు వచ్చినప్పుడు చేతులు ముడుచుకొని అడుక్కుం టుండేవారు. 'ఫో! వెధవా! పని ఎగ్గొట్టడానికి నాటకాలు ఆడుతున్నావ్' అని తిట్టించు కుంటూ ఉండేవారు.

ఇతను? నేరం చేసిన క్షణం నుంచి ఆస్పత్రిలో ఉన్నాడు. ఒక ఘరానా ప్రైవేట్ ఆస్పత్రిలో ఉన్నాడు, మరొక ఘరానా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నాడు. అతనిని కటకటాల వెనుక పెట్టి కాపలా కాయవలసిన పోలీసులు ఆస్పత్రి బయట అతను ఎప్పుడు దయతలచి తమ చేతికి చిక్కు తాడా అని పడిగాపులు కాస్తున్నారు. 'పని ఎగ్గొట్టడానికి నాటకాలు ఆడు తున్నావా' అనవలసిన డాక్టర్లు ఒకరితో ఒకరు పోటీపడి అతని ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని రుజువు చేస్తున్నారు. కాకర్ల సుబ్బారావుగారే స్వయంగా చేస్తున్నారు. మొదట శరీరానికి గాయం అయిందన్నారు. చిన్నదేగదా అంటే, అప్పుడెప్పుడో కాలికి తగిలిన గాయానికి తీసుకున్న మందుల ఫలితంగా వేలికి తగిలిన గాయం రక్తస్రావం ఆగకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. సైన్స్ మహిమ ఎంతటిది కదా! అని అచ్చెరువొందాము. అయితే పాదు వేలు బాగయిపోయిందని స్పష్టం అయిన తరువాత శరీరం బాగానే ఉందిగానీ అతగాడి మనసుకే సమస్య వచ్చిందని అన్నారు. ఏమొచ్చిందంటే అదే చెప్పకుండ ఊరికే నిద్రపోతున్నాడన్నారు. అయినప్పటికీ అతని చేత చెప్పించి నిష్ణాతులయిన మానసిక వైద్యుల చేత వైద్యం చేయిస్తామన్నారు. తమ ఆస్పత్రిలో లేకపోతే ఎర్రగడ్డ నుంచి

తెప్పిస్తామన్నారు. వేరే ఎవ్వరూ కాదు, నిమ్స్ డైరెక్టర్ కాకర్ల సుబ్బారావు గారే స్వయంగా అన్నారు. ఇవాల్టిదాకా అంటూనే ఉన్నారు.

బాలకృష్ణను కటకటాల నుంచి కాపాడడానికి చాలామంది తమ పరువు చాలా పోగొట్టుకున్నారు గానీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు గారంతగా వేరే ఎవరూ పోగొట్టుకోలేదు. ఏ పక్షపాతం వారిచేత ఈ పని చేయించిందో గానీ వారింకెప్పుడూ ఒక పెద్దమనిషిగా తలెత్తుకు తిరగలేరు. తిరగలేకుండ తానే చేసుకున్నారు. గొప్ప త్యాగి.

కేర్ ఆస్పత్రి పెద్దలు కాదు కాదన్నా ఒక విషయం స్పష్టం అయింది. మీరు ఎంత పెద్ద నేరం చేసి ఉన్నా ఫరవాలేదు. ఆ ఆస్పత్రి దండుకునే ఫీజు చెల్లించే స్థోమత మీకుంటే చాలు, నేరుగా 'కేర్'లో అడ్మిట్ అయిపోవచ్చు. వారు ఎంఎల్‌సి గింఎల్‌సి అనకుండ నేరుగా ఇంటెన్సివ్‌కేర్‌లోనే మిమ్మల్ని పెట్టేస్తారు. గతంలో సిద్ధార్థరెడ్డిలాగ మీరు ప్రాణానికి అపాయం లేకుండ పురుగుల మందు కొంచెం మాత్రమే తాగివున్నా, ఇప్పుడు బాలకృష్ణ లాగ చిన్న వేలికి చిన్న గాయం చేసుకొని ఉన్నా, వసుంధర లాగ చెప్పుకోవడానికి ఏ రోగం రొష్టూ లేకున్నా ఫరవాలేదు. నేరుగా ఇంటెన్సివ్ కేర్‌లోనే మిమ్మల్ని 'కేర్' పెడుతుంది.

అదేం నేర్పోగానీ చిన్న రోగమైనా కూడా నయం కాకుండా చూస్తుంది కేర్. బాలకృష్ణ వేలికి గాయం 3వ తేదీ రాత్రి అయిందంట. 'విదిన్ మినిట్స్' అన్నట్టు కేర్ ఇంటెన్సివ్‌కేర్‌లో పడ్డాడు. కానీ 5వ తేదీన వేలికి రక్తం ఇంకా ధారగా కారుతూనే ఉందని లక్ష్మీపార్వతి అన్నారు. అవును, ఇంకా కారుతూనే ఉందని అక్కినేని నాగేశ్వరరావూ అన్నారు. ఒక నేరస్థుడికి అంతటి సేవ ఎన్ని ఆస్పత్రులు చేయగలవు!

ఒక హత్యో, హత్యా ప్రయత్నమో చేసినవాడు 'నాకు ఒంట్లో బాగలేదు – కొంచెం ఉండండి' అని దుప్పటి తన్ని ఇంట్లో పండుకుంటే పోలీసులు ఇంటి బయట పడిగాపులు కాయరు. నీ రోగాన్ని మేము నయం చేస్తాములా అని తీసుకుపోతారు. కానీ ఇద్దరు ప్రముఖ పోలీస్ ఆఫీసర్లు నేరస్థుడికీ అతని వైద్యులకూ ఎప్పుడు దయకలుగుతుందా అని ఇంటి బయట చక్కర్లు కొట్టే స్థితికి తమను తాము నెట్టుకున్నారు. ఆర్.పి.సింగ్‌గారూ, ఎ.కె.ఖాన్‌గారూ అసమర్థులని ఇప్పటివరకూ ఎవరూ అనలేదు. ఖాన్‌గారయితే నల్లగొండ ఎస్.పి.గా ఉన్నప్పుడూ, అంతకు ముందూ, ఆ తరువాతా 'అసాంఘిక శక్తులను ఏరివేయడం'లో అత్యంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిన ఘనతగల వారు. ఏ నేరమూ చేయకపోయినా చేస్తారనీ, చేయగలరనీ అనుమానించిన వారిని సహితం వారు విడిచిపెట్టలేదు. అటువంటిది, జీవితఖైదు పడగల కాగ్నైజబుల్ నేరం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికి ఎన్ని తిప్పలు పడుతున్నారో. చట్టం ముందు అందరూ సమానమని ఇంకెప్పుడూ మీరు అనరుకదా, ఖాన్ సాబ్? ఏ నేరం చేయని బాలకృష్ణ కారు డ్రైవర్‌నూ, వంట మనిషి, పనిమనుషులను కేవలం సాక్షులన్న కారణంగా వెంటనే అదుపులోనికి తీసుకోగలిగిన మీరు నేరస్థులయిన బాలకృష్ణనూ, వసుంధరనూ అదుపులోకి ఎందుకు తీసుకోలేక పోయారో కొంచెం ఆలోచిస్తారా? చట్టాన్ని అక్రమంగా చేతిలోకి తీసుకునే వారిని నిర్దాక్షిణ్యంగా నిరోధించే ఘనత గల మీరు, చట్టాన్ని చేతిలోకి తీసుకునే సర్వ అధికారాలూ ఉండికూడా దానిని తీసుకోలేకపోవడం వెనుక ఉన్న విచిత్రమైన అశక్తత గురించి కొంచెం వివరిస్తారా?

పోలీసులూ ఆస్పత్రులేకాదు బాలకృష్ణ సేవలో పత్రికలు కూడా తమ పరువు చాలావరకు



పోగొట్టుకున్నాయి. నిజానికి అందువల్లనే మేము ఈ విషయాలను కరపత్రం రూపంలో ప్రజల వద్దకు తీసుకుపోవలసి వచ్చింది. ప్రకటన ఇస్తేనో, వ్యాఖ్య రాస్తేనో ఏ పత్రికా ప్రచురించే పరి స్థితి కనిపించలేదు. 4వ తేదీ పేపర్ చదవకుండా, 5వ తేదీ నుంచి పేపర్లు చదువుతున్న వారెవరైనా బాలకృష్ణ నేరస్థుడు కాడనీ, బాధితుడనీ అనుకునే ప్రమాదం ఉంది. అతని ఆరోగ్యాన్ని గురించి దైనందిన బులెటిన్‌లు, అతని వ్యక్తిత్వ వైచిత్రి గురించి సానుభూతి పూర్వకమైన వ్యాఖ్యలు, అతనిని దర్శించుకోవడానికి వచ్చిపోతున్న ప్రముఖుల ఊరడింపు సందేశాలు, రాజీ ప్రయత్నాల గురించి లేటెస్ట్ రూమర్‌లు – ఇంతటి సత్కారం ఏ నేరస్థుడి కయినా మీడియా ఎప్పుడయినా ఇచ్చిందా?

## ఈ ప్రహసనానికి ముగింపెప్పుడు?

నేరం జరిగిన రెండవరోజే హోంమంత్రి జానారెడ్డి 'చట్టం తన పని తాను చేసుకు పోతుంది' అని యథావిధిగా ప్రవచించారు. అయితే ఆ మాత్రం ప్రవచించడానికి కూడా వారు ముఖ్యమంత్రితోనూ, డిజిపితోనూ మొదట సమావేశం అయ్యారంట. అంటే వారు ఆమోదిస్తేనే చట్టం అని పిలవబడే అతీతశక్తి తన పని తాను చేసుకుపోతుందా? మరుసటి రోజు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు చెన్నైలో విలేకరుల వద్ద అదే ప్రవచనాన్ని పునరుద్ఘాటించారు. అయితే 'మా ప్రభుత్వం తొందరపడి ఏమీ చేయదు' అనీ, 'ఆచి తూచి వ్యవహరిస్తుంది' అనీ కూడా అన్నారు. ఆచితూచి వ్యవహరించడానికి ఇదేమైనా సున్నితమైన సామాజిక సంక్షోభమా? అయినా కాంగ్రెస్ వారి ఆచడం తూచడం తెలుగుదేశం వారికి చాలలేదు. బాలకృష్ణను అరెస్టు చేయడానికే సాహసించని పోలీసులను పట్టుకొని అతనిని 'వేధిస్తున్నారు, సతాయిస్తున్నారు' అంటూ తెలుగుదేశం నాయకులు నిరసన తెలిపారు. ఇంకా ఏం చేస్తే చంద్రబాబుకు సంతోషం కలిగి ఉండేదో. నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఎఫ్ఐఆర్‌ను చింపేసి నిందితుడికి సన్మానం చేసి ఈ మాత్రం కష్టపెట్టినందుకు క్షమాపణ కోరుకొని ఉంటే సంతోషం కలిగి ఉండేదా?

చట్టం సాధారణ మానవులకే తప్ప ఘరానా వ్యక్తులకు వర్తించదన్న పద్ధతిలో వ్యవహరిస్తే, ఆ చట్టం విలువ కోల్పోతుందనీ, దానిని గురించి నీతులు వల్లించే అర్హత పాలకులు కోల్పోతారనీ గుర్తించడం పెద్దగా కష్టం కాదుగానీ ఎవరి సంకుచిత ప్రయోజనాలలో వారు తలమునకలయి ఉండడం వల్ల మన రాష్ట్ర పాలకులు గుర్తించలేకపోతున్నారు. ఇక్కడ పాలకులంటే అర్థం కేవలం పాలక పార్టీ అని కాదు. సమాజాన్ని శాసించే అధికారం గల పెద్దలు అని అర్థం. డబ్బు, అధికారం, హోదా ఉన్న వాళ్లు హత్యలు చేసినా పోలీసులకు చిక్కకుండ ఆస్పత్రులలో తలదాచుకో గలరనీ వారికి తమ కథనం తయారు చేసుకోవడానికి అన్ని అవకాశాలూ పోలీసులు చేజేతులా ఇస్తారనీ, చివరికి వారిని కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు ఒంట్లో బాగులేదంటే 'లక్షణంగా ఉన్నావు – నీకేమయింది జైలుకు పో' అనవలసిన మేజిస్ట్రేటుదొర నిమ్స్ వైద్యుల బృందానికి ముద్దాయిని అప్పగించి అతని ఆరోగ్యం బాగయిందని వారు సర్టిఫికేట్ ఇచ్చాకనే జైలుకు పంపుతానని హామీ ఇస్తారనీ, నిమ్స్ డైరెక్టర్‌గారు పైకి కనిపించనిదీ, తనకు సహితం అంతుచిక్కనిదీ అయిన మానసిక రోగం ఏదో ఉందంటూ బెయిలు దొరికేదాకా ముద్దాయిని ఆస్పత్రిలోనే ఉంచుతారనీ, ఈ లోపల

అతను చేసిన నేరానికి గురయి అదృష్టంకొద్దీ ప్రాణాలతో బయటపడిన వారిపైన అన్నిరకాల ఒత్తిడులూ పెట్టి పెద్దలంతా కూడి రాజీ చేయించేస్తారనీ – పెద్దల న్యాయం ఈ విధంగా ఉంటుందనీ ప్రజలకు స్పష్టం అయింది.

ఈ ప్రజలు రేపేదయినా నేరాలు చేస్తే పోలీసులూ, కోర్టులూ వారిని కఠినంగా శిక్షించవచ్చు, చట్టం తన పనే కాదు అంతకంటె ఎక్కువ కూడా చేసుకుపోవచ్చు.

కాని ప్రజల గౌరవాన్ని పొందగలరా?

14 జూన్ 2004

హైదరాబాద్



## యస్‌సి, యస్‌టి చట్టాన్ని నీరుగార్చిన
# డిఎస్‌పిపై వెంటనే చర్య తీసుకోవాలి!

ప్రజలారా!

కర్నూలు జిల్లాలో దళితులపై జరుగుతున్న దౌర్జన్యాల కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నది కేవలం రెండు శాతమేనని రాష్ట్రస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ గత సమీక్షా సమావేశములో తేల్చింది. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు, రెవిన్యూ యంత్రాంగాన్ని నిందితులకు శిక్ష పడే విధంగా కేసులు నమోదు చేయడంలోను, అరెస్ట్ చేయడంలోను, దర్యాప్తును వేగవంతం చేయడంలోను శిక్షణ ఇవ్వకపోతే పరిస్థితి ఇదేవిధంగా కొనసాగే ప్రమాదం ఉంది. నిందితులు అగ్రకుల పెత్తందార్లు, ధనబలం, రాజకీయ పలుకుబడి కలవాళ్లయితే బాధితులు కేసులు నమోదు చేయించడానికే అనేక అవరోధాలు ఎదుర్కోవలసి వస్తోంది. బాధితులు పట్టుదలతో కేసును నమోదు చేయించగలిగినా, పోలీసు అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల నిందితులను అరెస్ట్ చేయించడానికీ, దర్యాప్తులో నిలదొక్కుకొని సాక్ష్యం చెప్పడానికీ కూడా తమ సాంఘిక స్థితివల్ల అనేక ఒత్తిడులను ఎదుర్కోవలసి వస్తోంది. పోలీసు అధికారులు బాధితుల పక్షాన ఉంటే నిందితులను శిక్షించే ప్రయత్నం కొంతవరకైనా పెరిగే అవకాశం ఉంది.

ఆదోని డి.ఎస్.పి. శ్రీరాములు బాధ్యతాయుతంగా స్పందించకపోగా, రాజకీయ నాయకులకు తలొగ్గి, నిందితుల పక్షం వహించడం వల్ల కేసు మధ్యలోనే నీరుగారిందన డానికి ఆదోని డివిజన్, పెద్దకడబూరు మండలం, చిన్నతుంబళం గ్రామానికి చెందిన తాయన్న అనే దళిత యువకుడిపై జరిగిన దాడే ఉదాహరణ. ఈ కేసు విషయంలో ఆదోనిలోని కొన్ని దినపత్రికలు సైతం సరైన రీతిలో వ్యవహరించనందున ఈ విషయాన్ని కరపత్ర రూపంలో తీసుకొని రావలసి వచ్చిందని చెప్పడానికి విచారిస్తున్నాం.

చిన్నతుంబళం గ్రామ సర్పంచ్, అగ్రకుల పెత్తందారు అయిన లింగాయత్ రవి తనను రాజకీయంగా దెబ్బతీస్తున్నారనే కారణంతో, కాంగ్రెస్‌ను ఆశ్రయించిన దళితులపై కక్షగట్టి తన అనుచరులైన ఐదుగురు వడ్డెర కులస్థులతో మార్చి 16వ తేదీన దళితుడైన తాయన్నను గ్రామ ప్రజల సమక్షంలో స్తంభానికి కట్టి వెదురుకట్టెలతో తీవ్ర రక్తగాయాలయ్యేట్టు కొట్టించ డంతో పాటు, కుల దూషణకు పాల్పడి అతన్ని అవమానించాడు. బాధితుడు తనపై జరిగిన దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయకముందే, పెద్దకడుబూరు పోలీసులు వడ్డె ఈరమ్మ ఇంట్లో చేయని దొంగతనాన్ని చేసినట్లుగా అతనిపై కేసు పెట్టారు. బాధితుడు ఆదోని కోర్టులో ప్రైవేట్ కేసు వేయగా పోలీసులు కేసును నమోదు చేశారుకాని,

కరపత్రం

నిందితులను అరెస్ట్ చేయలేదు. ఆదోని డిఎస్పి ఎన్నికల తరువాత వచ్చిన వత్తిడి కారణంగా ఆరుగురి నిందితుల్లో ఐదుగురిని రెండు దఫాలుగా అరెస్టు చేసినా, కేసులో ప్రధాన నిందితుడైన రవిని మాత్రం అరెస్టు చేయలేదు. అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన మారెప్పకు బదులు అతని మైనర్ తమ్ముణ్ణి రిమాండ్‌కు పంపాడంటే ఈయనగారు విచారణ ఎంత సవ్యంగా చేస్తున్నాడో అర్థమవుతోంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడం వల్ల దొంగతనం కేసును 'ఫాల్స్ కేసు'గా రెఫర్ చేశాడు. అప్పటికీ బాధితుడు రాజీకి రాక ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తుండడంతో రవి దళితుల మధ్యనే గొడవను సృష్టించి ఐదుగురు దళితులపై 'కౌంటర్ కేసును' పెద్దకడుబూరు పోలీసులచే పెట్టించాడు. ఆదోని డిఎస్పి ఇది తనకు తెలియకుండా జరిగిందని బుకాయించాడు. బాధితులు ఆందోళనకు దిగితే తనకు ట్రాన్స్‌ఫర్ వచ్చే ప్రమాదం ఉందని "చార్జిషీట్‌లో రవిని చేర్చి రిమాండుకు పంపుతానని" కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చాడు. ఊళ్లో పనులు లేకపోవడంతో దళిత కుటుంబాలు బొంబాయికి వెళ్లాలని నిర్ణయించుకోగా, కౌంటర్ కేసులు వారికి ప్రతిబంధకంగా మారాయి. రవి కౌంటర్ కేసులు పెట్టించడం, రాజకీయ పెద్దలతో నయానో, భయానో దళితులను ఒప్పించే ప్రయత్నం చేయడంతో వారు 'రాజీకి' ఒప్పుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు.

దళితులు ఉద్యమించడం ద్వారా సాధించుకొన్న చట్టం "ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల నిరోధక చట్టం, 1989". ఈ చట్టం లక్ష్యం కులాధిపత్యంతో అగ్రకుల పెత్తందార్లు చేసే దౌర్జన్యాలను అరికట్టడం. అందుకే ఈ కేసుల్లో డిఎస్పి స్థాయి అధికారులను విచారణాధికారిగా నియమించారు. వారు సైతం తమ విధి నిర్వహణలో ఉద్దేశ్యపూర్వకంగా నిందితుని పక్షం వహించి దళితుల్ని బలిపశువు చేస్తే సెక్షన్ 4 క్రింద శిక్షార్హులేనని ఎస్.సి., ఎస్.టి. చట్టం చెబుతోంది. ఆదోని డిఎస్పి విషయాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తెచ్చినా, అతనిపై ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకొనకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలు పునరావృతమై ఎస్.సి., ఎస్.టి. చట్టం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. కావున ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ సంఘటనపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపి, ఆదోని డిఎస్పి శ్రీరాములుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వంపై ఆ రకమైన ఒత్తిడి తీసుకొని రావాలని ప్రజలకు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

19.07.2004

ఆదోని, కర్నూలు జిల్లా



కరపత్రం

### యస్.సి., యస్.టి. కేసుల్లో నిందితుల పక్షం వహించిన

# మాజీ డి.యస్.పి. శ్రీరాముల్ని

## వెంటనే ప్రాసిక్యూట్ చేసి కఠినంగా శిక్షించాలి!

ప్రజలారా!

మన సమాజంలో కులాధిపత్య కొనసాగుతున్న కారణంగా, దళితులపై జరిగే దాడులను అరికట్టడానికి ప్రభుత్వం యస్.సి., యస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989 ఏర్పాటు చేసింది. ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన విచారణాధికారులైన డి.యస్.పి.లు సైతం రాజకీయ పలుకుబడికి, అగ్రవర్ణాల, బడాబాబుల ఒత్తిడికి తలొగ్గి ఆచరణలో ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదు. అందువల్ల 1995 సంవత్సరంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలను చట్టంగా చేసి వాటిని పటిష్టంగా అమలు జరపడానికి యస్.సి., యస్.టి. కమిషన్ సైతం ఏర్పాటు చేసింది. దళితులపై దాడుల సంఘటనలు జరిగినపుడు విచారణాధికారి వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి, సాక్ష్యాలను నమోదు చేయాలని, ఈ కేసులకు అధిక ప్రాధాన్యతనిచ్చి నెలలోగా రిపోర్టును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని ఈ చట్టంలోని ఆరు, ఏడు నిబంధనలు చెబుతున్నాయి.

ఆ నిబంధనలకు తిలోదకాలిస్తూ, ఆదోని డి.యస్.పి.గా గతంలో పనిచేసిన శ్రీరాములు యస్.సి., యస్.టి. కేసుల్లో కనీస న్యాయవిచారణ జరపకపోగా, నిందితుల పక్షం వహించి, తానే శిక్షార్హమైన చర్యలకు పాల్పడ్డాడు. దీనివల్ల బాధిత దళితులకు రక్షణ కల్పించవలసిన 'చట్టం ఉన్నవాడికి చుట్టంగా' మారిపోయింది. దీనికితోడు విచారణాధికారులు ఎటువంటి విచారణ జరపకుండానే దళితులు తప్పుడు కేసులు పెడతారనే రిజర్వుడు అభిప్రాయాలను వ్యక్తం చేయడం ఎంతవరకు సరైంది? అని మేము అడుగుతున్నాము. కావున ఈ చట్టం సక్రమ అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉంది.

చిన్నతుంబళం కేసులో నిందితులైన ఐదుగురు వడ్డెర కులస్థులను అరెస్టు చేయడంలో డి.యస్.పి. శ్రీరాములు తీసుకొన్న చొరవ, అదే కేసులో ప్రధాన నిందితుడైన రవి విషయంలో తీసుకోకపోగా, అతన్ని స్వేచ్ఛగా తిరగనివ్వడం చూసినా, రవి కేసును రాజీ చేయించుకొనేందుకు బాధితులపైనే 'కౌంటర్ కేసుల' నమోదుకు సహకరించడం, కేసులో నిందితుడైన మారెన్నకు బదులుగా అతని మైనర్ తమ్ముణ్ణి రిమాండ్‌కు పంపి, తన తప్పును కప్పిపుచ్చుకొనేందుకు మైనర్ తమ్ముడిని నిందితుడిగా చెప్పాలని, రవికి కేసుకు ఎటువంటి సంబంధం లేదని బాధితుడైన తాయన్నను భయపెట్టి రాయించుకోవడం చూసినా ఈయనగారి చట్ట విరుద్ధమైన చర్యలు బాగా అర్థమవుతాయి.

**సరైన విచారణకు నోచుకోని యస్.సి., యస్.టి. కేసుల వివరాలు**

| | | | |
|---|---|---|---|
| బాధితురాలు | : **మేరీరాణీ** విలేజి సెక్రెటరీ | బాధితుడు | : **పురుషోత్తం, రైతు** |
| ఊరు | : ఆదోని టౌన్ | ఊరు | : కాత్రికి |
| మండలం | : ఆదోని | మండలం | : కౌతాళం |
| క్రైం నెంబర్ | : 68/04 | క్రైం నెంబర్ | : 33/04 |
| ఆరోపణ | : కోర్టు ఆవరణంలో కుల దూషణ, అవహేళన | సెక్షన్ | : ఎస్‌సి, ఎస్‌టి Act, 3(1)(VIII) |
| | | ఆరోపణ | : ఫోర్జరీ ప్రామిసరీ నోటుతో సివిల్ దావా వేయడం |
| నిందితుడు | : మన్సూర్ అహ్మద్, న్యాయవాది | నిందితుడు | : నర్సన్నగౌడ్ |
| పోలీస్ స్టేషన్ | : టూటౌన్ పోలీస్ స్టేషన్, ఆదోని | పోలీస్ స్టేషన్ | : కౌతాళం |
| బాధితుడు | : **దేవపుత్ర, రైతు** | బాధితుడు | : **తాయన్న, రైతు కూలి** |
| ఊరు | : కాత్రికి | ఊరు | : చిన్నతుంబళం |
| మండలం | : కౌతాళం | మండలం | : పెద్దకడబూరు |
| క్రైం నెంబర్ | : 32/04 | క్రైం నెంబర్ | : 42/04 |
| సెక్షన్ | : ఎస్‌సి, ఎస్‌టి Act. 3(1)(VIII) | సెక్షన్ | : U/s. 323,342 & 3(1)(X) SC, ST (POA) |
| ఆరోపణ | : ఫోర్జరీ ప్రామిసరీ నోటుతో సివిల్ దావా వేయడం | ఆరోపణ | : బహిరంగ స్థలంలో స్థంభానికి కట్టి కొట్టడం |
| నిందితులు | : నర్సన్నగౌడ్ సిద్ధన్నగౌడ్ | నిందితుడు | : రవి, సర్పంచ్ |
| పోలీస్ స్టేషన్ | : కౌతాళం | పోలీస్ స్టేషన్ | : పెద్దకడబూరు |

కాత్రికి కేసులో నిరుపేద దళిత రైతులైన దేవపుత్ర, పురుషోత్తంలు తాము చేయని అప్పుకు తమపై ఫోర్జరీ ప్రామిసరీ నోట్లతో తప్పుడు సివిల్ దావాలను వేసిన నర్సన్నగౌడ్, సిద్ధన్నగౌడ్‌లపై చర్య తీసుకొమ్మని ఫిర్యాదు చేశారు. బాధితుల భూముల్ని నర్సన్నగౌడ్ గతంలో కొన్ని సంవత్సరాల పాటు ఆక్రమించుకొని అనుభవించాడు. బాధితులకు తానిచ్చిన సొమ్ముకంటే అనేక రెట్ల సొమ్ము ఎక్కువ అనుభవించాడు. బాధితుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి తమ భూములునే తిరిగి పొందడం సహించలేని అతను, అతని మేనల్లుడు సిద్ధన్నగౌడ్ పేరుమీద తప్పుడు సివిల్ దావాలను వేసి వారిని వేధింపులకు గురిచేశాడు. బాధితులు అనేకమార్లు ఉన్నతాధికార్ల చుట్టూ తిరిగి ఒత్తిడి చేసిన తరువాత గాని ఈయన వారిపై కేసును నమోదు చేయలేదు. కేసు విషయమై ఎటువంటి విచారణ జరపకుండా, నిందితులను అరెస్టు చేయక నెలలు తరబడి కాలయాపన చేస్తూ నిందితులను కాపాడే ప్రయత్నం చేశాడు. దళితులపై ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు సివిల్ దావాలను వేయడం శిక్షార్హమని చట్టం స్పష్టంగా చెబుతోంది.

ఆదోని కోర్టు ఆవరణంలో మేరీరాణి అనే దళిత మహిళను మన్సూర్ అహ్మద్ అనే న్యాయవాది "కులదూషణకు పాల్పడడమే కాక, అవహేళన చేశాడని, ఉద్యోగం ఊడబెరికి స్తానని బెదిరించాడని" చేసిన ఆరోపణ వాస్తవమైతే అంతకంటే అనాగరికమైన చర్య మరొకటి ఉండదు. ఈ సంఘటన విషయమై బాధితురాలు మెజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయగా ఆయన డి.యస్.పి.కి రెఫర్ చేశారు. ఈ సంఘటన జరిగి నెలన్నర కావస్తున్నా ఇంతవరకు కనీస విచారణ జరపక కేసును నాన్చడం ఎంతవరకు సబబని మేమడుగుతున్నాం. యస్.సి., యస్.టి. చట్టం సెక్షన్ 3(1)(X) ప్రకారం ఈ చర్య నేరమని చెబుతున్నా, ఇంత వరకు నిందితుడిని అరెస్టుచేసి విచారణ జరపక కాలయాపన చేయడం వెనుక ఆంతర్యమేమిటి?

కావున ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, పై నాలుగు కేసుల్లోని నిందితులను కాపాడేందుకు ప్రయత్నం చేసిన పోలీసు అధికారి శ్రీరాములుపై వెంటనే యస్.సి., యస్.టి. చట్టం సెక్షన్ 4 క్రింద కేసును నమోదుచేసి, సత్వర న్యాయవిచారణ జరిపి చర్య తీసుకోవాలి. నాలుగు కేసుల్లోని నిందితులను సైతం వెంటనే అరెస్టుచేసి విచారణ జరిపి, బాధితుల ఆరోపణలు వాస్తవమైతే వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. యస్.సి., యస్.టి. కేసుల్లో విచారణాధికారులైన డి.యస్.పి.లు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నపుడు దాన్ని వ్యతిరేకించడానికి ప్రజలు, ప్రజాసంఘాలు కలిసికట్టుగా ముందుకు రాగలిగినపుడే ఉన్న చట్టాన్నైనా కాపాడుకోగలమని విజ్ఞప్తి చేస్తున్నాం.

19-9-2004

ఆదోని, కర్నూలు జిల్లా

# ముస్లింలకు రిజర్వేషన్లు సబబే

**ము**స్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జివొ 33ను వెనక్కి తీసుకోవాలంటూ కొన్నివర్గాల వారు ఆందోళన చేస్తున్నారు. బిజెపివారు బహిరంగంగా అల్లరిచేయగా, ఇతరులు తగ్గ స్థాయిలో అదే డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యతిరేకత ఎంతవరకు సబబు అనేది చర్చించుకోవలసిన విషయం. సామాజిక వాస్తవాలేమిటి, రాజ్యాంగమేమంటుంది, న్యాయస్థానాలు ఏమన్నాయి మొదలయిన విషయాలు అందరం తెలుసుకోవాలి. విషయాలు తెలుసుకోకపోతే ఆవేశానికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

సామాజిక వాస్తవాల గురించి పెద్దగా వివాదం లేదు. జివొ 33ను వ్యతిరేకిస్తున్నవారెవ్వరూ ముస్లింలలో వెనుకబాటుతనం లేదని అనడంలేదు. హైకోర్టులో వేసిన కేసులలో సహితం, ముస్లింలు అభివృద్ధి చెందిపోయారు కదా, వారికి రిజర్వేషన్లు ఎందుకు అని ఏ ఒక్కరూ అనలేదు. ముస్లింలలో ఉందని ప్రభుత్వం చెప్తున్న వెనుకబాటుతనం నిజంగానే ఉందని అందరూ ఒప్పుకుంటున్నారు. అయినప్పటికీ వారికి రిజర్వేషన్లు ఇయ్యొద్దని వారి వాదన.

జివొ 33కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన గురించి తెలుసుకోవలసిన మొట్టమొదటి విషయం ఇది.

మరయితే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదనీ, అది సామాజికంగా హానికరమనీ, సమాజాన్ని నిలువునా చీలుస్తుందనీ అంటున్నారు.

రాజ్యాంగం సంగతి మొదట చెప్పుకుందాం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చుననీ, ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు ఆ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇయ్యవచ్చుననీ రాజ్యాంగం అంటుంది.

ఒక కులం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్టయితే ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్లు ఇయ్యడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు నలభై ఏళ్లుగా అనేక తీర్పులలో అనింది. ఈ కేసులన్నీ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని సవాలుచేస్తూ అగ్రకులాలు వేసినవే. అప్పుడూ వారు ఇదే వాదన చేశారు. ఈరోజు మతం పేరుమీద చేస్తున్న వాదన ఆరోజు కులం పేరుమీద చేశారు. కులం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదన్నారు. దానికి సుప్రీంకోర్టు ఏం సమాధానం చెప్పిందంటే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న కులానికి రిజర్వేషన్లు కల్పించడం 'కులం' ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చినట్టు కాదనింది. ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా దానికి రిజర్వేషన్ ఇస్తున్నారే తప్ప కులానికి రిజర్వేషన్ ఇవ్వడంలేదనింది.

ఏదయినా ఒక ప్రజాసమూహం వెనుకబడి ఉన్నట్టయితే వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. ఆ సమూహం ఒక కులం కావచ్చు, ఒక ప్రాంతవాసులు కావచ్చు, ఒక భాష మాట్లాడేవారు కావచ్చు. దీని అర్థం కులానికో, ప్రాంతానికో, భాషకో రిజర్వేషన్ ఇచ్చినట్టు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మాట అంటూ, 'ఒకవేళ ముస్లింలు వెనుకబడి ఉన్నారని ఒక రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్టయితే ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు' అని కూడా మండల్ కమిషన్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం అనింది. మన రాష్ట్రంలో ముస్లింలు వెనుకబడి ఉన్నారన్న వాస్తవాన్ని ఎవరూ కాదననప్పుడు 'రాజ్యాంగం ఒప్పుకోదు' అన్న వాదన చెల్లదని దీనినిబట్టి స్పష్టం అవుతున్నది.

ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం సమాజాన్ని నిలువునా చీల్చడమేనన్న వాదనను ఏవిధంగా అర్థం చేసుకోవాలి? హిందువులు, ముస్లింలు అన్న చీలిక మన సమాజంలో చాలాకాలంగా ఉంది. దానికి చారిత్రక, రాజకీయ కారణాలున్నాయి. ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్ల పట్ల హిందువులు కోపగించు కున్నట్టయితే ఈ ఎడం మరింత పెరుగుతుంది గానీ, సహృదయంగా అర్థం చేసుకుంటే ఎందుకు పెరుగుతుంది?

సహృదయంగా ఎందుకు స్పందించాలి అని అడుగుతారేమో. దీనికి జవాబు క్లుప్తంగానే అయినా జివొ 33లో ప్రభుత్వమే చెప్పింది. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 30 శాతం కాగా, ముస్లింలలో 65 శాతం. రాష్ట్రంలో నిరక్షరాస్యత 56 శాతం కాగా ముస్లింలలో 82 శాతం. ముస్లిం స్త్రీలలోనయితే 96 శాతం. రాష్ట్ర జనాభాలో ముస్లింలు 8.5 శాతం ఉన్నారుగానీ ప్రభుత్వ ఉద్యోగాలలో అందులో సగం కూడా లేరు. అత్యధికులు అసంఘటిత రంగంలోని చిన్న వృత్తులలో మగ్గుతున్నారు. పాన్‌షాపులు, చాయ్ దుకాణాలు, పూలు, పళ్ళ దుకాణాలు, రేడియో రిపైర్, వాచ్ రిపైర్ షాపులు పెట్టుకొని బతుకుతున్నారు. మెకానిక్ షెడ్‌లలో హోటళ్ళలో పనిచేస్తున్నారు. గ్రామీణ చేతివృత్తుల రంగంలో ఉన్నారు.

ఇటువంటి ప్రజా సమూహానికి రిజర్వేషన్లు ఇస్తే ఇతర ప్రజలు సానుభూతితో ఎందుకు అర్థం చేసుకోకూడదు? చేసుకున్నట్టయితే సమాజంలో చీలిక ఎందుకు పెరుగుతుంది? అయినా ముస్లిమేతరులు సానుభూతితో అర్థం చేసుకోరని ప్రకటించడానికి ఈ పిడికెడు మంది ఆందోళనకారులకు ఎవరు అధికారం ఇచ్చారు?

ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటిపోతుందనేది దానిని వ్యతిరేకిస్తున్నవారు చెప్తున్న మరొక కారణం. మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటడానికి వీలులేదని సుప్రీంకోర్టు చెప్పిందని వారు అంటున్నారు.

ఇదెంతవరకు నిజం?

మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించవచ్చునా లేదా అన్న విషయంలో సుప్రీంకోర్టు జడ్జిలు గడచిన 50 ఏళ్లలో తలా ఒక అభిప్రాయం వ్యక్తం చేశారు. వెనుకబాటుతనం ఎంత ఉంటే రిజర్వేషన్ అంత ఉంటుంది – దానికి సీలింగ్ ఏమిటి అన్నవారూ ఉన్నారు. మొత్తం రిజర్వేషన్ ఎట్టి పరిస్థితిలోనూ 50 శాతం మించడానికి వీలులేదన్నవారూ ఉన్నారు. ప్రస్తుతం శిరోధార్యంగా ఉన్నది మండల్ కమిషన్ కేసులో మెజారిటీ తరఫున తీర్పు ప్రకటించిన జస్టిస్ జీవన్‌రెడ్డి అభిప్రాయం. అదేమిటంటే, వెనుకబడిన వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్ మొత్తం 50 శాతం మించకూడదన్నది ఒక స్థూలమయిన నియమం. దానికి ప్రత్యేక

పరిస్థితులలో మినహాయింపులుండగలవు. అంతేకాక, వెనుకబడిన వర్గమన్న కారణంగా కాక వేరే కారణాల వల్ల ఇచ్చే రిజర్వేషన్‌కు ఈ '50 శాతం సీలింగ్' వర్తించదు. ముల్కీ తరహా లోకల్ రిజర్వేషన్లు, స్త్రీలకు ఇచ్చే 33.3 శాతం రిజర్వేషను, వికలాంగులకిచ్చే 3 శాతం రిజర్వేషను, ఎన్‌సిసి కోటా, స్పోర్ట్స్ కోటా మొదలైనవి ఈ సీలింగ్‌కు వెలుపల ఉంటాయి.

'50 శాతం సీలింగ్' వర్తించేది ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లకే. అవి మూడూ కలిపి ప్రస్తుతం 46 శాతం ఉన్నాయి. ముస్లింను బిసిలలో చేర్చి 5 శాతం రిజర్వేషన్ ఇస్తే ఇది 51 శాతం అవుతుంది. అంటే 'స్థూలమైన' పరిమితిని మించి ఒకశాతం మాత్రమే అవుతుంది. ఆ ఇంత కూడా మించవద్దనుకుంటే 5 శాతాన్ని 4 శాతానికి తగ్గిస్తూ జివొ 33ను సవరించవచ్చును. అప్పుడు దానిని వ్యతిరేకిస్తున్నవారు తమ వ్యతిరేకతను మానుకుంటారా? ముస్లింలలో (ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో) ధనికవర్గం కూడా ఒకటి ఉన్నదనీ, ముస్లింల పేరుమీద ఇచ్చే రిజర్వేషన్ యావత్తూ వారే తన్నుకు పోతారనీ కూడా వాదిస్తున్నారు. బిసి రిజర్వేషన్ విషయంలో అగ్రకులాల వారు ఇదే అభ్యంతరం వ్యక్తంచేయగా, మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఏమనిందంటే ప్రతీ బిసి కులంలోనూ 'క్రీమీ లేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి వారిని తొలగించాలని. ముస్లింలను ఇప్పుడు ఒక బిసి వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇస్తున్నారు కాబట్టి అది జివొ 33కు కూడా వర్తిస్తుంది. మన రాష్ట్రంలో 'క్రీమీ లేయర్' గుర్తింపుకు ప్రమాణాలింకా ప్రభుత్వం రూపొందించలేదు. ఏ ప్రమాణాలు రూపొందించినా అవి ముస్లింలకు కూడా వర్తిస్తాయి. కాబట్టి నిజాం మనవలే రిజర్వేషన్ మొత్తం కొట్టేస్తారని ఆందోళన చెందనక్కరలేదు.

ఇవికాక వేరే సాంకేతిక కారణాలు కూడా చెప్తున్నారు. వాటికి సామాజిక ప్రాముఖ్యం గానీ, రాజ్యాంగపరమైన ప్రాముఖ్యంగానీ ఏమీ లేదు కాబట్టి వాటినిక్కడ చర్చించనక్కరలేదు. ఒకవేళ ఏదో ఒక సాంకేతిక కారణం వల్ల జివొ 33 చెల్లదని రేపు హైకోర్టు తప్పుపట్టినా దానిని సవరించి మళ్లీ జారీచేయవచ్చు. అంతే తప్ప జివొ 33 చెల్లదనడానికి సామాజిక కారణంగానీ, రాజ్యాంగ పరమైన అవరోధంగానీ ఏమీ లేదు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ముస్లింలకూ ఇస్లాంకూ సంబంధించిన విషయాలను హేతుబద్ధంగా, స్థిమితమైన మనస్సుతో చర్చించడం సాధ్యంకాని కలుషిత వాతావరణం దేశంలో నెలకొని ఉంది. దీనికి బాధ్యులెవరు అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతంగానీ దీనిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నవారెవరో స్పష్టంగానే చూస్తున్నాం.

ఈ వాతావరణం కారణంగా ముస్లింల ప్రస్తావన వచ్చినప్పుడు మన సైకిల్‌కు గాలికొట్టే అహమ్మదు, మన వీధి చివర చాయ్ అమ్మే బాషా, మన పక్కింట్లో కసువు ఊడ్చే సుల్తాన్‌బీ జ్ఞాపకం రారు. ఒసామాబిన్ లాడెన్‌ను తలచుకుంటాం, జైష్-ఇ-మహమ్మద్‌ను, లష్కర్-ఇ-తయ్యబాను తలచుకుంటాం. దీనికి తగ్గట్టు స్పందిస్తాం. అప్పుడు ముస్లింలకు ప్రభుత్వం ఏ మేలు చేయజూసినా అది భయంకరమైన తప్పిదంగా కనిపిస్తుంది.

అమానవీయమైన ఈ మానసిక స్థితిని అధిగమించాలేగానీ జివొ 33లో తప్పేమీ లేదనీ, అది నిజానికి సామాజిక న్యాయానికి చాలా అవసరమైన చర్య అనీ గుర్తించడానికి ఎంతోసేపు పట్టదు.

5 ఆగస్టు 2004

హైదరాబాద్



# పట్టణీకరణ - మానవ హక్కులు

**సం**స్కరణల యుగంలో ప్రభుత్వాలు రూపొందించే పథకాలు, చేపట్టిన ప్రణాళికలన్నీ ప్రజల హక్కులకు ఆటంకంగా మారాయి. తెలుగుదేశం ప్రభుత్వం 'విజన్ 2020'లో భాగంగా ప్రచురించిన నగర మాస్టర్ ప్లాన్ 2020 దీనికి ఒక మంచి ఉదాహరణ. ఇప్పుడు ఉన్న 60 లక్షల జనాభా 2020 సంవత్సరానికి 1 కోటి 36 లక్షలకు పెరుగుతుందన్న ఆలోచనతో ఈ మాస్టర్ ప్లాన్ రచింపబడింది. 1975లో హుడా పరిధిలోకి వచ్చిన పది మునిసిపాలిటీలతో పాటు అదనంగా 125 గ్రామ పంచాయతీల్లోని 307 గ్రామాలను కలుపుకొని మొత్తం 534 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒక పట్టణానికి పథకం వేశారు. ఇందులో 14 బస్ డిపోలకు, 16 పెద్ద మార్కెట్లకు, ఎనిమిది రవాణా సెంటర్లకు, కొన్ని వందల పార్కులకు, కొన్ని వందల చిన్న కూరగాయ మార్కెట్లకు స్థానం కల్పించారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో చాలా నివాస ప్రాంతాలను గ్రీన్‌బెల్టు ప్రాంతాలుగా చూపెట్టారు.

కానీ ఈ ప్లాన్ వల్ల 307 గ్రామాల నుండి నిర్వాసితులై, జీవనోపాధి కోల్పోతున్న ప్రజలు ఏమౌతారు? మురికివాడలుగా ఉన్న ప్రాంతాలు ఏమౌతాయి? ఇన్ని లక్షల మంది ఎలా బతుకుతారు అన్న అంశాలపై ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ఇదికాక మూసివేయబడుతున్న పారిశ్రామిక కేంద్రాల శ్రామికుల అవసరాల ప్రస్తావనే లేదు. హైదరాబాద్ నగరంలో సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చినప్పటి నుండి 2000 చిన్న పరిశ్రమలు మూతబడ్డాయి. ఉపాధి అవకాశాలు ఇప్పటికే తగ్గిపోతుండగా జిల్లాల నుండి వలసలు ఎక్కువయ్యాయి. ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడమే కాక కరువు పీడిత ప్రాంతాలకు కనీస సహాయాన్ని కూడా అందించకపోవడం వలన వ్యవసాయ రంగంలో బతుకుదెరువు కోల్పోయి చాలా పెద్ద సంఖ్యలో హైదరాబాదుకు వలస వస్తున్నారు. కరువు జిల్లాల నుండి వలస వస్తున్న నాలుగు లక్షల ప్రజలు కాకుండా అదనంగా దాదాపు రెండు లక్షల మంది ఇతర జిల్లాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి కూడా బతుకుదెరువు కోసం వలస వస్తున్నారు. ఇంత మంది ప్రజలకు ఈ నగరంలో ఉన్న జీవనోపాధి మార్గాలు చూస్తే ఆశ్చర్యపోతాం. రెండు శాతం మంది ఫ్యాక్టరీలలో కాంట్రాక్టు లేబర్‌గా, 60 శాతం మంది గృహ నిర్మాణ కార్మికులుగా, ఒక శాతం వాచ్‌మెన్‌లుగా, మూడు శాతం పనిమనుషులుగా జీవనం వెళ్ళబుచ్చుతుండగా, మూడు శాతం మంది ప్రతిరోజూ అడ్డాల మీద పనికోసం పడిగాపులు పడుతున్నారు.

ఉపాధికి ప్రజలందరూ హైదరాబాదు వైపే చూస్తున్నారు. ప్రజలందరూ ఆశతో ఎదురుచూస్తున్న ఈ హైదరాబాదు నగర వికాసానికి ప్రభుత్వం తయారుచేసిన ప్రణాళికల్లో అసలు ప్రజలే లేరు. వాళ్ళ వసతులు, ఉపాధి గురించి ప్రతిపాదనలే కనిపించవు.

ఒకవైపు ప్రజలను ఉపేక్షిస్తూ మరోవైపు సింగపూర్ ఆదర్శంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రణాళికలను తయారు చేస్తున్నారు. విశాలమైన రోడ్లను, తోటలను, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ఆట స్థలాలను నిర్మించి అంతర్జాతీయ స్థాయిలో విహార స్థలంగా హైదరాబాదుకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం జరుగుతున్నది. దీని ఫలితంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిచయం కల కొందరు మధ్యతరగతి వర్గానికి చెందినవారు, దాని చుట్టూ వ్యాపారం చేసుకునే సంపన్నులకు తప్ప వేరెవ్వరికీ లాభంలేదు. హుస్సేన్‌సాగర్‌నే చూడండి. చెరువును పూడ్చారు. ఆ భూమిని అన్ని నియమాలకు విరుద్ధంగా ఐమాక్స్ థియేటరుకు ఇచ్చారు. ఈ థియేటరులోకి పేదలు కాదు కదా మామూలు మధ్యతరగతి ప్రజలు కూడా అడుగుపెట్టలేనంత ధరలున్నాయి. థియేటరు వలన మన సంపన్నుల సరదాలు తీరుతున్నాయి. కానీ చెరువును కుదించడం వలన పోటెత్తిన వరదల వలన అటు పేద ప్రజలు, ఇటు మధ్యతరగతి వాసులు విపరీతంగా నష్టపోయారు. ప్రజలందరి అవసరాలను దృష్టిలో పెట్టుకొని హుస్సేన్‌సాగర్‌ను తీర్చిదిద్ది ఉంటే ఈ సమస్య తలెత్తక పోవును.

గత ఆరు సంవత్సరాలుగా ఈ రకమైన విధానాలకు వ్యతిరేకంగా విశాలమైన, స్వతంత్రమైన హక్కుల ఉద్యమాన్ని నిర్మించే లక్ష్యంతో మానవ హక్కుల వేదిక పనిచేస్తున్న విషయం మీకు తెలుసు. ఈ ఆరేళ్ళ కృషిని సమీక్షించుకొని ముందుకు సాగే లక్ష్యంతో జంట నగరాల శాఖ మొదటి సదస్సును జరుపుకుంటున్నాం. ఆ సందర్భంగా ఇంతవరకు సాగిన నగర అభివృద్ధి విధానాలను సమీక్షించుకొని ప్రజల అవసరాలను తీర్చగల కొత్త విధానాల రూపకల్పనకు కృషిచేద్దాం రండి.

14.08.2004

హైదరాబాద్





## మణిపూర్ ఆందోళన:

# సైనికచట్టమే కాదు పాలనాపోవాలి

**అ**ది చాలా చిన్న చట్టం. పుస్తకంలో రెండు పేజీలు మాత్రమే ఉంటుంది. అందులో 7 సెక్షన్లు మాత్రమే ఉన్నాయి. అధికారం ఇచ్చేవాళ్లకు కొంత అధికారం ఇస్తూ, దానిని భరించే వారికి కొంత రక్షణ కల్పించే చట్టమయితే పెద్దదిగా ఉండాలి, ఎక్కువ సెక్షన్లుండాలి, మినహాయింపులతో షరతులతో సంక్లిష్టంగా ఉండాలిగానీ క్రూరమైన అధికారాన్ని కట్టబెట్టే చట్టం చిన్నగానూ చిన్నపిల్లలకు సహితం అర్థమయ్యేంత సరళంగానూ ఎందుకుండ కూడదు?

దాని పేరు సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం. అది అస్సాం, మణిపూర్‌లలో మాత్రమే ఉందనుకునేరు. 1958లో ఆ చట్టాన్ని చేసినప్పుడు ప్రస్తుత నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, మేఘా లయ, త్రిపురలు 'అస్సాం' అనే రాష్ట్రంలో భాగంగా ఉండేవి. ఈ రాష్ట్రాలు వేరు పడిన తరువాత 1972లో ఆ చట్టాన్ని సవరించి పేరు మార్చకుండానే ఈ రాష్ట్రాలన్నిటికీ వర్తింపజేశారు. తరువాతి కాలంలో జమ్ము-కాశ్మీర్‌కు కూడా అదే నమూనాలో ఒక చట్టం చేశారు.

ఈ చట్టాన్ని రద్దు చేయాలని మణిపూర్‌లో ఈ రోజు విస్తృతమైన ప్రజా ఉద్యమం నడుస్తున్నది. ఇటువంటి ఉద్యమాలూ, ఆందోళనలూ ఈశాన్య భార తంలో చాలా

## మరొక స్త్రీ సాహసం

**ఈ**రోజు మణిపూర్ రాష్ట్ర ప్రజలంతా రోడ్డెక్కేసరికి వారి ఆందోళన బయటి ప్రపంచం దృష్టిని ఆకర్షించిందిగానీ, నాలుగు సంవత్సరాలుగా ఒక స్త్రీ ఇదే డిమాండుతో ఆమరణదీక్ష చేస్తున్నది. కవి, మానవహక్కుల కార్యకర్త అయిన ఇరోం షర్మీలా సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేయాలంటూ 2000 సంవత్సరం నవంబర్ 2న ఆమరణ దీక్షకు కూర్చునింది. ప్రభుత్వం ఆదేశం మేరకు డాక్టర్లు రబ్బర్ గొట్టాల ద్వారా ఎక్కిస్తున్న 'ఆహారం' తప్ప ఆమె ఏమీ తీసుకోవడం లేదు. పూర్తిగా శుష్కించి ఎముకలూ చర్మం తప్ప ఏమీ మిగలకుండా పోయినా షర్మీ తన పట్టుదల వీడడం లేదు. మానవహక్కుల ఉద్యమకారులు, శ్రేయోభిలాషులు ఆమె చేత ఈ దీక్ష విరమింపజేయాలని ప్రయత్నిస్తే మీరు నాచేత మాన్పిస్తారుగానీ చట్టాన్ని రద్దుచేయించలేరు కదా అని తిరస్కరిస్తుంది.

జరిగాయి. వాటిని ఇక్కడి పత్రికలు గానీ, ప్రజలు గానీ ఎన్నడూ పట్టించుకోలేదు. కలకత్తాకు తూర్పున భారత భూభాగమేదీ లేనట్టే తక్కిన దేశం బతుకుతుంటుంది (అయితే ఆ భూభాగం వేరయిపోతానంటే మాత్రం విపరీతం గా ఆవేశపడుతుంటుంది).

ఈసారి మరి దేశమంతా పట్టించుకోవడానికి కారణం 11 మంది మణిపురీ స్త్రీలు తీసుకున్న సాహసవంతమైన నిర్ణయం. జులై 15న వాళ్లు మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని అస్సాం రైఫిల్స్ (ఒక పారా మిలిటరీ బలగం) కేంద్రం ఎదుట 'భారత సైనికులారా మమ్మల్నీ రేప్ చేయండి' అని బ్యానర్ పట్టుకొని నగ్న ప్రదర్శన నిర్వహించారు. మగవాళ్లు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం దేశం చూసింది గానీ స్త్రీలు నగ్న ప్రదర్శన చేయడం చూడలేదు, ఎన్నడూ ఊహించలేదు. చెప్పుతో చెంపమీద కొట్టినట్టు దేశం లేచి కూర్చుంది. మణిపూర్‌లో ఏం జరుగుతున్నది? అని అడగసాగింది.

అంతకు ముందు ఒక ఘటన జరిగింది. జూలై 10 రాత్రి తంగ్‌జాం మనోరమాదేవి అనే 32 సంవత్సరాల స్త్రీని అస్సాం రైఫిల్స్ జవాన్లు ఇంఫాల్‌లోని ఆమె యింటి నుండి నిద్రలేపి బాగా కొట్టి తీసుకుపోయారు. చాలా చట్టబద్ధంగా అరెస్టు మెమో రాసి ఆమె సంతకం కూడా తీసుకొని ఆమె తలిదండ్రులకు ఇచ్చారు. ఆమె వద్ద నిషిద్ధ సామగ్రి ఏమీ దొరకలేదని అందులో రాశారు కూడా.

మరుసటిరోజు తెల్లవారి పట్టణం బయట చేలలో మనోరమ శవం దొరి కింది. శవంలో ఎనిమిది తూటాలు దిగి ఉన్నాయి. ఇంటరాగేషన్ చేస్తుండగా ఆమె తప్పించుకొని పారిపోబోయిం

## మణిపూర్ ప్రజలకు ఏం కావాలి?

**మ**ణిపూర్‌లో రకరకాల పేర్లతో పనిచేస్తున్న 32 సాయుధ పోరాట సంస్థ లున్నాయని అంచనా.

మణిపూర్‌కు ఒక స్వతంత్ర రాజ్యంగా కనీసం వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉందని ఈ పోరాటాలలో ప్రధాన పాత్ర వహిస్తున్న మీయ్‌తీ జాతి ప్రజల భావన. వారి రాజ్యాన్ని మొగల్ పాదుషాలు సహితం జయించలేదు. 1891లో బ్రిటిష్‌వాళ్లు వారి రాజును లోబరచుకొని సామంతుడిని చేసుకోవడం వారి ప్రథమ పరాజయం. బ్రిటిష్ వాళ్లతో పోయిన స్వాతంత్ర్యం బ్రిటిష్ వాళ్ల నిష్క్రమణతో తిరిగి వచ్చిందని, భారత పాలకుల నిర్బంధ విధానాల వల్లనే అది తమకు దక్కకుండ పోయిందనీ వారి ఫిర్యాదు.

ఇది క్రిష్టియన్ మిషనరీల కుట్ర అనడానికి నాగాలలాగ వీరు క్రిష్టియన్లు కారు. ఐఎస్ఐ కుట్ర అనడానికి కాశ్మీరీలలాగ ముస్లింలు కారు. మీయ్‌తీలు హిందువులు. వైష్ణవ మతావలంబులు. అయితే వారి భాష, జీవన సంస్కృతి, రూపురేఖలు భారతీయుల కంటె చాలా భిన్నమయినవి. వెయ్యి సంవత్సరాల అవిచ్ఛిన్నమయిన తమ స్వతంత్ర అస్తిత్వం వదులుకోవడం వారికి ఇష్టంలేదు.

1947లో వారి రాజు బోధాచంద్ర సింగ్ భారత్ ఒత్తిడి ఫలితంగా కేంద్ర ప్రభుత్వానికి రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార సాధనాలు అనే మూడు విషయాలలో మాత్రం అధికారం ఉండే షరతు మీద మణిపూర్‌ను భారత్‌లో విలీనం చేశాడు. అయితే రెండేళ్లు తిరగకముందే నెహ్రూ - పటేళ్ల ప్రభుత్వం అతని మీద బాగా ఒత్తిడి పెట్టి పూర్తిగా విలీనం చేసేసుకున్నారు. అది కుట్ర అని ప్రజల అభియోగం.



దనీ, అప్పుడు కాల్చామనీ అస్సాం రైఫిల్స్ అధికారులు అన్నారు. వారి పరిశోధనలో ఆమె పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అనే వేర్పాటువాద సంస్థ కార్యకర్త అని తేలిందన్నారు. ఆమె ఇంట్లో సింగపూర్‌లో తయారైన రేడియో సెట్ ఒకటి, చైనాలో తయారైన గ్రెనేడ్ ఒకటి దొరికాయని కూడా అన్నారు. ఆ మేరకు ఒక 'మెమో' తయారుచేసి దానిపైన మనోరమ సంతకం తీసుకొని ఉంచుకున్నారు. ఇంటివద్ద రాసిన అరెస్టు 'మెమో'లో ఆమె వద్ద నిషిద్ధ వస్తువేదీ దొరకలేదని రాసిన సంగతి, దానిపైన కూడా మనోరమ సంతకం చేసిన సంగతి, పైన చెప్పాము. రెండవ మెమోపైన ఆమె ఏ పరిస్థితిలో సంతకం చేసి ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

అరెస్టు చేసినప్పుడు మనోరమ మణిపురీ స్త్రీలు సాధారణంగా ధరించే బిగు వయిన లుంగీ వంటి వస్త్రం ధరించి ఉందనీ, రబ్బర్ చెప్పులు వేసుకొని ఉందనీ- ఆమె పొలాల వెంబడి పారిపోయే ప్రయత్నం చేయడమేమిటని ప్రజలు వేసిన ప్రశ్నకు అస్సాం రైఫిల్స్ ఏ జవాబూ ఇవ్వలేదు. ఒకవేళ పారిపోయే ప్రయత్నం చేసినా వెంటపడి పట్టుకోవడం అస్సాం రైఫిల్స్ వీరజవాన్లకు సాధ్యం కాలేదా అన్న ప్రశ్నకూ జవాబివ్వలేదు. ఆమెను అస్సాం రైఫిల్స్ జవాన్లు రేప్‌చేసి చంపారని మణిపూర్ ప్రజల అభియోగం. ఆమె శరీరం మీద ఉన్న గాయాలను బట్టి వారు ఆ నిర్ధారణకు వచ్చారు.

అయితే మణిపూర్ ప్రజలు ప్రశ్నలడుగుతూ కూర్చోలేదు. మణిపూర్ రాష్ట్రం మైదాన ప్రాంతంలోని ప్రధాన తెగ అయిన మీయ్‌తీల పౌర సమాజంలో మొదటి నుండి స్త్రీలదే చురుకయిన పాత్ర. మహిళా సామాజిక కార్యకర్తలను 'మీయ్‌రా పైబీ'లు అంటారు. 11 మంది మీయ్‌రాపైబీలు జూలై 15న అసాధారణమైన నిరసన చేపట్టి విస్తృతమైన నిరసన ఉద్యమానికి నాంది పలికారు. ఆనాటి నుండి ఈనాటి వరకు మణిపూర్‌లో సాధారణ స్థితి తిరిగి రాలేదు.

సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఉప సంహరించాలన్నది వారి డిమాండు. ఆ చట్టం పోతే అణచివేత పోతుందని నమ్మేంత అమాయకులు కారు వారు. నిర్బంధ చట్టాలు నిర్బంధానికొక వికృతమైన 'చట్టబద్ధత' మాత్రమే కల్పిస్తాయి. అవి నిర్బంధానికి కారణం కాదు, నిర్బంధ చట్టాలు లేకపోతే నిర్బంధం లేకుండ పోదు. మణిపూర్‌తో సహా ఈశాన్య భారత ప్రాంత ప్రజలంతా కోరుకునేది సైనిక పాలన పోవాలని. దానికి చట్ట బద్ధత కల్పించే ఈ చట్టం సైనిక పాలనకొక సంకేతం మాత్రమే.

విచ్చలవిడి బలప్రయోగాన్ని ఆమోదించడం ఈ చట్టం లక్ష్యం. ఒక వ్యక్తి నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తున్నట్టయితే అతనిని నివారించడానికి తుపాకీతో నయినా, వేరే ఏ రకంగానైనా- ప్రాణం తీసేంత బలప్రయోగమయినా సరే- సైనికులు చేయవచ్చునని ఈ చట్టంలోని సెక్షన్ 4(ఎ) అంటుంది. సాయుధ దాడులు చేయడానికి, లేక ఆయుధాలు దాచుకోవడానికి, లేక మిలిటెంట్లకు తర్ఫీదు ఇవ్వడానికి ఉపయోగపడుతుందని భావించే ఏ నిర్మాణాన్నయినా సైనికులు పూర్తిగా ధ్వంసం చేయవచ్చునని 4(బి) అంటుంది. ఒక నేరం చేసిన, లేక చేయబోతున్న వ్యక్తిని అరెస్టు చేయడానికి సైనికులు ఎంత అవసరమను కుంటే అంత బలప్రయోగం చేయవచ్చునని సెక్షన్ 4(సి) అంటుంది. ఏ నివాసాన్నయినా వ్యక్తుల కోసం, వస్తువుల కోసం వారంట్ కూడా లేకుండ సైనికులు సోదాచేయవచ్చుననీ ఆ క్రమంలో ఎంత

అవసరమనుకుంటే అంత బల ప్రయోగం చేయవచ్చునని సెక్షన్ 4(డి) అంటుంది.

ఈ అధికారాలు చలాయించే క్రమంలో సైనికులు పాల్పడే ఏ చర్య మీదనయినా కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ఎటువంటి కేసూ పెట్టడానికి వీలులేదని సెక్షన్ 6 అంటుంది.

మామూలు చట్టాలు పోలీసులకు బలప్రయోగం చేసే అధికారం ఇచ్చిన చోట 'కనీస బలప్రయోగం' మాత్రమే చేయాలని నొక్కి చెప్తాయి. ఈ చట్టం 'నీకు అవసరమనిపించినంత చేసుకో' అంటుంది. అందుకే ఇటువంటి చట్టా లను అణచివేత చట్టాలు, నిర్బంధ చట్టాలు అంటాం.

దాదాపు 50 ఏళ్లగా ఈశాన్య రాష్ట్రాలను ఏలుతున్న సైనిక పాలన తొలగి పోవాలని కోరుకునే ఆ ప్రాంత ప్రజలు ఈ చట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండును తమ ఆందోళనకు కేంద్రం చేసుకోవ డం సహజం. ఈ ఆందోళనను అండర్ గ్రౌండ్ మిలిటెంట్ సంస్థలు రెచ్చగొడుతున్నాయని ఎప్పటి లాగే భారత సైన్యం ఆరోపిస్తున్నది. కానీ నిజానికి చేతిలో తుపాకి పట్టుకొని ప్రభుత్వంపైన యుద్ధం చేస్తున్న వారికి ఇటువంటి చట్టాల వల్ల ప్రత్యేకంగా వచ్చే సమస్య ఏమీ లేదు. వాటి క్రూరత్వాన్ని అనుభవించేది ఆ మిలిటెంట్ సంస్థల పట్ల రాజకీయంగా, సామాజికంగా ఎంతో కొంత సంబం ధాలు, సానుభూతి ఉండే మామూలు జనమే. ఈశాన్య భారత రాష్ట్రాలలో నడుస్తున్న పోరాటాలన్నీ అక్కడి వివిధ ప్రజా సమూహాలు తమ జాతి ఉనికినీ స్వాతంత్ర్యాన్నీ కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటాలు కాబట్టి ఆయా జాతులకు చెందిన ప్రజలకు ఆ పోరాటాల పట్ల ఎంతో కొంత సాను భూతి, సంబంధాలు ఉండడం సహజం. అందువల్ల ఆ ప్రజానీకమంతా ఇటువంటి చట్టాల క్రూరత్వానికి బలికావడం, వాటి రద్దును కోరుకోవడం సహజం. ఈ రోజు మణిపూర్ గురించి వింటున్నాంగానీ ఇదే స్థితి మిజోరంలో, త్రిపురలో, అస్సాంలో, నాగాలాండ్‌లో 50 ఏళ్లుగా ఉంది. నాగా లాండ్‌లో ప్రస్తుతం ప్రభుత్వానికీ మిలిటెంట్లకూ మధ్య కాల్పుల విరమణ అమలులో ఉందిగానీ లేకుంటే అక్కడి అన్ని రాష్ట్రాలకంటె నాగాలాండ్ ఎక్కువ నిర్బంధాన్ని చవిచూసింది.

అందువల్ల మణిపూర్ ప్రజల పోరాటానికి మనందరి మద్దతూ అవసరం. ప్రజలు ఒక్కసారి ఉవ్వెత్తున లేచేసరికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇబోబిసింగ్ కాం గ్రెస్ సంస్కృతికి సహజమైన సర్దుబాటు ధోరణిలో ఒక్క ఇంఫాల్ పట్టణంలో చట్టం అమలును ఉపసంహరించాడు. అంటే ఇంఫాల్‌లో పట్టుకున్న వారిని బయటికి తీసుకుపోయి కాల్చేస్తే సరిపోతుందన్న మాట!

తంగ్‌జాం మనోరమాదేవి హత్యపైన రెండు మూడు విచారణలు మొదల య్యాయి. అయితే విచారణలు రహస్యంగా ('ఇన్ కెమెరా') జరగాలనీ విచారణా ధికారి తమ కేంద్ర కార్యాలయానికే వచ్చి తమను ప్రశ్నించాలనీ అట్లాగయితేనే తాము విచారణలో పాల్గొంటామనీ అస్సాం రైఫిల్స్ అధికారులు అంటున్నారు. వాళ్లను 'నక్షాలు' చేయొద్దని శాసించే ఉద్దేశ్యం భారత సర్కార్‌కు లేదు. ఆ రాష్ట్రంలోని ప్రజలంతా తీవ్ర ఆవేదనకు గురయినా ఫరవాలేదు, భారత్‌ను మరింత ద్వేషించినా ఫరవాలేదు, నేరం చేసిన సైనికులను కాపాడడమే ప్రధానం భారత సర్కార్‌కు. ఇంఫాల్ పట్టణంలో మాత్రమే ఆ నిర్బంధ చట్టం అమలును నిలుపుదల చేయడం హాస్యాస్పదమని సాధారణ మానవులకు అనిపిస్తుండగా, ఆ మాత్రం స్వతంత్రించినందుకు ఇబోబీసింగ్‌పైన కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ కన్నెర్ర చేశాడంట. 'మా పార్టీ వాడయితేనేం? మాకు చాలా కోపంగా ఉంది' అని విలేకర్లతో అన్నాడంట.

శివరాజ్ పాటిల్ కన్నెర్ర చేస్తే చేయవచ్చునుగానీ మణిపూర్ ప్రజల భావా లను పట్టించుకోకుండ



ఉండడానికి ఇబోబీసింగ్ బయటివాడు కాదు కదా. రాజీ రాజకీయాల పరిధిలోనయినా ఏదో ఒకటి చేయక తప్పదు. అయితే అతను చేసింది చాలదు. సైనికుల చేతిలో విధ్వంసక అధికారాలు పెట్టే ఆ చట్టాన్ని మొత్తంగా ఎత్తివేయాలి. అంతేకాదు, ఈశాన్య భారతంలో సైనిక పాలనను ఎత్తివేయాలి.

23 ఆగస్టు, 2004
హైదరాబాద్

# పులిచింతలను ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?

రైతుల ప్రాణాలు కాపాడాలంటే సాగునీరివ్వాలని అడిగామని చెప్పి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఎడాపెడా ప్రాజెక్టులకు శంకుస్థాపనలూ, భూమిపూజలూ మొదలు పెట్టింది. 'పెండింగ్' ప్రాజెక్టులుగా పేరుపడిన అన్ని ప్రాజెక్టులూ అయిదేళ్ల లోపల కట్టేస్తానని దబాయిస్తున్నది.

ఉన్న నిధులు పొదుపుగా వెచ్చించి ఎక్కడ ప్రాజెక్టులు ఎక్కువ అవసరమో, ప్రాజెక్టులకు అవకాశం లేని ప్రాంతాలలో సాగునీటి పెంపుదల ఏవిధంగా చేపట్ట వచ్చునో విశ్లేషించి పథకాలు చేపట్టేబదులు, నీటి కేటాయింపులేని ప్రాజెక్టులూ, పర్యావరణ అనుమతి లేని ప్రాజెక్టులూ, పొరుగు రాష్ట్రాలు ససేమిరా అంటున్న ప్రాజెక్టులూ, ప్రజలు వద్దంటున్న ప్రాజెక్టులూ అన్నిటికీ ఇక్కడ వంద కోట్లు, అక్కడ అయిదు వందల కోట్లూ కేటాయించి భూమి పూజలు మొదలుపెట్టింది ప్రభుత్వం.

'ప్రజలు వద్దంటున్న' ప్రాజెక్టులలో పులిచింతల ఒకటి. ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే ప్రజలు ప్రాజెక్టును వ్యతిరేకించడం సహజం అని కొట్టిపారేస్తున్నారు. అది సహజమేగానీ దీన్ని కొట్టిపారేసే విషయంగా ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా భావించడంలేదు. 'దేశం' బాగుపడడానికి కొంతమంది త్యాగం చేయక తప్పదనే వైఖరి ఒకనాడు ప్రాచుర్యం పొంది ఉండింది. కానీ క్రమంగా, 'దేశం' పేరు చెప్పుకున్నా 'సమాజం' పేరు చెప్పుకున్నా బాగుపడేది కొందరు వ్యక్తులేననీ, నష్టపోయేదీ కొందరు వ్యక్తులేననీ, ఇద్దరూ 'దేశం'లో భాగమే కాబట్టి ఒకరి బాగునూ, మరొకరి వినాశనాన్నీ ఒకటిగానే చూడాలనీ అవగాహన పెరిగింది. ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారి స్థిరాస్తులకు (ఉంటే) నష్టపరిహారం ఇచ్చేసి చేతులు దులిపేసుకునే వైఖరి చాలావరకు పోయింది. మనకంటే నాగరికమైన దేశాలలో, నిర్వాసితుల పూర్వ జీవన ప్రమాణం ఏమాత్రం దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో ప్రాజెక్టు చేపట్టగలిగితేనే చేపడుతున్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల విషయం లోనయితే, కొత్తగా వచ్చే ఆయకట్టులోనే నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు నిధులిస్తున్న శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టుకూ, శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టుకూ ఈ నియమాన్ని ప్రపంచ బ్యాంకు వర్తింపజేస్తున్నది.

కానీ పులిచింతల వల్ల కొత్త ఆయకట్టేమీ రాదు కాబట్టి ఆ రకమైన పునరావాసం కల్పించడం సాధ్యంకాదు. పులిచింతల కృష్ణా డెల్టాలో ఇప్పటికే సాగవుతున్న 12.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ప్రాజెక్టు. కానీ దానికోసం నల్లగొండ, గుంటూరు జిల్లాలలో దాదాపు 30 వేల ఎకరాలు మునుగుతాయి. ఏడు గ్రామాలు పూర్తిగా, ఐదు గ్రామాలు పాక్షికంగా మునుగుతాయి. ప్రాజెక్టుకు కొత్త ఆయకట్టు లేదు కాబట్టి ప్రస్తుతం నాగరిక దేశాలు అనుసరిస్తున్న నమూనా ప్రకా రం ఈ జనానికి కొత్త ఆయకట్టులో పునరావాసం కల్పించే అవకాశం లేదు. అసలు వారికి ఏ పునరావాసమూ దక్కదు. స్థిరాస్తులున్న వారికి కొంత నష్టపరిహారం దక్కుతుంది. అందులో లాయర్లూ, బ్రోకర్లూ తినగా మిగిలిన దానిలో ఎకరానికి పదిగుంటలు కూడా తిరిగి ఏ ఊరిలోనూ కొనుక్కోలేరు. స్థిరాస్తులు లేనివారికి ఆ మాత్రం కూడ దక్కదు.



## ఆ ప్రజల అభ్యంతరాన్ని 'ఎప్పుడూ ఉండేదే' అని కొట్టిపారేయడం తగునా?

పులిచింతల ప్రాజెక్టు సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతంలో కడుతున్నారనీ, దాని వల్ల ఆ ఖనిజం వృథా అయిపోతుందనీ తెలంగాణ రాష్ట్ర సమితి లేవదీసిన అభ్యంతరానికి ప్రభుత్వం మరీ విచిత్రమైన జవాబు చెప్తున్నది. ఇప్పుడక్కడ ఉన్న ఖనిజం ప్రస్తుతం తవ్వుతున్న పద్ధతిలో తవ్వితే 2009లో అయిపోతుందనీ, ఇంకా వేగంగా తవ్వి ఇప్పుడే అంతా తీసేసి ప్రాజెక్టు కట్టేస్తామనీ పొన్నాల లక్ష్మయ్యగారు అంటున్నారు. అయిదు సంవత్సరాల నిక్షేపాన్ని అయిదు వారాలలో తవ్వేయడం సాధ్యమేనని అనుకున్నా, దానినంతా ఎక్కడ దాచుకుంటారు? మిర్యాలగూడెం నిండా గోడౌన్లు కట్టి భద్రపరుస్తారా? అక్కడ దొరికే సున్నపురాయిని స్థానిక సిమెంటు ఫ్యాక్టరీలకు ముడిసరుకుగా వాడుకోవడం జరుగుతున్నది. వాటి అవసరంమేరకు తవ్వడం జరుగుతున్నది. అయిదేళ్ల సరుకును ఇప్పటికిప్పుడు తవ్వేసి తీరికగా సిమెంటు ఉత్పత్తికి వాడుకుంటామనడం ఇంగితం ఉన్న వారిచ్చే జవాబేనా?

## ప్రధానమైన అభ్యంతరం

అయితే పులిచింతలను వ్యతిరేకించడానికి ప్రధానమైన అభ్యంతరం నీటి హక్కులకు సంబంధించినది. నిజానికి తొలినాడు ఇదే ప్రధాన అభ్యంతరంగా ఉండింది గానీ ఎవరి కారణాల వల్ల వారు దీని గురించి ఇప్పుడు మాట్లాడడం మానేసారు కాబట్టి కొంచెం వివరంగా చెప్పుకోవడం అవసరం.

'వృథాగా సముద్రంలోకి పోయే నీటిని' పులిచింతలలో బంధించి డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం వాడుకుంటున్నామనీ, దానిని వ్యతిరేకించడం కుళ్లుబోతు తనమనీ వాదిస్తున్నారు. ఇది అవాస్తవం. దీనిని అర్థం చేసుకోవడానికి కృష్ణా జలాల వాడకానికి సంబంధించిన వ్యవస్థ గురించి కొంత అవగాహన అవసరం. కోస్తా జిల్లాలకు చెందిన నాయకులకు ఈ అవగాహన ఏ మాత్రం లేకపోవడం వల్ల అక్కడి రైతాంగాన్ని ఊరికే రెచ్చగొట్టడం జరుగుతున్నది.

కృష్ణానది మూడు రాష్ట్రాల ద్వారా ప్రవహించే నది (తెలంగాణ వేరయితే నాలుగవుతుంది). దాని పరీవాహక ప్రాంతంలో వర్షాభావ తీవ్రత అధికం కాబట్టి ఆ నది నీటికి డిమాండు ఎక్కువ. అందువల్ల దాని మీద న్యాయబద్ధంగా హక్కులను రూపొందించుకోవడం, దానికి అందరూ కట్టుబడి ఉండడం అవసరం. దీనికి ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవస్థ బచావత్ అవార్డు.

బచావత్ అవార్డు కృష్ణానదీ జలాలలో ఒక హక్కుగా వాడుకోగలిగిన దానిని 'నికర జలాలు' అనీ, తక్కిన దానిని 'మిగులు జలాలు' అనీ వర్గీకరించింది. పులిచింతలలో బంధించబోయేది 'వృథాగా సముద్రంలోకి పోయే నీళ్లు' అంటే అర్థం అది అంతా మిగులు జలమని. అది అబద్ధం. పులిచింతలలో బంధించబోయే 40 లేక 45 టిఎంసిల నీటిలో 9 టిఎంసిలు నికర జలాలు. 9 టిఎంసిలను ఆరుతడి పంటలకు వాడుకుంటే 90 వేల ఎకరాలకు సరిపోతుంది. ఎగువ ప్రాంతంలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుండి హంద్రీ-నీవా దాకా ఒక్క చుక్క కూడా నికర జలం కేటాయింపులేని దుర్భిక్ష ప్రాంతాల 'పెండింగ్ ప్రాజెక్టులు' అరడజను దాకా ఉండగా, సుభిక్ష ప్రాంతపు ఆయకట్టును కేవలం స్థిరీకరించే ప్రాజెక్టుకు 9 టిఎంసిల నికర జలం కేటాయింపు చేయడం సబబు కాదన్నది మొదటి అభ్యంతరం.

నల్లగొండ జిల్లాలో నడుస్తున్న బాధాకరమైన ప్రహసనాన్ని గురించి ఇక్కడ చెప్పుకోవాలి. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు ప్రాంతాల ఫ్లోరైడ్ సమస్య అందరికీ తెలిసినదే. అదొక భయంకరమైన సమస్య అని అందరూ ఒప్పుకుంటారు. కృష్ణానది నుండి ఆ గ్రామాలకు తాగునీరు ఇవ్వడం దీనికొక పరిష్కారం అని ప్రభుత్వం గుర్తించింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నేరుగానయినా పరోక్షంగానయినా దానికి ఉపయోగపడగలదు. కానీ ఆ ప్రాజెక్టుకు చుక్క నికర జలం కేటాయింపు లేదు.

కాగా, చౌటుప్పల్ ప్రాంతానికి నీళ్లివ్వడం కోసమని చెప్పి వంద సంవత్సరాలకు పైగా మూసీనది పైన ఉన్న చిన్న ఆనకట్టల (కతువాల) వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారు. 50 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ వ్యవస్థ మధ్య భాగంలో పిల్లాయిపల్లి దగ్గర పక్కకు కాలవతీసి చౌటుప్పల్‌కు నీళ్లిస్తామంటున్నారు. దానివల్ల తమ పొలాలు ఎండి పోతాయని పిల్లాయిపల్లికి దిగువన ఉన్న కతువాల ఆయకట్టుదార్లు గొడవ చేస్తున్నారు. రెండు కరువు ప్రాంతాల రైతుల మధ్య గొడవ పెట్టి చోద్యం చూసే బదులు ఈ 9 టిఎంసిల నీటిని ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టుకు, ప్రత్యేకించి ఫ్లోరైడ్ ప్రాంతాల తాగునీటి అవసరానికి కేటాయించ వచ్చుకదా?

బచావత్ అవార్డు ప్రకటించే నాటికే ఆంధ్రప్రదేశ్ కృష్ణా నదీ జలాలను పెద్ద మొత్తంలో వాడుకుంటూ ఉండడం వల్ల ఆ అవార్డు మనకు కొత్తగా నికర జలాల కేటాయింపు చేయడానికి ఇష్టపడలేదు. ఒక్క జూరాల ప్రాజెక్టుకు మాత్రమే ఇచ్చింది. అయితే సాగునీటి వ్యవస్థను ఆధునీకరించి నీటిని పొదుపు చేసుకొని, పంట కాలవల నుండి తిరిగి నదిలోకి చేరే 'పునరుత్పత్తి జలాన్ని' దానికి కలుపుకొని మన వాటాలో నుండే మరికొంత నికర జలాన్ని పుట్టించుకునే అవకాశం మనకు ఉండింది. కృష్ణా డెల్టా ఆధునీకరణ ద్వారా 29 టిఎంసిల నికర జలాన్ని ఆదా చేసుకున్నామనీ, కెసి కెనాల్ ఆధునీకరణ ద్వారా 8 టిఎంసిల నికర జలాన్ని ఆదా చేసుకున్నామనీ చెప్పి, మన రాష్ట్రానికి లభ్యమవుతుందని బచావత్ అవార్డు గుర్తించిన 11 టిఎంసిల 'పునరుత్పత్తి జలాన్ని' దీనికి చేర్చి 48 టిఎంసిల నికర జలాలను అదనంగా మనకిచ్చిన కేటాయింపు నుండే మనం పొందాము. అందులో 19 టిఎంసిలు కర్నూలు (కొంత మేరకు కడప) జిల్లాలలో దుర్భిక్ష ప్రాంతాలకు నీళ్లిచ్చే శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టుకూ, 20 టిఎంసిలు మహబూబ్‌నగర్ జిల్లాలోని కరువు ప్రాంతాలకు నీళ్లిచ్చే భీమా ప్రాజెక్టుకూ కేటాయించి ఆ రెండు ప్రాజెక్టులకూ ఆమోదం పొందాము. పనిలో పనిగా మిగిలిన 9 టిఎంసిలు పులిచింతలకు కేటాయించడం జరిగింది.

ఆ కేటాయింపు సబబా? శ్రీశైలం కుడిగట్టు కాలవతోనూ భీమా ప్రాజెక్టు తోనూ రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాల కరువు తీరిపోదు. ప్రభుత్వాలే గుర్తించి నికర జలాల కేటాయింపు లేకపోయినా పదే పదే పునాది రాళ్లు వేసిన 'పెండింగ్' ప్రాజెక్టులు ఇంకా దండిగా ఉన్నాయి. ఆర్భాటంగా కట్టేసి నీళ్లొచ్చేదీ లేనిదీ తెలియకుండ ఉన్న ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ ఉంది. (దానికి తోకగా ఒక వరద కాలవ కూడ ఉంది – వరద కాలవకు వరద కాలవ ఉండడం ప్రపంచంలోనే ఇది తొలి ఉదాహరణ కావచ్చు). ఊసెత్తడమే మానేసిన శ్రీశైలం ఎడమగట్టు కాలవ ఉంది. తెలుగుదేశం పాలనలో జీవో జారీచేసి మహబూబ్‌నగర్ వాసులను ఊరిస్తున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది. అదే జిల్లాలో ఈ మధ్యనే హామీని పునరుద్ధాటించిన నెట్టెం పాడు ఉంది. తెలుగుదేశం హయాంలో కర్నూలు, అనంతపురం జిల్లాలలో మూడుసార్లు పునాదిరాళ్లు వేసి కాంగ్రెస్ హయాంలో జీవో పొందిన హంద్రీ–నీవా ఉంది. అనంతపురం జిల్లావాసులు ఎప్పటి నుండో అడుగుతూ



తెలుగుదేశం హయాంలో జీవో సాధించిన పిఎబిఆర్ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అటక నుండి తీసి దుమ్ముదులిపి ఇంకొక్కసారి హామీయిచ్చిన గండికోట, వెలుగొండ ప్రాజెక్టులున్నాయి. వీటిలో ఏ ఒక్క దానికి ఆ 9 టిఎంసిలు కేటాయించినా 90 వేల ఎకరాల మేరకు సస్యశ్యామలమవుతుంది. ఈ 'పెండింగ్' ప్రాజెక్టులన్నీ కరువు ప్రాంతాల ప్రాజెక్టులే కాబట్టి ఆ కేటాయింపు ఆ మేరకు ప్రజల జీవన్మరణ సమస్యను పరిష్కరిస్తుంది. అటువంటిది ఆ నీటిని కృష్ణా డెల్టా స్థిరీకరణకు కేటాయించడం ఏం న్యాయం?

అయితే నికర జలం కేటాయింపు వెనక్కి తీసుకున్నట్టయితే పులిచింతల కట్టేసుకోవచ్చునంటున్నామా? అనడం లేదు.

పులిచింతలను స్థిరీకరణ ప్రాజెక్టు అనడమే ఒకరకంగా పొరబాటు. ఒక ప్రాజెక్టు ఆయకట్టుకు రావలసిన నీళ్లు పూర్తిగా రాకపోయినా, సరైన సమయంలో రాక పోయినా దానికోసం చేసే ప్రత్యామ్నాయ ఏర్పాటును ఆయకట్టు స్థిరీకరణ అంటాం. పులిచింతల పైకి చూడగా అటువంటి ఏర్పాటుగానే కనిపిస్తుందిగానీ అది నిజమేనా? కృష్ణా డెల్టా ఆయకట్టుదారులు కొన్ని చారిత్రక – రాజకీయ కారణాల వల్ల ఒకరకమైన నీటివాడకానికి అలవాటుపడ్డారు. చాలాకాలం ఎగువ భాగాన చెప్పుకోదగ్గ ప్రాజెక్టులేవీ లేవు. ఆ తరువాత కర్ణాటకకు బచావత్ అవార్డు ద్వారా హక్కులు పుట్టినా వాడుకోవడంలో చాలా తాత్సారం చేసింది. తెలంగాణ, రాయలసీమ వాసులకు అడిగే హక్కే లేకుండ పోయింది. అందువల్ల తమ కేటాయింపు మించి నీరు పొందడం, అదికూడా వర్షాకాలం తొలిదినాలలోనే పొందడం కృష్ణా డెల్టావాసులకు సాధ్యం అయింది. బచావత్ అవార్డులో కేటాయింపు ఖరీఫ్‌కు మాత్రమే ఉండగా, అంతకంతా రబీ కూడా పండించుకోసాగారు.

ఇప్పుడు ఎగువ ప్రాంతం వారు తమ హక్కుల గురించి స్పృహ పెంచుకునేసరికి ఉద్దరకు వస్తున్న నీళ్లు తగ్గిపోవడమే కాక, తమకు అలవాటయిన సమయా నికి ("సకాలంలో") నీళ్లు రావడం కూడా సమస్యాత్మకం అయింది. దీనికి వారు ఎవరినీ నిందించలేరు. కృష్ణా డెల్టాకు కేటాయించినది 181 టిఎంసిలు. అందులో ఆధునీకరణ ద్వారా 29 ఆదా అయ్యాయని అంటున్నారు కాబట్టి 152 టిఎంసిల నీరు వారి హక్కు. అది ఎప్పుడు లభిస్తుందనే విషయంలో నదికి 'టెయిల్ ఎండ్'లో ఉండేవారికి ఇతరులను నిందించే హక్కు ఎక్కడిది?

అనివార్యమైన ఈ మార్పుకు అలవాటుపడడానికి, పంటలలో మార్పులు చేసుకోవడానికి వారికి కొంత సమయం పడుతుంది, నిజమే. అయితే అలవాటయి పోయిందని దాన్ని శాశ్వతంగా భావించి 'స్థిరీకరించాల'నుకోవడం ఎంతవరకు సబబు?

దీనికోసం ఇప్పుడు పులిచింతల కట్టేసుకుంటే, దానిలోకి 45 టిఎంసిల నీరు చేరేమేరకు సాగర్ నుండి దిగువకు నీళ్లు పోవాలన్నది ఒక 'హక్కు' అయి కూర్చుం టుంది. నిజానికి ఆ 'హక్కు' కోసమే కదా పులిచింతల కట్టుకుంటున్నది! రేపు కొత్త కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందుకు ప్రభుత్వం పోయి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుండి హంద్రీ–నీవా దాకా కరువు ప్రాంతాల ప్రాజెక్టులకు నీటి కేటాయింపు ఏదో ఒక రకంగా సాధించినా, ఆ కేటాయింపులకు పులిచింతల పోటీ అవు తుంది, ఈ 'హక్కు' వాటికి అవరోధం అవుతుంది. ఎందుకంటే సాగర్‌కూ పులిచింతలకూ మధ్య 45 టిఎంసిలు నదిలోకి వచ్చి చేరుతాయనడం కల్ల. అందులో ఎక్కువ భాగం పైనుండే రావలసి ఉంటుంది.

అందువల్లనే ఇప్పుడు ప్రతిపాదించిన చోట కాకుండా దిగువన కట్టుకొని సాగర్‌కు దిగువన కృష్ణానదిలోకి చేరే నీటితో పులిచింతలను నింపుకొమ్మని విమర్శకులు అంటున్నారు. కృష్ణా డెల్టా అవసరాలకు కావలసిన నీరు (అంటే 152 టిఎంసిలు) సాగర్‌కు దిగువనే సగటు సంవత్సరాలలో లభిస్తుందని నిపుణుల అంచనా. ఏ సంవత్సరమైనా అది తక్కువయితే చేయగలిగిందీ లేదు, సాగర్ కట్టమీదుగా అంతకంటె ఎక్కువ పొర్లివస్తే ఆపగలవారూ లేరు. అటువంటి అదనపు నీటిని ఆపుకోవడానికి బెజవాడకు ఎగువన ఇంకొక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టుకుంటామన్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఇప్పుడు ప్రతిపాదించిన చోట కాక ఇంకా దిగువన కడితే ముంపు ఎక్కువ ఉంటుందనీ, 46 గ్రామాలు, 60 వేల ఎకరాల భూమి మునుగుతాయనీ పొన్నాల లక్ష్మయ్యగారు అంటున్నారు.

అట్లాగయితే ప్రాజెక్టు కట్టనేవద్దు మరి.

1 నవంబరు, 2004

నల్లగొండ జిల్లా



# సౌజన్యకు మద్దతివ్వండి! శీనును నిలదీయండి!

కరపత్రం

సౌజన్య అనే మహిళ తన భర్తపై మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిన వార్త ఇటీవల పత్రికల్లో వచ్చింది. తన భర్త, అతని బంధువులు తనను నిరంతరం వేధిస్తున్నారని, భర్త రెండవ పెళ్ళి చేసుకొని తనను పట్టించుకోవడం లేదని కేసు సారాంశం. పోలీసులు భర్తను అరెస్టు చేశారు. ఇంతటితో సౌజన్యకు న్యాయం జరిగినట్లేనా? ఈ ప్రశ్నకు సమాధానం దొరకడం సులభం కాదు. చట్టం, పోలీసులు, సమాజం, సమాజంలోని పెద్దమనుషులు చూపిన, చూపుతున్న వివక్ష కారణంగానే సమాజంలో ఎందరో యువతులు ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు హత్యలకు గురవుతున్నారు. చాలా తక్కువ మంది మాత్రమే పరిమితంగానైనా న్యాయం కోసం పోరాడటానికి సిద్ధమౌతున్నారు. మరి ఇలా సిద్ధపడే వాళ్ళంతా సంసారాన్ని సర్దుకోవడం చేతకానివారా? అలా సర్దుకోవడం ఇష్టంలేనివారా? కావాలని బంగారం (పంజరం) లాంటి సంసారాన్ని చేజేతులా నాశనం చేసుకోవాలనుకొనేవారా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనుకుంటే సౌజన్య నాలుగేళ్ళ దాంపత్య జీవిత అనుభవాల్ని తెలుసుకోవాల్సిందే.

మైదుకూరుకు చెందిన వల్లంకొండు శ్రీనివాసులుతో 2000 సంవత్సరంలో సౌజన్యకు వివాహము అయింది. మైదుకూరులో బాగా స్థితిమంతులైన ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన శీనుతో వివాహానికి సౌజన్య తల్లిదండ్రులు దాదాపు 2 లక్షలపైనే కట్నం ఇచ్చారు. పెళ్లయిన రెండు నెలలు వారి సంసారం సజావుగా సాగింది. మూడోనెల నుంచి శీను అసలు స్వరూపం బయటపడసాగింది. అందం, కులం, చదువు వగైరాల ముసుగుమాటున అతను ఇంతవరకు కాపాడుకుంటూ వస్తున్న అతని నిజరూపం సౌజన్య వద్ద బయట పడసాగింది. దారినపోయే ఆడవాళ్ళను వెకిలిగా కామెంట్ చేస్తూ భార్యతోనో వారి గురించి నీచంగా మాట్లాడటం, తన అందచందాలపై విపరీతమైన ఆత్మవిశ్వాసంతో (ఒక విడుదల కాని సినిమాలో నాలుగైదు లక్షలు తగలేసి నటించడం వల్ల అలాంటి అహంకారం ఏర్పడి ఉండవచ్చు) ఏ ఆడదైనా తన రూపురేఖలుచూసి తన ఒళ్ళో వాలిపోతుందని భార్యతోనే మాట్లాడటం, ఇతరులతో పోలికలు పెట్టి నువ్వు అలా లేవని భార్యను దెప్పిపొవడంతో అతని వేధింపులు మొదలయ్యాయి. భార్యాభర్తల మధ్య రగిలిన మంటను ఎగదోయడానికి అత్తలు, ఆడపడుచులు సిద్ధంగా ఉండనే ఉంటారు. ఆరుగురు ఆడపడుచులు తమ ముద్దుల తమ్ముడైన శ్రీనివాసులును వెనకేసుకొని సూటిపోటి మాటలతో సౌజన్యను మరింతగా వేధించసాగారు. వీటికితోడు కోటీశ్వరుడైన శ్రీనివాసులుకు ఒక అవిటి అన్న ఉన్నాడు. అతను ఆస్తిలో సగభాగస్థుడు కాబట్టి అతని ఆలనా పాలనా చూడాలి. అతని మల మూత్రాలు ఎత్తివేసే దగ్గర నుండి అతని పనులన్నీ రక్తం పంచుకు పుట్టకపోయినా సౌజన్యనే

అతనికి సేవలు చేస్తూ వచ్చింది. అయితే పెత్తనం చేసే మొగుడు, ఆడబిడ్డలు అవిటిబావను సౌజన్య సక్రమంగా చూసుకోవడం లేదని నిందలు వేసి వేధించేవారు. ఆ రకంగా వేధింపులకు వారికి మరొక కారణం (ముఖ్యంగా బయటి వ్యక్తులను నమ్మించే కారణం) దొరికింది. అక్కడి నుంచి రకరకాల సాకులతో సౌజన్యకు భర్త పట్ల విపరీత అనుమానం అని, ఆడబిడ్డలను సరిగా చూసుకోదని, చివరకు సౌజన్య నడవడికే మంచిది కాదని ఆరోపణలు చేస్తూ వచ్చారు. మోజుతీరి పోయిన సౌజన్యను వదిలించుకొనే కుట్రలో భాగంగానే ఒక పద్ధతి ప్రకారం శీను ఈ ప్రచారాన్ని చేస్తూ వచ్చాడు.

ఇలాంటి వేధింపుల మధ్య సౌజన్య కాపురం సంవత్సరకాలం కొనసాగింది. ఈ సంవత్సర కాలంలో ఆలూమగల మధ్య "ప్రేమలు చిగురించకపోయినా" సౌజన్యకు బిడ్డ మాత్రం పుట్టింది. తన మీద ప్రేమతో కాకపోయినా బిడ్డపట్ల మమకారముతోనైనా తనను భర్త ఆదరిస్తాడనుకున్న సౌజన్య ఆశలు అత్యాశలయ్యాయి. శీనుకు భార్య, సంసారం రోజురోజుకు పాతబడిపోసాగింది. కొత్త తిరుగుళ్ళు తిరిగినా తన వరకు, తన సంసారం వరకు బాగా చూసుకుంటే చాలని సగటు ఆడవాళ్ళలాగానే సౌజన్య కూడా భావించింది. అయితే అలా జరుగలేదు. నేరుగా ఇంటికే ఫోన్‌చేసి సౌజన్యను నీచంగా మాట్లాడే స్థాయికి శీను గర్ల్‌ఫ్రెండ్స్ సంబంధాలు చేరుకొన్నాయి. అలాంటి సంఘటనలను నివారించాల్సిన శీను వాటిని మరింతగా ప్రోత్సహించి తన శాడిజాన్ని ప్రదర్శించాడు. భర్తతో వివాహేతర సంబంధమున్న మరో మనిషి ఫోన్‌చేసి సొంత భార్యని బండబూతులు తిట్టే పరిస్థితి కల్పించడంతో సౌజన్య సహనం నశించి మొగునితో మొట్టమొదటిసారిగా గొడవ పెట్టుకుంది. అణిగిమణిగి ఉండకుండా గొడవపెట్టుకోవడాన్ని 'భర్త'శ్రీనివాసులు భరించలేక పోయాడు. విపరీతంగా కొట్టాడు. ఆ సమయంలోనే సౌజన్య ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. దీంతో సౌజన్యను భర్త, ఆడపడుచులు కలిసి పుట్టింటికి తరిమివేశారు.

తల్లిదండ్రులకు ఎంత ప్రేమ ఉన్నా 'సంసారం చెడి' పుట్టిల్లు చేరిన ఆడదాన్ని అవమానంగాను, భారంగాను చూసే ప్రస్తుత సమాజంలో సౌజన్య తల్లిదండ్రులు కూడా సౌజన్యను అలాగే భావించారు. 'ఏదో ఒక విధంగా' సంసారం చేసుకొమ్మని నీతిబోధలు నూరిపోశారు. స్వయంగా వెంట పెట్టుకువెళ్ళి భర్తదగ్గర దిగబెట్టే ప్రయత్నం చేశారు. శీను అందుకు ఒప్పుకోలేదు. అతనిని ఒప్పించేందుకు సౌజన్య తల్లిదండ్రులు తిరగని పెద్దమనిషి లేడు. ఆశ ఉన్న ప్రతిచోటకు తిరిగారు. ఈలోపు శీను ఓ మళయాళి అమ్మాయిని పెళ్ళి చేసుకోవడంతో ఎలాగైనా కూతురి కాపురాన్ని నిలబెట్టాలన్న తల్లిదండ్రుల తపన సగం కూలిపోయింది. చివరిసారిగా సౌజన్య, ఆమె తల్లిదండ్రులు మరో పెద్దమనిషి దగ్గర పంచాయతీ పెట్టారు. ఆ పెద్దమనిషి సౌజన్య సర్దుకుపోవాలని, సౌజన్యతోను, కొత్తగా పెళ్ళి చేసుకున్న మళయాళి అమ్మాయితోనూ వేరువేరు ఇళ్ళలో శీను కాపురం చేసేలా పంచాయతీ చేశాడు. ఎప్పటికైనా భర్తలో మార్పు వస్తుందన్న ఆశతోనో, భార్యగా తన స్థానాన్ని కాపాడుకోవాలన్న తపనతోనో, కూతురి భవిష్యత్తుపై భయంతోనో... కారణాలు ఏమైనా ఆ పంచాయతీకి సౌజన్య అంగీకరించింది.

డబ్బు, కులం, చదువుల ద్వారా సంక్రమించిన హోదాతో తన అవలక్షణాలను కప్పిపుచ్చుకొనే ప్రయత్నం సునాయాసంగా శీను చేయగలిగాడు. ఈ కారణంగానే ఇన్ని పంచాయతీలలోనూ ఏ పెద్దమనిషి శీనును పెద్దగా తప్పుపట్టింది ఏమీలేదు. పైపెచ్చు ప్రతి పెద్దమనిషీ సర్దుకుపోవాలని సౌజన్యకే సలహాలు ఇచ్చారు. న్యాయం కోసం సౌజన్య పోలీసులను ఆశ్రయించింది. భర్త వేధింపులపై సౌజన్య స్వయంగా ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఆమెకు న్యాయం చేకూరలేదు.



అప్పట్లో ఇలాంటి సమస్యలను 'చిటికెలో పరిష్కరించే' అధికారిగా (ఎస్పీ మాటల్లో చెప్పాలంటే 'స్పెషలిస్ట్') అయిన ఎఎస్పీ నరసింగరావుకు ఈ కేసు అప్పజెపుతానన్న ఎస్పీ హామీ ఎందుకోగాని అమలు కాలేదు. మనుషుల సంగతి అలావుంచి చివరకు 'దేవుడు' కూడా శీనుహోదాకు తలొగ్గిన సంఘటన జరిగింది.

దసరా ఉత్సవాలప్పుడు కేవలం ఆర్యవైశ్యుల ఇంటివద్ద మాత్రమే అమ్మవారి 'బిందెసేవ' అనే సాంప్రదాయము ఉంది. ఈ ఆచారాన్ని సమర్థించడం మా ఉద్దేశ్యం కాదు కానీ, జరిగిన సంఘటనను పేర్కొనడం ఇక్కడ అవసరం. దసరా ఉత్సవాల నాటికి కేరళ అమ్మాయితో శీను కాపురం ఉంటున్నాడు. ఆర్యవైశ్యుల ఇళ్ళ వద్దకు తప్ప ఇతరుల ఇళ్ళ వద్దకు వెళ్ళకూడని బిందెసేవ ఆరోజు మాత్రం కేరళ అమ్మాయితో శీను కాపురం ఉంటున్న ఇంటివద్దకే నేరుగా వెళ్ళింది. సమాజం, పోలీసులు, పెద్దమనుషులు, కులపెద్దలు, చివరికి దేవుడు కూడా 'ఈ అష్టావక్ర అందగాడి' చుట్టూనే ఎలా తిరుగుతూ వచ్చారో తెల్పడం కోసమే ఈ ఉదాహరణలు చెప్పాల్సి వచ్చింది. తన కాపురాన్ని నిలబెట్టుకోవడానికి అన్నిరకాలుగా రాజీపడిన సౌజన్యకు చివరికి అంతటా నిరాదరణే ఎదురైంది. భర్త వేరుకాపురం పెట్టినా సర్దుకుపోవడానికి సిద్ధపడ్డ సౌజన్యకు ఆ తర్వాత కూడా భర్త, ఆడపడుచుల నుంచి నిరాదరణే ఎదురైంది. తనను పట్టించుకోకపోయినా ఫర్వాలేదు కనీసం కూతుర్ని స్కూలులో చేర్పించమని అడిగినందుకు భర్త దాడిచేసి కొట్టడంతో ఆమె పోలీసు కేసుపెట్టాల్సి వచ్చింది. సౌజన్య తన భర్తపై కేసుపెట్టడం వెనుక ఇంతటి నేపథ్యం ఉంది.

సౌజన్య పెట్టిన కేసు ఏమౌతుంది? కోర్టులో నిందితుడికి శిక్షపడుతుందా? కేసు వత్తిడితో శీను రాజీకి వస్తాడా? శీను తరఫున పెద్దమనుషులు పంచాయితీలు ఎలా చేస్తారు? సౌజన్యకు ఎలాగో అలా నచ్చజెప్పి కేసు ఉపసంహరించుకునేలా చేస్తారా? సౌజన్యను ఇప్పుడుంటున్న ఇంట్లోనే ఉండనిస్తారా? లేక కేసు పెట్టిన కక్షతో ఆమెను ఇంటి నుంచి వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తారా? ఇత్యాది ప్రశ్నలకు సమాధానాలు ముందు ముందు చూడాల్సి ఉంది.

రోజురోజుకు సమాజంలో పెరుగుతున్న 'నాగరికత' చాటున ఎన్ని కుటుంబాల్లో ఎంత మంది సౌజన్యలు ప్రపంచానికి తెలియకుండానే ఇలా మౌనంగా వేధింపులు ఎదుర్కుంటున్నారో? భర్త కుటుంబంలో, పుట్టింట్లో, సమాజంలో, పోలీసుల వద్ద, చివరకు దేవుడి సమక్షంలో కూడా ఎంతమంది సౌజన్యలు 'కుటుంబ హింసలో' సమిధలౌతున్నారో ఆలోచించండి. సమాజంలో అడుగడుగునా స్త్రీల పట్ల వివక్ష ఏ స్థాయిలో వుందో తెలుసుకోవడానికి సౌజన్య ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే. కులం, డబ్బు, చదువు, హోదా మాటున పెద్దమనుషులుగా చలామణి అవుతున్న 'అష్టావక్ర అందగాళ్ళని' మొత్తం సమాజం అసహ్యించుకుంటే తప్ప సౌజన్య లాంటి వారికి న్యాయం జరగదనే అనుకుంటు న్నాం. కేసులు, కోర్టులు, చట్టాల కన్నా సమాజంలో శీనులాంటి వ్యక్తుల పట్ల వ్యక్తమయ్యే 'అసహ్యమే' సౌజన్య లాంటి వారిని వేధింపుల నుంచి కాపాడగలుగుతుంది. శీను లాంటి వారిని సమాజం మొత్తం అసహ్యించుకోవడం, నిలదీయడం ద్వారానే నాగరికత మాటున కుటుంబాల్లో స్త్రీలపై జరుగుతున్న హింసను అడ్డుకోగలం. తద్వారానే మానవీయ సంబంధాలు గల సమాజాన్ని మనం నిర్మించుకోగలం.

03.12.2004, కడప జిల్లా

# జైళ్ళలో ఉన్న పౌరుల గురించి ఆలోచిద్దాం

**గ**త మూడు నెలలుగా రాష్ట్రంలోని జైళ్ళలో ఖైదీల హక్కులకు భంగం కలుగుతున్నట్లు తరచూ వార్తలు వస్తున్నాయి. గత ఆగస్టు నెలలో విశాఖపట్నం జైలు అధికారుల అవినీతిని ప్రశ్నించినందుకు తనను చిత్రహింసలు పెట్టారని, తాను ఆత్మహత్యాయత్నం చేశానని నాగార్జునరెడ్డి అనే విచారణలో ఉన్న ఖైదీ దొంగచాటుగా పత్రికలకు సమాచారాన్ని చేరవేశాడు. అక్టోబర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జైలులో దాసర్ల రాములు అనే 20 ఏళ్ళ ఖైదీ సరియైన వైద్యం అందక విడుదలవాల్సిన రోజే మరణించాడు. నవంబరు 18న వరంగల్ సెంట్రల్ జైలులో ముగ్గురు ఖైదీలు, రెండు రోజుల తర్వాత మరో ఖైదీ ఆత్మహత్యలకు ప్రయత్నించారు.

పైన పేర్కొన్న సంఘటనలలో జైళ్ళలోని దుర్భర జీవన పరిస్థితులను భరించలేకే ఖైదీలు ఆత్మ హత్యకు యత్నిస్తున్నారు. ఈ సంఘటనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నట్టు, ఆత్మహత్యలకు ప్రయత్నించిన వారు కరడుగట్టిన నేరస్తులని ప్రకటించాడు వరంగల్ జైలు అధికారి. కరడుగట్టిన నేరస్తులను కూడా ఆత్మహత్యలకు పురికొల్పే స్థాయిలో జైళ్ళలో హింస, అమానవీయమైన జీవన పరిస్థితులున్నాయా అని సమాజం ప్రశ్నించాలి. ఆంధ్రప్రదేశ్‌లోని జైళ్ళు ఆసియాలోనే ఉత్తమమైన వని ప్రకటించే జైళ్ళ విభాగం, జైళ్ళలో ఆత్మహత్యలు సహజమేనని అంటే మనమేమనుకోవాలి? ఉడికీ ఉడకని అన్నం, నీళ్ళలాంటి సాంబారు, పుచ్చిన కూరగాయలతో కూరలు రోజూ ఇస్తున్నారని, దీనికి అధికారుల అవినీతే కారణమని, తమ ప్రాణాలకు హామీ ఇస్తే ఇంకా ఎక్కువ వివరాలు ఇస్తానని కాళ్ళమీద పడిన ఖైదీలతో విచారించి నిజమని తేలితే అధికారులను శిక్షిస్తామని ప్రకటించ డానికి బదులు మీరు మారాలని హితబోధ చేసిన మంత్రులను చూస్తే ఏమనిపిస్తుంది?

హైకోర్టు వరంగల్ జిల్లా న్యాయమూర్తిని నివేదిక అడిగింది కాబట్టి ఆయన నివేదిక ఇస్తారు. ప్రభుత్వం యధావిధిగా దోషులపై "కఠిన చర్య"లంటూ హూంకరిస్తుంది. చివరకు మొక్కుబడి కోసం కొందరు చిరుద్యోగులపై శాఖాపరమైన చర్య తీసుకుంటుంది. జైలు సంస్కరణ గురించి మరోమారు ఊదర మొదలౌతుంది. కానీ యధావిధిగా ఏమీ జరగదు. నాలుగు రోజుల తర్వాత ప్రజలు, పత్రికలు అన్నీ మరచిపోతారు.

మేము ఇంత నిరాశగా ఎందుకు మాట్లాడవలసి వస్తోంది?

సరిగ్గా ఐదు సంవత్సరాల ముందు జైళ్ళు అవినీతిమయమైపోయాయని, ఖైదీల కడుపుకొట్టి అధికారులు జేబులు నింపుకుంటున్నారని రాష్ట్రంలో మొదటిసారిగా ఆరు కేంద్ర కారాగారాలపై అవినీతి నిరోధక శాఖ దాడిచేసింది. ఆహార పదార్థాల, మందుల కొనుగోలులో లెక్కలేనంత అవినీతి జరుగుతున్నదని, పలుకుబడి కల్గిన ఖైదీలకు లంచాలు మరిగిన అధికారులు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నారని, వారిపై చర్యలు తప్పవని ప్రభుత్వం ప్రకటించింది. రాజకీయ పక్షాలకు చెందిన



కాంట్రాక్టర్లు నాసిరకం ఆహార పదార్థాలను జైళ్ళకు సరఫరా చేస్తున్నారని ఆనాడు పత్రికలు దుమ్మెత్తిపోశాయి. కాని ఆ తర్వాతి కాలంలో ఒక్క జైలు అధికారిని కూడా శిక్షించిన దాఖ లాలు లేవు. చట్టబద్ధంగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీలపై హింసకు, అవినీతి లాంటి నేరాలకు పాల్పడి చట్టం నుండి తప్పించుకుంటూ కూడా సంస్కర్తలుగా చెలామణి అవుతున్న వారిపై చర్య తీసుకోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది.

## జైళ్ళలో ఈ పరిస్థితులు ఎందుకున్నాయి?

శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఇంతకంటే మెరుగైన ఆహారము, వైద్యం అవసరం లేదని, వారితో ఇంతకంటే నాగరికంగా ప్రవర్తించాల్సిన అవసరం లేదని అవినీతి అధికారులే కాదు, సమాజంలో చాలామందే నమ్ముతున్నారు. జైలుకు పంపడమే శిక్షగా చూడాలని, జైలులో అదనంగా శిక్షించ కూడదని, మనిషి స్వేచ్ఛ కోల్పోవడమే తీవ్రమైన శిక్షగా భావించాలని దేశంలోని ఉన్నత న్యాయ స్థానాలు, హక్కుల సంఘాలు చాలా కాలంగా వాదిస్తున్నాయి. నిర్బంధం వల్ల కోల్పోయే స్వేచ్ఛ పొందే హక్కు తప్ప, పౌరులకుండే మిగిలిన అన్ని హక్కులకు ఖైదీలు అర్హులేనని కోర్టులు ఇప్పటికి చాలాసార్లు స్పష్టం చేశాయి. అయినా హక్కుల ప్రమాణాలను పాటించి ఖైదీలతో నాగరికంగా వ్యవహరించే రాజకీయ ఉద్దేశం ప్రభుత్వానికి గాని, ఖైదీలను సంస్కరిస్తామని చెప్పుకునేవారు ముందుగా నాగరిక చట్టాలను తాము పాటించాలనే స్పృహ అధికారులకు గాని లేదు.

## ఎందుకీ నిర్లక్ష్యం?

అభివృద్ధికి శాంతి భద్రతలు ముఖ్యమని పదే పదే వల్లించే ప్రభుత్వాలు, శాంతి భద్రతలు కాపాడేందుకు బందీలుగా పెట్టుకున్న వారి గురించి ఎంత పట్టించుకొంటోంది? ప్రభుత్వా నికి జైళ్ళు అస్సలు ప్రాధన్యతారంగం కాదు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఆగమేఘాల మీద చట్టాలను సవరిస్తున్న ప్రభుత్వం వందేళ్ళనాటి జైళ్ళ చట్టాన్ని, మాన్యువల్‌ను ఎందుకు మార్చదు? జైళ్ళలో ఉన్న వారిలో 90 శాతం మంది గ్రామీణ పేదలు, దళితులు, పట్టణ కూలీలు, నిరుద్యోగులు, మైనారిటీలు. వారిలో 80 శాతం మంది నిరక్షరాసులు. ఈ సామాజిక వర్గాలకు సంబంధించిన అత్యవసర రాజకీయ ఎజెండా ప్రభుత్వాల ముందు ఏమీ లేదు. అడపాదడపా జైలుకు వెళ్ళే సంపన్నులు, మధ్యతరగతి వారు జైళ్ళలో ఉన్న అవినీతి ఆసరాతో ఊరట పొందుతారు. ఈ దేశంలో నేరారోపణ ఉన్నా, పలుకుబడి ఉన్నవారు జైలుకెళ్ళాల్సిన అవసరం లేదనే విషయాన్ని జయేంద్రస్వామి అరెస్టు విషయంలో ఆందోళన చేసిన రాజకీయ పక్షాలు, మద్దతు తెలిపిన మధ్యతరగతి స్పష్టంగానే చెప్పాయి.

మరలా వరంగల్ ఘటనకు వస్తే, హైకోర్టు అడగకపోయినా, తనకు తానుగా జైలుకు వెళ్ళి ఖైదీల సంక్షేమం పట్టించుకోవాల్సిన బాధ్యత జిల్లా న్యాయమూర్తిది. న్యాయస్థానాల తీర్పు మూలం గానే నేరస్తులు బంధించబడతారని, కాబట్టి వారి సంక్షేమాన్ని పట్టించుకునే ప్రాథమిక కర్తవ్యం స్వతహాగానే న్యాయమూర్తులదని సుప్రీంకోర్టు ఇప్పటికి పాతిక ఏళ్ళ నుండి అంటూనే ఉంది. అయినా ఆ స్పృహను న్యాయమూర్తులు ప్రదర్శిస్తున్న దాఖలా లేదు. ప్రభుత్వం నియ మించిన పెద్ద మనుషులు మొక్కుబడిగా జైళ్ళకు వెళ్ళి, అధికారులు చెప్పింది విని, ఖైదీల సంక్షేమం పట్టించుకోకుండా తమ బాధ్యతలను విస్మరిస్తున్నారు. ఈ

పరిస్థితి మారాలి. సమాజం జైళ్ళ గురించి పట్టించుకోవాలి. వాటిని బాధ్యతాయుతంగా ప్రవర్తించేట్టు చేయాలి. తద్వారా ఖైదీల హక్కులకు గుర్తింపు, రక్షణ కల్పించాలి. ఈ విషయాల గురించి చర్చించుకోవడానికి మానవహక్కుల దినమైన డిసెంబరు 10, సముచితమైన దినంగా భావించి మానవ హక్కుల వేదిక ఈ సమావేశం నిర్వహిస్తున్నది.

10.12.2004

హైదరాబాద్





# ప్రాణాలు పోయేదాకా ఈ 'ట్రాలీ'ల నాపరా?

(కలెక్టర్ గారికి మానవహక్కుల వేదిక సమర్పించిన 'విజ్ఞాపన పత్రం' ఇది. ఈ విజ్ఞాపనను ప్రజల అభీష్టంగా గౌరవించి ఊర్లో 'గ్రానైట్ ట్రాలీల'ను తిరగకుండా చేస్తే సరి, లేదా సంబంధిత శాఖాధికారుల మీద 'ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం' క్రింద హైకోర్టులో 'రిట్' వేసే బాధ్యతను కూడా మానవహక్కుల వేదిక స్వీకరిస్తుందని తెలియజేస్తున్నాం)

గౌరవనీయులైన ప్రకాశం జిల్లా కలెక్టర్ గారికి...

మానవహక్కుల వేదిక విజ్ఞప్తి!

ఇది గ్రానైటు ట్రాలీల గురించి. నిన్నటికి నిన్న ఒంగోలు లోని రత్నమహల్ సినిమా హాలుకు దగ్గరగా ట్రాలీ నుంచి గ్రానైటు రాయి పడబోయి ఆగిపోయింది. పాల కేంద్రం దగ్గరైతే క్రింద పడిపోవడం కూడా జరిగిపోయింది. అంతకు నాలుగు రోజుల క్రితం స్టేట్ బ్యాంకు దగ్గర ట్రాలీ విరిగి మరీ రాయి క్రిందపడింది. అంతకు కొద్ది వారాల క్రితం సంతపేట సందులో ఇంకో రాయిపడి, ఒక ఇంటికి చెందిన గోడ కూడా కూలిపోయింది. అంతకు కొన్ని నెలల క్రితం బందరు రోడ్డులోని టూ-టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా పడింది. ఇలా దాదాపుగా ఈ ట్రాలీలు ప్రయా ణించే ప్రతీ దారిలోనూ ఈ రాళ్ళ వర్షం కురుస్తూనే ఉంది.

ఏడు జతల చక్రాలతో, ఏడు మీటర్ల పొడుగుతో తన బరువుకి మించిన కొండల వంటి రాళ్ళను మోసుకుంటూ 'జురాసిక్ పార్కు'లోని 'డైనోసరస్'లాగా ఈ గ్రానైట్ ట్రాలీలు రహదారుల వెంట వస్తూ ఉంటే, చూపరులకు గుండెలు ఝల్లుమంటున్నాయి. 'ఆ ట్రాలీల క్రిందనో, ఆ రాళ్ళ క్రిందనో మనం పడితే? లేదా స్కూళ్ళకు వెళ్ళిన మన పిల్లలు పడితే?' అనే ఊహల్తో ప్రజలు బిక్కచచ్చిపోతున్నారు. అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం విచారకరం.

మునిసిపల్ హైస్కూలు సందులో ప్రస్తుతానికి ఈ వాహనాలను అనుమతించారు. కాని ఈ దారిలో కూడా చాలా నివాస గృహాలున్నాయి. స్కూలు ఉంది. హాస్టలు ఉంది. ట్రాలీని తిప్పాలన్నా, నడపాలన్నా చాలా కష్టంగా ఉంటుంది. ఆ రోడ్డు రోడ్డంతా భయంకరంగా ధ్వంసమైపోయింది. వాహనాల క్రింద స్కూలు పిల్లలో, తమ పిల్లలో పడతారనే

భయంతో అక్కడి నివాసితులు హడలి ఛస్తున్నారు. ఆ రోడ్లలో ఈ ట్రాలీలు ప్రయాణించేప్పుడు ఇళ్ళన్నీ దద్దరిల్లిపోతున్నాయి.

సంతపేట వీధుల్లోని వాళ్ళు తమ తమ రోడ్లకు పట్టిన దుస్థితినీ, ట్రాలీల వల్ల ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్న వైనాన్నీ మీకు వివరిస్తూ ఫిర్యాదులు చేసుకున్నారు. ఉత్తర దక్షిణ బైపాస్‌ల గుండా ఈ ట్రాలీలు ఊర్లోకి వచ్చినప్పుడు వీటివల్ల ప్రజల్లో కలుగుతున్న భయాందోళనల గురించి పత్రికలు వార్తలు రాశాయి. ధ్వంసమైన రోడ్లనూ, క్రింద పడ్డ రాళ్ళనూ ఫోటోలు తీసి మరీ ప్రచురించాయి. అయినా ఇంతవరకూ ఎటువంటి ఫలితమూ లేదు.

ఎవరికైనా తమదాకా వస్తేగానీ ఆ బాధ తెలీదు. దక్షిణ బైపాస్ నుంచి ఊర్లోకి వచ్చే ఈ ట్రాలీలు రత్నమహల్ ఎదురు బజారు నుంచి 'లోడింగ్ పాయింట్'కి వెళ్ళవచ్చు. కానీ ఆ బజారులో ఒంగోలు పార్లమెంటు సభ్యుని ఇల్లు ఉంది. అందుకని ఆ రోడ్లని బ్లాక్ చేశారు.

పోనీ చర్చి సెంటర్ నుంచి 'రైల్వే లోడింగ్ పాయింట్'కి చేరవచ్చు. ఈ రోడ్డు విశాలంగా ఉండి ట్రాలీ తిప్పడానికి అనువుగా కూడా ఉంటుంది. కానీ ఇటూ నిషేధించారు. ఎందుకని? ఈ రోడ్డులో కలెక్టర్ గారి బంగ్లా ఉంటుంది. కాబట్టి ఈ వాహనాలు అటు ప్రయాణించవు. ఇది పౌరుల పట్ల, వారి ప్రాణాల పట్ల, వారి సౌకర్యాల పట్ల ప్రభుత్వ అధికారులకు ఉన్న 'చిన్న చూపు'ను తెలియ జేస్తుంది. ఒక ఆర్గ్యుమెంటు కోసం 'ఈ బజార్లలో తిప్పవచ్చు కదా?' అని అంటున్నాం గానీ, నిజానికి మునిసిపల్ పరిధిలో ఎక్కడా కూడా వీటిని అనుమతించకూడదు.

జనవరి 7న మీరు ఒంగోలు ఎంపీతోనూ, మునిసిపల్, రైల్వే వార్లతోనూ, గ్రానైటు యాజమాన్యంతోనూ చర్చలు జరిపారే తప్ప, ఆ చర్చల్లోకి మీకు ఫిర్యాదు చేసిన వారిని ఆహ్వానించలేదు. ప్రజా అభిప్రాయాన్ని మీరు తీసుకోలేదు.

'మీ ట్రాలీల వల్ల రోడ్లన్నీ పాడైపోయాయి. కాబట్టి, వాటి పునర్నిర్మాణ ఖర్చును మీరే భరించాలి' అంటూ గ్రానైటు యజమానులకూ వాహన యజమానులకూ సూచించారు. అంతవరకూ బాగానే ఉందిగానీ, దానివల్ల వారికి కలిగే నష్టం ఏమీ ఉండదు. హాయిగా రోడ్లేసుకొని మళ్ళీ యథా ప్రకారం వాహనాలను అట్లే తిప్పుకుంటారు. దీనివల్ల ప్రజలకు కలిగే ఉపయోగం ఏమీలేదు.

'స్థల సేకరణ చేసి లోడింగ్ పాయింట్‌ని మారుస్తాము' అని ఆ చర్చల్లో ఇంకో సూచన చేశారు మీరు! ఇది కూడా బాగానే ఉంది. కానీ, ఇది ఎప్పటికి జరిగేను? 'ప్రభుత్వ నిర్ణ యాలూ, శాఖల మధ్య సమన్వయమూ, వాటి అమలూ' అనే వాటి గురించి మేము ప్రత్యేకంగా మీకు చెప్పనవసరం లేదనుకుంటాము.

మరి అప్పటిదాకా పరిస్థితి ఏంటి? 'ఒళ్ళు దగ్గర పెట్టుకుని, జాగ్రత్తగా రాళ్ళు క్రింద పడకుండా, రోడ్లు పాడవకుండా ట్రాలీలు నడపండి!' అని ఇంకో సూచన ఇచ్చారు మీరు. మీరు చెప్పి మూడు వారాలు కాకముందే మూడు రాళ్ళు పడ్డాయి. అంటే దీన్నిబట్టి ఊర్లోనే తిరగనిస్తూ ఎన్ని సూచన లిచ్చినా అవి నిష్ప్రయోజనమని తేలిపోయింది.

కాబట్టి ఆదాయాల కోసం పరుగులుతీసే వ్యాపారులతోనూ, ఆ వ్యాపారుల దగ్గర ఎన్నికల విరాళాల కోసం అర్రులు చాచే రాజకీయ నాయకులతోనూ, అవినీతి తప్ప ప్రజల బాగోగులు పట్టని అధికారులతోనూ మీరు చేసిన చర్చల వల్ల ఉపయోగమూ లేదు, పరిష్కారమూ లేదు.



నియమాలకు భిన్నంగా ఆ ట్రాలీలను ఊరి మధ్య దారుల్లో ఇంతకాలం తిప్పనీయడమే పెద్ద తప్పు. పైగా 'రోడ్లు వేసుకుని మళ్ళీ తిప్పుకోండి' అని ఇంకో అవకాశం ఇవ్వడం మరో తప్పు. సమస్యను 'లోడింగ్ పాయింట్ మార్చేవరకూ' వాయిదా వేయడం ఆఖరి తప్పు.

ప్రాణాంతకంగా పరిణమించిన ఈ సమస్యపైన 'మానవ హక్కుల వేదిక' ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. ప్రజలందరూ దీనికి ఒకే ఒక్క పరిష్కారం చెబుతున్నారు. అది ఏమిటంటే ఈ ట్రాలీలు హైవేమీదే నడవాలి. ఊరిలోకి రాకూడదు. హైవే మీదుగా రైల్వే లోడింగ్‌కి చేరేటట్లుగా లోడింగ్ పాయింట్‌ను మార్చాలి. అప్పటిదాకా "గతంలో ఎలా అయితే ఈ గ్రానైట్ రాళ్ళు చీమకుర్తి నుంచి నేరుగా ట్రాలీల ద్వారా మద్రాస్ షిప్‌యార్డుకు చేరాయో ఇప్పుడూ అలాగే చేరాలి!" ఇదీ ప్రజా అభిప్రాయం!

ప్రజల అధికారిగా ప్రజల అభిప్రాయాన్ని మీరు గౌరవించి యుద్ధ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకోవాలని మానవహక్కుల వేదిక డిమాండ్ చేస్తుంది.

ఒంగోలు, ప్రకాశం జిల్లా

కరపత్రం

# చర్చల ప్రక్రియను పునరుద్ధరించాలి ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పాలి

ప్రజలారా,

ప్రభుత్వానికి, నక్సలైట్ పార్టీలకు మధ్య చర్చలు జరిగి కొంతమేరకు అయినా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్రంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఆశించారు. రాష్ట్రంలో శాంతి, ప్రజాస్వామ్యం, మానవహక్కులు పునరుద్ధరింపబడతాయని అందరం అనుకున్నాం. గ్రామాల్లో ప్రజలు భయం లేకుండా తమకు నచ్చిన విధంగా బ్రతికే అవకాశం ఏర్పడాలని కోరుకున్నాం. చర్చల ప్రక్రియ ద్వారా సాయుధ ఘర్షణ స్థానంలో ప్రజా సమస్యలపై రాజకీయ ఘర్షణ ప్రారంభం కావాలని ఆశపడ్డాం. చర్చలు కేవలం ప్రభుత్వానికీ, నక్సలైట్లకూ మధ్య సమస్య కావనీ, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి అని మాట్లాడాం. చర్చలు ఒక ప్రజాస్వామిక ప్రక్రియ అని, సమస్యల పరిష్కారానికి ఒక మార్గం అని ప్రభుత్వానికి, నక్సలైటు పార్టీలకు చెప్పాం. కాని చర్చల ద్వారా ఆశించినవి ఏవీ జరగలేదు. పరిస్థితి మళ్ళీ మొదటికే వచ్చింది. నక్సలైట్ సమస్య సామాజిక ఆర్థిక రాజకీయ సమస్య అని, కేవలం శాంతి భద్రతల సమస్య కాదని అన్న కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ అణచివేత విధానాన్నే అమలు చేస్తున్నది.

మొదటి విడత చర్చల అనంతరం, డిసెంబర్ 16 తర్వాత కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించకపోవడం, పోలీసులు వరుస ఎన్‌కౌంటర్ హత్యలకు పాల్పడటం, అడవుల్లో కూంబింగ్‌లు, గ్రామాలపై దాడులు చేస్తూ సామాన్య ప్రజలను వేధించడం, అరెస్టులు చేయడం మొదలుపెట్టారు. ప్రభుత్వం నక్సలైటు ఉద్యమంపై అప్రకటిత నిషేధాన్ని అమలు చేస్తున్నది. ఈ వైఖరికి నిరసనగానే నక్సలైటు పార్టీలు చర్చల నుండి వైదొలుగు తున్నట్టు ప్రకటించారు. పోలీసు స్టేషన్లపై దాడులు చేస్తున్నారు. బస్సు దహనాలకు మళ్ళీ శ్రీకారం చుట్టారు. పోలీసు సిబ్బందినీ పాలక పార్టీల ప్రతినిధులనూ చంపుతున్నారు. దీనితో చర్చల కాలంలో గ్రామాల్లో నెలకొన్న శాంతియుత వాతావరణం పోయి యుద్ధ వాతావరణం నెలకొంది. చర్చలకు తలుపు తెరిచే ఉంచాం. “చర్చలు వేరు, చర్యలు వేరు” అని ముఖ్యమంత్రి, హోంమంత్రి మాట్లాడుతున్నంత కాలం పరిస్థితిలో మార్పురాదు. చర్చల విఘాతానికి లేదా ప్రతిష్టంభనకు ఎవరు కారణమో వారికే మళ్ళీ చర్చలను పునరుద్ధరిం చాల్సిన బాధ్యత ఉంది.

చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళడానికి, అర్థవంతంగా జరగడానికే గతంలో ముందుగా కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం కుదరడానికి మధ్యవర్తుల సూచనలు, సలహాలను ప్రభుత్వం ఆహ్వానించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలు కావడానికి, ఏదైనా ఉల్లంఘన జరిగితే పర్యవేక్షించడానికి ఒక కమిటీ ఏర్పడింది. మొదటి విడత చర్చలు జరిగే వరకు ఇరుపక్షాలూ కాల్పుల విరమణ పాటించడం (కొన్ని సంఘటనలు మినహా) జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన సందర్భాలలో కూడా పర్యవేక్షణ కమిటీకి క్రియాశీలకంగా వ్యవహరించడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ కమిటీకి స్పష్టమయిన సూచనలు, అధికారాలు ఏమీ ఇవ్వలేదు. సంఘటనలు జరిగినప్పుడు స్వతంత్రంగా విచారించే వెలుసుబాటు లేకుండా ప్రభుత్వమే ఏ సంఘటనలు విచారించాలో నిర్ణయించాల్సి వచ్చింది. ఈ విషయంపై పర్యవేక్షణ కమిటీ తన అసంతృప్తిని, అభ్యంతరాలను తెలియజేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. విప్లవ పార్టీల ప్రతినిధులు కొన్ని ఎన్‌కౌంటర్ హత్యలకు సంబంధించిన సంఘటన లపై విచారణను పర్యవేక్షణ కమిటీకి అప్పజెప్పాలని అడిగినా ప్రభుత్వం స్పందించలేదు. మధ్యవర్తు లను కూడా సమావేశపరిచి చర్చల ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నించలేదు. ఇది కేవలం ప్రభుత్వం చిత్తశుద్ధికి సంబంధించిన విషయం కాదు. దురుద్దేశ్యంతోనే ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మొత్తంగా చర్చల ప్రక్రియను ముందుకు తీసుకుపోవడానికి అవసరమయిన విధి విధానాలు, కమిటీలు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడంలో నక్సలైటు పార్టీలు కూడా స్పష్టత లేక ఉదాసీనంగా వ్యవహరించాయి. ఈ లోపాలు ఉన్నా చర్చల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడం వల్లనే ప్రధానంగా ఈ ప్రతిష్టంభన జరిగింది. చర్చలకు విఘాతం జరిగింది.

మొదటి విడత చర్చల సందర్భంగా ముందుకు వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, విధానాలు కూడా సంతృప్తికరంగా లేవు. భూమి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎంచుకున్న పద్ధతి ఆశించినట్టుగా లేదు. రిపబ్లిక్ డే నాడు ఆర్భాటంగా భూమి పంపిణీ చేపడతామని చెప్పి పేదలు ఎప్పటి నుండో సాగుచేసుకుంటున్న ప్రభుత్వ బంజర్లకు మాత్రమే పట్టాలిచ్చింది. రెండవ విడత చర్చల తేదీలను ప్రకటించకుండా, కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించకుండా ప్రభుత్వం ఆ తర్వాత కూడా చర్చల స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరించింది. కాల్పుల ‘విరమణ ఒప్పందం’ లాంటిది ఏదీ లేదని అబద్ధాలు చెప్పింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో పోలీసు అధికారుల ఒత్తిడితో చర్చల ప్రక్రియను నీరుగార్చి ‘శాంతి’ పేరుతోనే వరుస ఎన్‌కౌంటర్లు ప్రారంభించింది.

గతంలోనూ, ఇప్పుడు కూడా రాజకీయ నిర్ణయంలో భాగంగానే ఎన్‌కౌంటర్లు ఆగిపోవడం జరిగింది. చర్చల సమయంలోనే రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లు ఆగిపోయాయి. గ్రామాల్లో పోలీసుల వేధింపులు ఆగిపోయాయి. కాని మొదటి విడత చర్చల తర్వాత ప్రభుత్వం వైఖరిలో మార్పు వచ్చింది. ఎన్‌కౌంటర్లకు, కూంబింగ్‌లకు లైసెన్స్ ఇచ్చింది. అణచివేతనే పరిష్కారంగా ఎంచుకుంది. నక్సలైట్ పార్టీలు కూడా ప్రతిఘటన పేరుతో సాయుధ చర్యలు విస్తృతం చేశాయి. ఈ పరిస్థితి రాష్ట్రంలో మళ్ళీ శాంతి, ప్రజాస్వామ్యం, మానవహక్కులకు ప్రమాదంగా మారింది.

చర్చలకు సంబంధం లేకుండానే రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామికంగా వ్యవహరించడం ప్రభుత్వ విధి. చట్టబద్ధ పాలనను గౌరవించడం ప్రజాస్వామిక ప్రభుత్వం లక్షణం. రాష్ట్ర డిజిపి ప్రకటనలు, ఎన్‌కౌంటర్ సంఘటనలపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, కూంబింగ్ ఆపరేషన్ అంటే తలదువ్వుకోవడం అని వ్యంగ్యంగా అనడం ప్రజాస్వామ్యవాదులు ఎవ్వరూ

హర్షించరు. ప్రభుత్వం కూడా పరోక్షంగా వీటిని సమర్థిస్తూ ఉంది. ప్రభుత్వం ఒకవైపు చర్చలకు సిద్ధం అంటూనే ఆచరణలో మాత్రం చర్చల ద్వారాలను మూసివేసే విధంగా మావోయిస్టు ప్రతినిధులపై కుట్రకేసులు పెడ్తూ గ్రామాల్లో సామాన్య ప్రజానీకాన్ని వేధిస్తున్నది. ముఖ్యంగా నల్లమలలో చెంచులను నక్సలైట్ల గాలింపు పేరుతో నిర్బంధించడం, గూడాలు ఖాళీ చేయించడం, హెలికాప్టర్లతో చక్కర్లు కొడుతూ పల్లె వాతావరణాన్ని భయభ్రాంతం చేయడం వంటి చర్యలతో రోజు రోజుకూ అణచివేత పద్ధతులను క్రూరంగా అమలుచేస్తూ చంద్రబాబు ప్రభుత్వాన్ని మించి ప్రజా జీవితాలను ఛిద్రం చేయపూనుకుంటున్నది. ఎన్‌కౌంటర్లను ఆపమని, శాంతి ప్రజాస్వామిక వాతావరణం ఏర్పరచండని విజ్ఞప్తులు చేస్తున్నందుకు వరంగల్‌లో ఎపిసిఎల్‌సి కన్వీనర్ వీరన్నను బెదిరించడం, మానవహక్కుల వేదిక నాయకులు డాక్టర్ బుర్రా రాములును గ్రీన్ టైగర్స్ పేరిట చంపుతామనడం మళ్ళీ మొదలైంది. ఈ వైఖరిచాలా ప్రమాదకరం. చర్చలు ఉన్నా లేకపోయినా ప్రభుత్వం, పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలి. ప్రభుత్వం తన రాజకీయ పరిణతి, విజ్ఞత నిరూపించుకోవాలంటే చర్చలను పునరుద్ధరించాలి. ప్రజలు, ప్రజాస్వామికవాదులు ప్రభుత్వంపై మళ్ళీ ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని భావిస్తూ ఈ సదస్సును నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా మేం సంయుక్తంగా ఈ క్రింది డిమాండ్స్‌ను చేస్తున్నాం.

- ఎన్‌కౌంటర్ల హత్యలను వెంటనే నిలిపివేయాలి.
- కూంబింగ్‌లను, గ్రామాల్లో దాడులు, వేధింపులను ఆపివేయాలి.
- ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి రెండవ విడత చర్చలకు తేదీలను ప్రకటించాలి.
- నక్సలైటు పార్టీలు కూడా హత్యలు మానేసి సంయమనం పాటించి చర్చల పునరుద్ధరణకు ప్రయత్నించాలి.
- రెండవ విడత చర్చల్లో నిర్దిష్టంగా విధి విధానాలను, సమస్యలకు సంబంధించి పరిమితమయిన అజెండాను రూపొందించుకోవాలి.
- నక్సలైట్లు బస్సు దహనాలకూ, ప్రజలకు ఇబ్బంది కల్గించే ఇతరత్రా చర్యలకూ స్వస్తిచెప్పాలి.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంతో కలిసి..

14.05.2005

హైదరాబాద్





# హక్కుల్ని నిలుపుకునే కృషికి ఆహ్వానం

(మిర్యాలగూడెం తూడి ఫంక్షన్ హాల్‌లో మే నెల 7, 8 తేదీలలో
మానవహక్కుల వేదిక మొదటి రాష్ట్ర మహాసభలు)

ప్రజలారా!

మానవహక్కుల వేదిక మొదటి రాష్ట్ర మహాసభలకు ఆహ్వానం పలుకుతున్నాం, మీ సహాయ సహకారాలు కోరుతున్నాం.

హక్కుల గురించిన స్పృహ, హక్కులు కావాలన్న ఆరాటం ఇవాళ సమాజంలో చాలా పెరిగాయి. తమకంటూ హక్కులుంటాయన్న ఆలోచన నిన్నటిదాకా లేనివారు కూడా ఈరోజు ఆ ఆలోచన చేస్తున్నారు, అడుక్కోవడం కాక దబాయించి ఇమ్మంటున్నారు.

హక్కుల స్పృహ పెరిగేకొద్దీ హక్కులను అమలు చేయవలసిన యంత్రాంగాలూ, వ్యవస్థలూ తమ కర్తవ్యాన్ని మరింత చురుకుగా నిర్వహిస్తాయని ఆశిస్తాం. కాని సరిగ్గా అందుకు భిన్నంగా, అవి మరింత కఠినంగా, నిర్లక్ష్యంగా, నిర్దయగా తయారవుతున్నాయి. న్యాయస్థానాలలో సహితం హక్కుల పరిభాషకు చోటు తగ్గిపోతున్నది. హక్కులడిగే వారిని అనుమానంగా చూసే వైఖరి పెరుగుతున్నది.

ఒకరు హక్కులు అడుగుతున్నా రంటే వేరొకరు కొంత అధికారాన్నో కొంత సంపదనో అయాచితంగా వచ్చిన కొన్ని అవకాశాలనో కోల్పోతారని అర్థం. వారిలో అసహనమూ ఈ రోజు పెరిగింది. ఫలితంగా హక్కులు అడిగే ప్రజలపైన వారు గుంపులుకట్టి దాడి చేస్తున్నారు, భ్రష్టుపట్టించే దుష్ప్రచారం చేస్తున్నారు, అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని నిర్బంధం ప్రయోగిస్తున్నారు.

ఒకవైపు హక్కుల కోసం కొత్త కొత్త పోరాటాలు ముందుకు రావడం చూస్తు న్నాం. సమాజం మూలల నుండి హక్కులడిగే గొంతులను వింటున్నాం. మేమెవ్వరినీ అడుక్కోవడం లేదు, మనుషులుగా మాకు చెందవలసిందే అడుగుతున్నాం అన్న కోణాన్ని తెలుసుకుంటున్నాం.

ఈ గొంతులు చట్టాలలో సవరణలు కోరుతున్నాయి. ప్రభుత్వ విధానాలలో మార్పు కోసం అడుగుతున్నాయి. పత్రికలలోనూ, దృశ్య మీడియాలోనూ తమకు చోటు ఇవ్వాలని డిమాండ్ చేసి పొందుతున్నాయి. సమాజంలోని ఇతర వర్గాలు, ముఖ్యంగా తమ లేమి నుండి, తమ అణగారినతనం నుండి ప్రయోజనం పొందుతున్న వర్గాలు, తమ కోర్కెలను సావధానంగా వినాలనీ, న్యాయబద్ధంగా స్పందించాలనీ, లేనిపక్షంలో ప్రతిఘటనకు సిద్ధంగా ఉండాలనీ అంటున్నాయి.

మరొకవైపు పాలకుల సంకట స్థితి, రెండు నాల్కల నీతి చూస్తున్నాం. మాటల వరకు

ఎవరినీ దేనినీ కాదనగల స్థితిలో వారు లేరు. ఎవ్వరికీ ఏదీ ఇచ్చే ఉద్దేశ్యంలోనూ లేరు. కాబట్టి అస్పష్టమైన హామీలిచ్చి తాము చేసేది చేసుకుంటూ గట్టిగా అడ్డుతగిలితే పోలీసులను పెట్టి కొట్టిస్తూ సాగించుకుంటున్నారు.

ఆధిపత్యాన్నీ, అవకాశాలనూ అనుభవిస్తున్న వర్గాలు మరింత పచ్చిగా అసహనం ప్రదర్శి స్తున్నారు. వారి ఆధిపత్యం వోట్ల ద్వారా వచ్చేది కాదు కాబట్టి అనునయంగా మాట్లాడవలసిన అవసరం తమకు లేదని వారి ఆలోచన. దూషణ, దాడులు, పోలీసులను మేపి అణచివేత ప్రయోగిం చడం వారి వ్యవహారనీతి అయింది.

ప్రపంచ వ్యాప్తంగా పెత్తనం చలాయిస్తున్న 'సరళీకరణ' తత్వం, భారత సమాజం మీద పట్టుబిగి స్తున్న హిందుత్వ వాదం ఏక సమయంలో ఈ అసహనానికీ, అణచివేత ధోరణికీ కారణమూ, పర్యవసానమూ.

ఈ స్థితిలో హక్కుల ఉద్యమానికి ఒక విశాలమైన కర్తవ్యం ఉందనీ, తనకు తానొక చిన్న పరిధి గీసుకొని అందులో ఉండి పోవడం తగదనీ ప్రకటించి పుట్టింది మానవహక్కుల వేదిక ఏడేళ్ల కింద. ఈ ఏడు సంవత్సరాల కాలంలో దాదాపు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ హక్కుల పరిరక్షణ కోసం కార్యక్రమాలు చేపడుతూ మా మొదటి మహాసభలను మే నెల 7, 8 తేదీలలో మిర్యాల గూడెంలో జరుపుకుంటున్నాము. మేము ఏయే రంగాలలో హక్కుల గొంతును నిలబెట్టడానికి ఏమేం కృషి చేశామో క్లుప్తంగా వివరించి మా మహాసభలకు మీ మద్దతు, సహాయ సహకారాలు కోరుతాము.

మన రాష్ట్రానికి ఈ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 'పేరుతెచ్చిన' విషయాలలో ప్రముఖ మైనది రైతుల ఆత్మహత్యలు. కర్ణాటక, పంజాబు మనతో పోటీపడే ప్రయత్నం కొంత చేస్తున్నప్పటికీ ప్రథమ స్థానం ఆంధ్రప్రదేశ్‌దే. తన ప్రాణం తాను తీసుకోవడానికి ఒక వ్యక్తి నిర్ణయించుకుంటే అందులో హక్కుల సమస్య ఏముంది అనుకోవచ్చు. కానీ ఆ నిర్ణయం వెనుక వ్యవస్థాగతమైన కారణాలున్నాయి. చిన్న కమతాలు ఎక్కువగా ఉండే మనబోటి దేశాలలో మార్కెట్ ఆటుపోట్లనూ, ప్రకృతి వైప రీత్యాలనూ, దశాబ్దాలుగా సాగుతున్న నీటి వనరుల నిర్వహణా వైఫల్యాన్నీ, ముడిసరుకుల కల్తీనీ ఎదుర్కొనడానికి రైతులకు పాలనా యంత్రాంగం అం డగా నిలబడాలనీ, ఇది రైతుల హక్కనీ మేము భావిస్తున్నాం. ఆర్థిక సరళీకరణ పేరుతో కష్టం చేసుకుని బతికే వారి జీవితాన్ని మరింత కష్టతరం చేస్తున్న ప్రభుత్వ విధానాలు ఈ ఆత్మహత్యల వెనక ఉన్నాయని మేము అర్థం చేసు కుంటున్నాం. ఆత్మహత్యల ఘటనలను నిర్దిష్టంగా పరిశీలించి ఈ వాస్తవాన్ని సమాజం ముందు నిలబెట్టడానికి కృషి చేస్తున్నాం. దీనికి విరుగుడుగా ప్రభుత్వం చేపట్టిన చర్యల అసంపూర్ణతను ఎండ గడుతున్నాం.

వక్తలు :

**డా॥ సురేశ్**

(పి.యు.సి.ఎల్, తమిళనాడు)

సునామీ–మానవహక్కులు

**జి.అలోషియస్**

(పరిశోధకుడు, ఢిల్లీ)

అభివృద్ధి విధానాలు – మానవహక్కులు

**సి.కె.జాను**

(ఆదివాసీ హక్కుల కార్యకర్త, కేరళ)

ఆదివాసులు – అభివృద్ధి

**కమల్ మిత్ర చినాయ్**

(పాకిస్తాన్–ఇండియా ప్రజావేదిక)

భారత పాక్ సంబంధాలు – ప్రజాతంత్ర దృక్పథం

అయితే 'వ్యవసాయ సంక్షోభం' కేవలం వ్యవసాయదారులనే కాదు, చేతి వృత్తుల వారినీ, గ్రామీణ కూలిజనాన్నీ కూడా కుదిపేస్తున్నది. రైతులు ఆత్మహత్య చేసుకుంటే, భూమిలేని కూలీలు దూర ప్రాంతాలకు వలసపోయి దిక్కులేని బతుకులు బతుకుతున్నారు, బతకలేక పోతే చస్తున్నారు. వేరే ఏ వృత్తికీ అలవాటు పడలేని నేతకార్మికులు ఆకలికి కృశించి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని కేవలం అభివృద్ధి ఆటుపోట్లుగా చూడాలంటుంది ప్రభు త్వం. కాదు, నిండుగా జీవించే హక్కుకు సంబం ధించిన సమస్యగా చూడాలంటున్నాము మేము. నిరంతర పోషకాహార లోపం వల్ల కృశించి, శక్తిహీనులయి ప్రాణం పోగొట్టుకోవ డాన్ని ఆకలిచావు నిర్వచించాలని డిమాండ్ చేస్తున్నాము. దానికి నివారణ, పరిహారం కూడా ఉండాలని అడుగుతున్నాం.

సాగునీటి గురించి కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో జరుగుతున్న ఘర్షణను 'ప్రాంతాల మధ్య' కొట్లాటగానో, రాజకీయ వాదుల రెచ్చగొట్టే చర్యలగానో కాక హక్కులకు సంబంధిం చిన విషయంగా చూడాలంటున్నాం. జీవితావసరాలలో ఒకటయిన నీరు ప్రకృతి సిద్ధ మయిన వనరు. దానిమీద అందరికీ సమాన హక్కు ఉండాలని అంటున్నాం. సాగునీటి వివాదాలను ఆ కోణం నుండి చూస్తున్నాం, నదీ జలాల అసమాన పంపిణీని ఆ కారణంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం నదీ జలాల ప్రాజెక్టులు చేపట్టే పద్ధతిని ప్రధానంగా ఈ కోణం నుండి చూడాలి తప్ప 'టెండర్ల కుంభకోణా'న్ని ప్రధాన విషయం చేయడంలో అర్థం లేదం టున్నాం.

ఇవి ప్రభుత్వ విధానాలతో, బాహ్యశక్తులు పెట్టే ఒత్తిడితో ముడిపడి ఉన్న విషయాలు కాగా, ఎప్పటినుంచో వస్తున్న అణచివేత కులానికీ జెండర్‌కూ సంబంధించినది. ఈ విష యంలో పెద్ద పెద్ద ఆందోళనలెంత అవసరమో దైనందిన ప్రాతిపదికన బాధితులకు సలహా, సహాయం, అండ అంత అవసరం. అణిచివేతను ఎదుర్కొనడానికి, బెదిరింపులు తట్టుకొన డానికి, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి, పోలీసులు సక్రమంగా నేర పరిశోధన చేసేటట్టు చూడడానికి, 'రాజీపడ'మని ఒత్తిడి పెడితే ధిక్కరించడానికి, తోడుకావాలి. ఆ తోడు ఇవ్వడం హక్కుల ఉద్యమం ముఖ్య కర్తవ్యాలలో ఒకటి. అది నిత్యం అందిస్తున్నాం.

ప్రపంచీకరణ అనేది మనకు సంబంధించినంతవరకు దేశ పాలనా విధానాలను అప్రజాస్వామికంగా, అమానవీయంగా దిగజార్చే ప్రక్రియ కాగా, అంతర్జాతీయంగా అది అమెరికా ఏకచ్ఛత్ర ఆధిపత్యాన్ని నెలకొల్పడానికొక ముసుగు అయింది. దీని దుష్ఫలితాన్ని అతి ఘోరంగా అనుభవించిన ఆఫ్ఘన్, ఇరాక్ ప్రజలకు సంఘీభావంగా కార్యక్రమాలు చేపట్టాము. అమెరికా విదేశాంగ నీతివెనక ఉన్న దౌర్జన్య రాజకీయాలను వివరిస్తూ విస్తృతంగా ప్రచారం జరిపాం.

నక్సలైట్ ఉద్యమంపైన పోలీసు దమనకాండను వ్యతిరేకించడంతో మన రాష్ట్రంలో హక్కుల ఉద్యమం ప్రారంభం అయింది. ఆ దమనకాండ ఇవ్వాల్టికీ కొనసాగుతున్నది. అయితే ఒక్క నక్సలైట్ల మీదనే కాదు, మొత్తంగానే అన్ని ఉద్యమాలపైనా ఆందోళనల పైనా ఏ ఆందోళనలో భాగం కాకున్నా ఏదో ఒక నేరారోపణతో పోలీసుల అదుపులోకి పోయిన ప్రతీ అర్భకుని పైన బలప్రయోగా నికి పాల్పడడం మన రాష్ట్రంలో పోలీసుల వ్యవహార

సంస్కృతి అయింది. దీనికి చట్టమూ, రాజ్యాం గమూ, అవి గుర్తించే పౌర హక్కులూ, మనిషయినందుకు ప్రతీ ఒక్కరూ గౌరవించవలసిన మానవతా – ఏదీ అడ్డంరాదు. ఈ అధికార దమనకాండకు వ్యతిరేకంగా మాట్లాడడం హక్కుల ఉద్యమం నిత్యం చేయవలసిన పని, చేస్తున్న పని.

నక్సలైట్ ఉద్యమాన్ని కేవలం ఒక నేర ప్రక్రియగా చూడొద్దనీ, సామాజిక భూమిక గల రాజకీయ ఉద్యమంగా చూసి రాజకీయంగా వ్యవహరించమనీ పాలకులకు చెప్తున్నాం. పాలకులు అవునవునంటూనే దానిని శాంతి భద్రతల సమస్యగా చూస్తూ మరింతగా దమనకాండ పెంచుతున్నారు. నక్సలైట్లకు కూడా, ప్రతిఘటన పేరిట ఎంత హింస చేసినా ఎవరిమీద చేసినా అది సమర్ధనీయమేనని వాదించవద్దని వారిస్తున్నాం. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ హింసా ప్రతిహింసల వలయం దుష్ప్రభావం నుండి రాష్ట్రాన్ని బయటపడేయడం కోసం ఇరుపక్షాలూ చర్చలకు కూర్చోవాలని కోరాం. చర్చల ప్రక్రియను ఫలవంతం చేయడానికి కృషి చేశాం. అది విఫలమైన తరువాత దానిని పునరుద్ధరించడానికి కృషిచేస్తున్నాం.

ఆహార వస్త్రాలతో సమానమయిన అవసరంగా నివాస హక్కును గుర్తించాలని కోరుతున్నాం. మనదేశంలో నివాస హక్కు అనేది ఏ అర్థంలోనూ లేకపోవడం భారత రాజ్యాంగంలోనూ, చట్టాలలోనూ ఉండే లజ్జాకరమైన లోపాలలో ఒకటి. ప్రభుత్వ భూములు పెట్టుబడి పెట్టగల వారికే దత్తం చేయడం ఒక విధానంగా మారిన ప్రస్తుత దశలో గుడిసెలు మూకుమ్మడిగా కూల్చివేయడం మునిసిపాలిటీలకు నిత్యకృత్యం అయింది. ఈ అన్యాయాన్ని మొత్తంగా ఆపలేక పోయినా ఒక్కొక్క చోట కొంతకాలం వాయిదా వేయించడం, ఒక్కొక్కచోట పునరావాసం పొందడం గుడిసెవాసులకు సాధ్యం అవుతున్నది. ఈ పోరాటాలలో భాగస్వాములమవుతున్నాము.

ఇంకా–

ఏజెన్సీలోనూ రిజర్వ్ ఫారెస్టులోనూ భూమి హక్కుల కోసం ఆదివాసులు చేస్తున్న ఆందోళనలకు, సముద్రం మీదనే కాక తీరం మీద కూడా హక్కు కోసం మత్స్యకారులు చేస్తున్న ఆందోళనలకు, సమాన అవకాశాల కోసం వికలాంగులు చేస్తున్న ఆందోళనలకు, సమాన అవకాశాల కోసమే కాక సగౌరవంగా బతికే అవకాశం కోసం మైనారిటీలు చేస్తున్న ఆందోళనలకు, తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్వేచ్ఛ కోసం దేశ సరిహద్దు ప్రాంతాల ప్రజలు చేస్తున్న ఆందోళనలకు, భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట అమలవుతున్న ప్రాంతీయ పెత్తనం నుండి విముక్తి కోరుకుంటున్న తెలంగాణ వంటి వివక్షకు గురయిన ప్రజలు చేస్తున్న ఆందోళనలకు, కళ్ల ముందే హరించుకుపోతున్న చట్టపరమైన హక్కులను రక్షించుకోవడం కోసం కార్మికులు చేస్తున్న ఆందోళనలకు, మొత్తం ప్రభుత్వరంగం స్థానాన్ని ఆక్రమించుకున్న ప్రైవేట్ ఉత్పత్తి, వాణిజ్య రంగాలలో దళితులకూ ఆదివాసులకూ స్త్రీలకూ సకల బలహీన వర్గాలకూ ప్రభుత్వరంగం నమూనాలోనే రిజర్వేషన్లు కల్పించాలన్న ఆందోళనకు, ప్రపంచ బ్యాంకు ఏం చెప్పినా నయా ఉదారవాద సిద్ధాంత పైత్యం ఏమన్నా విద్య, వైద్యం మొదలైన సకల కనీస జీవిత అవసరాల కల్పన ప్రభుత్వం బాధ్యతగానే ఉండాలన్న ఆందోళనలకు–

అండగా ఉంటున్నాం. మద్దతు ఇస్తున్నాం, అవి లేవదీసిన విలువలను సామాజిక ఆలోచనా రీతులలో పెంపొందించే కృషి చేస్తున్నాం, పాలనలో వ్యవస్థితం చేసే కృషీ చేస్తున్నాం.

ఈ కృషి కొనసాగాలనీ, ఇంకా బాగా జరగాలనీ కోరుకునే వారి సహాయ సహకారాలు కాంక్షిస్తూ–

25 ఏప్రిల్ 2005, హైదరాబాద్